ఈనాడు

విజయవాడ 17-1-2019 గురువారం సిటీ సంపుటి 45 . సంచిక 157

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఫ్రంట్‌పై ముందుకు

సమాఖ్య కూటమిపై తెరాస, వైకాపాల మధ్య కీలక చర్చలు

- వైకాపా అధ్యక్షుడితో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడి భేటీ
- లోటస్‌పాండ్‌లో 2 గంటలపాటు సమావేశం
- కేసీఆర్ ప్రతిపాదనలపై పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం: జగన్
- మరోసారి చర్చలకు త్వరలో అమరావతికి కేసీఆర్: కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

తెరాస అధినేత, సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తున్న సమాఖ్య కూటమికి సంబంధించి మరో అడుగు పడింది. కాంగ్రెస్, భాజపాలకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటయ్యే ఈ కూటమిలో వైకాపాను భాగస్వామిగా చేర్చే విషయమై ఆ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ల మధ్య కీలక చర్చలు జరిగాయి. బుధవారం హైదరాబాద్‌లోని జగన్ నివాసం ఈ చర్చలకు వేదికైంది. కేసీఆర్ ప్రయత్నం.. స్వాగతించాల్సిన విషయమని, దీనిపై పార్టీలో చర్చించుకొని ఎలా ముందుకెళ్లాలో నిర్ణయించుకుంటామని ఈ సందర్భంగా జగన్ (మిగతా 2లో)



హైదరాబాద్‌లోని జగన్ నివాసంలో ఆయనతో భేటీ అయిన తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

"ఈ రోజు జరిగింది మొదటి సమావేశం మాత్రమే. తెలంగాణ ప్రయోజనాలు, ఆంధ్రాకు ప్రత్యేక హోదాపై ఇప్పటికే మేం స్పష్టతనిచ్చాం. అప్పటి ప్రధాని లోక్‌సభలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని చెప్పాం. త్వరలో మా పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అమరావతికి వెళ్లి జగన్‌తో లోతుగా చర్చిస్తారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎలా పోరాడాలనే దానిపై మాట్లాడతారు.

- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

తెరాసతో చర్చలను స్వాగతిస్తున్నాం. రాష్ట్రాల హక్కులు, సమాఖ్య కూటమి ఏర్పాటు దిశగా తెరాస అధినేత, సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి అభినందనీయం. అన్యాయాలపై కేంద్రాన్ని నిలదీసేందుకు రాష్ట్రాలు ఒకే వేదికపైకి రావాలి. కేసీఆర్ ప్రతిపాదించిన సమాఖ్య కూటమి విషయంలో రాష్ట్రాలు ముందుకు రావాలి. కేసీఆర్‌తో తదుపరి చర్చలు జరుపుతాం."

- వైకాపా అధినేత జగన్

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపైనా చర్చ

సమాఖ్య కూటమిపై చర్చించేందుకు జగన్‌తో భేటీపై మంగళవారం నిర్ణయం తీసుకున్న కేసీఆర్ దీనిపై ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. కేటీఆర్, ఇతర ముఖ్య నేతలను చర్చలకు పంపిస్తున్నట్లు తెలిపారు. వారిని తమ ఇంటికి రావాలని జగన్ ఆహ్వానించారు. బుధవారం మధ్యాహ్నం 12.30కి కేటీఆర్ ఇతర నేతలతో కలిసి జగన్ ఇంటి వద్దకు వచ్చారు. ఆయనకు వైకాపా నేతలు స్వాగతం పలికారు. జగన్ ప్రధాన ద్వారం వద్దకు వచ్చి కేటీఆర్‌ను లోనికి తోడ్కొని వెళ్లారు. సమాఖ్య కూటమి సన్నాహాలపై కేటీఆర్, ఎంపీ వినోద్‌లు జగన్‌కు వివరించారు. కూటమిలో చేరడం వల్ల వైకాపాకు మేలు జరుగుతుందని వివరించారు. కాంగ్రెస్, భాజపాలు ఆంధ్రాకు అన్యాయం చేశాయనే భావనతో ఆ రాష్ట్ర ప్రజలున్నందున ప్రత్యామ్నాయ ప్రతిపాదన వారిని ప్రభావితం చేస్తుందని కేటీఆర్ చెప్పారు. ఈ సందర్భంగా ఏపీ రాజకీయాలు, రాబోయే ఎన్నికల మీద చర్చ జరిగినట్లు తెలిసింది. తెలంగాణ ఎన్నికల్లో విజయం సాధించడంపై కేటీఆర్, తెరాస నేతలకు జగన్ అభినందనలు తెలిపినట్లు తెలిసింది. జగన్ పాదయాత్ర అనుభవాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు.



చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో మనవడితో కలిసి ఎడ్లబండిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ముసుగు తీసేస్తే సరి

- వైకాపా, తెరాసల తీరుపై చంద్రబాబు వ్యాఖ్య
- మోదీ దిగిపోతే తప్ప న్యాయం జరగబోదని వెల్లడి 2లో
- స్వగ్రామంలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న సీఎం

"ముసుగులో గుద్దులాట ఎందుకు? ఆంధ్రప్రదేశ్‌లోనూ తెరాస, వైకాపాలు కలిసి పోటీ చేయొచ్చు కదా! ఇక్కడ కూడా తెరాస పార్టీ పెట్టుకోవచ్చు కదా! మోదీ, కేసీఆర్, జగన్ ముగ్గురూ కలిసిపోయారు. జగన్‌తో కలవాల్సిందిగా పవన్‌కల్యాణ్‌కు తెరాస నుంచి రాయబారాలు పంపుతున్నారు. కేసీఆర్ తనకు ఇలా సూచిస్తున్నారని స్వయంగా పవనే చెప్పారు. అంటే.. వీరంతా కలిసి రాష్ట్రాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ 10% రిజర్వేషన్లు

- ఇప్పటివరకు అమలుచేయని సంస్థలన్నీ రిజర్వేషన్ విధానం పరిధిలోకి
- కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడి
- 2019-20 నుంచే వర్తింపు
- బిల్లు తీసుకురానున్న కేంద్రం
- పేదల కోటాకు అనుగుణంగా సీట్ల పెంపు

ఈనాడు, దిల్లీ: ఇకపై దేశవ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు అమలుకానున్నాయి. ఇప్పటివరకు రిజర్వేషన్లు అమలు కాని ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ వచ్చే విద్యాసంవత్సరం(2019-20) నుంచి వాటిని వర్తింపజేయనున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ మంగళవారం వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లతోపాటు కొత్తగా తీసుకొచ్చిన పేదల కోటా 10 శాతాన్ని కూడా వాటిలో అమలు చేస్తా




మని తెలిపారు. మొత్తం 40 వేల కళాశాలలు, 900 విశ్వవిద్యాలయాల్లో రానున్న విద్యాసంవత్సరం నుంచే ఈ 10 శాతం కోటాకు శ్రీకారం చుట్టబోతున్నట్లు చెప్పారు. పాత రిజర్వేషన్లకు అదనంగానే ఈ పదిశాతం కోటా ఉంటుందని స్పష్టం చేశారు. కొత్త రిజర్వేషన్ల విధానం అమలు కోసం అన్ని కళాశాలు, విశ్వవిద్యాలయాల్లో 25 శాతం సీట్లు పెంచుతామని జావడేకర్ తెలిపారు. కోటా అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ), అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) వారం రోజుల్లోగా వెల్లడిస్తాయని చెప్పారు. అన్నిరకాల కోర్సుల్లో రిజర్వేషన్లు (మిగతా 2లో)

కోటాపై ఏం చేద్దాం?

- నెలాఖరుకు రాష్ట్రం తుది నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఆర్థికంగా వెనకబడిన వర్గాల రిజర్వేషన్లపై ఏం చేయాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. కేంద్రం మాదిరిగా ఆర్థికంగా వెనకబడిన వర్గాలందరికీ కలిపి పది శాతాన్ని యథాతథంగా అమలు చేయడమా... స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేయడమా అన్న అంశాలపై ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేసిన కేంద్రం రాష్ట్రాల పరిధిలో ఎలా అమలు చేయాలన్నది మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేసింది. రాష్ట్రంలో అమలు చేయాల్సిన తీరుపై (మిగతా 2లో)



కృత్రిమ మేధపై 5 లక్షల మందికి శిక్షణ

- దేశవ్యాప్తంగా పది పరిశోధనశాలలు
- ఏఐ అనుకూల వాతావరణ సృష్టికి 715 సంస్థలతో భాగస్వామ్యం
- మైక్రోసాఫ్ట్ ఇండియా వెల్లడి 7లో

Microsoft

జస్టిస్ ఖన్నాకు పదోన్నతిపై అభ్యంతరాలు

- ఇద్దరు హైకోర్టు చీఫ్ జస్టిస్‌లను కాదని సర్వోన్నత న్యాయస్థానానికి ఎంపిక
- తప్పు పట్టిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కౌల్

7లో

సంక్షోభంలో థెరెసా మే సర్కార్

- బ్రెగ్జిట్ ఒప్పందం తీర్మానం ఓటమి
- వ్యతిరేకించిన సొంత పార్టీ సభ్యులు
- అవిశ్వాసం పెట్టిన ప్రతిపక్షం

7లో



వైద్య పరీక్షల కోసం అమెరికాకు జైట్లీ

- త్వరగా కోలుకోవాలంటూ రాహుల్ ట్వీట్

11లో

బ్రహ్మానందంకు గుండె శస్త్ర చికిత్స

- నిలకడగా ఆరోగ్యం



ఈనాడు సినిమా లో

ఇదీ సంగతి!



ప్రాజెక్టుల సాకారంపై దృష్టి

- వివిధ దశల్లో సాగునీటి పథకాలు
- టెండర్ల స్థాయిలో వైకుంఠపురం బ్యారేజి, గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు
- పరిశీలన దశలో మరికొన్ని
- ఇప్పటికే అంచనాలు మించిన నీటిపారుదల బడ్జెట్ పాలనామోదాలు

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో మొత్తం 62 సాగునీటి ప్రాజెక్టులను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆయా చీఫ్ ఇంజినీర్లు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థల నుంచి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ పరిశీలనకు పంపుతున్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణ సాధ్యాసాధ్యాలపై జలవనరులశాఖ, ఆర్థికశాఖలు పరిశీలనలు జరుపుతున్నాయి. కొన్ని ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే ఆర్థికశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేయగా ఆయా చీఫ్ ఇంజినీర్లు వాటిని నివృత్తి



చేసే పనుల్లో ఉన్నారు.

టెండర్లు ఖరారు కావాలి

మరికొన్ని ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే పాలనామోదం ఇచ్చి పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో వైకుంఠపురం బ్యారేజి, గుంటూరు ఛానల్ పొడిగింపు పనులకు సంబంధించి టెండర్లు ఖరారు కావాల్సి ఉంది.

పరిశీలన దశలో ఉన్నవి

వంశధార-బాహుదా అనుసంధానం, వేదవతి ఎత్తిపోతల, రాజోలిబండ మళ్లింపు పథకం, చోడవరం బ్యారేజి, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువకు నీటి సరఫరా.

పట్టుదలతో ప్రభుత్వ వర్గాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (మిగతా 2లో)

కోటాపై ఏం చేద్దాం?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే ఉన్నత స్థాయిలో ఒకసారి ప్రాథమికంగా చర్చ జరిగింది. కాపులకు అయిదు శాతం రిజర్వేషన్లతో పాటు బీసీల్లో ఉన్న కొన్ని వర్గాల్ని ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలన్న ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలపకపోవడంపై రాష్ట్రప్రభుత్వం తీవ్రఅసంతృప్తితో ఉంది. వీటిని పక్కనబెట్టి కొత్తగా రిజర్వేషన్లు అమలు చేయాల్సి రావటం ఆచరణలో ఎలాంటి ప్రభావం చూపుతుందన్న అంశంపై దృష్టి సారించింది. నాలుగు రోజుల కిందట జరిగిన ఓ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్థాయి ఉన్నతాధికారి ఒకరు... కాపులకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి, మిగిలిన అన్ని వర్గాలకు కలిపి ఆరు శాతం ఇస్తే బాగుంటుందని సూచించినట్లు సమాచారం. దీనిపై తదుపరి ఎలాంటి చర్చ జరగలేదు. ఆదివారం వరకు సెలవులు కావడంతో సీఎం చంద్రబాబు సమీక్షించేందుకు వీలులేకపోయింది. ఈనెల 21న జరిగే మంత్రివర్గసమావేశంలో చర్చించే అవకాశం ఉంది. నెలాఖరులోగా ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకునే వీలుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

ముసుగు తీసేస్తే సరి

- వైకాపా, తెరాసల తీరుపై ముఖ్యమంత్రి వ్యాఖ్య

ఈనాడు - తిరుపతి

మనం కష్టపడి ముందుకు వెళ్తుంటే అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగకూడదని, మనం నిలదొక్కుకోకూడదని, మనల్ని దెబ్బతీయాలని చూస్తున్నారని అన్నారు. అది వాళ్లకు సాధ్యం కాదని వివరించారు. సంక్రాంతి పండగను కుటుంబసభ్యులతో కలిసి జరుపుకొనేందుకు ముఖ్యమంత్రి రెండు రోజుల పాటు స్వగ్రామమైన చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లికి వచ్చారు. మంగళవారం స్థానిక గ్రామదేవతలకు పూజలు చేశారు. పితృదేవతలకు బట్టలు పెట్టారు. తల్లిదండ్రుల సమాధుల వద్ద నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పొత్తులపై స్పందించారు. 'ఎన్నికల వేళ వివిధ రాష్ట్రాల్లోని పార్టీలు అక్కడి పరిస్థితులను బట్టి పొత్తులు పెట్టుకుంటాయి. కొన్ని రాష్ట్రాల్లో స్థానికంగా పొత్తు లేకపోయినా, జాతీయ స్థాయిలో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. కొందరు ఎన్నికల ముందు రాకున్నా తర్వాత వస్తారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా రెండే కూటములున్నాయి. ఒకటి భాజపా నేతృత్వంలోని ఎన్డీయే. రెండోది భాజపాకు వ్యతిరేకంగా ఉన్న పార్టీలతో జాతీయ స్థాయిలో ఏర్పడుతున్న ప్రత్యామ్నాయ కూటమి. తెదేపా ఆవిర్భావం నుంచి తెలంగాణలో పోటీ చేస్తోంది. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాం. అదే రీతిన ఇక్కడ వాళ్లు(తెరాస, వైకాపా) కలిసి పోటీ చేయాలనుకుంటే చేయొచ్చు' అని పేర్కొన్నారు.

> 'మేం ఎప్పుడూ వ్యక్తిగత విమర్శలు చేయలేదు. తెదేపా అలాంటి తప్పుడు పనులు చేయబోదు. షర్మిల ఎందుకిలా మాట్లాడారో అర్థం కావట్లేదు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తున్నా. పార్టీపై బురదజల్లాలనుకుంటే కుదరదు. ఇలాంటి దుష్ప్రచారం వైకాపాకే అలవాటు. షర్మిల వ్యక్తిగత వ్యవహారంతో నాకు, పార్టీకి ఏం సంబంధం?'
>
> - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

మోదీపై దేశమంతా తిరుగుబాటు

'మనం ఇక్కడ కష్టపడుతుంటే కేంద్రాన్ని అడ్డుపెట్టుకుని అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. కేంద్రం తీరుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దేశవ్యాప్తంగా అందరూ ఒక్కటై తిరుగుబాటు చేసేసరికి భాజపా నేతలకు దిక్కుతోచడం లేదు. యూపీలో రెండు విపక్షాలు ఏకమయ్యాయ'ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

నమ్మకం లేనప్పుడు పోటీ ఎలా చేస్తారు?

జగన్‌పై దాడి కేసులో విచారణపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. 'రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేకుంటే రాష్ట్ర పౌరుడిగా ఎలా ఉంటారు? ఎలా పోటీ చేస్తారు? విశాఖలో సంఘటన జరిగితే అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయకుండా హైదరాబాద్ వెళ్లి ఎన్ఐయే దర్యాప్తు కావాలని అడగడం ఏమిటి?' అని ప్రశ్నించారు.

తెలంగాణకంటే బ్రహ్మాండంగా..

రానున్న ఎన్నికలకు సరైన సమయంలో అభ్యర్థులను ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ఓటడిగే అధికారం తెదేపాకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. 'తెలంగాణలో చేయని అభివృద్ధి ఇక్కడ చేశాం. తెలంగాణకంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నాం. తెరాసకంటే బ్రహ్మాండమైన విజయం తెదేపాకు రావాలి' అని అభిప్రాయపడ్డారు. రేపటి ఎన్నికల్లో చేతకాని పార్టీలు, తప్పుడు పార్టీలు అధికారంలోకి వస్తే వ్యవస్థ కుప్పకూలుతుందని, ప్రజాజీవనం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఈబీసీ రిజర్వేషన్లపై ఏం చేయాలనేది ఆలోచిస్తున్నామని, రాష్ట్రంలో కాపులకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరినా స్పందించని కేంద్రం, ఎన్నికల కోసం చట్టం తెచ్చిందని ఆరోపించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

'ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందిస్తోంది. జీవన ప్రమాణాలను పెంచాం. పెరిగిన పింఛన్లతో లబ్ధిదారుల ఆత్మగౌరవం పెరిగింది. నాలుగేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదు. సేద్యానికి తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తున్నాం. రైతులకు రూ.24వేల కోట్ల రుణమాఫీ చేశామ'ని ముఖ్యమంత్రి వివరించారు. సంక్రాంతిని అడ్డం పెట్టుకుని జూదం ఆడటం సరికాదని, ఒక బలహీనతకు లోనైతే మరో వంద బలహీనతలకు అది కారణమవుతుందని పేర్కొన్నారు.



నారా, నందమూరి కుటుంబసభ్యులకు వేదాశీర్వచనం చేస్తున్న తితిదే వేదపండితులు

ఎడ్లబండిపై షికారు

ముఖ్యమంత్రి గ్రామస్థులతో సరదాగా గడిపారు. మంగళవారం ఉదయం పదింటికి నారా, నందమూరి కుటుంబసభ్యులను తితిదే ఉన్నతాధికారులు కలిసి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందించారు. వేద పండితులు ఆశీర్వదించారు. రెండు కుటుంబాల వారు గ్రామదేవత సత్యమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడినుంచి నాగాలమ్మ గుడికి వెళ్లి పూజాదికాల్లో పాల్గొన్నారు. తల్లిదండ్రుల సమాధి వద్ద ముఖ్యమంత్రి నివాళులు అర్పించాక ఇంటి వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి బాలకృష్ణతో కలిసి పూలమాలలు వేశారు. స్థానికుల వినతులు స్వీకరించారు. కొద్దిసేపు ఇంట్లోకి వెళ్లిన సీఎం తరువాత తన మనుమడు దేవాన్ష్‌తో కలిసి ఎడ్లబండిపై గ్రామంలో తిరిగారు. సాయంత్రం ఐదున్నరకు రేణిగుంట విమానాశ్రయం నుంచి అమరావతికి బయలుదేరారు.



లోటస్‌పాండ్‌లో భేటీ అనంతరం వైఎస్ జగన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్. పక్కన వైకాపా నేతలు పార్థసారథి, విజయసాయిరెడ్డి, రామకృష్ణారెడ్డి, తెరాస నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్

ఫ్రంట్‌పై ముందుకు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. జగన్‌తో ప్రాథమిక చర్చలు జరిపామని.. త్వరలోనే సీఎం కేసీఆర్ ఆయనతో సమగ్రంగా చర్చిస్తారని కేటీఆర్ చెప్పారు.

తెరాస అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బుధవారం కేటీఆర్ హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో జగన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెరాస తరఫున ఎంపీలు వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్, పార్టీ శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌రెడ్డి, వైకాపా నుంచి ఎంపీలు విజయసాయిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు ఎస్వీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పార్థసారథి, నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలపాటు జగన్, కేటీఆర్‌ల మధ్య సమాఖ్య కూటమి, ఇతర అంశాలపై చర్చలు జరిగాయి. చివరన ముఖ్యమంత్రి కేసీఆర్ జగన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చర్చల అనంతరం కేటీఆర్, జగన్ విలేకరులతో మాట్లాడారు.

గుణాత్మక మార్పు కోసం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు: కేటీఆర్

"తెరాస అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ గడిచిన ఏడాదిన్నరగా దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కేంద్రం అధికారాలను తన వద్ద పెట్టుకొని రాష్ట్రాలను ఇబ్బంది పెడుతున్న తరుణంలో సమాఖ్య స్ఫూర్తితో పోరాటాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఆయా పార్టీల అధ్యక్షులతో సంప్రదింపులు జరిపి.. తన పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత జగన్‌కి కేసీఆర్ ఫోన్ చేసి.. మాట్లాడేందుకు వస్తాం అని చెప్పగా.. ఆయన రమ్మన్నారు. తప్పకుండా మాకు విశ్వాసం ఉంది. రాష్ట్రాలను శక్తిమంతం చేయడానికి, హక్కులను కాపాడటానికి భవిష్యత్తులో సందర్భానుసారంగా.. ఒకే రకమైన ఆలోచనా ధోరణి గల వారమంతా కలిసి ముందుకు వెళతాం. సీఎం కేసీఆర్ స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి.. జగన్‌తో మాట్లాడాక.. ఈ చర్చలను మరింత ముందుకు తీసుకుపోతాం. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై మా వైఖరిని తెరాస అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌తోసహా రాజ్యసభలో మా పార్టీ నేత కేశవరావు, లోక్‌సభలో ఎంపీ కవిత పలు సందర్భాల్లో స్పష్టం చేశారు. అప్పటి ప్రధాని లోక్‌సభలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని మేం చెప్పాం. ఈ రోజు జరిగింది కేవలం మొదటి సమావేశం మాత్రమే. మిగతా అంశాలన్నింటినీ సీఎం కేసీఆర్ జగన్‌ను కలిసిన తర్వాత సమగ్రంగా చర్చిస్తారు" అని కేటీఆర్ తెలిపారు.

రాష్ట్రాలు ఒకే వేదికపైకి రావాలి: జగన్

"కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. తారక్(కేటీఆర్) ఈ రోజు వచ్చి చర్చించారు. రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయం, సమాఖ్య కూటమి ఏర్పాటు తదితర అంశాలపై చర్చించాం. అన్యాయానికి గురికాకుండా కేంద్రాన్ని నిలదీసేందుకు రాష్ట్రాలు ఒక వేదికపైకి రావాలి. లేకుంటే హక్కులు సాధించలేం. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటు సాక్షిగా చేసిన హామీకే దిక్కూదివానం లేదు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే.. ఏపీకి చెందిన 25 మంది ఎంపీలకుతోడు.. పక్కన తెలంగాణ రాష్ట్రం నుంచి మరో 17మంది ఎంపీలు జత అయితే.. మొత్తం 42మంది రాష్ట్రాలకు జరుతున్న అన్యాయంపై ప్రశ్నించగలిగితే.. పార్లమెంటు సాక్షిగా చెప్పిన మాట అని చెప్పగలిగితే.. కేంద్రం దిగి వస్తుంది. రాష్ట్రాలకు మేలు జరిగే పరిస్థితి రావాలి. రాష్ట్రాల బలం పెరిగితే.. అప్పుడు రాష్ట్రాలకు అన్యాయం చేసేలా నడుచుకోవడానికి కేంద్రం వెనుకడుగు వేస్తుంది. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో ఒక జాతీయస్థాయి వేదిక ఏర్పాటు చేశారు. ఎంపీల పరంగా ఏకం చేసి.. రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ముందుకు వెళ్లాలనుకోవడం హర్షించదగ్గ విషయం. ఈ అంశంపై మరోసారి చర్చలకు వస్తామని కేసీఆర్ ఫోన్‌లో చెప్పారు. ఆయన చెప్పిన అంశాలపై పార్టీలో చర్చించి.. రాబోయే రోజుల్లో వీటిని మరింత ముందుకు తీసుకెళ్లే విషయంలో 4 అడుగులు ముందుకు వేస్తాం. కేసీఆర్‌తో తదుపరి చర్చలు జరుపుతాం"అని జగన్ పేర్కొన్నారు.

జగన్‌కు కేసీఆర్ ఫోన్

బుధవారం చర్చల అనంతరం కేటీఆర్ సమక్షంలో కేసీఆర్ ఫోన్‌లో జగన్‌తో మాట్లాడుతూ.. ఇటీవల ఏపీలో నిర్వహించిన పాదయాత్రపై అభినందనలు తెలిపారు. త్వరలోనే అమరావతికి వచ్చి కలుస్తానని, అన్ని విషయాలు మాట్లాడుకుందామని చెప్పారు. అమరావతిలో ఈనెల నాలుగో వారంలో తన గృహప్రవేశం ఉందని, దానికి రావాలని ఈ సందర్భంగా జగన్.. కేసీఆర్‌ను ఆహ్వానించినట్లు తెలిసింది.

ఏపీలో తెరాస పోటీ చేయదు.. ఆంధ్రప్రదేశ్‌లో తెరాస పోటీ చేయదని, అభ్యర్థులను నిలపదని.. వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. "త్వరలో కేసీఆరే స్వయంగా జగన్‌తో చర్చలు జరుపుతారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేవారికే వైకాపా మద్దతు ఉంటుంది" అని విజయసాయిరెడ్డి తెలిపారు.

ప్రాజెక్టుల సాకారంపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే నీటిపారుదల బడ్జెట్ పాలనామోదాలు అంచనాలు మించాయని ఆర్థికశాఖ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్ లోపు ఎన్ని ప్రాజెక్టులు పట్టాలకు ఎక్కనున్నాయనేది వేచి చూడాలి. కొన్ని ముఖ్య ప్రాజెక్టుల విషయంలో త్వరగా పాలనామోదం ఇచ్చి టెండర్లు ఖరారు చేయాలనే పట్టుదలతో ప్రభుత్వ వర్గాలు ఉన్నాయి. తుంగభద్ర నదిపై గుండ్రేవుల రిజర్వాయర్ చేపట్టే ప్రతిపాదన ఉన్నా అంతర్రాష్ట్ర సమస్యను పరిష్కరించాల్సి ఉందని చెబుతున్నారు.

పాలనామోదం దిశగా 'ముక్త్యాల'

కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల వద్ద కృష్ణా నది నీటిని ఎత్తిపోసి సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు స్థిరీకరణకు నీరివ్వాలనేది యోచన. ప్రస్తుత అంచనా విలువ రూ.490.64 కోట్లు. 38,627 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఇది ఉపకరిస్తుంది. అంతర్రాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టు నిర్మాణ తీరు తెన్నుల్లో కొన్ని మార్పులు చేసి పాలనామోదం దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఫిబ్రవరి నెలలోగా టెండర్లు ఖరారు చేయాలనే తలంపుతో ఉన్నారు.

62వ ప్రాధాన్య ప్రాజెక్టుగా చోడవరం బ్యారేజి

కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజికి దిగువన మరో కొత్త బ్యారేజి(చోడవరం) నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. దాదాపు రూ.900 కోట్లు అంచనా వ్యయంగా ప్రస్తుతం లెక్కిస్తున్నారు. కృష్ణా నదిలో 2.70 టీఎంసీల నీటిని నిల్వ చేయాలనేది యోచన. ప్రకాశం బ్యారేజికి దిగువన 12 కిలోమీటర్ల దూరంలో దీని నిర్మాణానికి పాలనామోదం కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని చూస్తున్నారు. దీన్ని 62వ ప్రాధాన్య ప్రాజెక్టుగా ఈ మధ్యే జాబితాలో చేర్చారు.

రూ.382 కోట్లు అంచనాతో మాచర్ల ఎత్తిపోతల

గుంటూరు జిల్లాలోని వరకపుడిశల వద్ద ఓ ఎత్తిపోతల పథకం నిర్మించి గురజాల, మాచర్ల రెండు నియోజకవర్గాల్లోని ఆయకట్టుకు ప్రయోజనం కల్పించడమే లక్ష్యం. దాదాపు రూ.382 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొంటున్నారు. 17,026 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుందని చెబుతున్నారు. ఈ ప్రతిపాదన ఇంకా ప్రభుత్వ పరిశీలనకు రావాలి.

55 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు

సోమశిల-స్వర్ణముఖి అనుసంధాన(లింకు) కాలువ నుంచి చిత్తూరు జిల్లాలోని బాలాజీ జలాశయానికి నీరు. గాలేరు-నగరి సుజల స్రవంతి పథకంలో భాగంగా మల్లెమడుగు, బాలాజీ జలాశయాలకు మరో వైపు నుంచి నీటిని మళ్లించే ఏర్పాటు. సోమశిల-స్వర్ణముఖి అనుసంధాన కాలువ నుంచి కూడా 4 టీఎంసీల నీటిని ఎత్తిపోసి అటు వైపు తీసుకువెళ్లే ప్రతిపాదనపై జలవనరులశాఖ దృష్టి సారించింది. ఈ నీటిని తొలుత మల్లెమడుగు జలాశయానికి, ఆనక బాలాజీ జలాశయానికి తీసుకువెళ్లేలా ఒక ప్రణాళిక సిద్ధం చేసి పనులు చేపట్టేందుకు పరిశీలిస్తున్నారు. ఇలా నీటిని ఎత్తిపోయడం ద్వారా చిత్తూరు జిల్లాలోని 11 మండలాల్లో 55 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వవచ్చని ప్రణాళిక సిద్ధం చేశారు. అంచనా విలువ రూ.508.70 కోట్లు. ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

కుప్పం ప్రాంతంలో చిన్ననీటి వనరుల అభివృద్ధి

కుప్పం ప్రాంతంలో పాలార్ చెక్ డ్యాముల నిర్మాణం ద్వారా కొత్తగా 30 నిర్మించి, పాతవి 21 పునరుద్ధరించి మొత్తం 21,070 ఎకరాల కొత్త ఆయకట్టకు నీరిచ్చే దిశగా పనులు. రూ.152.46 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు ఏర్పాట్లు. ఇవి కాకుండా ఇదే ప్రాంతంలో మరికొన్ని చిన్న ఎత్తిపోతల నిర్మాణాలు, ఛానళ్ల ఆధునికీకరణ పనులతో తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కరించే పనులకు ఏర్పాట్లు.

ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ 10% రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తామని, దానికి సంబంధించిన వివరాలను విద్యాసంస్థలు ఈ ఏడాది జారీ చేసే తమ వివరాల పత్రాల్లో(ప్రాస్పెక్టస్) తెలియజేయాలని జావడేకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం మనదేశంలో 4 కోట్లమంది విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసిస్తున్నట్లు వెల్లడించారు. 2017-18 లెక్కల ప్రకారం మనదేశంలో 32,426 ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల అమలుకోసం ప్రభుత్వం వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అత్యవసర ఆదేశం(ఆర్డినెన్స్) ద్వారా వెంటనే కోటాను అమల్లోకి తీసుకొస్తుందని కూడా వార్తలొస్తున్నాయి.

సాంకేతిక విద్యాసంస్థల సిబ్బందికి 7వ వేతన సంఘం సిఫార్సుల వర్తింపు

ఏఐసీటీఈ పరిధిలోని అన్ని సాంకేతిక విద్యాసంస్థల్లో పనిచేసే బోధనాసిబ్బందికి 2016 జనవరి 1 నుంచి 7వ వేతన కమిషన్ సిఫార్సులు వర్తింపజేస్తున్నట్లు జావడేకర్ చెప్పారు. ఇందుకోసం రూ1,240 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఫలితంగా 3.5 లక్షలమంది సిబ్బందికి లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు.

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

సంప్రదింపులెందుకు?

బానిసత్వాన్ని నిషేధించాలని నిర్ణయానికి వచ్చిన యజమాని.. నీకు స్వేచ్ఛ కావాలా? వద్దా? అని బానిసలను సంప్రదించటం లాంటి పనులేం చెయ్యడు!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

17–1–2019 గురువారం

శ్రీ విళంబి నామ సం||రం|| ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
ఏకాదశి: సా. 6.32 తదుపరి ద్వాదశి
కృత్తిక నక్షత్రం: ఉ. 10.09 తదుపరి రోహిణి
అమృత ఘడియలు: ఉ. 7.45 నుంచి 9.21
పునరమృతం తె. 6.33
వర్జ్యం: తె. 1.50 నుంచి 3.25 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10.20 నుంచి 11.04 తిరిగి
మ. 2.45 నుంచి 3.29 వరకు
రాహుకాలం: మ. 1.30 నుంచి 3.00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-42
ముక్కనుమ, సావిత్రి గౌరీవ్రతం

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	10.0	27.3
మెదక్	10.9	31.6
రామగుండం	12.6	29.6
గుంటూరు	15.2	29.4
హైదరాబాద్	15.2	30.0
శ్రీకాకుళం	16.0	30.0
కడప	16.0	33.0
తిరుపతి	16.4	30.1
విశాఖపట్నం	16.6	28.4
అనంతపురం	16.9	31.3
రాజమహేంద్రవరం	18.0	32.0
కర్నూలు	18.2	32.1
సూర్యాపేట	19.0	25.0
ఖమ్మం	19.0	29.0
విజయవాడ	19.6	29.8
నరసాపురం	19.7	28.4
తాడేపల్లిగూడెం	20.2	28.1
ఒంగోలు	20.9	30.6
నెల్లూరు	21.0	30.0

నెలాఖరులోగా గ్రామాల్లోనూ అన్న క్యాంటీన్లు

• తాత్కాలిక వసతులతో ప్రారంభం

ఈనాడు-అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లోనూ నెలాఖరులోగా అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటి ద్వారా రాష్ట్రంలోని పేదలకు రూ.5కే అల్పాహారం/భోజనాన్ని అందిస్తున్న విషయం విదితమే. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన క్యాంటీన్ల భవనాల పనులు పూర్తవ్వాలంటే కనీసం మరో నెల రోజుల సమయం పట్టనుందని సంబంధిత వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో అప్పటివరకు ఆగకుండా ఈ నెలాఖరులోగా తాత్కాలిక వసతులతో క్యాంటీన్లు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. మరో వారం రోజుల్లో మొదటి విడతగా ఎన్ని ప్రారంభిస్తారో అన్నదానిపై స్పష్టత రానున్నది. పట్టణాల్లో 216, గ్రామీణ ప్రాంతాల్లో 152 ప్రారంభించాలన్నది లక్ష్యం.






పట్టణ పేదల ఇంట ఇంధన పొదుపు

• తొలి విడతగా 75 వేల ఇళ్లకు పరికరాల పంపిణీ
• ఇది దేశంలోనే మొదటిసారి
• సీఎం చంద్రబాబు వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: దేశంలోనే తొలిసారిగా పట్టణ పరిధిలోని పేదలకు నిర్మించి ఇచ్చే ఇళ్లకు ప్రభుత్వం ఇంధన పొదుపు గృహోపకరణాలు అందించనుంది. ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీ టిడ్కో) ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన- ఎన్టీఆర్ పట్టణ ఇళ్లకు దీన్ని వర్తింపచేయనుంది. 9 వాట్లు సామర్థ్యం కలిగిన ఎల్ఈడీ బల్బులు, 20 వాట్ల ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, 50 వాట్ల ఫ్యాన్లు పంపిణీ చేయనుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన సామర్థ్య అభివృద్ధి సంస్థ(ఏపీసీడ్కో) ఆధ్వర్యంలో తొలి విడతగా 75 వేల ఇళ్లకు వీటిని అందించనుంది. ఇందుకోసం రూ.30 కోట్లు వెచ్చించనుంది. దశలవారీగా దీన్ని 5.29 లక్షల ఇళ్లకు విస్తరించనుంది. దీంతో పాటు వీధుల్లో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 'దేశంలోనే తొలిసారిగా పేదల ఇళ్లకు ఇంధన సామర్థ్య ఉపకరణాలు అందించడం సంతోషంగా ఉంది. ఇంధన సామర్థ్య ఫలాలు



సామాన్య ప్రజలకు అందాలన్న నా ఆకాంక్ష ఈ చర్యలతో నెరవేరుతుంది. దీనివల్ల సామాన్యులకు ప్రయోజనంతో పాటు ఆర్థిక, పర్యావరణ లబ్ధి కూడా చేకూరుతుంది' అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

పేదల కోసం నిర్మిస్తున్న ఇళ్లు ధనికుల గృహాలతో సమానంగా ఉండాలన్నదే తన ఆకాంక్షని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. పట్టణ గృహ నిర్మాణంలో ఇంధన సంరక్షణ, సామర్థ్యం, నీటి సంరక్షణపై దృష్టిపెట్టాలన్నారు. ఈ పథకానికి వేల కోట్ల విలువైన భూమిని ఉచితంగా ఇవ్వడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు రూ.13,035 కోట్లు అందించిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. ఇంధన సామర్థ్య సన్నద్ధతలో ఇప్పటికే దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో నిలిచిందని సీఎం తెలిపారు. ఎల్ఈడీ వీధిలైట్ల ఏర్పాటు, కోటి కుటుంబాలకు 2 కోట్ల ఎల్ఈడీ బల్బులు అందించి మరో జాతీయ రికార్డు సృష్టించినట్లు వివరించారు.

పంపిణీ వల్ల లాభాలు...

- ★ ఏటా 54.5 మి.యూనిట్లు విద్యుత్తు ఆదా
- ★ ప్రతిసంవత్సరం రూ.32కోట్ల మేర పొదుపు

ఆ లేఖ సత్యంబాబు రాసిందేనా?

• ఆయేషామీరా హత్యాచారం కేసు దర్యాప్తులో సీబీఐ సందేహాలు

ఈనాడు, హైదరాబాద్: సంచలనం సృష్టించిన బిఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా అత్యాచారం, హత్య కేసు దర్యాప్తులో సీబీఐ వేగం పెంచింది. కేసు పూర్వాపరాలన్నింటినీ వడపోస్తున్న అధికారులు సత్యంబాబు రాసినట్లుగా చెబుతున్న లేఖపై దృష్టి సారించారు. ఇది నిజంగా ఆయన రాసిందేనా, అందుకు అవకాశం ఉందా? అసలు లేఖ రాయడానికి కారణాలేమిటి.. అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తులో ఎక్కడా లేఖ ప్రస్తావనే తీసుకురాని పోలీసులు, అనంతరం దాని గురించి పేర్కొనడంపైనా సీబీఐ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. కింది కోర్టు తీర్పును తప్పుబడుతూ ఆయేషా కేసులో నిందితుడు సత్యంబాబును ఉమ్మడి హైకోర్టు నిర్దోషిగా విడుదల చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఆయేషా తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు అసలు దోషులను పట్టుకునేందుకు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ప్రస్తుతం కేసు పూర్వాపరాలు విశ్లేషిస్తున్న అధికారులు సత్యంబాబు రాసినట్లుగా చెబుతున్న ఒక లేఖపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేసిన ఇబ్రహీంపట్నం పోలీసులు న్యాయస్థానంలో దాఖలు చేసిన అభియోగపత్రంలో లేఖ గురించి పేర్కొన్నారు. సంఘటనా స్థలం నుంచి దాన్ని సేకరించామని పేర్కొన్నారు. 'అత్యాచారం, హత్య చేసినందుకు నన్ను క్షమించండి' అంటూ హాస్టల్‌లో ఉన్న మిగతా యువతులను ఉద్దేశించి ఈ లేఖలో సత్యంబాబు రాసినట్లు అభియోగపత్రంలో వివరించారు. లేఖకు మరోవైపు చిరుత, చరణ్‌తేజ, 143 అని రాసి.. హృదయం చిహ్నం(లవ్ సింబల్) వేసినట్లు కూడా పేర్కొన్నారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్.ఐ.ఆర్.లో ఈ లేఖ ప్రస్తావన లేదని, కేసు డెయిరీల్లోనూ దాని గురించి ఎక్కడా చెప్పలేదని, కాని అకస్మాత్తుగా అభియోగపత్రంలో లేఖ గురించి చెప్పడమే కాక.. అందులో చేతిరాత సత్యంబాబుదే అని నిర్ధరిస్తూ ఫోరెన్సిక్ నిపుణులు ఇచ్చిన నివేదికను కూడా జోడించటంపై సీబీఐ అధికారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

సీజీఎస్టీ, కస్టమ్స్ చీఫ్ కమిషనర్‌గా హరేరామ్

ఈనాడు, విశాఖపట్నం: విశాఖపట్నం సీజీఎస్టీ, కస్టమ్స్ చీఫ్ కమిషనర్‌గా బి.హరేరామ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ సీజీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఆయన పదోన్నతిపై చీఫ్ కమిషనర్ అయ్యారు. పూర్వ చీఫ్ కమిషనర్ సహరావత్ గతేడాది నవంబరులోనే బదిలీ అయ్యారు. 1987వ బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన బి.హరేరామ్ సహాయ కమిషనర్‌గా, సహాయ సంచాలకులుగా, సంయుక్త కమిషనర్‌గా, కమిషనర్‌గా, ప్రిన్సిపల్ కమిషనర్‌గా దేశంలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. విధి నిర్వహణలో ప్రతిభకుగానూ 2005లో రాష్ట్రపతి పతకాన్ని అందుకున్నారు. చీఫ్ కమిషనర్‌గా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకు సంబంధించిన సీజీఎస్టీ వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు.







ఈనాడు

ఖాకీవనానికి 'సుప్రీం' కంచె

మనిషి మనుగడకు ప్రాణాధారమైన గాలితోపాటు చల్లని నీడనిచ్చి సేదతీర్చే వృక్షాల్లాంటివే పటుతర ప్రజాస్వామ్య వ్యవస్థలు కూడా! రాజకీయ చీడపీడలు సోకి వ్యవస్థలు గుల్లబారిపోకుండా కాచుకోవడం- ప్రజాతంత్ర బాధ్యత. రాజకీయంగా పాలనపరంగా పోలీసులపై పెరిగిపోతున్న ఒత్తిళ్లను ఉపేక్షిస్తే ప్రజాస్వామ్య పునాదులే బీటలువారిపోతాయని పోలీసు పరిశోధన అభివృద్ధి సంస్థ నాలుగు దశాబ్దాలనాడే విస్పష్టంగా హెచ్చరించింది. అదెంత వాస్తవమో కళ్లకు కట్టిన నేపథ్యంలో- దుర్రాజకీయ కబంధ హస్తాల నుంచి పోలీసు వ్యవస్థను తప్పించేందుకు సర్వోన్నత న్యాయపాలిక విస్పష్ట ఆదేశాలు జారీచేసి పుష్కరకాలం దాటింది. నాటి చరిత్రాత్మక తీర్పు స్ఫూర్తిని కొడిగట్టించడానికి ఇన్నేళ్లుగా సాగుతున్న కపట నాటక విన్యాసాలకు తెరదించుతూ సుప్రీంకోర్టు తాజాగా చేసిన న్యాయ నిర్ణయం సంస్తుతిపాత్రమైనది. పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) నియామక వ్యవహారమంతా తమ చెప్పుచేతల్లోనే ఉండేలా- 2006లో 'సుప్రీం' ఇచ్చిన ఉత్తర్వుల్ని సవరించాలని కోరుతూ పంజాబ్, కేరళ, పశ్చిమ్‌బంగ, హరియాణా, బిహార్ రాష్ట్రాలు న్యాయపాలికను ఆశ్రయించాయి. రాజకీయ ఒత్తిళ్లనుంచి పోలీసు అధికారులకు రక్షణ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణలే లక్ష్యంగా డీజీపీల ఎంపిక, నియామక సరళి ఉండేలా గత ఆదేశాలున్నాయన్న సుప్రీంకోర్టు- అయిదు రాష్ట్రాల విజ్ఞప్తుల్ని టోకున తోసిపుచ్చింది. పోలీసు సంస్కరణలకు సంబంధించి నిరుడు జులై తొలివారంలో ఇచ్చిన ఆదేశాలు తు.చ. తప్పక అమలు కావాలనీ గిరిగీసింది. ప్రస్తుత డీజీపీ పదవీకాలం ముగియడానికి మూణ్నెళ్ల ముందే రాష్ట్రాలు సీనియర్ అధికారుల జాబితాను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పంపించాలని- మిగిలిన పదవీకాలం, మంచి రికార్డు, పోలీసు దళాలకు సారథ్యం వహించగల విస్తార అనుభవం ప్రాతిపదికన యూపీఎస్సీ నిర్ణయించే ముగ్గురినుంచి రాష్ట్ర ప్రభుత్వం ఒకర్ని ఎంచుకోవాలనీ సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. దుర్రాజకీయ చీకటి కోణాలకు తావులేకుండా, పూర్తి పారదర్శకంగా అత్యున్నత నియామకాలు సాగడం- ఆయా వ్యవస్థల సామర్థ్యాన్ని ఇనుమడింపజేస్తుంది!

ఏ ప్రజాతంత్ర దేశంలోనైనా పోలీసు వ్యవస్థ అంటే- సామాజిక భద్రతా సాధనం. అవినీతి నేతల మోచేతి నీళ్లు తాగుతూ అధికార పరమపద సోపానాల్ని అవలీలగా అధిరోహించడంలో పోలీసు బాసులు పోటీపడుతుండటానికి, ఘోర నేరాలకు పాల్పడ్డవాళ్లూ బోర విరుచుకుని తిరుగుతుండటానికిగల సంబంధం- దేశీయంగా వ్యవస్థ రాజకీయంగా పుచ్చి, నైతికంగా చచ్చిందనడానికి నిదర్శనం. వృత్తిధర్మానికి నిబద్ధమైన వాళ్లకు, తమ అనుచిత ఫర్మానాలను పాటించని వాళ్లకు చీటికి మాటికి బదిలీ బహుమానాలు ఇచ్చే క్షుద్ర రాజకీయం గజ్జె కట్టిందంటూ 1996లో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు- కీలెరిగి వాత పెట్టేలా విస్పష్ట ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర డీజీపీలకు నిర్ణీత పదవీకాలం, పోలీసుల పనిపోకడల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో భద్రతా కమిషన్, రోజువారీ శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతలనుంచి దర్యాప్తు విధుల్ని వేరు చేయడం వంటి కీలక సూచనల్ని అప్పటికి మూడు దశాబ్దాల క్రితమే జాతీయ పోలీసు సంఘం అందించింది. వాటి అమలులో అలవిమాలిన జాప్యాన్ని తీవ్రంగా పరిగణించిన 'సుప్రీం' న్యాయపాలిక- సునిశితమైన ఏడు ఆదేశాలతో రక్షక భట వ్యవస్థ సాకల్య ప్రక్షాళన క్రతువుకు తనవంతుగా బాటలు పరచింది. యూపీఎస్సీ జాబితానుంచే డీజీపీ నియామకం, డీజీపీ, ఐజీ, ఇతర సీనియర్ అధికారులకు కనీస పదవీకాలం, రాష్ట్ర స్థాయిలో భద్రతా కమిషన్లు, నియామకాలు- బదిలీల నిమిత్తం ప్రత్యేక బోర్డు వంటివి నాటి ప్రభావాన్విత ఆదేశాల్లో కొన్ని! మూడు నెలల వ్యవధిలోగా అన్ని రాష్ట్రాలూ తన ఆదేశాల్ని అమలు చెయ్యాలని 'సుప్రీం' స్పష్టీకరించినా, అడ్డమైన కొర్రీలతో వాటిని అడ్డుకొనేందుకు పలు రాష్ట్ర ప్రభుత్వాలు బారులు తీరాయి. 2006నాటి ఉత్తర్వుల స్ఫూర్తిని మరింత తేటతెల్లం చేస్తూ 2018 జులైలో సవివరంగా 'సుప్రీం' స్పందించినా- వాటికి కట్టుబాటు కష్టమన్న రాష్ట్రాలకు తాజాగా చుక్కెదురైంది!

తప్పు చేస్తే దేశాధ్యక్షుడి కూతురినైనా ఉపేక్షించని వృత్తినిబద్ధత అమెరికాలో పోలీసు వ్యవస్థ సొంతం. ప్రజాదరణ మెండుగాగల అధ్యక్షుడు బిల్ క్లింటన్‌ను సైతం నైతిక నిందారోపణలపై బోనెక్కించడంలో అక్కడి న్యాయ వ్యవస్థ ఘనత బహుధా ప్రశంసనీయం. ప్రజాజీవనంలో క్షీణ విలువలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థపై జన విశ్వాసాన్నే కదలబారుస్తున్న దశలో బ్రిటన్ చురుకుగా స్పందించి, లార్డ్ నోలన్ కమిటీ సూచనలు స్వీకరించి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఆ తరహా వ్యవస్థాగత సంస్కరణలు నిరంతరం ఎండమావిని తలపిస్తున్న దేశం మనది. జన శ్రేయస్సాధకంగా పోలీసు యంత్రాంగాన్ని రూపాంతరీకరించేందుకు ఏం చేయాలో లా కమిషన్, రెబీరో కమిటీ, పద్మనాభయ్య కమిటీ, జస్టిస్ మలీమత్ కమిటీ వంటివెన్నో విలువైన సూచనల్ని పూసగుచ్చాయి. పౌరుల సంతృప్త స్థాయి ఆధారంగా పోలీసుల పనితీరును మదింపు వెయ్యాలని జస్టిస్ వర్మ కమిటీ సిఫార్సు చేసింది. వాటిమీద సాలీళ్లు గూళ్లు కడుతుంటే, సర్వోన్నత న్యాయపాలిక ఆదేశాల్నే అమలు చేయడానికి నిరాకరిస్తున్న రాష్ట్రాలు- శాంతి భద్రతలు రాష్ట్రాల పరిధిలోని అంశమని, పోలీసు యంత్రాంగంపై సర్వం సహా పెత్తనం తమదే కావాలనీ వాదిస్తున్నాయి. సామర్థ్యం, నిజాయతీ, రుజువర్తనలతోపాటు రెండేళ్లపాటు స్థిరంగా పనిచేసే అవకాశం పోలీసు బాసుల్లోనే కాదు, మొత్తం వ్యవస్థలోనే నైతిక ధృతి పెరగడానికి దోహదపడుతుంది. చట్టబద్ధ పాలనపట్ల జన విశ్వాసం మెరుగుపడే చర్యలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఊతమిస్తే, వ్యవస్థలు బలపడతాయి. పటిష్ఠ వ్యవస్థలే దారిదీపాలై జనజీవితాలూ తెరిపిన పడతాయి!

వస్తుసేవల పన్ను (జీఎస్టీ) వల్ల దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎమ్ఎస్ఎమ్ఈ)లకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదని గత ఏడాది డిసెంబరు 21న లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. '2014లో ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టే సమయానికి ఎమ్ఎస్ఎమ్ఈలు అధోగతిలో ఉన్నాయి. ఆయన చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాల వల్ల ఈ రంగం ఇప్పుడు కొత్త ఊపిరులు పోసుకుంటోంది.' అని ఆ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఓ ముఖాముఖీలో వ్యాఖ్యానించారు. జీఎస్టీ అమలులోకి వచ్చాక దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న వ్యాపారాల్లోని లక్షల మంది జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయి. జీఎస్టీకి ముందు నోట్లరద్దు సైతం ఇదేస్థాయిలో ప్రతికూల ప్రభావం చూపించింది.



ఎమ్ఈలకు వేర్వేరు పెట్టుబడి పరిమితులను నిర్దేశించారు. ఇప్పుడు ఈ రెండు రంగాలను కలిపి టర్నోవర్ ఆధారంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాన్ని పునర్నిర్వచించాలని సవరణ బిల్లులో కేంద్రం ప్రతిపాదించింది. ఇది వ్యాపారాన్ని సరళతరం చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ఈ బిల్లు మీద నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలైన స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం), లఘు ఉద్యోగ్ భారతి సైతం ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. 'ఈ బిల్లు చట్టరూపం దాల్చితే ఎమ్ఎస్ఎమ్ఈల ప్రత్యేక గుర్తింపు కనుమరుగైపోతుంది. సూక్ష్మ పరిశ్రమలకు లభిస్తున్న ప్రోత్సాహకాలను పెద్ద సంస్థలు చేజిక్కించుకోవడానికి ఈ బిల్లు ఉపయోగపడుతుంది' అని ఎస్‌జేఎం సహ కన్వీనర్ అశ్వినీ మహాజన్ ఆందోళన వ్యక్తంచేశారు. తయారీ రంగంలోని ఎమ్ఎస్ఎమ్ఈలు కొనుగోళ్లు- అమ్మకాల వ్యాపారాలు, విడిభాగాల బిగింపు పరిశ్రమల వైపు మొగ్గుచూపేలా ఈ బిల్లు ప్రోత్సహిస్తుందని తద్వారా 'భారత్‌లో తయారీ' లక్ష్యం నీరుగారిపోతుందనే వాదన వినిపిస్తోంది. తయారీ, సేవారంగాల్లోని ఎంఎస్ఎంఈల స్వభావాలు, సమస్యలు వేర్వేరు. వాటన్నింటినీ కలిపి ఒకేలా గుర్తించడం వల్ల ప్రయోజనమేమీ లేదు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెట్టుబడి పరిమితులను పెంచాలని కోరుతున్నాయి. ప్రభుత్వం దాన్ని పక్కన పెట్టి ఆదాయం ఆధారంగా వర్గీకరణకు పూనుకుంది. జాతీయ ఎమ్ఎస్ఎమ్ఈ విధాన రూపకల్పన కోసం తగిన సిఫార్సులు చేయమంటూ కేంద్ర కేబినెట్ విశ్రాంత కార్యదర్శి, ఝార్ఖండ్ మాజీ గవర్నర్ డాక్టర్ ప్రభాత్‌కుమార్ ఆధ్వర్యంలో 2015లో ఏకసభ్య సంఘాన్ని నియమించారు. సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదాయం, ఉపాధికల్పనల ఆధారంగా వర్గీకరించాలనే ప్రతిపాదనను అప్పట్లోనే అధికార యంత్రాంగం ఈ సంఘం ముందు ఉంచింది. 2017లో ప్రభాత్‌కుమార్ నివేదికను సమర్పిస్తూ ఈ నిర్వచనం మార్పు అవసరం లేదని, పెట్టుబడి పరిమితులను పెంచితే చాలన్నారు. ఆయన సిఫార్సును తిరస్కరించి కేంద్రం సవరణ బిల్లును తీసుకొచ్చింది.

చిన్న పరిశ్రమలకు పెద్ద దెబ్బ

అఖిల భారత పరిశ్రమల సమాఖ్య నివేదిక ప్రకారం పెద్దనోట్ల రద్దు తరవాత అసంఘటిత రంగంలోని సూక్ష్మ పరిశ్రమల్లో 40 శాతం ఖాయిలాపడే దుస్థితిలోకి జారిపోయాయి. 'ఇటీవలి కాలంలో ఎమ్ఎస్ఎమ్ఈ రంగం రెండు పెద్ద కుదుపులకు లోనైంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ నిర్ణయాలు ఆయా యూనిట్లను తీవ్రంగా దెబ్బతీశాయి' అని 2018 ఆగస్టులో ఆర్‌బీఐ అధ్యయన ఫలితాలు స్పష్టంచేశాయి.

ఉద్యోగాలు కోల్పోయి వెతలు

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. వ్యవసాయం తరవాత ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్న రంగం ఇదే. దేశవ్యాప్తంగా ఉన్న 6.33 కోట్ల ఎమ్ఎస్ఎమ్ఈలు 11.1 కోట్ల మందికి నేరుగా ఉపాధి కల్పిస్తున్నాయి. ఇంతకు అయిదు రెట్ల మంది ఈ పరిశ్రమలను నమ్ముకుని జీవిస్తున్నారు. దేశ జీడీపీలో దాదాపు 30 శాతం, తయారీ రంగ ఉత్పాదకతలో 45 శాతం, ఎగుమతుల్లో 48.5 శాతాలకు ఎమ్ఎస్ఎమ్ఈలే ఆధారాలు. పరిమాణం, వ్యాపార స్వభావాల కారణంగా ఈ రంగం పలు సమస్యలను ఎదుర్కొంటోంది. మొత్తం ఈ రంగంలో సూక్ష్మ పారిశ్రామిక యూనిట్లు 6.3 కోట్లు. పది మంది లోపు కార్మికులతో తక్కువ పెట్టుబడితో చిన్న చిన్న పనులు చేసుకుంటూ, కనీస మొత్తం లాభాలు పొందే యూనిట్లు ఇవి. వీటిలో 66 శాతం పరిశ్రమలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు నిర్వహించేవే. వీటిలో అత్యధికం అసంఘటిత రంగంలోనే ఉన్నాయి. రోజువారీ పనిని బట్టి మనుగడ సాగించే ఈ పరిశ్రమల్లో సాధారణంగానే నగదు లావాదేవీలు ఎక్కువగా ఉంటాయి. పెద్దనోట్ల రద్దు వీటికి అశనిపాతమైంది. వినియోగదారుల నుంచి చెల్లింపుల్లో జాప్యం జరగడంతో రుణదాతలకు కిస్తీలు, కార్మికులకు వేతనాలు చెల్లించడంలో అవి బాగా ఇబ్బందిపడ్డాయి. ఓ అధ్యయనం ప్రకారం 2016 అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో ఎమ్ఎస్ఎమ్ఈల్లో 35 శాతం మేర ఉద్యోగాలు పోయాయి. 2017 జనవరి- మార్చి త్రైమాసికంలోనూ 30 శాతం ఉద్యోగులు తొలగింపునకు గురయ్యారు. ఆ తరవాత మూడు నెలల్లో పరిస్థితులు కాస్త కుదటపడుతున్నాయని అనుకుంటున్న సమయంలో జీఎస్టీ అమలులోకి వచ్చింది. ఫలితంగా తరవాతి త్రైమాసికంలో 25 శాతం ఉద్యోగాలు పోయాయి. 'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి కాయకల్ప చికిత్స చేస్తాననే హామీతో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ, వాస్తవంలో అందుకు విరుద్ధమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి' అని ఏఐఎమ్ఓ అధ్యక్షుడు రఘునాథన్ స్పష్టం చేశారు.

బ్యాంకర్ల నుంచి చేయూత లభించకపోవడంతో పెద్దనోట్ల రద్దుకు ముందు నుంచే హైదరాబాదు చుట్టుపక్కల రెండు వేలకు పైగా ఎమ్ఎస్ఎమ్ఈ ఖాయిలా పడ్డాయి. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీల తరవాత వీటికి గడ్డురోజులు దాపురించాయి. తమిళనాడులోని కోయంబత్తూరు, తిరుప్పూర్ జిల్లాల్లోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 3.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుంటాయి. జీఎస్టీ ప్రభావంతో (కొత్తగా పన్ను పరిధిలోకి రావడం, 18 శాతం దాకా పన్ను విధించడం తదితరాలు) ఇక్కడ సుమారు యాభై వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. అసోం వెదురు ఉత్పత్తులు, లూథియానా సైకిళ్లు, కశ్మీర్ తివాచీలు, మొరాదాబాద్ ఇత్తడి, సూరత్ వస్త్ర పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఆరు వేల కోట్ల రూపాయల టర్నోవర్ గల మొరాదాబాద్ పరిశ్రమ 60 శాతం నష్టపోయింది. జంషెడ్‌పూర్‌లో వెయ్యి కర్మాగారాలు ఖాయిలా పడ్డాయి. సూరత్ దుస్తుల పరిశ్రమలో అమ్మకాలు 30- 40 శాతం తగ్గాయని, ఫలితంగా నాలుగు లక్షల ఉద్యోగాలు పోయినట్టు స్థానిక వస్త్ర వ్యాపారుల సమాఖ్య ప్రకటించింది. ఇదే నగరంలోని వేలాది ఎంబ్రాయిడరీ యూనిట్లలో పనిచేసే ఏడు లక్షల కుటుంబాలూ వీధినపడ్డాయి. జీఎస్టీ అమలులోకి వచ్చిన మొదటి నాలుగైదు నెలల్లోనే తమ మూలధనాల్లో 20- 25 శాతం నష్టపోయామని వారణాసి

నోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావం...

వస్త్ర వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దనోట్ల రద్దు తరవాత ముంబయి ప్రాంతంలోని ధారవీలో ఉన్న ఎనిమిది వేల ప్లాస్టిక్, దుస్తులు, తోళ్ల పరిశ్రమల్లో సగం మూతపడ్డాయి. 'నల్లధనం స్థిరాస్తులు, బంగారం రూపంలోనే ఉంది. ప్రభుత్వం బినామీ ఆస్తుల స్వాధీనం మీద దృష్టిపెడితే మంచి ఫలితాలొచ్చేవి. కానీ అలా జరగలేదు. అందుకే వ్యాపారులు పెద్దనోట్ల రద్దును అపరాధంగా చూస్తున్నారు. నల్లధనం పేరుచెప్పి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను దెబ్బకొట్టారు' అని అఖిలభారత ఎమ్ఎస్ఎమ్ఈ సమాఖ్య సెక్రటరీ జనరల్ అనిల్ భరద్వాజ్ ఆవేదన వ్యక్తంచేశారు.

నోట్లరద్దు, జీఎస్టీ... సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం పనితీరును దెబ్బతీశాయన్నది వాస్తవం. వీటి తరవాత మోదీ సర్కారు మరో తేనెతుట్టెను కదిపింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక రంగ మౌలిక స్వరూపాన్నే మార్చే 'ఎమ్ఎస్ఎమ్ఈల అభివృద్ధి (సవరణ) బిల్లు'ను జులై 2018లో లోక్‌సభలో ప్రవేశపెట్టింది. పెట్టుబడి ఆధారంగా ఇప్పటి వరకూ వీటిని వర్గీకరిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో తయారీ, సేవారంగ ఎమ్ఎస్

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎమ్ఎస్ఎమ్ఈ)ల వివరాలు

సంవత్సరం	ఎమ్ఎస్ఎమ్ఈల జీవీఏ (స్థూల విలువ జోడింపు)	వృద్ధి	జీవీఏ(స్థూల విలువ జోడింపు)లో ఎమ్ఎస్ఎమ్ఈల వాటా	దేశ జీడీపీలో ఎమ్ఎస్ఎమ్ఈల వాటా
2011-12	రూ. 25.83 లక్షల కోట్లు	--	31.86 %	29.57 %
2012-13	రూ. 29.77 లక్షల కోట్లు	15.27 %	32.36 %	29.94 %
2013-14	రూ. 33.43 లక్షల కోట్లు	12.27 %	32.26 %	29.76 %
2014-15	రూ. 36.58 లక్షల కోట్లు	9.43 %	31.86 %	29.39 %
2015-16	రూ. 39.36 లక్షల కోట్లు	7.62 %	31.60 %	28.77 %

ఆధారం: కేంద్ర గణాంకాల సంస్థ సమాచారం

ప్రధాని నిర్ణయాలపై పెదవివిరుపు

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి ఉపశమనం కల్పించడానికి గత నవంబరులో ప్రధాని కొన్ని నిర్ణయాలు ప్రకటించారు. కోటి రూపాయల వరకూ రుణాన్ని 59 నిమిషాల్లో మంజూరు చేయడం, పాత రుణాల చెల్లింపులపై రెండు శాతం వడ్డీ తగ్గింపు వంటి నిర్ణయాలను అమలులోకి తెచ్చారు. వీటి వల్ల తమకు కలిగే మేలు పెద్దగా లేదని ఎమ్ఎస్ఎమ్ఈ వర్గాలు పెదవి విరిచాయి. మరోవైపు, కొత్త సంవత్సరం మొదటి రోజున రుణాల ఏకకాల పునర్‌వ్యవస్థీకరణ పథకాన్ని ఆర్‌బీఐ ప్రకటించింది. ఆ మరుసటి రోజు ఈ రంగం ఎదుర్కొంటున్న వ్యవస్థీకృత సమస్యలను అధ్యయనం చేసి, దీర్ఘకాలిక పరిష్కారాలను సూచించడానికి ఓ ఉన్నతస్థాయి సంఘాన్ని నియమించింది. సెబీ మాజీ ఛైర్మన్ యు.కె.సిన్హా నేతృత్వంలోని ఈ సంఘం ఈ ఏడాది జూన్ నాటికి నివేదికను సమర్పించాల్సి ఉంది. రుణాల లభ్యత నుంచి నిబంధనల సంకెళ్ల వరకూ ఈ రంగం సమస్యలపై ఇప్పటికే విస్తృత అధ్యయనం జరిగింది. కానీ, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. 2011-12తో పోల్చితే 2015-16 నాటికి ఎమ్ఎస్ఎమ్ఈలు జోడించిన స్థూలవిలువ (జీవీఏ) లో వృద్ధి సగానికి సగం పడిపోయింది. దేశ జీడీపీలో వాటి వాటా సైతం తగ్గింది. మూలిగే నక్కపై తాటిపండు పడినట్టు నోట్లరద్దు, జీఎస్టీ ఈ రంగాన్ని దెబ్బతీశాయి. ముఖ్యంగా జీఎస్టీ వర్తింపునకు సంబంధించి అభ్యంతరాలున్నాయి. ప్రభుత్వం సహేతుకంగా వ్యవహరించి సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది!

- శైలేష్ నిమ్మగడ్డ

మూలాలకే ముప్పు

పౌరసత్వ చట్ట సవరణ బిల్లు ఈశాన్య భారతంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్లలో వేధింపులకు గురై భారత్‌కు వలస వచ్చిన ముస్లిమేతరులకు ఈ బిల్లు ద్వారా పౌరసత్వం కల్పించదలచారు. ఈ మూడుదేశాల్లోని హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు 2014 డిసెంబరు 31కి ముందు భారత్‌కి వలస వచ్చి ఉంటే వారికి పౌరసత్వం కల్పించాలని బిల్లు సూచిస్తోంది. వాస్తవానికి 1955 పౌరసత్వ చట్టం ప్రకారం అక్రమంగా ప్రవేశించిన విదేశీయులు పౌరసత్వం పొందేందుకు అర్హులు కారు. గతంలో విదేశాల నుంచి వచ్చిన వారు 11 సంవత్సరాలు నివసిస్తేనే పౌరసత్వం పొందడానికి అర్హులు. ఈ మూడుదేశాల నుంచి వచ్చిన ముస్లిమేతరులు ఆరేళ్లు ఇక్కడ నివసిస్తే, పౌరసత్వం లభించే విధంగా బిల్లులో తాజాగా సవరణ చేశారు. దశాబ్దాల నుంచి బంగ్లాదేశ్ అక్రమ వలసదారులతో అసోమ్‌లోని పలు జిల్లాల జనాభా స్వరూపమే మారిపోయింది. 1979-85 మధ్య కాలంలో అక్రమ వలసలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో విద్యార్థి సంఘాల నేతృత్వంలో భారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఫలితంగా 1985లో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ హయాములో అసోం ఒప్పందం కుదిరింది. 1971 మార్చి 24 తరవాత బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారిని అక్రమ చొరబాటుదారులుగానే గుర్తించి వెనక్కు పంపేయాలని అందులో పేర్కొన్నారు.

అక్రమ చొరబాటుదారులను మతపరంగా విభజించడంపై నిరసన వ్యక్తమవుతోంది. రాజ్యాంగంలోని 14వ అధికరణ ప్రకారం దేశంలోని ఏ పౌరుడి పట్లా ప్రభుత్వం దుర్విచక్షణ కనబరచరాదు. ఇందుకు భిన్నంగా అక్రమంగా వలస వచ్చిన కొన్ని మతాల వారికి పౌరసత్వం కల్పించడాన్ని ఈశాన్యంలోని పలు ప్రజా, యువజన, విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు దేశంలో రెండు కోట్లకు మందికిపైగా ఉంటారని అంచనా. కొన్నినెలల క్రితం అసోమ్‌లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించిన జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్సీ)లో దాదాపు 40 లక్షల మందిని అక్రమంగా వచ్చినవారిగా గుర్తించారు. వీరి పూర్వీకులు అసోమ్‌కు చెందినవారుగా సరైన పత్రాలు సమర్పిస్తే భారత పౌరులుగా గుర్తించే వెసులుబాటు కల్పించారు.

పౌరసత్వ చట్ట సవరణ బిల్లును నిరసిస్తూ అసోమ్‌లో భాజపా సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వం నుంచి అసోం గణ పరిషత్ (ఏజీపీ) బయటకు వచ్చింది. బిల్లు చట్టరూపం దాల్చితే బంగ్లాదేశ్ నుంచి వచ్చే అక్రమ వలసలకు ద్వారాలు తెరిచినట్టే అవుతుందని ఏజీపీ పేర్కొంటోంది. బిల్లుకు వ్యతిరేకంగా మణిపూర్, నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర తదితర ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఆందోళనలు మిన్నంటుతున్నాయి. బిల్లును వెనక్కు



పౌరసత్వ బిల్లు ప్రకంపనలు

తీసుకోవాలని నాగాలాండ్ సీఎం కోరగా, మణిపూర్‌ను మినహాయించాలని ఆ రాష్ట్రంలోని భాజపా ప్రభుత్వం డిమాండ్ చేసింది. 1985 అసోం ఒప్పందంలోని ఆరో నిబంధన ప్రకారం అస్సామీయుల వారసత్వ, సాంఘిక, భాషా, సాంస్కృతిక పరమైన వికాసానికి రాజ్యాంగ, శాసన, పాలనపరమైన రక్షణలు ఉన్నాయి. సవరణ బిల్లు వీటికి వ్యతిరేకంగా ఉందని ప్రజా, విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అక్రమంగా ప్రవేశించిన బంగ్లా జాతీయులను మతంతో ముడిపెట్టకుండా తిప్పి పంపివేయాలన్నది వారి డిమాండ్. జాతీయ పౌరపట్టిక (ఎన్ఆర్సీ)లో అసలైన అస్సామీయులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా దాదాపు 40 లక్షల మందిని జాబితా నుంచి తొలగించారు. వీరిలో సగం మంది బంగ్లా హిందువులు ఉంటారని అంచనా. అక్రమ వలసదారులతో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. వీరు అక్రమ పద్ధతుల్లో ఓటరు, ఆధార్ కార్డులు పొందుతున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోని వివిధ తెగలు ప్రత్యేకమైన ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి కలిగి ఉన్నాయి. అక్రమ వలసల కారణంగా సొంత ప్రాంతాల్లో మైనార్టీలుగా మారిపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

పౌరసత్వ బిల్లుతో ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేకించి అసోమ్‌కు లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర మంత్రి హిమంత బిశ్వ శర్వ పేర్కొంటున్నారు. బంగ్లాదేశ్ ముస్లిముల రాకతో రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో స్థానికులు మైనార్టీలుగా మారిన ఉదంతాన్ని ఆయన గుర్తుచేశారు. వలస వచ్చిన హిందువులకు స్థిరనివాసం కల్పిస్తే జనాభాలో సమతూకం వస్తుందన్నది భాజపా నేతల యోచన. కొత్తగా ఓటుహక్కు పొందే బంగ్లా హిందువులు తమకు అనుకూలంగా ఓటువేస్తారని కమలనాథులు ఆశాభావంతో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువసీట్లు గెలుచుకోవాలన్నది వారి వ్యూహం. రాజస్థాన్‌లో గత అయిదేళ్లలో పాకిస్థాన్ నుంచి పారిపోయి వచ్చిన వేలాది హిందువులకు ఆశ్రయం కల్పించారు. కానీ రాజస్థాన్‌తో ఈశాన్య రాష్ట్రాలను పోల్చలేమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అసోమ్‌లో 1971 నుంచి లక్షలాది బంగ్లాదేశీయులు అక్రమంగా వలస వచ్చి స్థిరపడ్డారు. దీంతో స్థానికులు, వలస వచ్చిన వారికి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. బిల్లును వెనక్కు తీసుకోవాలంటూ యువత ఉద్యమిస్తుండటంతో ఏం చేయాలో భాజపాకు అర్థం కావడం లేదు. బిల్లుపై కేంద్రం తన పట్టు వీడకుంటే శాంతి చర్చల నుంచి తప్పుకొంటామని 'ఉల్ఫా' (యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం) హెచ్చరించింది. అసోం ఒప్పందంపై కేంద్రం నియమించిన కమిటీకి నేతృత్వం వహిస్తున్న బెజ్‌బారువా పదవి నుంచి తప్పుకోవడం పరిస్థితుల తీవ్రతకు అద్దంపడుతోంది. బిల్లు వల్ల రాష్ట్రంతోపాటు ఇతర ఈశాన్య రాష్ట్రాల ప్రజల హక్కులకు ఎలాంటి భంగం ఏర్పడబోదంటూ ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ఆందోళనలను ఉపశమింప చేయలేకపోతోంది. ఈ అంశంపై కేంద్రం మరోసారి సమీక్షించాల్సిన అవసరం ఉంది!

- కొలకలూరి శ్రీధర్

ఈనాడు లేఖలు

ప్రభుత్వ చిత్తశుద్ధి ప్రశ్నార్థకం

గత కొంతకాలంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (కేదస- సీబీఐ)లో చోటుచేసుకున్న పరిణామాలు ఆ సంస్థ విశ్వసనీయతపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ చిత్తశుద్ధినీ ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అత్యున్నత దర్యాప్తు సంస్థ వ్యవహారాలను కేంద్ర ప్రభుత్వం ఆషామాషీగా తీసుకున్నట్లు కనపడుతోంది. ఏకంగా సంస్థ అధిపతి, అందులో పనిచేస్తున్న సీనియర్ అధికారులపైనే ఆరోపణలు రావడం దాని ప్రతిష్ఠను దిగజారుస్తోంది. దర్యాప్తు సంస్థ అధికారులే దర్యాప్తును ఎదుర్కోవలసి రావడాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. తొలుత డైరెక్టర్ తొలగింపు, తాత్కాలిక డైరెక్టర్ నియామకం, సర్వోన్నత న్యాయస్థానంలో కేసు, తీర్పు తదనంతర పరిణామాలు ప్రజలను నివ్వెర పరచాయి. నియామకానికి సంబంధించి ప్రధానమంత్రి ఆధ్వర్యంలోని సంఘం వ్యవహారశైలిపై సైతం విమర్శలు రావడం దురదృష్టకరం. ఇకనైనా సంస్థ విశ్వసనీయత పెంచే విధంగా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

- కె.బాబూరావు, కొత్తపేట, హైదరాబాద్

కాంట్రాక్టు కార్మికులకు భరోసా

కాంట్రాక్టు కార్మికులకు మేలు చేసే విధంగా ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. విద్య, ఉద్యోగ రంగాల్లోని కాంట్రాక్టు కార్మికులకు వేతనాల పెంపు ఇతర సౌకర్యాలను కల్పిస్తూ మంత్రుల బృందం కీలక నిర్ణయం తీసుకుంది. ఏళ్లతరబడి పని చేస్తున్న కార్మికుల జీవితాల్లో ఇది వెలుగులు నింపనుంది. వీరు ఇప్పటివరకు కనీస సౌకర్యాలకు నోచుకోక, అరకొర జీతాలతో జీవితాలను భారంగా నెట్టుకొస్తున్నారు. తమ ఇబ్బందులపై అనేకసార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించడం స్వాగతించదగ్గ పరిణామం. ఈ నిర్ణయం అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి.

- దుగ్గివలస రామ్‌ప్రసాద్, సరుబుజ్జిలి, శ్రీకాకుళం జిల్లా

జీవన సాఫల్యం


'ప్రస్తుతం మీ శిష్యులతో చేయిస్తున్న సాధన ఏమిటి?' అని బుద్ధుణ్ని అడిగాడొకాయన. 'తినడం, నడవడం, కూర్చోవడం సాధన చేస్తున్నాం' అని బుద్ధుడు బదులిచ్చాడు. అడిగిన ఆసామీ ఆశ్చర్యపోయాడు. 'నిత్యం ప్రతి మనిషీ చేసేవాటిని సాధనగా ఎలా చెబుతారు?' అని తిరిగి ప్రశ్నించాడు. 'తినడాన్ని కాదు మేం సాధన చేస్తున్నది- తిండి మీద ఎరుకను' అన్నాడు బుద్ధుడు. ఇది చాలా చిన్నదిగా తోచే అతి గంభీరమైన విషయం.

రాముడి నివేదన కోసం సేకరించిన ప్రతి పండును శబరి ఎంత శ్రద్ధగా ఎంపిక చేసిందో, రంగనాథుడి కైంకర్యం కోసం తపిస్తున్న పువ్వులను విష్ణుచిత్తుడు ఎంత విధేయతతో స్వీకరించాడో- అలా మనం తినే ప్రతి మెతుకును ప్రజాపతి ప్రసాదిస్తున్న పాయసపాత్రను అందుకున్నప్పటి దశరథుడిలా తపనతో చేతుల్లోకి తీసుకుంటే- ఆ మెతుకు అమృతమే అవుతుంది. ఆహారాన్ని ప్రసాదంగా తీసుకునేటప్పుడూ ఇదే సూత్రం వర్తిస్తుంది. బుద్ధుడు చెప్పిన ఎరుక అలాంటిదే!

ఏం చేస్తుంటే దానిపైన, ఏం చూస్తుంటే దానిలోను పూర్తిగా నిమగ్నం కావడం సాధనతో మాత్రమే పట్టుబడే విద్య. నిపుణుడైన ఒక వైద్యుడు రోగి ప్రాణాలను రక్షించడమే పరమ లక్ష్యంగా శస్త్రచికిత్స నిర్వహిస్తున్నప్పుడు అలాంటి నిమగ్నత తోస్తుంది. పక్షికి బాణం గురి పెట్టినప్పుడు అర్జునుడు చూపించిందదే! ప్రతి పనినీ అలా జాగ్రత్తగా నిర్వహించడంలో మొదట్లో ఎంతో ఒత్తిడి ఉంటుంది. సాధనతో దాన్ని అధిగమించినప్పుడు నైపుణ్యం అలవడుతుంది. చేసే ప్రతి పనిలోనూ అది ప్రతిఫలిస్తుంది. ఆంగ్లంలో దాన్ని 'మైండ్‌ఫుల్‌నెస్' అంటున్నారు. తెలుగులో 'మనసు పెట్టి చేయడం'గా అనుకోవచ్చు. మనసు పెట్టి చేసేది ప్రతిదీ ధ్యానమే అవుతుంది. 'నీ ధ్యాస ఇక్కడ లేదు' అనేవారు మన పెద్దలు. అంటే చేస్తున్న పనిపట్ల మనకు పూర్తిస్థాయి స్పృహ ఏర్పడలేదని అర్థం. ధ్యాస, స్పృహ, ఎరుక, ఏకాగ్రత, నిమగ్నత... వంటివన్నీ ధ్యానంలో భాగాలు. బండి నడపడం, తినడం, నడవడం, కూర్చోవడం... అన్నీ ధ్యానపూర్వకంగా జరుగుతాయి.

పని ఎంత చిన్నదైనా ఏకాగ్రతతో చేస్తుంటే ప్రకృతి సిద్ధంగా మనసులోంచి శక్తి ఉబికి వస్తుందని, మనిషికి ప్రోత్సాహకరంగా మారుతుందని 'ఒక యోగి ఆత్మకథ'లో పరమహంస యోగానంద సోదాహరణంగా వివరించారు. అప్పుడవి చేస్తున్న పనులుగా కాక- మనద్వారా జరుగుతున్న పనులుగా పరిణమిస్తాయి. మేలుతరమైన ఫలితాలను అందిస్తాయి.

'ఏ పని చేస్తున్నా వేరే ఆలోచనలు వస్తూనే ఉన్నాయి. చేసే పనిమీద మనసు నిలవడం లేదు. ఏకాగ్రతను అనుభవపూర్వకంగా నిరూపించండి గురుదేవా' అని ఆధ్యాత్మిక గురువును సాధకుడు అభ్యర్థించాడు. 'దేని గురించి ఎక్కువగా ఆలోచనలు వస్తున్నాయి?' అని అడిగాడు గురువు. 'భార్యాపిల్లల గురించి, సంపాదన గురించి, ఆస్తిపాస్తుల గురించి' అన్నాడు శిష్యుడు. ఆ సమయంలో వారిద్దరూ నదిలో స్నానం చేస్తున్నారు. గురువు వెంటనే జుట్టు పట్టుకొని శిష్యుణ్ని నీళ్లలో ముంచేసి గట్టిగా అదిమిపట్టాడు. ప్రాణం పోయినంత పని అయింది శిష్యుడికి. ఎలాగో పట్టు విడిపించుకొని గభాలున నీళ్లలోంచి లేచాడు. 'చచ్చిపోయాననే అనుకున్నాను, ఎందుకలా చేశారు' అని గురువును అడిగాడు. 'ఇప్పుడు చెప్పు! ఆ క్షణాన నీకు ప్రాణాలెలా రక్షించుకోవాలన్న ధ్యాస ఒక్కటి తప్ప నిన్ను నిత్యం వెంటాడుతున్న ఆలోచనలేవీ రాలేదు కదా! అదే ఏకాగ్రత అంటే' అన్నాడు గురువు. చేసే ప్రతి పనిలోనూ ఆ స్థాయి ఏకాగ్రతను, ఎరుకను అలవరచడమే బుద్ధుడు తన శిష్యులతో సాధన చేయిస్తున్నది.



అంతర్యామి

శ్వాస ఒకటే కాదు, చేసే ప్రతి పనినీ గమనిస్తూ వర్తమానంలో జీవించడమే ధ్యానం. అదే యోగజీవనం. బతుకులోని ప్రతిక్షణంతోను కలిసి నడవడమే జీవితాన్ని ఆస్వాదించడమంటే! మనం గడుపుతున్నామా, జీవిస్తున్నామా- అనేది ధ్యాసే నిర్ణయిస్తుంది. గడుపుతున్నవాడు బద్ధుడు, గ్రహించినవాడు బుద్ధుడు. అంతే తేడా! బుద్ధుడనేది పేరుగా కాకుండా స్వభావంగా గుర్తించడమే మనిషి జీవితానికి సాఫల్యం!

- ఎర్రాప్రగడ రామకృష్ణ

ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్ల బొనాంజా

ఈనాడు - హైదరాబాద్

ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శుభవార్త. ఆయా విద్యా సంస్థల్లో ఏకంగా 25 శాతం వరకు సీట్లను పెంచుకోవాలని కేంద్రం ప్రకటించింది. ఆర్థికంగా వెనకబడిన కులాలకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నందున వచ్చే విద్యా సంవత్సరం నుంచే సీట్ల పెంపు అమల్లోకి రానుందని వెల్లడించింది. దీనికి సంబంధించి వారం రోజుల్లోనే యూజీసీ, ఏఐసీటీఈల నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడనున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు అధిక ప్రయోజనం చేకూరనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఐఐటీ, ఎన్ఐటీ లాంటి జాతీయ విద్యాసంస్థల్లో స్వల్ప సంఖ్యలో సీట్లు పెరగాలంటే అందుకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు, అధ్యాపకులు అవసరం. విద్యా నాణ్యత విషయంలో రాజీపడకుండా ఉండాలన్నదే దాని వెనుక ఉద్దేశం. ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను ప్రపంచంలోని పది కఠిన పరీక్షల్లో ఒకటిగా నిపుణులు చెబుతుంటారు. వాటిల్లో వేల సంఖ్యలో సీట్లుంటే లక్షల మంది పోటీ పడుతుంటారు. ఆ సంస్థల్లో చదువుకునే విద్యార్థులకు బహుళజాతి సంస్థలు భారీ వేతనం ఇచ్చి ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాయి. అలాంటి వాటిల్లో 25 శాతం సీట్లు పెరుగుతాయని కేంద్రం ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

25 శాతం సీట్ల పెంపు ఎలా?

ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌కు ఏమాత్రం ఆటంకం కలగకుండా 10 శాతం కొత్త కోటాను అమలు చేయనున్నారు. అంటే సూపర్ న్యూమరరీ కింద ఆ సీట్లను పెంచుతారు. ఆ ప్రకారం ప్రస్తుతం ఒక కోర్సులో 50 సీట్లుంటే 10 శాతం పెరిగితే 55 సీట్లవుతాయి. మరి 10 శాతం పెరగాల్సి ఉండగా 25 శాతం వరకు సీట్లు పెరుగుతాయని కేంద్ర మంత్రి చెబుతున్నారు. దీనిపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పొదిలె అప్పారావు మాట్లాడుతూ.. 2007లో కేంద్రీయ వర్సిటీల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్రం ఆదేశించి ఇతరులకు సమస్య లేకుండా 54 శాతం సీట్లను పెంచాలని ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు. అదే విధానం ఇప్పుడూ ప్రకటిస్తే రెట్టింపు అంటే 20 శాతం అవుతుందని విశ్లేషించారు. దీనిపై ఒకటీ రెండు రోజుల్లోనే ఆఫీస్ మెమోరాండం(ఓఎం) వస్తుందని ఆశిస్తున్నట్లు, అప్పుడే సీట్లపై స్పష్టత వస్తుందన్నారు. ఎన్ఐటీ వరంగల్ సంచాలకుడు ఆచార్య ఎన్‌వీ రమణారావు మాట్లాడుతూ.. సీట్లు పెరిగితే ఆ ప్రభావం ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలపై పడుతుందని చెప్పారు. ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థుల సంఖ్య కొద్ది సంవత్సరాలుగా పెరగడం లేదని, అలాంటప్పుడు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీల్లో చేరే వారు పెరిగితే ఆ మేరకు ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య తగ్గుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం నుంచి వచ్చే మార్గదర్శకాలను చూసిన తర్వాత స్పష్టత వస్తుందని, అప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని కళాశాలల్లోనూ సీట్లు పెంచుతామని చెప్పారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లోనూ 10 శాతం తప్పనిసరి అంటే ఆ ప్రకారం నిబంధనల్లో మార్పు చేస్తామన్నారు.

తెలుగు విద్యార్థులకు వరమే

ప్రస్తుతం ఐఐటీలు, ఎన్ఐటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు 15-18 శాతం వరకు సీట్లను సొంతం చేసుకుంటున్నారు. సీట్ల సంఖ్య పెరిగితే అదే నిష్పత్తిలో మన విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈబీసీ రిజర్వేషన్ పరిధిలో ఉండి ఐఐటీలు, ఎన్ఐటీలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య తెలుగు రాష్ట్రాల్లో తక్కువగా ఉందని, అందువల్ల ఆ కోటా ద్వారా ప్రయోజనం తక్కువ ఉంటుందన్నారు. మిగిలిన 15 శాతంతో ప్రయోజనం పొందే అవకాశం ఉందని ఐఐటీ శిక్షణ నిపుణుడు కృష్ణ చైతన్య తెలిపారు.

25 శాతం సీట్లు పెరిగితే విద్యాసంస్థలో సీట్ల సంఖ్య ఇలా

విద్యాసంస్థలు	ప్రస్తుత సీట్లు	పెరిగే సీట్లు
23 ఐఐటీలు	11279	2819
31 ఎన్ఐటీలు	17,967	4491
20 ట్రిపుల్ఐటీలు	4023	1005
జీఎఫ్‌టీఐ	4683	1170

(ఐఐటీల్లో 800, ఎన్ఐటీల్లో 653, జీఎఫ్‌టీఐల్లో 20 సీట్లు బాలికలకు సూపర్ న్యూమరరీ కింద కేటాయించారు. పై సీట్లకు ఇవి అదనం)



వేలంలో లడ్డూను దక్కించుకొన్న రామిరెడ్డి

రూ.20.6 లక్షలు పలికిన పుట్టలమ్మ లడ్డు

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు నగర సమీపం నల్లపాడు పరిధి చల్లావారిపాలెంలో శ్రీపుట్టలమ్మ తల్లి సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి లడ్డు ప్రసాదానికి వేలం పాట నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన ఈ వేలంలో నల్లపాడుకు చెందిన అమ్మవారి భక్తుడు దుగ్గెంపూడి రామిరెడ్డి రూ. 20.6 లక్షలకు పాడి లడ్డును దక్కించుకొన్నారు.

జేఈఈలో అత్యధిక 'తెలుగు' మార్కులు 350!

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్ పేపర్-1లో తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక మార్కులు 350గా ఉండొచ్చని తెలుస్తోంది. ఈనెల 9వ తేదీ నుంచి 12 వరకు రోజుకు రెండు సార్లు చొప్పున మొత్తం ఎనిమిది విడతల ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. అనుకున్న దానికంటే ఒక రోజు ముందే ఎన్‌టీఏ ఎనిమిది ప్రశ్న పత్రాలకు సంబంధించిన ప్రాథమిక కీ విడుదల చేసింది.



ఎక్స్‌ఎల్ఆర్ఐ విద్యా సంస్థ నమూనా

నేడు ఎక్స్‌ఎల్ఆర్ఐ విద్యా సంస్థకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

విజయవాడ, న్యూస్‌టుడే: ఆసియాలో ప్రసిద్ధిగాంచిన జేవియర్ లేబర్ రిలేషన్స్ ఇన్‌స్టిట్యూషన్(ఎక్స్‌ఎల్ఆర్ఐ)కు నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం లాంఛనంగా శంకుస్థాపన చేయనున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిస్తామని ఎక్స్‌ఎల్ఆర్ఐ ప్రాజెక్టు డైరెక్టర్ ఫాదర్ కె.ఎస్. కాజిమిర్ బుధవారం విజయవాడలో వెల్లడించారు. అమరావతిలో తమ సంస్థ స్థాపించేందుకు ఎడ్యుకేషన్ హబ్‌లో 50 ఎకరాలను ముఖ్యమంత్రి కేటాయించారన్నారు. ఐనవోలు గ్రామంలో నిర్మించే అధునాతన ఎక్స్‌ఎల్ఆర్ఐ విద్యా సంస్థతో మేనేజ్‌మెంట్ రంగంలో నైపుణ్యం కలిగిన యువత రూపుదిద్దుకుంటుందన్నారు. 1949లో జంషెడ్‌పూర్‌లో ప్రారంభమై ఈ ఏడాదికి 70 వసంతాలు పూర్తి చేసుకొని ప్లాటినం జూబ్లీ వేడుకలకు సమాయత్తమైందన్నారు.

గూడూరు కూడలిలో పనులు..
పలు రైళ్లు రద్దు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరులోని గూడూరు జంక్షన్‌లో ఇంజినీరింగ్ పనులు జరుగుతున్నందున కొన్ని రైళ్లు పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు సీనియర్ మండల వాణిజ్య అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. గుంటూరులో 12.10గంటలకు బయలుదేరి డోన్‌కు వెళ్లే రైలు(57328) ఈ నెల 20వ తేదీ నుంచి 31 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. డోన్‌లో 6.30కి బయలుదేరి గుంటూరు వచ్చే రైలుని(57327) ఈ నెల 21 నుంచి వచ్చే నెల 1 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. గుంటూరులో 1.00 గంటకు బయలుదేరి తిరుపతికి వెళ్లే రైలు(67232)ని బిట్రగుంట-తిరుపతి మధ్య ఈ నెల 21 నుంచి 31 వరకు పాక్షికంగా రద్దు చేసినట్లు చెప్పారు. తిరుపతిలో 15.00 గంటలకు బయలుదేరి గుంటూరు వచ్చే రైలు (67231)ని తిరుపతి-బిట్రగుంట మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు వివరించారు. గుంటూరులో 5.15కి బయలుదేరి కాచిగూడ వెళ్లే రైలు (77281)ని గుంటూరు-డోన్ మధ్య ఈనెల 21 నుంచి 31 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. కాచిగూడలో 5.10కి బయలుదేరి గుంటూరు వచ్చే రైలు (77282)ని డోన్-గుంటూరు మధ్య ఈనెల 21 నుంచి 31 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. రేపల్లెలో 4.00 గంటలకు బయలుదేరి మార్కాపురంవెళ్లే రైలు(77247) గుంటూరు-మార్కాపురం మధ్య ఈనెల 21 నుంచి 31 వరకు రద్దు చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో వివరించారు.

కోలాహలంగా పార్వేట ఉత్సవం



పంచాయుధాలు ధరించిన శ్రీమలయప్పస్వామి

తిరుమల, న్యూస్‌టుడే: కోనేటిరాయుడి పార్వేట ఉత్సవం ఆద్యంతం కోలాహలంగా, ఆనందభరితంగా జరిగింది. కనుమ పండగ సందర్భంగా బుధవారం తిరుమలలో శ్రీవారికి తితిదే ఈ వేడుక నిర్వహించింది. శ్రీనివాస చక్రవర్తి పంచాయుధాలు ధరించి వన విహారార్థం వెళ్లి దుష్ట మృగాలను వేటాడి సంహరించి.. విజయగర్వంతో తిరిగివచ్చే సన్నివేశాన్ని రక్తికట్టించారు. పంచాయుధాలతో పాటు వేట పరికరాలైన డాలు, కత్తి, ఈటె తదితర ఆయుధాలను స్వీకరించిన శ్రీమలయప్పస్వామి శ్రీపీఠాన్ని అధిరోహించి ఆలయం వెలుపలికి విచ్చేశారు. శ్రీకృష్ణస్వామి మరో పీఠాన్ని అధిరోహించి శ్రీవారిని అనుసరించారు. ఇరువురు మూర్తులు బాజాభజంత్రీలతో పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపానికి వేంచేశారు. అక్కడ సంగీత సాంస్కృతిక ప్రదర్శనల తర్వాత.. నివేదనలు, హారతులు అందుకున్నారు. అనంతరం శ్రీనివాసుడు వీరావేశంతో పరుగెత్తుతూ మృగాలను వేటాడే సన్నివేశాలను శ్రీవారి తరపున అర్చకులు ప్రదర్శించారు. సాయంత్రం స్వామివార్లు ఆలయ ప్రవేశం చేశారు. అంతకుముందు ఉదయం తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని గోదాదేవి పూలమాలను తిరుమలకు తీసుకువచ్చి తిరువీధుల్లో ఊరేగించారు. గోదాదేవి పరిణయోత్సవం సందర్భంగా స్వామివారికి బహూకరించారు.



ఆలయ పుష్కరిణిలో శ్రీస్వామిఅమ్మవార్లకు తెప్పోత్సవం

శ్రీశైల మల్లికార్జున స్వామికి పుష్పపల్లకీ సేవ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాల ఐదో రోజు బుధవారం శ్రీపార్వతీ సమేత మల్లికార్జున స్వామివార్లకు వైభవంగా పుష్పపల్లకీ సేవ జరిగింది. ఉత్సవాల సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లకు ఆలయ ప్రాంగణంలో అర్చకులు, వేదపండితులు మంగళహారతులు సమర్పించి విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రీస్వామిఅమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం జరిగింది. అనంతరం నందివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పుష్కరిణి వద్ద శ్రీస్వామిఅమ్మవార్లకు అంగరంగ వైభవంగా తెప్పోత్సవం జరిగింది. స్వామి, అమ్మ వార్ల పుష్పపల్లకీ సేవలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా పాల్గొన్నారు.

వేడుకగా శ్రీకాళహస్తీశ్వరుని కైలాసగిరి ప్రదక్షిణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తిలో కనుమ పండగను పురస్కరించుకుని బుధవారం కైలాసగిరి ప్రదక్షిణోత్సవం ఆద్యంతం ఘనంగా సాగింది. మాఘ మాసంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కంధ మూర్తి ఉత్సవమూర్తులు కైలాసగిరి ప్రదక్షిణను చేశారు. కైలాసగిరి పర్వతశ్రేణుల్లో ఉన్న దేవతలు, రుషులను కల్యాణానికి ఆహ్వానిస్తూ ఈ విశేషోత్సవం జరిపారు. భగవంతుడిని అనుసరిస్తూ అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్నారు. ముక్కంటి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ గిరి ప్రదక్షిణోత్సవం 21 కిలోమీటర్ల పొడవునా సాగింది.

శ్రీరామానుజం.. సువర్ణరూపం

చిన జీయర్ స్వామి ఆశ్రమంలో బంగారు ప్రతిమ



హైదరాబాద్‌లో చినజీయర్ స్వామికి బంగారం బిస్కెట్లను అందిస్తున్న మై హోం గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు దంపతులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: శంషాబాద్‌లోని చిన జీయర్ స్వామి ఆశ్రమంలో నిత్యారాధన కోసం రామానుజాచార్యుల బంగారు ప్రతిమ కొలువుదీరుతోంది. ఈ ప్రతిమ ఏర్పాటుకు పలువురు దాతలు దాదాపు 27 కిలోల బంగారాన్ని విరాళంగా ప్రకటించారు. జూబ్లీహిల్స్ నందిగిరిహిల్స్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, మైహోం గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, శ్రీకుమారి దంపతుల నివాసంలో గత నెల 16 నుంచి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ధనుర్మాసోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి గోదాదేవి కళ్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా.. శంషాబాద్ ఆశ్రమంలో రామానుజాచార్యుల ప్రతిమ ఏర్పాటుకు రామేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు 20 కిలోల బంగారాన్ని చిన జీయర్ స్వామికి అందించారు. శ్రీ జ్యువెలర్స్ నిర్వాహకులు అనీల్‌కుమార్ అగర్వాల్ అయిదు కిలోల బంగారం ఇవ్వడానికి ముందుకొచ్చారు. డాక్టర్ ఆనంద్, ఎన్టీవీ అధినేత నరేంద్రచౌదరి దంపతులు కిలో చొప్పున బంగారాన్ని విరాళంగా ప్రకటించారు.





చిత్తూరు జిల్లా రంగంపేటలో జనసమూహం మధ్య పరుగు పెడుతున్న కోడెగిత్తలు ★ తమిళనాడులోని పాలమేడు గ్రామంలో నిర్వహించిన జల్లికట్టులో ఎద్దును లొంగదీసుకొనేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

రంగంపేటలో కోడెగిత్తల జోరు

రంగంపేట (చంద్రగిరి) – న్యూస్‌టుడే

చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఆరేపల్లి రంగంపేటలో బుధవారం పశువుల పండుగను పాడిరైతులు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకున్నారు. తమ పాడి సంపద వృద్ధి చెందాలని కోరుతూ గ్రామదేవతలు సత్తెమ్మ, నడివీధి గంగమ్మ, కాటమరాజుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా రంగంపేటలో పశువుల పందేలను నిర్వహించారు. పాడిరైతులకు నాయకులు గిత్తల కొమ్ములకు కట్టే కానుకలను (పలకలు) అందించారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో డప్పుల చప్పుళ్ల మధ్యన కోడెగిత్తలను వీధుల్లోకి పరుగులెత్తించారు. కోడెగిత్తల కొమ్ములకు కట్టి ఉంచిన నగదు, పంచె, టవలు, పలకలను సొంతం చేసుకోవడానికి యువకులు వాటిని నిలువరించే ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో కొందరికి గాయాలయ్యాయి. మరికొందరు చాకచక్యంగా కోడెగిత్తలను ఒడిసి పట్టుకుని వాటి కొమ్ములకు అలంకరించిన కానుకలను చేజిక్కించుకున్నారు.

తమిళనాట వేడుకగా జల్లికట్టు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళుల వీరత్వానికి ప్రతీకగా, సాహస క్రీడగా భావిస్తున్న జల్లికట్టు తమిళనాడులో వేడుకగా జరుగుతోంది. తమిళుల ప్రీతిపాత్రమైన పొంగల్ (సంక్రాంతి) పర్వదినం సందర్భంగా ఏటా జల్లికట్టు నిర్వహించడం ఆనవాయితీ. మదురై జిల్లాలోని అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూర్‌లో జరిగే జల్లికట్టు పోటీలు ప్రసిద్ధిగాంచాయి. ఈ ఏడాది పొంగల్ సందర్భంగా మదురై జిల్లా అవనియాపురంలో మంగళవారం, పాలమేడులో బుధవారం పోటీలు జరిగాయి. ఇందులో 988 ఎద్దులు రంగంలోకి దిగగా వాటిని ఒడిసి పట్టడానికి 848 మంది క్రీడాకారులు కదన రంగంలో కాలు మోపారు. ఉదయం 8.15 గంటలకు ప్రారంభమైన ఈ క్రీడలు సాయంత్రం 4.30 గంటలు వరకు జరిగాయి. సిద్ధం చేసిన వాడివాసల్ (గేటు) తెరిచి ఒక్కో ఎద్దును మైదానంలోకి విడిచిపెట్టారు. రంకెలు వేస్తూ దూసుకొస్తున్న ఎద్దులను పట్టుకోవడానికి క్రీడాకారులు ప్రయత్నించడం, వారికి చిక్కకుండా ఎద్దులు తప్పించుకోవడం గ్యాలరీ నుంచి వీక్షిస్తున్న సందర్శకులను ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసింది. ఎద్దును పట్టుకునే ప్రయత్నంలో 48 మంది గాయపడగా.. వారిలో ముగ్గురిని మదురైలోని ప్రభుత్వ రాజాజీ ఆస్పత్రికి తరలించారు. యువకులకు చిక్కకుండా మైదానంలో ఉరకలు వేసిన మూడు ఎద్దులను ఉత్తమ ఎద్దులుగా ఎంపిక చేశారు. అలాగే 10 ఎద్దులను ఒడిసి పట్టుకున్న అలంగానల్లూర్‌కు చెందిన ప్రభాకరన్ అనే వ్యక్తి ఉత్తమ జల్లికట్టు క్రీడాకారుడిగా బహుమతి అందుకున్నారు. జల్లికట్టు పోటీల సందర్భంగా పాలమేడులో భారీ సంఖ్యలో పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

వీర విహార కోడి

- రాష్ట్రంలో అడ్డూఅదుపూ లేకుండా సాగిన కోడి పందేలు
- తోడైన జూదం, మద్యం
- రూ.500 కోట్లు చేతులు మారినట్లు అంచనా
- పత్తేపురంలో లాటరీ విజేతలకు కారు, 2 బుల్లెట్ల అందజేత



ప.గో.జిల్లా గుండుగొలనులో పందెపు బరులు



పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం పెదగరువులో జోరుగా కోడిపందేలు

ఈనాడు డిజిటల్ – ఏలూరు, రాజమహేంద్రవరం

సంక్రాంతి సందర్భంగా రాష్ట్రంలోని ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో మూడు రోజులపాటు కోడిపందేలు అడ్డూఅదుపూ లేకుండా సాగాయి. కోతాట, గుండాట వంటి జూదక్రీడలు దర్జాగా సాగిపోయాయి. మద్యం ఏరులై పారింది. భోగి రోజున ప్రారంభమైన ఈ పందేలను మకర సంక్రాంతి, కనుమ రోజున భారీ ఎత్తున నిర్వహించారు. మొత్తంగా అన్ని రకాల పందేలు కలిపి రాష్ట్రవ్యాప్తంగా రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల పైబడి చేతులు మారినట్టు అంచనా.

పెద్ద ఎత్తున పందేలు

ఉభయగోదావరి జిల్లాల్లో కోడిపందేల్లో ఒక్కో పందెం రూ.10 లక్షల వరకు జరిగినట్లు తెలిసింది. బరిలో తలపడే కోళ్ల యజమానులు వేసుకునే పందెం మాత్రమే ఇది. దీనికి పదుల రెట్లలో బరిబయట పందేలు జరుగుతూ ఉంటాయి. బరుల్లో రూ.కోట్లు చేతులు మారాయి. ప్రతి పందెంలో వెయ్యి రూపాయలంటే లెక్కే లేదన్నట్లు సాగాయి. అన్ని బరుల వద్ద గుండాట, కోతాటకు కొదవే లేదు. ఒక్కో బరివద్ద 30కు పైగా గుండాట బల్లలు వేశారు. చాలా చోట్ల కోతాట జోరుగా సాగింది.

హైదరాబాద్ నుంచి టీవీ ఆర్టిస్టులు

పశ్చిమగోదావరి జిల్లాలోని అయిభీమవరం, పెదగరువు, పూలపల్లి, నందమూరు గరువు, సీసలి తదితర ప్రాంతాల్లో గుండాట జోరుగా సాగింది. గుండుగొలనులో కోతాట పెద్దఎత్తున సాగింది. ఒక్కో ఆటకు రూ.లక్ష కూడా పందెం కాశారు. పెదగరువులో 10 ఎకరాల స్థలంలో బరి ఏర్పాటు చేశారు. నిడమర్రు మండలం పత్తేపురంలో జరిగిన కోడిపందేలకు హాజరయ్యే వారి నుంచి రూ.వెయ్యి చొప్పున వసూళ్లు చేశారు. వారికి లాటరీ కూపన్లు ఇచ్చారు. లాటరీ విజేతలకు కారు, రెండు బుల్లెట్లు అందజేశారు. అయిభీమవరంలో జరిగిన పందేలకు హైదరాబాద్ నుంచి టీవీ ఆర్టిస్టులు హాజరయ్యారు. ఇతర రాష్ట్రాల నుంచి పందెం రాయుళ్లు తరలి వచ్చారు. పందేలను ఎప్పటికప్పుడు వీడియోలు తీసి ప్రదర్శించారు.



పత్తేపురంలో విజేతల కోసం బుల్లెట్ బహుమతి

ఏరులై పారిన మద్యం

అన్ని బరుల వద్ద మద్యం ఏరులై పారింది. పందెంరాయుళ్లు విచ్చలవిడిగా మద్యం సేవించి బరుల వద్దే స్పృహ తప్పి పడిపోయారు. అన్ని బరుల వద్ద బిర్యానీ పాయింట్లు వెలిశాయి. శీతల పానీయాలు, ఇతర బండారాల దుకాణాలు వెల్లువెత్తాయి. వీరవాసరం మండలం నందమూరిగరువులో ఓ ఎలక్ట్రానిక్ ఛానల్ ప్రతినిధులపై పందెంరాయుళ్లు దాడి చేశారు. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి పందేలను నిలిపివేశారు.

తూర్పుగోదావరి జిల్లాలో

తూర్పుగోదావరి జిల్లాలో సంక్రాంతి పందేల పేరిట రూ.100 కోట్లకు పైగా నగదు చేతులు మారి ఉంటుందని అంచనా. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150 బరుల్లో పెద్ద పందేలు జరగ్గా మరో వెయ్యిచోట్ల చిన్న పందేలు నిర్వహించారు. మద్యం దుకాణాలు, గుండాట, పేకాటలు అన్ని చోట్లా యథేచ్ఛగా సాగాయి. కోనసీమలోని అన్ని మండలాల్లోనూ అధిక సంఖ్యలో పందేలు నిర్వహించారు. కోనసీమలోని పలు మండలాల్లో పట్టపగలే అశ్లీల నృత్యాలు ప్రదర్శించారు. పలు ప్రాంతాల్లో రాత్రిపూటా పందేలు కొనసాగాయి. పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు.

కోనసీమలో ఉత్సాహంగా ప్రభల తీర్థాలు



ఎత్తయిన వాకలగరువు, తొండవరం గ్రామాల ప్రభలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా కనుమ రోజు బుధవారం కోనసీమలో ప్రభల ఉత్సవాలు వైభవంగా సాగాయి. అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, మామిడికుదురు, రాజోలులలో ప్రభల ఉత్సవాలు నిర్వహించారు. అంబాజీపేట మండలం వాకలగరువు, తొండవరంలలో ఎత్తైన ప్రభలను తయారు చేసి, రావిచెట్టు కూడలికి భక్తులు భుజాలపై మోసుకొచ్చారు. వాకలగరువులోని పార్వతీ సోమేశ్వరస్వామి, తొండవరంలోని ఉమాతొండేశ్వరస్వామి, గున్నేపల్లి అగ్రహారంలోని పార్వతీ రామేశ్వరస్వామి వార్ల ప్రభలను స్థానిక కూడలికి తీసుకువచ్చి తీర్థం నిర్వహించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాలకు చెందిన చెన్నమల్లేశ్వరస్వామి, పార్వతీ వీరేశ్వరస్వామి వార్ల ప్రభలను పంట కాలువలు, వరి చేల మధ్య నుంచి ఎగువ కౌశిక నదిని దాటించి భక్తులు భుజాలపై మోసుకొచ్చారు. ఆ అపురూప దృశ్యాలను వేలాది మంది భక్తులు ఆసక్తిగా తిలకించారు. పి.గన్నవరం, మలికిపురం, రాజోలు, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లోని పలు గ్రామాల్లో సంక్రాంతి ప్రభల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.

ప్రతి సంక్రాంతికి పాలకొల్లులోనే: అల్లు అర్జున్



అభిమానులకు అభివాదం చేస్తున్న సినీ కథానాయకుడు అల్లు అర్జున్

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి సంక్రాంతి పాలకొల్లులోనే చేసుకుంటానని సినీ కథానాయకుడు అల్లు అర్జున్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు ఆయన మంగళవారం కుటుంబసమేతంగా వచ్చారు. తాత అల్లు రామలింగయ్య విగ్రహానికి పూలమాల వేశాక ఆయన మాట్లాడుతూ మద్రాసులో పుట్టినప్పటికీ తన సొంత ఊరు పాలకొల్లుగానే భావిస్తానని తెలిపారు. పెళ్లయ్యాక తన భార్య స్నేహారెడ్డి పాలకొల్లు తీసుకెళ్లమని అడిగేవారని, ఆ కోరిక ఇప్పుడు తీర్చానని అన్నారు. తన తాతయ్య అల్లు రామలింగయ్య, నాన్న అల్లు అరవింద్‌లకు పాలకొల్లు కొంచెమే ఇచ్చిందికానీ తనకు చాలా ఇచ్చిందని చెప్పుకొచ్చారు. తన ఊరికి చేయాల్సింది చాలా ఉందని, ఈ సంక్రాంతినుంచే దీనికి శ్రీకారం చుట్టానని అన్నారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణమండపానికి రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అల్లు వెంకటేశ్వర స్మారక ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకొని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. ముందుగా అభిమాన సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో నిర్మించిన నిర్మాత బన్ని వాసు అతిథిగృహాన్ని ఆయన సందర్శించారు. శాసనసభ్యుడు రామానాయుడు, శాసనమండలి సభ్యుడు అంగర రామ్మోహన్ ఆయన్ను కలిశారు.

బంగారంతో పొంగలి కుండలు



వేలూరు, న్యూస్‌టుడే: తమిళనాడులోని వేలూరు జిల్లా అంబూరు షరాబ్ బజారు వీధికి చెందిన నగల తయారీదారు దేవన్ పశువుల పండుగను పురస్కరించుకొని 1.19 గ్రాముల బంగారంతో పశువు, పొంగలి కుండలు, చెరకు గెడలు తయారు చేశారు. 3 సెం.మీ ఎత్తు, 4 సెం.మీ వెడల్పుతో రెండు బంగారు కుండలు, మూడు చెరకు గెడలు, ఒక పశువును 24 గంటల్లో తయారు చేసి బుధవారం సాయంత్రం ప్రజల సందర్శనార్థం ఉంచారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చి వాటిని వీక్షించారు. ఇదివరకే ప్రపంచకప్, ఫుట్‌బాల్, క్రికెట్ బ్యాట్, దివంగత జయలలిత, కరుణానిధి, తిరుకురళ్ పుస్తకం తయారు చేయడం గమనార్హం.

రంగస్థల ప్రముఖుడు శర్మ కన్నుమూత

- విచారం వ్యక్తం చేసిన సీఎం

తెనాలి (మారీస్‌పేట) – న్యూస్‌టుడే



మొదలి నాగభూషణ శర్మ

నాటక రచయిత, దర్శకులు, బోధకులు, పరిశోధకులు మొదలి నాగభూషణ శర్మ (84) మంగళవారం రాత్రి గుంటూరు జిల్లా తెనాలిలో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రాచ్య, పాశ్చాత్య నాటక విధానాలను తెలుగు రంగస్థలంపై జ్వలింపజేసి దేదీప్యమానంగా వెలుగులు నింపిన నిత్య కృషీవలుడిగా శర్మ తెలుగునాట సుపరిచితులు. జానపద కళలపై సాధికారతను పెంచే రచనలు చేసిన ఆయన ఆంగ్లంలోనూ రచనలు చేసి అంతర్జాతీయ వేదికలపై తెలుగు పెద్దలను, ప్రక్రియలను నిలబెట్టారు. ఆయన వ్యక్తిగత, వృత్తి జీవితాలు రెండూ రంగస్థలంతోనే పెనవేసుకున్నాయని విశ్లేషకులు చెబుతుంటారు. పాశ్చాత్య నాటకరంగ వైవిధ్యాలు, సిద్ధాంతాలు, విభిన్న శైలిపై అనర్గళంగా బోధించగల అధ్యాపకత్వం ఆయన సొంతమని పలువురు ప్రముఖులు తమ మాటల్లో వర్ణించారు. సురభి సమగ్ర చరిత్ర, కన్యాశుల్కం నూరేళ్ల సమాలోచన, తెలుగు సాహిత్యంపై గాంధీజీ ప్రభావంపై విశ్లేషణాత్మక రచనలు ఆయన కలం నుంచి జాలువారినవే. మన తోలుబొమ్మలాట అంతర్జాతీయ కీర్తిని గడించడం వెనక ఆయన కృషి ఉంది. వారం రోజుల క్రితమే ఆయన ప్రతిష్ఠాత్మక అజో-విభొ-కందాళం ఫౌండేషన్ వారి విశిష్ట ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని అందుకున్నారు. గత ఏడాది ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కళారత్న పురస్కారాన్ని అందజేసింది. ఎన్టీఆర్ రంగస్థల పురస్కారంతోపాటు పదుల సంఖ్యలో అవార్డులను, వందల సత్కారాలను పొందారు. రాజా ఈడిపస్(గ్రీస్) నాటకం, నరజాతి సమస్తం, దొరా నీచావు మూడింది, కాయితం పులి వంటి ప్రసిద్ధ రచనలు ఆయన కలం నుంచి అనువాదంగా వచ్చాయి.

'రసరంజని'తో అనుబంధం..

ఎం.ఎన్.శర్మ హైదరాబాద్ నల్లకుంటలో ఉంటూ ఉస్మానియా వర్సిటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పని చేశారు. భార్య కన్నుమూసిన తర్వాత సీతాఫల్ మండిలోని సోదరుడి దగ్గర ఉన్నారు. కొంతకాలంగా తెనాలిలో ఉంటున్న తన పెద్ద కుమారుడు శరత్ దగ్గరకు వెళ్లిపోయారు. 1993లో పురుడుపోసుకున్న తెలుగు నాటక రంగ సంస్థ 'రసరంజని' కార్యనిర్వాహక అధ్యక్షులుగా సమర్థంగా సేవలు అందించారు. నాటక శిక్షణ ఇచ్చి ఎందరినో కళాకారులుగా తీర్చిదిద్దారు. కేంద్ర సంగీత నాటక అకాడమి, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకు (ఎన్ఎస్‌డీ) సభ్యులుగా పనిచేశారు. నృత్యంపై వస్తున్న 'నర్తనం' సంచికకు సంపాదకులుగా వ్యవహరించారు.

ప్రముఖుల సంతాపం..

ఈనాడు డిజిటల్, అమరావతి: నాగభూషణశర్మ మృతి పట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. జీవితకాలం మొత్తాన్ని నాటక రంగానికే అంకితం చేశారని కొనియాడారు. శర్మ కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. నాటకమే ప్రధానాంశంగా అమెరికాలోని ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేశారని గుర్తు చేసుకున్నారు. ది విజిట్, హయవదన, తుగ్లక్, వెయిటింగ్ ఫర్ గోడో వంటి గ్రీకు, సంస్కృత, ఆంగ్ల నాటకాలకు మొదలి నాగభూషణశర్మ దర్శకత్వం వహించారని ముఖ్యమంత్రి తెలిపారు. శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు కందిమళ్ల సాంబశివరావు, నట శిక్షకులు డి.ఎస్.దీక్షిత్ తదితరులు నాగభూషణశర్మ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాటక రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కృత్రిమ మేధస్సుపై శిక్షణ

- మూడేళ్లలో ఐదు లక్షల మందికి ప్రయోజనం

బెంగళూరు: కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతపై దేశ యువతకు పెద్ద ఎత్తున శిక్షణనిచ్చేందుకు సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ఇండియా సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా పది విశ్వవిద్యాలయాల్లో ఏఐ పరిశోధనశాలలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. వచ్చే మూడేళ్లలో పది వేల మంది డెవలపర్లకు నైపుణ్యాలు కల్పించాలని, 5 లక్షల మంది యువతీయువకులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. భారత్ ఆర్థిక, సామాజిక పురోగతి కోసం ఏఐని అందరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా తాము సాధిస్తోన్న ప్రగతిని బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో వివరిస్తూ ఈ విషయాలను ప్రకటించింది. ప్రతి సంస్థకూ, వ్యక్తికీ సాధికారత కల్పించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, విద్యాసంస్థలు, పౌర సమాజంలోని వివిధ వర్గాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది. భారత్‌లో 'ఇంటెలిజెంట్ క్లౌడ్ హబ్ ప్రోగ్రామ్'ను కూడా ఇటీవలే మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఏఐ, డేటా సైన్సెస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అంశాల్లో పరిశోధక సంస్థలు, ఉన్నత విద్యాసంస్థల్లో శిక్షణకు ఈ ప్రోగ్రామ్ ద్వారా సంస్థ చేయూతను ఇవ్వనుంది.

వినియోగిస్తున్నవాటిలో 60 శాతం భారీ సంస్థలే

ఏఐ అనుకూల వాతావరణ సృష్టికి సమగ్ర వ్యూహాన్ని రూపొందించి, అమలు చేసేందుకు 715 సంస్థలతో కలసి పనిచేస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ వివరించింది. ఉద్యోగి ఉత్పాదకత, వ్యాపార క్రియాశీలతలను పెంచేందుకు, వినియోగదారులతో సంబంధాలను మెరుగుపరిచేందుకు, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలను వేగవంతం చేసేందుకు అవసరమైన పరిష్కారాల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపింది. 700కుపైగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తమ ద్వారా ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకున్నట్లు వివరించింది. వీటిలో 60 శాతం తయారీ, ఆర్థిక సేవల రంగాలకు చెందిన భారీ సంస్థలే ఉన్నాయని పేర్కొంది. వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు కారణమవుతున్న కొత్త తరం సంస్థలతోనూ జట్టు కడుతున్నట్లు తెలిపింది.

ప్రజల అవసరాలను తీర్చడంలో ప్రభుత్వానికి మైక్రోసాఫ్ట్ సహకారం అందిస్తోంది. వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణం వంటి కీలక రంగాల్లో చేపట్టే కొత్త కార్యక్రమాల్లో సహకారం అందించేందుకు, సమస్యల పరిష్కారానికి నీతి ఆయోగ్‌తో భాగస్వామ్యం ఏర్పరుచుకుంది. క్లౌడ్, ఏఐ వంటి వాటిని ఉపయోగించి పరిష్కారాలు చూపనుంది. విద్య, నైపుణ్య కల్పన, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో ఏఐ వినియోగ అవకాశాలను గుర్తించేందుకు భారత పరిశ్రమ సమాఖ్య (సీఐఐ)తోనూ కలిసి పనిచేస్తోంది.

★ వేల మంది అభ్యర్థులను ఆటోమెటిక్‌గా వీడియో ఇంటర్వ్యూ చేసేందుకు టాల్వ్యూ అనే ఏఐ టూల్‌ను అభివృద్ధి చేసింది.

భారత్‌కు గొప్ప పాత్ర



"ఏఐ విప్లవంలో గొప్ప పాత్రను పోషించే స్థానంలో భారత్ ఉంది. దేశ అభివృద్ధికి, ఇక్కడి వ్యాపారాలకు ఏఐ ఎంతగానో దోహదపడనుంది. ముఖ్యంగా విద్య, నైపుణ్య కల్పన, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో ఇది కీలకం కానుంది. ఏఐ ఆధారిత సాంకేతికతలు వేగంగా విస్తరిస్తుండటంతో ఖర్చులూ తగ్గుతున్నాయి"

- అనంత్ మహేశ్వరి, మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్

ఏఐతో మైక్రోసాఫ్ట్ చూపిన కొన్ని పరిష్కారాలు



★ గుండె జబ్బులను ప్రారంభ దశలోనే గుర్తించే ఏఐ పరిష్కారాన్ని అపోలో ఆసుపత్రులతో కలిసి అభివృద్ధి చేసింది.

★ కచ్చితమైన వ్యాధి నిర్ధారణకు, క్యాన్సర్ వంటి రోగాలను ముందుగా గుర్తించేందుకు సాంకేతికతను ఎస్ఆర్ఎల్ డయాగ్నోస్టిక్స్‌తో కలిసి రూపొందించింది.

★ సందేశాల ద్వారా సంభాషణలు జరుపుతూ కొత్త వినియోగదారులను ఆకర్షించేందుకు, వారికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగపడే 'రెవా' అనే 'చాట్ బోట్'ను ఫ్యూచర్ జనరలి బీమా సంస్థకు అందించింది.

★ ప్రముఖ క్రికెటర్ అనిల్ కుంబ్లేకు చెందిన స్పెక్టాకామ్ సంస్థ, స్టార్ ఇండియాలతో కలిసి క్రికెట్ ఆటగాళ్లు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు సాయపడే పవర్ బ్యాట్‌ను తయారు చేసింది.

సంక్షోభంలో థెరెసా మే సర్కార్

◆ బ్రెగ్జిట్ ఒప్పందం తీర్మానం ఓటమి ◆ వ్యతిరేకించిన సొంత పార్టీ సభ్యులు ◆ అవిశ్వాసం పెట్టిన ప్రతిపక్షం

లండన్

బ్రిటన్ ఆధునిక చరిత్రలో ఎన్నడూ ఎరగని రాజకీయ సంక్షోభం నెలకొంది. ఐరోపా సమాఖ్య (ఈయూ) నుంచి వైదొలగేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్రెగ్జిట్ తీర్మానాన్ని

- **తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ 432 మంది, ఆమోదిస్తూ 202 మంది ఎంపీలు ఓటు వేశారు.**
- **ప్రధాని సొంత పార్టీ అయిన కన్జర్వేటివ్స్‌కు చెందిన వందమందికిపైగా సభ్యులు తీర్మానాన్ని వ్యతిరేకించారు.**

దిగువ సభ తిరస్కరించింది. ఆ వెంటనే ప్రధాని థెరెసా మేపై ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా వెల్లడయిన ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే ప్రభుత్వం బ్రెగ్జిట్‌పై కార్యాచరణ మొదలుపెట్టింది. ఆ మేరకు మార్చి 29లోగా ఈయూ నుంచి బయటకు రావాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ఒప్పందాల ప్రతిపాదనను దిగువ సభ తిరస్కరించడంతో ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏమిటన్నది అగమ్యగోచరంగా ఉంది.

ఈయూ నుంచి వైదొలగే విషయమై ఈయూ- బ్రిటన్ మధ్య 'ఉపసంహరణ ఒప్పందం' కుదిరింది. వైదొలగిన తరువాత ఇరు పక్షాలూ ఎలా వ్యవహరించాలన్నదే ఈ ఒప్పందం సారాంశం. దీని ఆమోదం కోసం ప్రధాని మే దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్‌లో మంగళవారం తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం 230 ఓట్ల తేడాతో ఓడిపోయింది. గతంలో బ్రెగ్జిట్‌కు అనుకూలంగా మాట్లాడిన ఎంపీలు కూడా తీర్మానాన్ని వ్యతిరేకించారు.



బ్రిటన్ దిగువసభలో బుధవారం మాట్లాడుతున్న ప్రధాన మంత్రి థెరెసా మే

కన్జర్వేటివ్ పార్టీకి ప్రస్తుతం 316 మంది సభ్యులు ఉన్నారు. మిత్రపక్షమైన డెమొక్రాటిక్ యూనియన్ పార్టీకి పది మంది సభ్యులు ఉన్నారు. విశ్వాస పరీక్ష, బడ్జెట్‌వంటి సందర్భాల్లో మద్దతు తెలుపుతూ ఓటు వేసేలా ఆ పార్టీతో ఒప్పందం కూడా ఉంది. ఆ పార్టీ బ్రెగ్జిట్‌కు అనుకూలంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. తీర్మానం నెగ్గడానికి 320 ఓట్లు అవసరం కాగా సొంత పార్టీవారు సహకరించకపోవడంతో భారీ తేడాతో ఓడిపోయింది. ఈయూ నుంచి వైదొలగడాన్ని వ్యతిరేకిస్తున్న కొందరు ఎంపీలు గత నెలలో థెరెసా మేపై పార్టీలో అంతర్గతంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అప్పుడు ఆమెకు 200 మంది మద్దతు తెలపగా, 117 మంది వ్యతిరేకించారు. అప్పట్లో సమ్మతి తెలిపిన కొందరు ఇప్పుడు అభిప్రాయాన్ని మార్చుకున్నారు.

పార్లమెంటు నిర్ణీత కాలపరిమితి చట్టం-2011 ప్రకారం అవిశ్వాస తీర్మానం నెగ్గితే మళ్లీ విశ్వాసం పొందడానికి ప్రభుత్వానికి 14 రోజుల గడువు ఉంటుంది. పార్లమెంటులో విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గితే మళ్లీ ప్రభుత్వం ఏర్పాటవుతుంది. విశ్వాస తీర్మానం ఓడిపోతే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతిపక్ష నేతకు అవకాశం లభిస్తుంది. అది సాధ్యం కాకపోతే పార్లమెంటు రద్దవుతుంది. ప్రధానిపై అవిశ్వాసం పెట్టడం 26 ఏళ్ల తరువాత ఇదే తొలిసారి.

బెంగాల్‌లో భాజపా రథయాత్రకు సుప్రీం కోర్టు నిరాకరణ

బహిరంగ సభలకు అనుమతి

దిల్లీ/కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో భాజపా రథయాత్రల నిర్వహణకు సుప్రీం కోర్టు అనుమతి నిరాకరించింది. ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలకు అంగీకరించింది. రథయాత్రల నిర్వహణకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అనుమతి ఇవ్వని నేపథ్యంలో భాజపా రాష్ట్ర శాఖ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యాన్ని మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. రథయాత్రకు అనుమతి ఇస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్న రాష్ట్ర ప్రభుత్వ ఆందోళన కాదనలేనిదని సుప్రీంకోర్టు పేర్కొంది. అనుమతుల కోసం తాజా ప్రతిపాదనలతో రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అయితే ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్ర కింద బహిరంగ సభలు నిర్వహించుకోవచ్చని తెలిపింది. అయితే సమాచారం కోసం సమావేశాల వివరాలను ఇవ్వాలని ఆదేశించింది.

ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవి రేసులో ఇంద్రా నూయి

న్యూయార్క్: ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవికి ప్రముఖ భారతీయ అమెరికన్ ఎగ్జిక్యూటివ్ ఇంద్రా నూయిని నామినేట్ చేసే అంశాన్ని అమెరికా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ ఇంద్రా పేరును ప్రతిపాదించినట్లు అమెరికా పత్రికలు కథనాలు రాశాయి. పెప్సీకో సంస్థకు సీఈఓగా 12 ఏళ్లపాటు సేవలందించిన ఇంద్రా గత ఆగస్టులో ఆ పదవిని వీడారు. ప్రపంచ బ్యాంకు తదుపరి అధ్యక్షుడు లేదా అధ్యక్షురాలి ఎంపిక ప్రక్రియను ట్రంప్‌నకు సీనియర్ సలహాదారుగా ఉన్న ఇవాంకాతోపాటు అమెరికా ఆర్థిక మంత్రి స్టీవెన్, శ్వేతసౌధం చీఫ్ ఆఫ్ స్టాఫ్ మిక్ మల్వనీ పర్యవేక్షిస్తున్నారు. ఇవాంకకు ఈ బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. అయితే పదవి రేసు ప్రాథమిక దశలో అభ్యర్థులు తరచూ మారిపోతుంటారని, అంతిమంగా ఎవరికి బాధ్యతలు అప్పగించాలన్న విషయంపై ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి. ఐక్యరాజ్యసమితిలో అమెరికా మాజీ రాయబారి, భారత సంతతి రాజకీయ నేత నిక్కీ హేలీ పేరును కూడా ఈ పదవి కోసం ట్రంప్ ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఒకవేళ ట్రంప్ ప్రభుత్వం తనను నామినేట్ చేస్తే ఇంద్రా అందుకు సమ్మతిస్తారా? లేదా అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో ట్రంప్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఆమె కొన్ని వ్యాఖ్యలు కూడా చేశారు. ప్రపంచ బ్యాంకులో అత్యధిక వాటా కలిగి ఉన్నందున అమెరికానే ఆ సంస్థ అధ్యక్ష పదవికి అభ్యర్థులను నామినేట్ చేస్తుంది.





జాబిల్లిపై అంకురార్పణ

తొలి మొక్క మొలిపించిన చైనా

చంద్రుడిపై చైనా నాటిన తొలి విత్తు మొలకెత్తింది. దీంతో జాబిల్లిపై మొక్కను మొలిపించిన తొలి దేశంగా చైనా చరిత్ర సృష్టించింది. ఇటీవల చంద్రుడి రెండో వైపునకు చాంగే-4 వ్యోమనౌకను పంపిన సంగతి తెలిసిందే. దీనిలో ఓ బుల్లి కంటైనర్ ఉంది. దీనిలోనే పత్తి, బంగాళాదుంప విత్తనాలను ఉంచారు. ఇవి తాజాగా మొలకెత్తినట్లు చైనా పరిశోధకులు వెల్లడించారు. సంబంధిత చిత్రాలనూ విడుదలచేశారు. గురుత్వాకర్షణ తక్కువగా ఉండే పర్యావరణంలో మొక్కల ఎదుగుదలను పరీక్షించడమే ఈ పరిశోధన లక్ష్యం.

ఒక్క రోజులోనే రిటర్నుల పరిశీలన

- ఆదాయపు పన్ను వ్యవహారాలపై సరికొత్త పోర్టల్ 2.0కు రూపకల్పన
- 21 నెలల్లో అందుబాటులోకి రానున్న కొత్త వ్యవస్థ
- ఇన్ఫోసిస్‌కు బాధ్యతలు
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం



మంత్రివర్గ వివరాలను వెల్లడిస్తున్న పీయూష్ గోయల్

ఈనాడు, దిల్లీ: ఆదాయపు పన్ను ఈ-ఫైలింగ్ పోర్టల్, సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్‌ను కలిపి కొత్తగా సమీకృత ఈ-ఫైలింగ్, ప్రాసెసింగ్ సెంటర్ 2.0ని ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం ఐటీ రిటర్నుల పరిశీలన, ఇతర వ్యవహారాలకు 63 రోజుల మేర సమయం పడుతోందని, ఈ కొత్త సెంటర్‌వల్ల అది ఒక్క రోజుకు తగ్గిపోతుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఆయన బుధవారం సాయంత్రం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ప్రస్తుతం సీపీసీ-ఐటీఆర్ 1.0 ప్రాజెక్టు అమల్లో ఉందని తెలిపారు. ఎవరినీ అడిగే అవసరం లేకుండా ఆటోమేటిక్ పద్ధతిలో పెద్దఎత్తున పన్ను చెల్లింపుదారులకు సొమ్ము వాపసు చేస్తున్నామని, 2.0 పోర్టల్ అందుబాటులోకి వస్తే ఇది మరింత వేగం పుంజుకుంటుందని వెల్లడించారు. వచ్చే ఎనిమిదేళ్ల కోసం కొత్త వ్యవస్థను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం 4,241 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేస్తుందన్నారు. అందరికంటే తక్కువకు బిడ్డింగ్ వేసిన ఇన్ఫోసిస్ సంస్థకు ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. కొత్త వ్యవస్థ అందుబాటులో రావడానికి 21 నెలల సమయం పడుతుందని తెలిపారు. దాఖలైన ఆదాయపన్ను రిటర్న్‌ల్లో 5-7% రిటర్నులను తనిఖీ చేస్తున్నారని, కొత్త వ్యవస్థవల్ల ఈ శాతాన్ని పెంచుతారా? అన్న ప్రశ్నకు పీయూష్ గోయల్ బదులిచ్చారు. అలాంటిదేమీ ఉండదని చెప్పారు. ప్రస్తుతం 0.3% రిటర్నులను మాత్రమే తనిఖీ చేస్తున్నారని, 5-7% శాతం రిటర్న్‌లు అన్నది సరి కాదని తెలిపారు. ప్రభుత్వ రంగంలోని నాలుగు జల విద్యుత్తు రంగ సంస్థలైన ఎన్‌హెచ్‌పీసీ, నీప్కో, టీహెచ్‌డీసీ, ఎస్‌జేవీఎన్‌ఎల్‌లలో పనిచేస్తున్న 5,245 మంది ఎగ్జిక్యూటివ్‌ల వేతనాలను స్థిరీకరించింది. 1997 జనవరి నుంచి వేతనాల్లో ఉన్న వ్యత్యాసాలను సవరించింది. ఈ-1 గ్రేడులో ఉన్న ఎగ్జిక్యూటివ్‌లకు కార్మికులు, సూపర్‌వైజర్ల కన్నా తక్కువగా వేతనాలు వస్తుండడంతో ఆ సమస్యనూ పరిష్కరించింది. ఈ కారణంగా రూ. 323 కోట్లు వ్యయం కానుంది.

కేంద్ర విశ్వవిద్యాలయాలకి నిధులు

దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 13 కేంద్ర విశ్వవిద్యాలయాల నిర్మాణం పనులు పూర్తిచేయడానికి రూ.3,639.32 కోట్లు మంజూరుచేసింది. ఇదివరకు ఖర్చుచేసిన 4,474.65 కోట్లకు అదనంగా ఈ మొత్తాన్ని ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందినవి ఏవీ లేవు.

ఎగ్జిమ్‌బ్యాంక్ అధీకృత మూలధనాన్ని రూ.10 వేల కోట్ల నుంచి రూ.20వేల కోట్లకు పెంచడానికి ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం రీకేపిటలైజేషన్ బాండ్ల ద్వారా రూ.6వేల కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. ఈ మొత్తాన్ని 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.4,500 కోట్లమేర, 2019-20లో రూ.1,500 కోట్ల మేర అందించనుంది.

ప్రజాస్వామ్యమే మన బలం: రాహుల్

దిల్లీ: భారత్‌కు ప్రజాస్వామ్య వ్యవస్థే అతి గొప్ప బలమని, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రక్షించుకోవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. అఫ్గానిస్థాన్‌కు చెందిన ఎంపీలు ఇటీవల పార్లమెంటు సందర్శనకు వచ్చినప్పుడు జరిగిన ఓ ఘటనను వివరిస్తూ ఫేస్‌బుక్ పోస్ట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "అఫ్గాన్ ఎంపీలు గ్యాలరీలో కూర్చొని సభను గమనిస్తున్నారు. సభ్యుల అరుపులతో సమావేశం గందరగోళంగా సాగింది. ఆ తర్వాత అఫ్గాన్ ఎంపీలు నా కార్యాలయానికి వచ్చారు. చర్చ సరిగ్గా నడవనందుకు నేను వారిని క్షమాపణలు కోరాను. కానీ ఓ ఎంపీ కన్నీరు పెట్టుకున్నారు. ఎందుకని అడిగితే 'మీరు పార్లమెంటులో జరిపే చర్చలు మా దేశంలో తుపాకులతో జరుగుతున్నాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు" అని రాహుల్ పేర్కొన్నారు.

అమిత్ షాకు స్వైన్ ఫ్లూ

దిల్లీ: భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా స్వైన్ ఫ్లూ బారినపడ్డారు. దిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. దేవుడి దయ, అందరి అభిమానంతో తాను త్వరగా కోలుకుంటానని షా బుధవారం ట్విటర్‌లో పేర్కొన్నారు. ఆయన్ను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆస్పత్రిలో పరామర్శించారు.

దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షీలా దీక్షిత్ బాధ్యతల స్వీకరణ

- జగదీశ్ టైట్లర్‌కు ప్రాధాన్యం ఇవ్వడంపై అకాలీదళ్ విమర్శ

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ దిల్లీ రాష్ట్ర అధ్యక్షురాలిగా మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం రాజీవ్ భవన్‌లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. షీలాతో పాటూ- పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా దేవేందర్ యాదవ్, హరూన్ యూసఫ్, రాజేశ్ లిలోటియాలు బాధ్యతలు స్వీకరించారు.

2013 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్... హస్తిన పీఠాన్ని మళ్లీ ఎలాగైనా చేజిక్కించుకోవాలని యోచిస్తోంది. ఈ క్రమంలోనే అనారోగ్య కారణాల రీత్యా అజయ్ మాకెన్ అధ్యక్ష బాధ్యతల నుంచి వైదొలగడంతో పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆ బాధ్యతలను షీలాకు అప్పగించారు.

అన్ని స్థానాలూ గెలుచుకుంటాం: షీలా

బాధ్యతలు స్వీకరించిన అనంతరం షీలా దీక్షిత్ మాట్లాడుతూ- దిల్లీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తానని, ఇందుకు కార్యకర్తలు సహకరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో దిల్లీ పరిధిలోని అన్ని లోక్‌సభ స్థానాలనూ కైవసం చేసుకుంటామన్నారు. అంతకు ముందు ఆమె మీడియాతో మాట్లాడుతూ... వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుల విషయమై ఆమ్‌ఆద్మీ పార్టీతో చర్చించలేదని స్పష్టం చేశారు. రాజకీయాలంటేనే సవాళ్లనీ, తమకు భాజపా-ఆమ్‌ఆద్మీ పార్టీ ఒక సవాలని, వాటిని కలిసికట్టుగా ఎదుర్కొంటామని చెప్పారు.



టైట్లర్ హాజరు వివాదాస్పదం!

1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ నేత జగదీశ్ టైట్లర్ షీలాదీక్షిత్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరు కావడం, ఆయనకు ముందు వరుసలో ప్రాధాన్యం కల్పించడం తీవ్ర వివాదానికి కారణమైంది. టైట్లర్‌కు ప్రాధాన్యమివ్వడమంటే... ఓ విధంగా ఈ కేసుల్లో సాక్షులను కాంగ్రెస్ పార్టీ భయభ్రాంతులకు గురిచేయడమేనని శిరోమణి అకాలీదళ్ ఆరోపించింది. ఇది సిక్కుల పుండు మీద కారం చల్లే చర్యని కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ విమర్శించారు.



అలహాబాద్‌లో కుంభమేళా తొలిరోజు పవిత్ర స్నానం ఆచరించేందుకు తరలివచ్చిన సాధువులు

కుంభమేళా కోలాహలం

అలహాబాద్: కుంభమేళా మొదలైంది. అలహాబాద్‌లోని త్రివేణీ సంగమం భక్తులతో కిటకిటలాడుతోంది. తొలి రోజు మంగళవారం దాదాపు 2.25 కోట్ల మంది ఇక్కడ పవిత్ర స్నానాలు ఆచరించారు. సూర్యోదయం మొదలుకొని అస్తమయం వరకూ రోజంతా భక్తులు తరలివస్తూనే ఉన్నారు. గజగజ వణికించే చలిలో 'హర హర గంగ'అని జపిస్తూ వీరు మునకేస్తున్నారు. మకర సంక్రాంతినాడు ఆరంభమైన ఈ కుంభమేళా 50 రోజులపాటు కొనసాగుతుంది.

కెన్యాలో ఉగ్రవాదుల దాడి

15 మంది మృతి

నైరోబీ: కెన్యాలో ఉగ్రవాదులు బీభత్సం సృష్టించారు. దేశ రాజధాని నైరోబీలో 'డసిట్‌డీ2' హోటల్ సముదాయంపై దాడికి తెగబడి 15 మందిని పొట్టనపెట్టుకున్నారు. మృతుల్లో అమెరికా వాసి సహా పలువురు విదేశీయులు ఉన్నట్లు తెలుస్తోంది. 101 గదులతో కూడిన హోటల్, స్పా, రెస్టారెంట్, పలు కార్యాలయాలు 'డసిట్‌డీ2' సముదాయంలో ఉన్నాయి. అందులోకి మంగళవారం మధ్యాహ్నం ముష్కరులు చొరబడ్డారు. వాహనాలు నిలిపే స్థలంలో తొలుత పేలుడు సంభవించింది. ఆత్మాహుతి దళ సభ్యుడు హోటల్‌లో తనను తాను పేల్చేసుకున్నాడు. ఆపై ఇతర ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. వారివద్ద బందీలుగా చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు బలగాలు ప్రయత్నిస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున పదుల సంఖ్యలో బందీలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. ఈ దాడి చేసింది తామేనని ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ 'అల్-షబాబ్' ప్రకటించుకుంది.

శబరిమలలో ఆందోళన

ఇద్దరు మహిళల ప్రవేశాన్ని అడ్డుకున్న నిరసనకారులు

తిరువనంతపురం: యాభై ఏళ్లలోపు వయసున్న ఇద్దరు మహిళలు అయ్యప్ప ఆలయానికి వెళ్లేందుకు చేసిన యత్నాన్ని నిరసనకారులు అడ్డుకున్నారు.

జస్టిస్ ఖన్నాకు పదోన్నతిపై అభ్యంతరాలు

- ఇద్దరు హైకోర్టు చీఫ్ జస్టిస్‌లను కాదని సర్వోన్నత న్యాయస్థానానికి ఎంపిక
- తప్పు పట్టిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కౌల్
- బార్ కౌన్సిల్ నిరసన



జస్టిస్ దినేష్ మాహేశ్వరి



జస్టిస్ సంజీవ్ ఖన్నా

దిల్లీ: దిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్ ఖన్నాను కేంద్రప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. అయితే ఈ విషయంలో సీనియార్టీని పాటించలేదంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు, మాజీ న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్, దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్ర మేనన్‌లు సీనియర్లు అయినప్పటికీ, వారిని కాదని జస్టిస్ ఖన్నాను నియమించారంటూ అసంతృప్తి వ్యక్తమయింది. సీనియార్టీని విస్మరించారంటూ సుప్రీంకోర్టు ప్రస్తుత జడ్జి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ కొలీజియం సభ్యులైన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ అరుణ్ మిశ్రలకు నోట్ రాశారు. సీనియర్లయిన ఇద్దరు ప్రధాన న్యాయమూర్తులకు పదోన్నతి కల్పించకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆయన అందులో పేర్కొన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అఖిల భారతస్థాయి సీనియార్టీ జాబితాలో జస్టిస్ ఖన్నా 33వ స్థానంలో ఉన్నారు. సీనియార్టీని పట్టించుకోవడం లేదంటూ ప్రధాన న్యాయమూర్తి కాకముందు విలేకరుల సమావేశం పెట్టి విమర్శలు చేసిన జస్టిస్ గొగొయి ఇప్పుడు ఇలా చేయడం ఏమిటని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎం.లోధా వ్యాఖ్యానించారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. సీనియార్టీని విస్మరించారంటూ దిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కైలాశ్ గంభీర్ సోమవారం రాష్ట్రపతికి లేఖ రాశారు. ఈ నిర్ణయం అన్యాయం, అసంబద్ధమని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్ర ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. జస్టిస్ నంద్రజోగ్, జస్టిస్ మేనన్‌ల పేర్లను తొలుత ప్రతిపాదించి, అనంతరం వెనక్కితీసుకోవడం ఇష్టారాజ్యంగా సాగిన ఏకపక్ష చర్యలాంటిదని, దీన్ని దేశ ప్రజలు అంగీకరించబోరని అన్నారు.

జస్టిస్ మాహేశ్వరికి పదోన్నతి

జస్టిస్ ఖన్నాతో పాటు కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మాహేశ్వరిని కూడా ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జిగా నియమించింది. ఈ నెల 11న వీరిద్దరి పేర్లను కొలీజియం సిఫార్సు చేసింది.

సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ప్రకారం..

సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ప్రకారం జడ్జీలకు పదోన్నతిపై తొలుత డిసెంబరు 12న కొలీజియం చర్చలు జరిపింది. డిసెంబరు 30న కొలీజియం సభ్యుడిగా ఉన్న జస్టిస్ ఎం.బి.లోకుర్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో జస్టిస్ మిశ్ర నియమితులయ్యారు. ఈ నెల 5,6 తేదీల్లో కొత్త కొలీజియం సమావేశమయి విస్తృతంగా చర్చలు జరిపింది. అదనపు సమాచారం లభించడంతో మొత్తం వ్యవహారాన్ని మళ్లీ మదింపు చేయాలని నిర్ణయించింది.

సెన్సెక్స్ ▲ 3	నిఫ్టీ ▲ 4	డోజోన్స్ 24223 ▲ 158	నాస్‌డాక్ 7048 ▲ 24	రూపాయి 71.24 ▼ 19 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	ముడి చమురు 60.61 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)
36321	10890				

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)

నిఫ్టీ	16న	మార్పు%
YES BANK	208.35	2.64
INDIABULLS HSG	829.60	2.57
INDUSIND BANK	1526.70	2.11
WIPRO	336.55	2.05
BPCL	347.25	1.62
ULTRATECH CEM	3887.00	1.55
INFOSYS	736.80	1.40

గ్రహణం (-)

నిఫ్టీ	16న	మార్పు%
JSW STEEL	286.45	-1.93
BHARTI INFRATEL	275.85	-1.39
BAJAJ FINANCE	2569.85	-1.32
VEDANTA	196.30	-1.31
UPL	766.10	-1.27
ASIAN PAINTS	1389.75	-1.15
BHARTI AIRTEL	333.95	-1.13

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.61	74.92	బహ్రెయిన్ దీనార్	174.88	200.08
పౌండ్ స్టెర్లింగ్	82.99	96.26	కువైట్ దీనార్	193.77	241.28
యూరో	73.64	85.42	ఒమన్ రియాల్	171.12	196.03
జపనీస్ యెన్/100	59.54	69.05	సౌదీ రియాల్	17.18	20.36
ఆస్ట్రేలియా డాలరు	46.51	53.81	యూఏఈ దిర్హమ్	17.58	20.55
సింగపూర్ డాలరు	47.66	56.47	మలేషియా రింగిట్	15.38	18.92
థాయ్ బాత్/100	202.48	242.16	చైనీస్ యువాన్	7.42	12.04



బుధవారం నిఫ్టీ కదలికలు



కొడాక్ 4కే స్మార్ట్ టీవీలు

హైదరాబాద్ (బంజారాహిల్స్), న్యూస్‌టుడే: 4కే విభాగంలో 43 అంగుళాల యూహెచ్‌డీ స్మార్ట్ టీవీని ఆవిష్కరించినట్లు కొడాక్ తెలిపింది. కొడాక్ బ్రాండ్ లైసెన్సు పొందిన సూపర్ ప్లాస్ట్రోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌పీపీఎల్) ద్వారా ఈ టీవీలు అందుబాటులోకి రానున్నాయని, ఎస్‌పీపీఎల్ డైరెక్టర్, సీఈవో అవ్‌నీత్ సింగ్ మార్వా ఇక్కడ తెలిపారు. ఈనెల 20 నుంచి ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఈ స్మార్ట్‌టీవీలను విక్రయించబోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 4కే యూహెచ్‌డీలో 55, 50 అంగుళాల టీవీలు అందుబాటులో ఉన్నాయని, మార్కెట్ వాటా పెంచుకునేందుకు 43 అంగుళాల టీవీ విడుదల చేశామని,. దీని ధర రూ.23,999గా వెల్లడించారు. 5.1.1 ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫామ్‌పై పని చేసే ఈ టీవీకి 1 జీబీ మెమొరీ, 8జీబీ ఫ్లాష్ స్టోరేజీ ఉంటుందన్నారు. ప్రస్తుతం 14 రకాల టీవీలను రూ.9,499-36,999 శ్రేణిలో విక్రయిస్తున్నామని, ఈ ఏడాది మరో 9 కొత్త మోడళ్లను విడుదల చేస్తామని చెప్పారు. స్మార్ట్ టీవీల విపణిలో ప్రస్తుతం 4 శాతం వాటా కలిగి ఉన్నామని, 2022 కల్లా 8 శాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కొన్ని ప్రముఖ షోరూంల్లోనూ ఈ టీవీలు అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు.

ఎక్కడి సూచీలు అక్కడే

● అంతర్జాతీయ మిశ్రమ సంకేతాలతో.. ● తోడైన రాజకీయ అనిశ్చితుల ప్రభావం ● 10,900 దిగువన నిఫ్టీ



సూచీలు బుధవారం అతి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు అందుతుండటం, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో సెన్సెక్స్ 3 పాయింట్లు, నిఫ్టీ 4 పాయింట్ల మేర మాత్రమే లాభపడ్డాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 200 పాయింట్ల మేర ఊగిసలాడింది. అంతర్జాతీయ సూచీలకొస్తే ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లూ ఇదే ధోరణిలో ట్రేడయ్యాయి.

ఇదిలా ఉంటే మంగళవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 465 పాయింట్లు, నిఫ్టీ 149 పాయింట్ల మేర పెరిగిన సంగతి తెలిసిందే. డిసెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్ఠానికి (2.19 శాతం) చేరడం, టోకు ద్రవ్యోల్బణం కూడా 8 నెలల కనిష్ఠానికి (3.80 శాతం) తగ్గడం మార్కెట్లకు బాగా కలిసొచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వచ్చే నెలలో నిర్వహించబోయే ద్రవ్య పరపతి విధాన సమీక్షలో వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్న సానుకూల అంచనాల నడుమ మార్కెట్లు దూసుకెళ్లాయి.

సెన్సెక్స్ బుధవారం ఉదయం 36,370.74 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. తర్వాత వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో 36,462.03 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. అయితే అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులతో ఒక దశలో 36,278.61 పాయింట్ల కనిష్ఠాన్ని కూడా నమోదు చేసింది. చివరకు 3 పాయింట్ల లాభంతో 36,321.29 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 4 పాయింట్ల లాభంతో 10,890.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,928.15-10,876.90 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో యెస్ బ్యాంక్ అత్యధికంగా 2.66 శాతం లాభపడింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.02%, ఇన్ఫోసిస్ 1.38%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.68%, ఓఎన్‌జీసీ 0.62%, ఎస్‌బీఐ 0.58%, యాక్సిస్ బ్యాంక్ 0.54%, ఆర్ఐఎల్ 0.40% చొప్పున లాభపడ్డాయి. వేదాంతా 1.33%, భారతీ ఎయిర్‌టెల్ 1.27%, ఏషియన్ పెయింట్స్ 1.21%, హీరో మోటోకార్ప్ 1.07%, బజాజ్ ఫైనాన్స్ 1.01% మేర నష్టపోయాయి. రంగాలవారీ సూచీలకొస్తే బ్యాంకింగ్, పీఎస్‌యూ, ఆరోగ్య సంరక్షణ, భారీ యంత్ర పరికరాలు, ఇంధనం, చమురు-గ్యాస్, టెక్ పెరిగాయి. స్థిరాస్తి, టెలికాం, ఎఫ్ఎంసీజీ, వాహన, లోహ రంగాలు డీలా పడ్డాయి. బీఎస్ఈలో 1209 షేర్లు సానుకూలంగా, 1375 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 141 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

మైండ్‌ట్రీ లాభం రూ.191 కోట్లు

మధ్యంతర డివిడెండు రూ.3

దిల్లీ: 2018-19 మూడో త్రైమాసికంలో ఐటీ సంస్థ మైండ్‌ట్రీ రూ.191.2 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2017 - 18 ఇదే కాలంలో సంస్థ నమోదు చేసిన రూ.141.5 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 35.1 శాతం ఎక్కువ. ఇదే సమయంలో ఆదాయం కూడా రూ.1,377.7 కోట్ల నుంచి 29.7 శాతం వృద్ధి చెంది రూ.1,787.2 కోట్లకు చేరింది. డాలరు ప్రాతిపదికన చూస్తే నికర లాభం 22.2 శాతం పెరిగి 26.9 మిలియన్ డాలర్లకు, ఆదాయం 17.4 శాతం పెరిగి 251.5 మి.డాలర్లకు చేరినట్లు కంపెనీ పేర్కొంది. 'సాంకేతికత, డొమైన్ నైపుణ్యాలు మా ఖాతాదారులు, సంస్థకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. సాధారణంగా ఐటీకి మూడో త్రైమాసికం బలహీనంగా ఉంటుంది. అయితే మేము మంచి వృద్ధి నమోదు చేయగలిగాం. భవిష్యత్తులోనూ దీన్ని కొనసాగించి వాటాదార్లకు గరిష్ఠ ప్రయోజనం కలిగిస్తామ'ని మైండ్‌ట్రీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ రోస్టో రావణన్ పేర్కొన్నారు. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.3 మధ్యంతర డివిడెండును కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

మెరిసిన టీవీ 18 బ్రాడ్‌కాస్ట్

నికర లాభం రూ.147 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో టీవీ 18 బ్రాడ్‌కాస్ట్ రూ.146.96 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2017-18 ఇదే కాలంలో సంస్థ నికరలాభం రూ.8.53 కోట్లు మాత్రమే. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.271.13 కోట్ల నుంచి రూ.1,474.70 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ఫలితాల్ని గత ఆర్థిక సంవత్సరం ఫలితాలతో పోల్చి చూడలేమని కంపెనీ బీఎస్ఈకిచ్చిన సమాచారంలో పేర్కొంది. 2018 మార్చి 1 నుంచి వయాకామ్ 18 మీడియా, ఇండియాకాస్ట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ సంస్థలు టీవీ 18 బ్రాడ్‌కాస్ట్‌కు అనుబంధ సంస్థలుగా మారిన నేపథ్యంలోనే, ఫలితాల్ని పోల్చి చూడొద్దని తెలిపింది.

విదేశీ వాణిజ్య రుణాలు సులభతరం

ముంబయి: సంస్థలు విదేశీ వాణిజ్య రుణాలు (ఈసీబీ) తీసుకోవడం ఇకపై సులభతరం కానుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆటోమేటిక్ మార్గంలో పొందే ఈ రుణాలపై ఉన్న రంగాలవారీ పరిమితుల్ని కూడా ఎత్తివేసింది. అర్హత గల సంస్థలు ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా 750 మిలియన్ డాలర్ల (సుమారు రూ.5,300 కోట్లు) వరకు విదేశీ వాణిజ్య రుణాలు పొందే వెసులుబాటును కల్పించింది.

వ్యవస్థలోకి నేడు రూ.10,000 కోట్లు

నగదు లభ్యత పెంచేందుకు వీలుగా, ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడం ద్వారా రూ.10,000 కోట్లను వ్యవస్థలోకి చొప్పించబోతున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఓపెన్ మార్కెట్ కార్యకలాపాల (ఓఎంఓ) ద్వారా నేడు వీటిని కొనుగోలు చేయబోతున్నట్లు తెలిపింది.

సువెన్‌కు ఆస్ట్రేలియా, సింగపూర్‌లలో పేటెంట్లు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన సువెన్ లైఫ్‌సైన్సెస్‌కు ఆస్ట్రేలియా, సింగపూర్‌లలో ఔషధ పేటెంట్లు లభించాయి. అల్జీమర్స్, పార్కిన్సన్, స్కిజోఫ్రెనియా వంటి న్యూరో-డీజెనరేటివ్ వ్యాధుల విభాగంలో ఈ పేటెంట్లు లభించాయని, 2036 వరకు వీటికి గడువున్నట్లు సువెన్ తెలిపింది.

10 నెలల కనిష్ఠానికి వాణిజ్య లోటు

● డిసెంబరు ఎగుమతుల్లో వృద్ధి అంతంతే

దిల్లీ: దేశ ఎగుమతులకు సంబంధించి డిసెంబరులో వృద్ధి పెద్దగా కనిపించలేదు. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో, 2017 డిసెంబరుతో పోలిస్తే, గత నెలలో కేవలం 0.34% మేర పెరిగి 27.93 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అయితే దిగుమతులు కూడా తగ్గడంతో, దేశ వాణిజ్య లోటు 10 నెలల కనిష్ఠ స్థాయి అయిన 13.08 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది (2017) డిసెంబరులో ఇది 14.2 బి. డాలర్లుగా ఉంది. బుధవారం వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. దిగుమతులు 2.44 శాతం క్షీణించి 41 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. సెప్టెంబరు 2016లో చివరి సారిగా దిగుమతులు క్షీణించాయి. అప్పట్లో అవి 2.54% మేర తగ్గాయి.

డిసెంబరు 2018లో పసిడి దిగుమతులు సైతం 24.33% తగ్గి 2.56 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. చమురు దిగుమతులు మాత్రం 3.16 శాతం హెచ్చి 10.67 బి. డాలర్లు పెరిగాయి. పలు కీలక ఎగుమతి రంగాల్లోనూ ప్రతికూల వృద్ధి నమోదైంది. ఇంజినీరింగ్ వస్తువులు, రత్నాభరణాలు, తోళ్లు, ఫార్మా, సముద్ర ఉత్పత్తులు, ముడి ఇనుము, టీ, కాఫీ వంటి ఎగుమతులు క్షీణించాయి.

ఏప్రిల్-డిసెంబరులో పైకే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులో చూస్తే, ఎగుమతులు 10.18 శాతం మేర పెరిగి 245.44 బిలియన్ డాలర్ల మేర వృద్ధి చెందాయి. ఇదే కాలంలో దిగుమతులు సైతం 12.61 శాతం పెరిగి 386.65 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ తొమ్మిది నెలలకు వాణిజ్య లోటు 141.2 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

అంతర్జాతీయ అనిశ్చితి వల్లే

దేశీయంగా సవాళ్లు; అంతర్జాతీయ అనిశ్చితుల వల్ల ఎగుమతుల్లో పెద్దగా వృద్ధి నమోదు కాలేదని ఎగుమతుల సంఘం ఫియో అభిప్రాయపడింది. 'డిసెంబరు 2018లో చైనా ఎగుమతులు క్షీణించాయి. అంతర్జాతీయ బలహీనతలు ఇందుకు నేపథ్యం. పరిస్థితి మారుతోందన్న సంకేతాలు ఇంకా కనిపించడం లేద'ని ఫియో అధ్యక్షుడు గణేశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.

రూ.15,000 కోట్ల ఎస్సార్ స్టీల్ ఎన్‌పీఏ ఖాతాల విక్రయానికి యోచన

దిల్లీ: ఎస్సార్ స్టీల్ నుంచి బకాయిల వసూలు కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చర్యలు ప్రారంభించింది. ఈ సంస్థకు సంబంధించి రూ.15,431.44 కోట్ల విలువైన నిరర్థక ఆస్తుల ఖాతాలను విక్రయించే యోచనలో ఉంది. ఈ విషయమై ఇప్పటికే దరఖాస్తులను (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్-ఈఓఐ) కూడా ఆహ్వానించింది. ఎస్సార్ స్టీల్ నుంచి రావాల్సిన పూర్తి బకాయిల వసూలుకు, వీటి విక్రయానికి రిజర్వ్ ధరగా రూ.9,587.64 కోట్లను నిర్ణయించినట్లు బ్యాంకు వెల్లడించింది. ఎన్‌పీఏల వసూలుకు సంబంధించి పునర్వ్యవస్థీకరణ ప్రణాళికకు ఆమోదం లభించిందని, ఎన్‌సీఎల్‌టీ (అహ్మదాబాద్)కి సమర్పించామని పేర్కొంది. దీని ప్రకారం వసూలు చేయాల్సిన కనీస విలువ రూ.11,313.42 కోట్లని తెలిపింది. ఇందులోని 18 శాతం తక్కువగా రిజర్వ్ ధర నిర్ణయించినట్లు పేర్కొంది. ఈఓఐ సమర్పించిన సంస్థలు తక్షణమే నిరర్థక ఆస్తులను పరిశీలించుకోవచ్చని ఎస్‌బీఐ వెల్లడించింది. జనవరి 30న ఇ-వేలం ద్వారా ఎన్‌పీఏ ఖాతాల విక్రయాన్ని బ్యాంకు నిర్వహించనుంది.

హైదరాబాద్‌లో ఇసుజు విక్రయ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: వాణిజ్య వాహన విభాగంలో ఇసుజు డీ-మ్యాక్స్ పికప్స్ వాహనాలకు మంచి ఆదరణ లభిస్తోందని ఇసుజు మోటార్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నౌహిరో యమగుచి అన్నారు. బుధవారం హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో మహావీర్ ఇసుజు విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దీంతో నగరంలో విక్రయ కేంద్రాల సంఖ్య రెండుకు చేరింది. ఈ కొత్త కేంద్రం ద్వారా హైదరాబాద్‌తో పాటు, రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ నగరాలకూ తమ సేవలు అందించనున్నట్లు తెలిపారు. మహావీర్ గ్రూప్ ఛైర్మన్ యశ్వంత్ ఝబక్ పాల్గొన్నారు.

మార్కెట్ కబుర్లు

- ✦ దక్షిణా కొరియా అనుబంధ సంస్థ సాంగ్‌యాంగ్ మోటార్ కంపెనీలో తన వాటాను 72.46% నుంచి 74.65 శాతానికి **మహీంద్రా అండ్ మహీంద్రా** పెంచుకుంది.
- ✦ అమెరికా డాలర్లలో బాండ్లను జారీ చేయడం ద్వారా **ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ)** 3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.21,000 కోట్లు)ను సమీకరించనుంది. ఇప్పటికే ఈ కంపెనీ బాండ్ల జారీ ద్వారా 900 మిలియన్ డాలర్లను సేకరించిన సంగతి తెలిసిందే.
- ✦ ఆర్‌హెచ్‌టీ హెల్త్ ట్రస్ట్ ఆస్తుల కొనుగోలును పూర్తి చేసినట్లు **ఫోర్టిస్ హెల్త్‌కేర్** ప్రకటించింది. గతేడాది ఫిబ్రవరిలోనే ఈ కొనుగోలు నిమిత్తం రూ.4,650 కోట్ల వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది.
- ✦ జీవిత బీమా వ్యాపారంలోకి ప్రవేశించడానికి బీమా నియంత్రణాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ నుంచి ఇండియాబుల్స్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ అనుబంధ సంస్థ **ఇండియాబుల్స్ లైఫ్ ఇన్సూరెన్స్** కంపెనీ ప్రాథమిక అనుమతులు దక్కించుకుంది.
- ✦ డియోజియోకు చెందిన **యునైటెడ్ స్పిరిట్స్** తన అనుబంధ సంస్థ ఫోర్ సీజన్స్ వైన్స్‌లో తనకున్న మొత్తం వాటాను, అనుబంధ బ్రాండ్లను గ్రోవర్ జంపా వైన్‌యార్డ్స్, క్విటెలా అసెట్స్‌కు విక్రయించే ఒప్పందాన్ని పూర్తి చేసింది. తద్వారా రూ.31.86 కోట్లను పొందింది.

అంకురాలకు ఊరట

● ఏంజెల్ పెట్టుబడులపై పన్ను మినహాయింపు ప్రక్రియ సులువు ● త్వరలో నోటిఫికేషన్

దిల్లీ: అంకుర సంస్థ (స్టార్టప్)లకు ప్రభుత్వం ఊరటనివ్వనుంది. ఏంజెల్ ఫండ్‌ల నుంచి వచ్చిన పెట్టుబడులపై ఆదాయ పన్ను మినహాయింపు ప్రక్రియను సరళీకరించనుంది. దీనిపై త్వరలోనే అధికారిక నోటిఫికేషన్ వెలువడనున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అటువంటి దరఖాస్తులపై 45 రోజుల్లోగా నిర్ణయం ప్రకటించాల్సి ఉంటుందని పన్ను వర్గాలకు గడువు విధించినట్లు సమాచారం. వివిధ అంకుర సంస్థల వ్యవస్థాపకులు తమకు వచ్చిన పన్ను నోటీసులపై ఆందోళన వెలిబుచ్చిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఏంజెల్ ఫండ్‌ల నుంచి సమీకరించిన నిధులపై పన్నులు కట్టాలంటూ ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 56(2) కింద వీరికి ఆదాయ పన్ను(ఐటీ) విభాగం నోటీసులు పంపిన సంగతి తెలిసిందే.

ఇదీ కొత్త ప్రక్రియ

- ✦ కొత్త ప్రక్రియలో ఈ మినహాయింపును కోరే అంకురాలు అన్నీ డీఐపీపీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తులను ఆ విభాగం అవసరమైన పత్రాలతో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ)కి పంపుతుంది.
- ✦ 'ఈ క్లాజు కింద దరఖాస్తు చేసిన అంకురాలకు సీబీడీటీ తప్పనిసరిగా మినహాయింపునివ్వాల్సి ఉంటుంది. ఒక వేళ ఏదైనా కారణంతో తిరస్కరించాలనుకుంటే 45 రోజుల్లోగా ఆ పని చేయాల'ని విశ్వసనీయ వర్గాలు వివరించాయి.



- ✦ అంతక్రితం ఈ ప్రక్రియ ఒక అంతర్ మంత్రిత్వ శాఖల బోర్డు ఇచ్చే ధ్రువీకరణ పత్రం ద్వారా సాగేది.
- ✦ అంకుర సంస్థల షేర్ల మార్కెట్ విలువను తెలుపుతూ మర్చంట్ బ్యాంకర్ ఇచ్చే నివేదికను సైతం జత చేసే నిబంధనను తొలగించారు. డీఐపీపీ వద్ద గుర్తింపు పొందిన ఏదైనా అంకురం కొన్ని షరతులకు లోబడి ఈ మినహాయింపును కోరడానికి అర్హత ఉంటుంది.
- ✦ ఆ షరతుల కింద అంకురాలు తమ ఖాతా వివరాలు; మూడేళ్ల నాటి ఆదాయ రిటర్నులనూ సమర్పించాలి. నికర విలువనూ తెలపాలి.
- ✦ పెట్టుబడికి ముందు ఆర్థిక సంవత్సరంలో రూ.50 లక్షల ఆదాయం లేదా అంత కంటే ఎక్కువ ఉండాలి. నికర విలువ రూ.2 కోట్ల కంటే ఎక్కువ ఉండాలి. అంతక్రితం ఈ ఆదాయ పరిమితి రూ.25 లక్షలుగా ఉంది.

ఇక మినహాయింపులు పెరుగుతాయ్..

రూ.10 కోట్ల వరకు అందే పెట్టుబడుల (ఏంజెల్ పెట్టుబడులతో సహా)కు పూర్తి పన్ను మినహాయింపు ఉంటుందని ఏప్రిల్ 2018లో ప్రభుత్వం తెలిపింది. అయితే అప్పటి నుంచి ఇప్పటి దాకా కేవలం రెండే అంకురాలు ఈ మినహాయింపును పొందాయి. సాధారణంగా 300-400 వరకు అంకురాలు ఏటా ఏంజెల్ ఫండ్‌లను పొందుతుంటాయి. ఈ ప్రక్రియ సరళీకరించిన నేపథ్యంలో మరిన్ని అంకురాలు పన్ను మినహాయింపునకు దరఖాస్తు చేసుకోవడానికి వీలవుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. నోటిఫికేషన్ జారీ తర్వాత మినహాయింపునకు దరఖాస్తు చేసుకునే అంకురాలకు సవరించిన నిబంధనలు వర్తిస్తాయి. అయితే పన్ను అధికార్ల నుంచి నోటీసులు అందుకున్న వారికి ఇవి వర్తించవు.

ఏంజెల్ పన్ను రద్దు చేయండి

ప్రధానికి అంకురాల లేఖ

దిల్లీ: ఏంజెల్ పెట్టుబడులపై పన్నును రద్దు చేయాలని పారిశ్రామిక సంఘం ఐస్ప్రిరిట్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసింది. 'అంకుర భారత్'కు ఇది తీవ్ర ప్రమాదంగా మారిందని.. చాలా అంకురాలు దీని బారిన పడ్డాయని 60కి పైగా అంకురాలకు ప్రాతినిధ్యం వహించే ఐస్ప్రిరిట్ అందులో వివరించింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2018-19	2017-18	2018-19	2017-18
పీసీబీఎల్	108.58	56.55	950.00	618.00
కేపీఐటీ	63.90	61.66	566.70	569.47
హెచ్‌టీ మీడియా	42.91	136.96	664.89	681.70
డీసీబీ	86.10	57.01	871.78	685.72
హెచ్ఎంవీఎల్	29.16	39.09	252.80	238.45
నెట్‌వర్క్ 18	77.16	3.19	1538.04	439.23
ఎంసీఎక్స్	41.99	18.77	109.10	76.52

నేటి బోర్డు సమావేశాలు: రిలయన్స్ ఇండస్ట్రీస్, సైయెంట్, హిందుస్థాన్ యునిలీవర్, ఫెడరల్ బ్యాంక్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ

16న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	433	వరంగల్	435
చిల్లరగా(ఒక గుడ్డు)	4.95	విశాఖపట్నం	435
బెంగళూరు	445	చెన్నై	450
17వ తేదీకి...		చిత్తూరు	443
విజయవాడ/గోదావరి	435	నమక్కల్	435

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 389.30 (385.15) 2847403
ASIAN PAINTS 1389.75 (1405.95) 1189597
AXIS BANK LT 664.00 (660.60) 6598151
BAJAJ AUTO L 2717.45 (2725.85) 218357
BAJAJ FINANC 2569.85 (2604.20) 952597
BAJAJ FINSER 6464.85 (6509.70) 119680
BHARTI AIRTE 333.95 (337.75) 6944533
BHARTI INFRA 275.85 (279.75) 3605390
BPCL 347.25 (341.70) 4781001
CIPLA 511.50 (514.95) 1446921
COAL INDIA L 232.05 (232.65) 2050899
DR. REDDYS 2616.95 (2594.80) 946148
EICHER MOTOR 20735.70 (20638.15) 67468
GAIL 325.50 (324.55) 5083489
GRASIM IND 826.30 (815.50) 1926154
HCL TECH 938.25 (947.70) 850621
HDFC 1975.00 (1992.15) 1878811
HDFC BANK 2120.20 (2121.90) 1313113
HERO MOTOCOR 2879.85 (2910.95) 261721
HINDALCO IND 208.40 (208.50) 8209760
HINDUSTAN UN 1772.55 (1789.85) 2054033
HPCL 240.60 (241.55) 2721203
ICICI BANK 375.30 (372.75) 15106484
INDIABULLS H 829.60 (808.85) 5907953
INDIAN OIL 135.80 (134.55) 6605251
INDUSINDBANK 1526.70 (1495.20) 2188162
INFOSYS LTD 736.80 (726.60) 9658944
ITC 294.05 (296.55) 7784035
JSW STEEL LT 286.45 (292.10) 3752082
KOTAK MAHIND 1202.75 (1213.40) 2374649
LARSEN & TOU 1342.15 (1340.90) 2454470
M&M 726.25 (726.90) 1288969
MARUTI SUZIK 7310.25 (7355.15) 424769
NTPC LTD 146.35 (145.80) 4732815
ONGC 146.35 (145.15) 3667241
POWER GRID C 192.00 (192.45) 4789937
RELIANCE IND 1135.90 (1129.65) 6382777
SBI 303.15 (301.65) 12111480
SUN PHARMA 453.80 (452.45) 5879148
TATA CONSULT 1870.15 (1867.80) 2359280
TATA MOTORS 185.45 (185.35) 11874245
TATA STEEL L 474.55 (475.05) 5280293
TECH MAHINDR 699.90 (706.25) 1922647
TITAN IND 961.20 (968.30) 1118736
ULTRATECH 3887.00 (3827.65) 201711
UPL LIMITED 766.10 (775.95) 2584090
VEDANTA LIMI 196.30 (198.90) 12554389
WIPRO 336.55 (329.80) 9896290
YES BANK LTD 208.35 (203.00) 58015710
ZEE ENTERTAI 452.10 (456.80) 19555435

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1287.45 (1293.20) 53823
ACC 1473.95 (1483.45) 419240
ADITYA BIRLA 96.35 (96.60) 1081605
AMBUJA CEMEN 216.85 (216.75) 975644
ASHOK LEYLAN 93.95 (93.60) 10035208
AUROBIND PHA 788.30 (786.55) 1884849
AVENUE SUPER 1393.25 (1390.00) 771654
BANDHAN BANK 448.65 (452.55) 728778
BANK OFBAROD 121.00 (121.10) 10282923
BEL 88.90 (90.20) 5854118
BHEL 68.35 (68.35) 5484091
BIOCON LTD 650.70 (647.70) 937081
BOSCH LTD 19089.40 (19130.05) 6336
BRITANNIA 3175.75 (3183.90) 182044
CADILA HEALT 352.55 (355.90) 1206297
COLGATE PALM 1330.75 (1324.25) 791151
CONTAINER 696.90 (681.70) 1586105
DABUR INDIA 423.85 (426.10) 1621386
DLF LIMITED 182.95 (185.95) 4131732
GENERAL INS 258.25 (257.65) 35504
GODREJ CONSU 774.95 (781.45) 505038
HAVELLS INDI 683.45 (681.10) 676883
HDFC STAND L 387.50 (387.50) 962874
HINDUSTAN ZI 272.60 (273.00) 118186
ICICI LOMBAR 860.30 (871.65) 147195
IDEA CELLULR 36.40 (36.25) 8866060
INTERGLOBE A 1136.55 (1082.95) 1683696
L&TFIN.HOLD 141.85 (141.05) 5431451
LIC HOUS.FIN 481.85 (486.05) 1499699
LUPIN 863.20 (849.70) 1681645
MARICO LIMIT 380.40 (381.45) 884665
MCDOWELL 595.20 (604.25) 743176
MOTHERSON 162.30 (160.70) 2458362
MRF 65991.20 (66195.60) 3514
NHPC LTD 25.85 (25.55) 3668208
NMDC LTD 93.30 (93.65) 8325966
OIL INDIA 173.55 (175.10) 622333
ORACLE FIN S 3682.75 (3661.90) 14088
P&G HYG&HEAL 9896.85 (9939.75) 2395
PETRONET LNG 220.50 (214.95) 1896008
PIDILITE IND 1154.00 (1168.90) 408227
PIRAMAL ENTE 2372.15 (2345.75) 437127
SAIL 50.40 (51.05) 10092890
SBI LIFE INS 621.40 (623.90) 440003
SHREE CEMENT 15822.95 (15618.70) 16308
SHRIRAM TRAN 1188.20 (1188.20) 1185014
SIEMENS 1060.55 (1063.05) 240413
SUN TV LTD 573.45 (579.55) 1265311
THE NEW INDI 183.55 (185.25) 13822

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.32 (6.65) 200
AISHWARYA TE 3.15 (3.03) 1364
ALPHAGEO 478.45 (478) 316
AMAR RAJA BA 765.15 (765.90) 23155
ANDHRA BANK 29.10 (29) 20764
ANDHRA CEMEN 5.80 (5.77) 1633
ANDHRA PAPER 450.40 (447.50) 1965
ANDHRA PETRO 67.15 (64.90) 60406
ANDHRA SUGAR 330.45 (331.70) 2572
ANJANI PORTL 130.10 (133.80) 266
ASTRA MICROW 83.35 (84.35) 6339
AUROBINDO PH 787.05 (785.25) 81172
AVANTEL SOFT 230.70 (231.70) 484
AVANTI FEEDS 383.15 (373.75) 27546
AVON ORG 6.14 (6.44) 570
BALAJI AMIN 483.45 (442.75) 25082
BARTRONICS 7.21 (7.20) 7648
BHAGIRA CHEM 442.40 (437.10) 1374
BHAGYA NAG 36.90 (37.10) 3087
BN RATHI SEC 26 (26.05) 1293
BRILLIANT SE 1.07 (1.10) 538571
CAMBRIDGE TE 44.10 (44.50) 717
CIL SECURI 15.75 (17.45) 1804
COMBAT DRUGS 20 (21) 30
CONT COFFEE 264.25 (265.95) 72320
COROMAN FERT 453.85 (453.60) 2338
CUBEX TUB 14.78 (14.08) 551
CYBERMATE 2.16 (2.15) 57796
CYIENT LIMIT 623.15 (612.75) 8985
DECCAN CEMEN 395 (385.50) 3
DIVI'S LAB 1520.75 (1522.95) 13883
DIVYA GRANIT 94.20 (89.75) 10275
DR REDDY 2621.85 (2591.95) 37323
FOUR SOFT 36.85 (36.80) 3086
GATI CORPN 81.45 (82.30) 33628
GAYATRI PROJ 184.15 (182) 1587
GMR INFRASTR 16.60 (16.50) 581065
GOLDST INFRA 244.35 (233.30) 44528
GOLDSTONE EN 15.70 (16.20) 3252
GRANULES (I) 91.20 (87.85) 98979
GSS AMERICA 129.60 (132.40) 9714
GVK POWER 7.57 (7.55) 176118
HBL NIFE POW 28.75 (28.55) 22235
HERITAGE FOO 537.20 (534.75) 1067
HIL LTD 2043 (1988.45) 252
HIND FLUROCA 16.50 (15.75) 3252
IDL INDUSTRS 268.10 (265.30) 10
ILFS ENGINEE 14.30 (14.55) 1103
INCAP 39.90 (38) 50
IVRCL INFRAS 0.99 (0.99) 41935
JEEVAN SCIEN 37.45 (36.50) 302
KAKATIYA CEM 196.25 (199.25) 1532
KALLAM SPG 17.80 (17.95) 16934
KAVERI SEED 573.50 (579.05) 12398
KCP LTD 89.95 (89.10) 377
KERNEX MICRO 28.10 (26.85) 11244
KNR CONSTRUC 216.15 (217.85) 6503
KREBS BIO 127.50 (120.50) 305
LANCO INDUS 189.10 (187.40) 4371
LAURUS LABS 378.60 (378.35) 1663
LOKESH MACH 45.50 (44.90) 1089
MADHUCON PRO 6.71 (6.25) 27534
MEGA SOFT 7.54 (7.29) 1450
MIC ELECTRON 0.96 (1.01) 43875
MOLD-TEK.TEC 46.40 (44.45) 20340
MOLDTK PLA 260.90 (261.55) 1854
MSR INDIA LT 11.60 (11.80) 1813
NAGARJAGRICH 27.50 (27.55) 1311
NATCO PHARMA 679.90 (691.55) 945868
NAVA BH VENT 112.25 (113.45) 6879
NCC 88.55 (89) 437983
NCL IND 129 (128.30) 221
NEHA INTER 4 (4.09) 4299
NETTLINX 50.50 (52.70) 29861
NEULAND LAB 502.10 (499.85) 132
NIHAR INFO 14 (13.78) 360
NILE 366.85 (367.45) 289
NORTHGATE TE 0.76 (0.80) 9344
OIL COUNTRY 15.40 (15.60) 700
PANYAM CEMEN 13.59 (13.80) 2069
PENNER IND 37.90 (38.55) 20535
PHYTOCHEM I 46.15 (43.05) 1176
PIONEER DIST 165.80 (169.55) 3823
PITTI LAMIN 64.85 (62.50) 6962
POKARNA 182.95 (173.80) 65245
PRAJAY ENGS 8.35 (8.43) 1345
PREMIER EXPL 237.25 (234.60) 488
PRISM CEMENT 85.40 (85.70) 45021
PRUDENTL PHA 3.63 (3.60) 37333
RAASI REFRAC 13.70 (13.70) 20
RAIN INDUSTR 123.45 (117.60) 139481
RAJ PACKAGIN 27 (27.50) 135
RAM INFORMAT 40.80 (40.50) 3996
REG.CERAMIC 4.55 (4.72) 5
SAGAR CEM 655.20 (644.30) 91
SAMKRG PIST 194.65 (196.20) 2774
SATVAH. ISPA 9.30 (9.28) 5000
SMS PHARMA 75.40 (74.65) 5679
SOUTH BIO TE 2.05 (2.09) 101
SREE RAYAL A 35.75 (36) 80528
SRINIVASA SH 39.50 (39.60) 318
STARCHIK SP 26 (26) 585
STEEL EXCHAN 13.70 (13.75) 4678
SUJANA METAL 0.41 (0.43) 31605
SUJANA TOWER 1.38 (1.32) 21500
SURANA TELE 4.60 (4.76) 76
SURYALAKSH.C 42.05 (43.40) 1536
SUVEN PHARMA 219.55 (219.05) 104340
TAJ GVK HOTE 180.05 (182.30) 2063
TANLA 30.25 (29.45) 37383
TERA SOFTWAR 48.50 (48.70) 3004
TRANS BIOTEK 4.93 (4.70) 85448
TRENDY KNIT 0.23 (0.23) 2200
VBC FERRO 39.75 (39.35) 1182
VICEROY HOTE 4.55 (4.64) 1747
VIJAY TEXTIL 41.20 (41.60) 320
VIMTA LABS 291.10 (300.45) 3471
VISAKA IND 429.75 (428.35) 1874
VISTA PHARMA 28.70 (29.25) 1575
VIVIMED LABS 33.70 (34.55) 22679
VJIL CONSULT 41.30 (42.70) 2979
VST INDUS 3269.20 (3214.45) 2223
YBRANT DIGIT 2.85 (2.98) 167155
ZENOTECH LAB 34.95 (35.40) 4975
ZENTECH 81 (79.40) 1969

2025కు మరో 1,000 విమానాలు



● ప్రస్తుతం దేశీయంగా 600కు పైగా సేవలు
● 15 ఏళ్లలో ఇంకో 100 విమానాశ్రయాలు

ముంబయి: రాబోయే 7-8 ఏళ్లలో (2025 నాటికి) మన దేశం మరో 1,000 విమానాలు సమకూర్చుకోనుంది. దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య అత్యంత వేగంగా పెరుగుతున్న దేశం మనదేనని, వరుసగా గత 50 వారాలుగా, ఈ సంఖ్యలో రెండంకెల వృద్ధి లభిస్తోందని పౌర విమానయాన కార్యదర్శి ఆర్.ఎన్.చౌబే ఇక్కడ చెప్పారు. ప్రస్తుతం దేశీయంగా 600కు పైగా విమానాలతో సంస్థలు ప్రయాణికులను చేరవేస్తున్నాయని అంతర్జాతీయ విమానయాన సదస్సులో చౌబే పేర్కొన్నారు. రాబోయే 15 సంవత్సరాలలో మరో 100కు పైగా విమానాశ్రయాల అవసరం ఉంటుందని, 100 కోట్ల ట్రిప్పులు ఉంటాయని అంచనా వేశారు. గత నాలుగేళ్లుగా దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య, అంతక్రితం ఏడాదితో పోలిస్తే 20 శాతం మేర వృద్ధి చెందుతోందని వివరించారు. ఇంధన ధరలు ప్రస్తుత విధంగానే ఉంటే, రాబోయే 20 ఏళ్లు కూడా ప్రయాణికుల సంఖ్యలో వృద్ధి ఇదేవిధంగా ఉంటుందని ఫిక్కీ నిర్వహించిన సమావేశంలో చౌబే విశ్వాసం వ్యక్తం చేశారు.

2040కి ప్రయాణికులు 110 కోట్లకు

2040 నాటికి దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య ప్రస్తుతం కంటే 6 రెట్లు అధికమై 110 కోట్లకు చేరుతుందని, విమానాశ్రయాలు కూడా 200కు చేరతాయని పౌర విమానయాన శాఖ దార్శనిక పత్రం అంచనా వేసింది. 2018లో 622 విమానాలున్నాయని, 2040 మార్చికి వీటి సంఖ్య 2359కి చేరుతుందని తెలిపింది. 2017-18లో దేశంలోపల, విదేశాలకు కలిపి 18.70 కోట్ల మంది ప్రయాణించారని, ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఏడో అతిపెద్ద విపణిగా నిలిచిందని పేర్కొంది. విమానాలను లీజుకు ఇచ్చే పరిశ్రమ కూడా దేశీయంగా అవతరిస్తుందని తెలిపింది. 2040కి దిల్లీ, ముంబయిల్లో మూడేసి, మిగిలిన 31 ప్రధాన నగరాల్లో రెండేసి విమానాశ్రయాలు అవసరం అవుతాయని అంచనా వేసింది. ఇందుకోసం 1.50 లక్షల ఎకరాల భూమి, ఇది కాకుండా 40-50 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.80-3.50 లక్షల కోట్ల) పెట్టుబడులు అవసరం అవుతాయని తెలిపింది. తక్కువమంది రాకపోకలు సాగిస్తున్న విమానాశ్రయాలను ఆదుకునేందుకు 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.14,000 కోట్ల)తో నాభ్ నిర్మాణ ఫండ్‌ను ప్రారంభించే యోచన చేస్తున్నట్లు వెల్లడించింది. విమానాశ్రయాల కోసం భూ సేకరణకు బదులు, యజమానుల భాగస్వామ్యంతో భూమి సమీకరించవచ్చని వివరించింది.

విమానాల తయారీకి చర్యలు: మంత్రి

దేశీయంగా విమానాల తయారీ చేపట్టడంతో పాటు, విమానాలకు రుణాల సదుపాయాన్నీ దేశీయంగా ప్రారంభించే యోచన ఉందని పౌర విమానయాన మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు. ఇందుకోసం అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో చేతులు కలుపుతామన్నారు. విమానాలకు నిర్వహణ, మరమ్మతు సేవలు కూడా దేశీయంగా గణనీయంగా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు.


ప్రత్యేక కార్గో విధానం ఆవిష్కరణ

విమానాల్లో సరకు రవాణా (కార్గో) సేవల్లో 2025 కల్లా ప్రపంచ అగ్రశ్రేణి 5 విపణుల్లో మన దేశాన్ని నిలపాలనే ధ్యేయంతో రూపొందిన ప్రత్యేక కార్గో విధానాన్ని ఈ సదస్సులో ఆవిష్కరించారు. దేశీయ విమానాశ్రయాల ద్వారా జరుగుతున్న సరుకు రవాణాల్లో 60 శాతం విదేశాలవే అని, దేశీయంగా 8 శాతం వృద్ధి లభిస్తోందని నివేదిక తెలిపింది. 2016-17లో ఈ రంగ ఆదాయాలు రూ.22,000 కోట్ల మేర ఉన్నాయని అంచనా. రాబోయే 10-15 ఏళ్లలో కార్గో రవాణా గణనీయంగా పెంచాలని ప్రతిపాదించారు. ఇందుకోసం మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, దేశ, అంతర్జాతీయ సంస్థల మధ్య ఒప్పందాలు జరగాలని పేర్కొన్నారు. భిన్న దేశాల మధ్య రవాణాకు, మనదేశం ట్రాన్సిట్ హబ్‌గా మారాలని ఆకాంక్షించారు.

ఈనాడు బిజినెస్

గొప్ప ఆలోచనాపరుడు

'గ్లోబల్ థింకర్స్' జాబితాలో ముకేశ్‌కు చోటు



దిల్లీ

అపర కుబేరుడు ముకేశ్ అంబానీ 'గ్లోబల్ థింకర్స్'-2019 జాబితాలో చోటు దక్కించుకున్నారు. ప్రఖ్యాత ప్రచురణ సంస్థ 'ఫారిన్ పాలసీ' మొత్తం 100 మందితో ఈ జాబితా రూపొందించింది. ప్రస్తుతానికి కొంత మంది పేర్లనే వెల్లడించింది. పూర్తి జాబితాను ఈనెల 22న విడుదల చేస్తుంది. అలీబాబా వ్యవస్థాపకుడు జాక్ మా, అమెజాన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) జెఫ్ బెజోస్, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్‌ఎఫ్) అధిపతి క్రిస్టీన్ లగార్డే కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. '44.3 బిలియన్ డాలర్లతో జాక్‌మా స్థానాన్ని తోసిరాజని గతేడాది ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా ముకేశ్ అంబానీ అవతరించారు. చమురు, రిటైల్ రంగాల నుంచి ఆయన ఎక్కువ సంపద సంపాదించినా, తన కొత్త టెలికాం సంస్థ జియోతో భారత్‌పై అమిత ప్రభావాన్ని చూపార'ని ఫారిన్ పాలసీ అభిప్రాయపడింది. 'సెల్యులార్ డేటా, వాయిస్ కాల్స్‌ను తొలి ఆరు నెలల పాటు ఉచితంగా ఇవ్వడం ద్వారా 10 కోట్ల మందికి పైగా వినియోగదార్లను ఎంతో త్వరగా తమ ఖాతాలో వేసుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇంటర్నెట్ వినియోగాన్ని వేగవంతం చేశారు. ఇక తదుపరి దశలో గూగుల్, ఫేస్‌బుక్ వంటి సంస్థలతో పోటీపడుతూ, డిజిటల్ వాయు తరంగాలను ఉపయోగించుకుని కంటెంట్, ఇతర ఉత్పత్తులను ముకేశ్ విక్రయిస్తార'ని ఆ సంస్థ పేర్కొంది.

- ✦ గ్లోబల్ థింకర్స్(అంతర్జాతీయ ఆలోచనాపరులు) జాబితాకు ఈ ఏడాది పదో వార్షికోత్సవం సందర్భంగా ఫారిన్ పాలసీ తన జాబితాను 10 విభాగాలుగా చేసి.. ఒక్కో విభాగంలో పది మంది పేర్లు ఇవ్వాలని నిర్ణయించింది.
- ✦ గత దశాబ్ద కాలంలో ప్రపంచంపై గొప్ప ప్రభావాన్ని చూపిన వారితో తొలి గ్రూపు పేర్లు ఇవ్వనుంది.
- ✦ గతేడాదిలో ప్రభావాన్ని చూపిన వ్యక్తులతో ఇతర గ్రూపులను నింపింది. అందులో భాగంగా 40 ఏళ్లలోపు ఆలోచనాపరులు, రక్షణ, భద్రతా రంగాలు, విద్యుత్-వాతావరణం, సాంకేతికత, ఆర్థిక శాస్త్రం-వ్యాపారం, విజ్ఞానం-ఆరోగ్యం, కార్యకలాపాలు, కళలు.. ఇలా విభజిస్తూ వెళ్లింది.
- ✦ సాంకేతిక ఆలోచనాపరుల జాబితాలో అంబానీ అగ్రస్థానంలో నిలిచారు.
- ✦ గత దశాబ్ద కాలంలో ప్రభావాన్ని చూపిన వ్యక్తుల జాబితాలో జాక్‌మా, క్రిస్టీన్ లగార్డేలు చోటు చేసుకున్నారు. యూరోపియన్ కమిషనర్ ఫర్ కాంపిటిషన్ మార్గరెట్ వెస్టాగర్, టీవీ వ్యాఖ్యాత ఫరీద్ జకారియా, బిల్-మిలిందా గేట్స్, అమెజాన్ బెజోస్ ఇందులో చోటు దక్కించుకున్నారు.
- ✦ న్యూజిలాండ్ ప్రధాని జసిండా ఆడెర్న్ 40 ఏళ్ల లోపు ఆలోచనాపరుల జాబితాలో ఉన్నారు.

జెట్ ఎయిర్‌వేస్.. కష్టాలు ఇంకా తీరలేదు

- పునరుద్ధరణ ప్రణాళికపై మల్లగుల్లాలు
- ఎస్‌బీఐ సహా ఆర్థిక సంస్థలు, వాటాదార్ల చర్చలు



దిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కి విలవిలలాడుతున్న జెట్ ఎయిర్‌వేస్‌కు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళిక రూపొందించేందుకు, ఆ సంస్థకు రుణాలిచ్చిన ఎస్‌బీఐ సహా ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పాటు వాటాదార్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కొత్తగా వాటాల రూపంలో పెట్టుబడులు, తత్ఫలితంగా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో వచ్చే మార్పుల వంటి అంశాలన్నీ ఈ ప్రణాళికలో భాగమేనని జెట్ ఎయిర్‌వేస్ బుధవారం తెలిపింది. పునరుద్ధరణ ప్రణాళికపై స్పష్టత రాకపోవడంతో, స్టాక్ మార్కెట్లలో షేరు బాగా నష్టపోతున్న నేపథ్యంలో, వ్యయ నియంత్రణకు, రుణ భారం తగ్గించుకునేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ ప్రకటించింది. తీవ్ర నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న జెట్ ఎయిర్‌వేస్, 2018 డిసెంబరు 31 నాటికి ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల బృందా (కన్సార్షియా)నికి రుణాలు చెల్లించడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత, కొత్త వాటాదార్ల నుంచి అదనపు పెట్టుబడులు స్వీకరించేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. 'కంపెనీని సమగ్రంగా పునరుద్ధరించడంతో పాటు ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేలా చూసేందుకు ఎస్‌బీఐ, ఇతర ఆర్థిక సంస్థలు, వాటాదార్లతో సంప్రదింపులు సాగుతున్నాయి' అని జెట్ ఎయిర్‌వేస్ ప్రకటించింది. ప్రణాళికపై వాటాదార్లు విస్తృతంగా చర్చిస్తున్నారని, అయితే ఇంకా తుది నిర్ణయానికి రాలేదని, కంపెనీకి ప్రయోజనం కలిగేలా ఇది ఉంటుందని తెలిపింది. కొత్తగా పెట్టుబడుల స్వీకరణ, ఆస్తుల సమగ్ర వినియోగం, లాయల్టీ పథకంలో కంపెనీ వాటా విక్రయం వంటివి అమలు చేస్తున్నట్లు పేర్కొంది. సంస్థలో ప్రస్తుతం 24 శాతం వాటా కలిగిన ఎతిహాద్ ఎయిర్‌వేస్, తన వాటా పెంచుకునేందుకు చూస్తోందని వార్తలు వస్తున్నా, స్పందించేందుకు ఆ సంస్థ ప్రతినిధి నిరాకరించారు. ఒకవేళ ఎతిహాద్ కనుక తన వాటా పెంచుకునేందుకు ముందుకు వస్తే, ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో ప్రిఫరెన్స్ ప్రైసింగ్‌కు సంబంధించి, తమకు మినహాయింపు ఇవ్వాలని ఎతిహాద్ కోరుతున్నట్లు సమాచారం.

షేరుకు నష్టాలు: కంపెనీ పునరుద్ధరణ ప్రణాళికపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో, బుధవారం బీఎస్ఈలో జెట్ ఎయిర్‌వేస్ షేరు 7.95% నష్టపోయి, రూ.271 వద్ద స్థిరపడింది. ఒక దశలో 9.62 %నష్టపోయి రూ.266.05కు చేరింది కూడా.

మార్చి నాటికి రూ.55వేల కోట్ల ప్రీమియం!

ఎల్ఐసీ జోనల్ మేనేజర్ సుశీల్ కుమార్



ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 31, 2018 నాటికి ఎల్ఐసీ దక్షిణ మధ్య మండలం (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక) రూ.35,000 కోట్ల ప్రీమియాన్ని వసూలు చేసింది. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ఇది రూ.55,000 కోట్లకు చేరుకుంటుందనే నమ్మకంతో ఉన్నట్లు జోనల్ మేనేజర్ టి.సి.సుశీల్ కుమార్ తెలిపారు. ఎల్ఐసీ నుంచి ఇటీవల విడుదలైన 'జీవన్ శాంతి'కి మంచి ఆదరణ లభిస్తోందని, ఈ ఒక్క పాలసీ నుంచే కొత్త ప్రీమియం రూపంలో రూ.750 కోట్లు వచ్చాయని చెప్పారు. మార్చి నాటికి ఈ పాలసీ ప్రీమియంగా రూ.2,000 కోట్లు వసూలు చేయాలనే లక్ష్యం విధించుకున్నట్లు వివరించారు. దక్షిణ మధ్య మండలం పనితీరును సమీక్షిస్తూ, డిసెంబరు 31, 2018 నాటికి పరిహారం, మెచ్యూరిటీ, యాన్యుటీల కింద రూ.25,000 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మైసూరు, కరీంనగర్‌లలో జరిగిన ప్రమాదాల్లో మరణించిన వారికి 48 గంటల్లోనే పరిహారం చెల్లించామని చెప్పారు. జోన్ నుంచి 1,385 మంది ఏజెంట్లు అమెరికాలో జరిగే మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ సమావేశానికి ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు.



స్కోడా 'సూపర్బ్' కొత్తగా

ధర రూ.23.99 లక్షలు

దిల్లీ: ఖరీదైన సెడాన్ కారు 'సూపర్బ్'లో కొత్త వేరియంట్‌ను స్కోడా ఆటో ఇండియా విడుదల చేసింది. దీని ధర రూ.23.99 లక్షలు (ఎక్స్‌షోరూం, దిల్లీ). 1.8 లీటర్ పెట్రోలు ఇంజిన్‌తో తీసుకొచ్చిన ఈ కార్పొరేట్ ఎడిషన్‌లో ఎనిమిది ఎయిర్ బ్యాగ్‌లు, అడాప్టివ్ ఫ్రంట్ లైటింగ్ సిస్టమ్ (ఏఎఫ్ఎస్) ఫంక్షన్, 20.32 సెం.మీల ఫ్లోటింగ్ తాకే తెర లాంటి ప్రత్యేకతలు ఉన్నాయి. చోదకునికి, ముందు, వెనకాల కూర్చునే ప్రయాణికులకు వేర్వేరు ఉష్ణోగ్రతలతో గాలి తగిలేలా మూడు అంచెల ఎయిర్ కండిషనింగ్ కూడా ఇందులో ఉంది.

జాతీయ రహదారుల ఫాస్ట్‌ట్యాగ్‌కు జీఎస్‌టీ ఇ-వేబిల్లు అనుసంధానం!

దిల్లీ: జీఎస్‌టీ ఇ-వేబిల్లు వ్యవస్థను జాతీయ రహదారుల (ఎన్‌హెచ్ఏఐ) ఫాస్ట్‌ట్యాగ్ వ్యవస్థకు ఏప్రిల్ నుంచి అనుసంధానం చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా సరకు రవాణా కదలికలపై కన్నేసి ఉంచేందుకు, జీఎస్‌టీ ఎగవేతలను నియంత్రించేందుకు ఈ విధంగా చేయాలని భావిస్తున్నారు. రవాణాదార్లతో సంప్రదింపుల అనంతరం ఫాస్ట్‌ట్యాగ్, డీఎంఐసీకి చెందిన లాజిస్టిక్స్ డేటాబ్యాంక్ సర్వీస్‌కు ఇ-వేబిల్లు అనుసంధానంపై అధికారులతో ఓ కమిటీని రెవెన్యూ విభాగం ఏర్పాటు చేసింది. 'ఒకటే ఇ-వేబిల్లుతో కొందరు రవాణాదార్లు పలుమార్లు రాకపోకలు సాగిస్తున్నారు. ఫాస్ట్‌ట్యాగ్‌తో అనుసంధానం వల్ల ఫలానా వాహనం ఎక్కడ ఉందో గుర్తించొచ్చు. అదే విధంగా ఎన్‌హెచ్ఏఐ టోల్‌ప్లాజాలను ఎన్ని సార్లు, ఎప్పుడెప్పుడు ఆ వాహనం దాటిందో తెలుసుకోవచ్చ'ని ఓ అధికారి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈ అనుసంధాన వ్యవస్థను ఏప్రిల్ నుంచి ప్రారంభించేందుకు యోచన చేస్తున్నారని తెలిపారు. ప్రయోగాత్మక విధానంలో భాగంగా కర్ణాటకలో ఇప్పటికే ఈ తరహా అనుసంధాన వ్యవస్థను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ చదివినా.. అమ్మాయిలకు కొలువు దూరమే



- ● అబ్బాయిలతో పోలిస్తే 5 రెట్లు అధికంగా నిరుద్యోగిత
- ● పని ప్రదేశంలోనూ వివక్ష
- ● సొసైటీ ఆఫ్ ఉమన్ ఇంజినీర్స్ అధ్యయనం

దిల్లీ: ఇంజినీరింగ్ పూర్తి చేసిన అమ్మాయిలకు ఉద్యోగావకాశాలు చాలా తక్కువగా ఉంటున్నట్లు ఓ సర్వేలో వెల్లడైంది. ఇంజినీరింగ్ చదివిన అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల నిరుద్యోగిత రేటు 5 రెట్లు అధికంగా ఉందని తేలింది. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలోని సెంటర్ ఫర్ వర్క్-లైఫ్ లా భాగస్వామ్యంతో సొసైటీ ఆఫ్ ఉమన్ ఇంజినీర్స్ 'వాకింగ్ ద టైట్ రోప్' పేరుతో ఈ నివేదికను రూపొందించింది. భారత్‌లోని 'పాశ్చాత్య ఇంజినీరింగ్ కంపెనీల్లో' లింగ వివక్ష అనుభవాలనూ ఈ నివేదికలో పొందుపరచారు. ఇందులోని అంశాలను పరిగణనలోకి తీసుకుని, సమస్యల పరిష్కారం దిశగా ఉద్యోగ సంస్థలు చర్యలు తీసుకోవాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఉదయ్‌పూర్)లో అధ్యాపకుడిగా (ఫ్యాకల్టీ) పనిచేస్తున్న నీతి సనన్ కోరారు. దేశవ్యాప్తంగా వివిధ విభాగాలు, స్థాయిల్లో పనిచేస్తున్న 693 మంది ఇంజినీర్ల నుంచి సేకరించిన వివరాలతో దీనిని రూపొందించారు. అందులోని వివరాలు ఇలా..

- ✦ మహిళలతో పాటు పురుషులూ ఏదో రూపేణా వివక్ష ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం, ప్రాంతం లాంటి విషయాల్లో వివక్ష ఎదురవుతోందని 44% మంది పురుషులు, 30 శాతం మంది మహిళలు తెలిపారు.
- ✦ మిగతా సహోద్యోగుల స్థాయిలో గౌరవం పొందాలంటే మళ్లీ మళ్లీ తామేంటో నిరూపించుకోవాల్సి వస్తోందని 76% మంది వెల్లడించారు.
- ✦ మహిళలకు ఉంటున్న ఒకే ఒక్క అత్యున్నత స్థాయి పదవి కోసం మిగతా మహిళా ఉద్యోగులతో కలిసి పోటీ పడాల్సి ఉంటోందని 45 శాతం మంది మహిళా ఇంజినీర్లు చెప్పారు.
- ✦ పనిప్రాంతంలో లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని 11 శాతం మంది మహిళలు, 6 శాతం మంది పురుషులు వెల్లడించారు.
- ✦ నియామకాల్లో వివక్ష ఉందని 54 శాతం మంది పురుషులు, 44% మంది మహిళలు అభిప్రాయపడ్డారు.

బీమాపై మహిళల ధీమా



పాలసీదారులతో పాటు ఏజెంట్లలోనూ వీరి సంఖ్య పెరుగుతోంది: ఐఆర్‌డీఏ

ఈనాడు, హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల ప్రాధాన్యం ఏటా పెరుగుతోంది. జీవిత బీమా రంగంలోనూ వారి భాగస్వామ్యం పెరగడం గమనార్హం. బీమా ఏజెంట్లుగానూ రాణిస్తున్నారు. భారతీయ బీమా నియంత్రణ, ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) తాజాగా విడుదల చేసిన 2017-18 వార్షిక నివేదికలో ఈ వివరాలు వెల్లడించింది.

గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2.82 కోట్ల జీవిత బీమా పాలసీలు తీసుకున్నారు. వీటిద్వారా మొదటి ఏడాది రూ.92,135 కోట్ల ప్రీమియం వసూలైందని ఐఆర్‌డీఏ నివేదిక పేర్కొంది. ఇందులో 90 లక్షల పాలసీలు అంటే.. దాదాపు 32% పాలసీలను మహిళలు తీసుకున్నట్లు తెలిపింది. రాష్ట్రాల వారీగా చూస్తే.. మహారాష్ట్రలో (12%), పశ్చిమ బంగా (10.3%), ఉత్తరప్రదేశ్ (9.4%)లలో మహిళలు తీసుకున్నారు. మొదటి ప్రీమియంగా మహిళల నుంచి రూ.29,801 కోట్లు వసూలైంది.

ప్రతి 10,000 మందికి 210 పాలసీలు: దేశ వ్యాప్తంగా చూస్తే 2017-18లో ప్రతి 10,000 మందిలో 210 మంది పాలసీలు తీసుకున్నారు. వేర్వేరుగా చూసినప్పుడు ప్రతి 10వేల మందిలో 227 మంది పురుషులు, 139 మంది మహిళలు పాలసీ తీసుకున్నారు. రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే.. చండీగఢ్, గోవా, దిల్లీలలో మహిళలు అధికంగా పాలసీలు తీసుకున్నారు. **తెలంగాణ**లో ప్రతి 10వేల మందిలో పురుషులు 302 మంది, మహిళలు 168 మంది పాలసీలు తీసుకున్నారు. **ఆంధ్రప్రదేశ్** నుంచి పురుషులు 306 మంది, మహిళలు 189 మంది జీవిత బీమా పాలసీలు తీసుకున్నారని ఐఆర్‌డీఏ వెల్లడించింది.

ఏజెంట్లు పెరిగారు: జీవిత బీమా ఏజెంట్లుగా మహిళల సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెరిగిందని ఐఆర్‌డీఏ వెల్లడించింది. మార్చి 31, 2018 నాటికి మొత్తం మహిళా ఏజెంట్ల సంఖ్య 5,79,220కి చేరింది. మొత్తం ఏజెంట్లలో ఇది 27.81 శాతం. ఇందులో భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో 50.47శాతం ఉండగా.. మిగిలిన 49.53 శాతం మంది ప్రైవేటు బీమా సంస్థల్లో ఉన్నారు. ఇక ప్రైవేటు బీమా సంస్థల్లో అధికంగా మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో అత్యధికంగా 46.11శాతం మహిళా ఏజెంట్లు ఉన్నారు. ఐడీబీఐ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 39.17శాతం, ఏగాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 34.10శాతం మంది మహిళా ఏజెంట్లున్నారు.

తెరచాటు బంధం తెరపైకి

- కేటీఆర్, జగన్ భేటీపై రాష్ట్ర మంత్రుల ధ్వజం

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన వారంతా ఒక చోట చేరుతున్నారని కేటీఆర్, జగన్ భేటీపై రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. తెరాస, వైకాపా రహస్య ఒప్పందంపై తెలుగుదేశం చెప్పిందే నిజమైందని, ఇంతవరకు తెరచాటున ఉన్న ఈ బంధం ఇప్పుడు తెరపైకి వచ్చిందని విమర్శించారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఇది ఫెడరల్ ఫ్రంట్ కాదని... భాజపా తోలుబొమ్మల ఫ్రంట్... మోదీ చేతిలో కీలుబొమ్మ ఫ్రంట్ అని పేర్కొన్నారు. కేసీఆర్ ద్వారా హోదా తీసుకువస్తామని జగన్ అనడంలోనే కుట్ర దాగి ఉందని, ఆంధ్రప్రదేశ్‌కు హోదా ఇస్తామని సోనియా అంటే నాడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఎలా స్పందించారో ఇక్కడి ప్రజలు మరిచిపోలేదని వివరించారు. తెలంగాణ డిస్కంల నుంచే రూ.5,702 కోట్లు రావాల్సి ఉందని, పన్ను వసూళ్లలో తేడాల వల్ల రాష్ట్రం రూ.3800 కోట్లు నష్టపోయిందని వివరించారు. తొమ్మిదో షెడ్యూలులో 8 సంస్థలు, పదో షెడ్యూలులో 142 సంస్థల ఆస్తులు, అప్పుల విభజనకు తెరాస నాయకులు అడుగడుగునా మోకాలడ్డుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆస్తులపై సుప్రీం ఇచ్చిన తీర్పు కూడా అమలు కాకుండా అక్కడ మోదీ... ఇక్కడ కేసీఆర్ ఎలా అడ్డుపడ్డారో అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. అలాంటి వాళ్లతో జగన్ కుమ్మక్కవడంపై ప్రజలే గుణపాఠం చెబుతారని అభిప్రాయపడ్డారు.



మోదీ వ్యతిరేక ఓట్లు చీల్చాలనే కుట్ర



కేటీఆర్, జగన్‌లు ... మోదీపై ఒక్క మాట కూడా అనలేదని, మోదీ వ్యతిరేక ఓట్లు చీల్చే కుట్రలో భాగమే ఫెడరల్ ఫ్రంట్ అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు ఒక ప్రకటనలో విమర్శించారు. తెదేపా ముందు నుంచి చెబుతున్నట్లే వైకాపా ముసుగు తొలగిందన్నారు. 42 మంది ఎంపీలుంటే ప్రత్యేకహోదా సాధించేందుకు అవకాశం ఉంటుందన్న ఆయన తన పార్టీ ఎంపీలతో దొంగ రాజీనామాలు చేయించి రాష్ట్రానికి అన్యాయం చేయలేదా అని అడిగారు. ప్రత్యేకహోదా, రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంటు వంటి విభజన హామీలపై ఒక్క రోజైనా మోదీని నిలదీశారా, కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.75వేల కోట్లు రావాలని మేధావులు చెబుతోంటే వాటి గురించి అడిగారా అని కళా ప్రశ్నించారు. –కళా వెంకట్రావు

జగన్‌తో నాటకాలాడిస్తున్నారు: మంత్రి గంటా



ప్రధాని నరేంద్రమోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్ కలిసి జగన్‌తో నాటకాలాడిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ద్వేషిస్తున్నారని మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కేటీఆర్ బృందం జగన్‌ను కలవడం ఒక జగన్నాటకమని పేర్కొన్నారు. బుధవారం విశాఖపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పెద్ద తప్పిదం చేస్తున్నారని, ప్రజలు క్షమించని విధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు మద్దతు తెలపాలని వైకాపాను కోరడమన్నది పైకి కనిపిస్తున్నా.. అవి రెండూ అవిభక్త కవలలని వ్యాఖ్యానించారు. రెండూ పార్టీలు, రెండు జెండాలుగా కాకుండా వాటిని విలీనం చేసి ఒకే పార్టీగా ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ఏపీలో తెదేపాను ఏమీ చేయలేరన్నారు. జగన్‌కు రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు లేదని, సరైన రాజకీయ అనుభవం లేక తప్పు మీద తప్పు చేసి ఆ పార్టీ వైఫల్యానికి ఆయనే కారణంగా నిలుస్తున్నారన్నారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేసిన వ్యాఖ్యలను మంత్రి గంటా ఖండించారు.

కేసీఆర్ ముందు జగన్ మోకరిల్లడమా



ఆంధ్ర ప్రాంత ప్రజలను తీవ్రంగా దూషించిన కేసీఆర్ ముందు జగన్ మోకరిల్లడమా అని రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్ధా రాఘవరావు విమర్శించారు. తెలంగాణ నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, ఆస్తుల పంపకంపై ఏనాడూ ప్రశ్నించని జగన్ వారితో ఇప్పుడు చేతులు ఎలా కలుపుతారని ప్రశ్నించారు. అధికార దాహం, పదవీ వ్యామోహం, కేసుల మాఫీలే అజెండాగా రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో వైకాపా, తెరాస, భాజపాలు ఆడుతున్న నాటకాలను ప్రజలు ఒక కంట గమనిస్తున్నారని మంత్రి శిద్ధా పేర్కొన్నారు. –శిద్ధా రాఘవరావు

వీరి ముసుగు తొలగింది



'రాష్ట్రంలో సమర్థవంతమైన నాయకత్వం ఉండకూడదనే అవినీతిపరుడైన జగన్‌తో కేసీఆర్ అంటకాగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు సహకరించేందుకే ఈ నాటకం. అవినీతి కేసుల నుంచి బయటపడటం, హైదరాబాద్‌లోని ఆస్తులను కాపాడుకోవడం కోసమే భాజపా, కేసీఆర్‌తో జగన్ కలిశారు. ఇప్పుడు వీరి ముసుగు తొలగిపోయింది. వీరి వెనుక మోదీ ఉన్నారని స్పష్టమైంది. భాజపా, కేసీఆర్, జగన్, ఒవైసీ అందరూ కలిసి రాష్ట్రంలో పోటీ చేసినా ఏమీ కాదు. పింఛన్ల పెంపు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుతో ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ పెరుగుతుంటే ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైకాపా ప్రయత్నిస్తోంది. 'రాష్ట్రానికి జగనే చుట్టపు చూపుగా వస్తున్నారు. ఆయనకే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై అవగాహన లేదు. ఇక కేసీఆర్‌కు ఏం తెలుసు...' అని పేర్కొన్నారు. –నక్కా ఆనందబాబు

మోదీ దర్శకత్వంలో కేసీఆర్ ఫ్రంట్

వైకాపా పాతాళానికి పడిపోవడం ఖాయం: సీపీఐ

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ దర్శకత్వంలోనే తెరాస అధినేత కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ఈ కూటమితో రెండు రాష్ట్రాల ప్రజలకు పెనుప్రమాదం పొంచి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో భాజపా పూర్తిగా విఫలమవ్వడంతోనే ఇప్పుడు ప్రమాదకర రాజకీయాలకు తెర తీస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ సీపీఐ భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు.. మోదీకి ఊడిగం చేసేందుకే జగన్, కేటీఆర్‌ల మధ్య సమావేశం కొనసాగిందని, ఈ భేటీతో ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా స్థితి పాతాళానికి పడిపోవడం ఖాయమని చెప్పారు.

ఆ ముసుగు తొలగిపోయింది: ఎల్.రమణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో ప్రధాని మోదీ, భాజపాకి తెరాస, వైకాపాలు 'బి' టీంగా వ్యవహరిస్తున్నాయని తెతెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ విమర్శించారు. ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కొత్త రాజకీయాలకు తెరలేపిన తెరాస ఇన్ని రోజులు దాచుకున్న ముసుగు ఇప్పుడు తొలగిపోయిందన్నారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, వైకాపా అధ్యక్షుడు జగన్‌ను కలిసిన ఈ రోజును తెదేపా చీకటి రోజుగా భావిస్తోందన్నారు.

'వైఎస్ అభిమానులు జీర్ణించుకోలేరు'

ఈనాడు, అమరావతి: సమైక్య రాష్ట్రంలో తెరాస చేసిన దాడులను మరచి.. ఆ పార్టీ నాయకులతో భేటీ కావడం ద్వారా వైఎస్ జగన్ స్వార్థ రాజకీయాలకు తెరలేపారని యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు కొలిశెట్టి శివకుమార్ ధ్వజమెత్తారు. ఈ భేటీని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. తనను అన్యాయంగా పార్టీ నుంచి బహిష్కరించడాన్ని నిరసిస్తూ 'స్వార్థంపై యుద్ధం' నినాదంతో ఈ నెల 25న విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు.

ఐదో రోజూ శ్రీనివాసరావు విచారణ

ఈనాడు, హైదరాబాద్: వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి కేసులో నిందితుడు శ్రీనివాసరావు విచారణ ఐదో రోజు కూడా జరిగింది. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు న్యాయస్థానం అనుమతితో శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయంలో విచారిస్తున్న సంగతి తెలిసిందే. జగన్‌పై దాడి చేయడానికి కారణాలేమిటి? అన్న అంశంపైనే అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఎన్ని రకాలుగా అడుగుతున్నా శ్రీనివాసరావు మాత్రం ఒకే సమాధానం చెబుతున్నాడని, సంచలనం కోసం తప్ప మరేమీ లేదంటున్నాడని తెలుస్తోంది. దాడికి ముందు శ్రీనివాసరావు ఎవరెవరితో మాట్లాడాడన్న వివరాలు తెప్పించుకున్న అధికారులు దానిపైనా ప్రశ్నిస్తున్నారు. దాదాపు 20 మంది యువతులతో మాట్లాడినట్లు గుర్తించిన అధికారులు వారి గురించి కూడా ప్రశ్నించినట్లు సమాచారం. శ్రీనివాసరావును మరో రెండు రోజుల పాటు ఎన్ఐఏ అధికారులు ప్రశ్నించనున్నారు.

సానుభూతి కోసమే చేశానన్నాడు: జగన్‌కు సానుభూతి రావాలనే దాడి చేశానని శ్రీనివాసరావు చెబుతున్నట్లు ఆయన తరపు న్యాయవాది సలీం వెల్లడించారు. బుధవారం ఎన్ఐఏ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... తనను విచారించడానికి ఒక్కరోజు చాలని, తాను అబద్ధం చెప్పాల్సిన అవసరం కూడా లేదని చెబుతున్నాడని సలీం వివరించారు.

జగన్‌పై దాడి కేసులో పలువురికి నోటీసులు

ఈనాడు, విశాఖపట్నం: వైకాపా అధ్యక్షుడు జగన్‌పై దాడి కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు స్థానికంగా పలువురిని విచారించారు. ప్రత్యక్ష సాక్షులతో పాటు దాడికి ముందు ఏం జరిగిందనే దానిపై ఆరా తీశారు. విచారణకు హాజరవ్వాలని కొందరికి నోటీసులు జారీ చేశారు.

ఆంధ్ర వ్యతిరేకులతో కుమ్మక్కు: మంత్రి దేవినేని



ఆంధ్రా వ్యతిరేకి అయిన తెలంగాణ సీఎం కేసీఆర్‌తో జగన్ తన కుమ్మక్కు రాజకీయాలను ఇక బహిరంగంగా నెరిపే పరిస్థితికి చేరారని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. 'ఆంధ్రా ద్రోహులతో జత కట్టడం పులివెందుల రాజకీయాలు కావు. విజయవాడ, పులివెందుల రాజకీయాలంటే.. దమ్ము, ధైర్యంతో ప్రజల ముందుకు వెళ్లేవి. నేరుగా ప్రజాక్షేత్రంలో తేల్చుకునేవిగా ఉండాలి...' అని వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. పోలవరం ముంపు మండలాలను తెలంగాణ నుంచి చంద్రబాబు గుంజుకున్నారని కేసీఆర్ విమర్శించారని, ఈ ప్రాంతం వాళ్లను దూషించారని గుర్తు చేశారు. ఏపీలో ఉన్న ఎంపీల సంఖ్యాబలం 25 చాలదంటూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 42 ఎంపీ స్థానాలను ఆ మేరకు తగ్గించిన వారితో కుమ్మక్కు అవుతారా అని ప్రశ్నించారు. సామాజిక పింఛన్ల మొత్తాన్ని పెంచడంతో తెదేపా ప్రభుత్వానికి ప్రజాదరణ పెరిగిందని ఆయనకు నిద్రపట్టని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల్లో ఆంధ్రుల సత్తా, పౌరుషం ఏమిటో చూపి వైకాపాకు తగిన గుణపాఠం చెప్పడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి ఉమా వ్యాఖ్యానించారు.

చీకటి ఒప్పందం బహిర్గతం: మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: 'దిల్లీ, ఆంధ్ర, తెలంగాణ మోదీలు ఒక్కటయ్యారు. ఇంతకాలం వీరి మధ్య సాగిన చీకటి ఒప్పందం ఇప్పుడు బహిర్గతమైంది...' అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖల మంత్రి లోకేశ్ బుధవారం వ్యాఖ్యానించారు. వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీపై ఆయన ట్విటర్ వేదికగా స్పందించారు. లంకలో పుట్టిన వాళ్లంతా రాక్షసులని, ఆంధ్రా వాళ్లు వారి వారసులని, ఆంధ్రా బిర్యానీ పేడలా ఉంటుందని అవహేళన చేసిన కేసీఆర్‌తో జగన్మోహన్‌రెడ్డి జత కట్టారని విమర్శించారు. విభజన చట్ట ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన వాటా దక్కకుండా అడ్డుపడిన ఆయనతో కలిసి జగన్ ఆంధ్రా ద్రోహుల ఫ్రంట్ ఏర్పాటు చేశారని లోకేశ్ పేర్కొన్నారు.

షర్మిలతో రాజకీయం తగదు: మంత్రి సునీత



రామగిరి, న్యూస్‌టుడే: షర్మిలను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయాలనుకోవడం జగన్‌కు తగదని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత హితవు పలికారు. అనంతపురం జిల్లా రామగిరిలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్ప మనసుతో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ప్రజాదరణ వస్తోందన్న ఉద్దేశంతో వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆరోపణలకు దిగుతున్నారని ఆరోపించారు. షర్మిల గతంలో పాదయాత్ర చేపట్టినప్పుడూ తాను ఒక మహిళగా ఎంతో గర్వపడ్డానని, ఆమెను వ్యక్తిగతంగా గౌరవిస్తానని చెప్పారు. చెప్పుడు మాటలు విని ఆరోపణలు చేయడం ఏమిటని, తప్పుదారి పట్టిస్తున్నారని ఆమె గ్రహించాలన్నారు. జగన్ గతంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై ఇద్దరు, ముగ్గురు భార్యలు ఉన్నారని వ్యక్తిగత విమర్శలకు దిగారని గుర్తు చేశారు. అలాంటి సంస్కృతి తమ నాయకుడికి, తెలుగుదేశం పార్టీకి లేదన్నారు. ఆ రోజే షర్మిల తన అన్న జగన్‌ను చొక్కా పట్టుకొని నిలదీయాల్సిందన్నారు.

తెదేపా 10 అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం

- తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా దేవినేని అవినాశ్
- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా పోతుల సునీత

ఈనాడు-అమరావతి: తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా దేవినేని అవినాశ్, తెలుగు మహిళ అధ్యక్షురాలిగా పోతుల సునీత నియమితులయ్యారు. వీరి పేర్లను తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఖరారు చేశారని బుధవారం ఒక ప్రకటనలో పార్టీ వర్గాలు వెల్లడించాయి. మొత్తం 10 అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు.

విభాగం	పేరు (జిల్లా)
తెలుగు యువత	దేవినేని అవినాశ్ (కృష్ణా)
తెలుగు మహిళ	పోతుల సునీత (ప్రకాశం)
తెలుగు రైతు	కంభం విజయ రామిరెడ్డి (నెల్లూరు)
బీసీ సెల్	బోనబోయిన శ్రీనివాస యాదవ్ (గుంటూరు)
ఎస్సీ "	ఎంఎస్ రాజు (అనంతపురం)
ఎస్టీ "	ఎంవీవీ ప్రసాద్ (విశాఖపట్నం)
మైనార్టీ "	ఇంతియాజ్ అహ్మద్ (కర్నూలు)
క్రిస్టియన్ "	మద్దిరాల జోసెఫ్ ఇమ్మాన్యుయేల్ (గుంటూరు)
టీఎన్‌టీయూసీ	బి.నరేశ్‌కుమార్‌రెడ్డి (చిత్తూరు)
అంగన్‌వాడీ యూనియన్	భీమినేని వందనాదేవి (గుంటూరు)

1 నుంచి భాజపా బస్సు యాత్ర

కన్నా లక్ష్మీనారాయణ వెల్లడి



చిన్నచౌకు (కడప), న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడే ప్రధాన అడ్డంకి అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. బుధవారం కడపలో ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1న శ్రీకాకుళం నుంచి బస్సుయాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. కడపలో ఉక్కు కర్మాగారం కోసం కేంద్రం సానుకూలంగా ఉన్నప్పటికీ చంద్రబాబు సరైన సమాచారం ఇవ్వకుండా హడావిడిగా శంకుస్థాపన చేసి వదిలేశారని చెప్పారు. ముఖ్యమంత్రికి రాయలసీమపై చిత్తశుద్ధి ఉంటే అక్కడే హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. కేంద్రం చేసిన పనులన్నింటినీ తానే చేశానంటూ ముఖ్యమంత్రి ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ నెల 18న కడపకు భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రానున్నట్లు తెలిపారు. కందుల ఎస్టేట్‌లో సీమలోని శక్తి కేంద్రాల సభ్యులతో అమిత్‌షా ముఖాముఖి నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు సత్యకుమార్, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌నాయుడుతో పాటు పలువురు ఉన్నారు.

భాజపా ఎన్నికల ప్రణాళిక కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర భాజపా ఎన్నికల ప్రణాళిక కమిటీ ఛైర్మన్‌గా కేంద్ర మాజీ మంత్రి డి.పురంధేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఓ ప్రకటన జారీచేశారు. కమిటీకి కన్వీనర్‌గా మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, సభ్యులుగా పి.విజయబాబు, ఎమ్మెల్సీ మాధవ్, దాసరి శ్రీనివాసులు, షేక్ మస్తాన్, పి.సత్యనారాయణ, కె.కపిలేశ్వరయ్య, పి.సన్యాసిరాజు మురళి, సుధీష్ రాంబొట్ల, ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం వ్యవహరిస్తారని ఆ ప్రకటనలో వివరించారు.

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం: అంబటి రాంబాబు

కృష్ణలంక (విజయవాడ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలే వైకాపా లక్ష్యమని ఆ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. బుధవారం విజయవాడలో మాట్లాడుతూ కేటీఆర్‌తో జగన్ కేవలం ఫెడరల్ ఫ్రంట్ గురించి మాత్రమే చర్చించారని చెప్పారు. దీని ఏర్పాటులో భాగంగా దేశవ్యాప్తంగా పలు పార్టీ నేతలతో చర్చలు జరిపిన విధంగానే జగన్‌ను తెరాస నేతలు కలిసినట్లుగా పేర్కొన్నారు. చంద్రబాబులా ఎవరికీ కొమ్ముకాయాల్సిన అవసరం, లాలూచీ పడాల్సిన అగత్యం తమ పార్టీకి లేదన్నారు.

ఆంధ్ర ద్రోహిగా జగన్ మారారు

- వైకాపా-తెరాస దోస్తీపై తెదేపా ఎంపీల ధ్వజం

ఈనాడు – దిల్లీ

జగన్, కేటీఆర్ భేటీతో వైకాపా ముసుగు తొలగిపోయిందని తెలుగుదేశం పార్టీ ఎంపీలు వ్యాఖ్యానించారు. తెదేపా లోక్‌సభ పక్ష నేత తోట నరసింహం, లోక్‌సభసభ్యులు పి.రవీంద్రబాబు, అవంతి శ్రీనివాస్, కేశినేని శ్రీనివాస్ (నాని), కొనకళ్ల నారాయణరావు, కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాజ్యసభసభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ బుధవారం దీనిపై ఓ ప్రకటన విడుదల చేశారు. కేసుల మాఫీకి జగన్, భారీ కుంభకోణాలు కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్... మోదీకి మోకరిల్లారని.. వారిద్దరూ మోదీ చేతిలో కీలుబొమ్మలని విమర్శించారు. కేసీఆర్, మోదీ ఇచ్చే మూటలకు కక్కుర్తిపడి జగన్ ఆంధ్ర ద్రోహిగా మారారని ఆరోపించారు. పోతిరెడ్డిపాడుపై విషం కక్కి... పోలవరం ముంపు మండలాల విలీనంపై నేటికీ విమర్శలు చేస్తున్న కేసీఆర్‌తో చేతులు ఎలా కలుపుతారని ప్రశ్నించారు. వైకాపా అగ్ర నాయకులకు తెలంగాణ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టులు కట్టబెట్టడం కేసీఆర్-జగన్ లాలూచీకి.. వైకాపా ఎంపీల రాజీనామాలు సాగదీసి ఉపఎన్నికలు రాకుండా చేయడం మోదీ-జగన్ కుమ్మక్కుకు నిదర్శనం కాదా తెలపాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకహోదాకు బహిరంగ ప్రకటన ఇచ్చిన కాంగ్రెస్‌ను కాదని జగన్... మోదీ-కేసీఆర్ పంచన చేరారన్నారు. కాంగ్రెస్ భాగస్వామ్యం లేకుండా 2019లో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు సాధ్యం కాదన్నారు. మోదీ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ నాటకం ఆడుతున్నారని.. అందుకే దేశంలోని ప్రధాన పార్టీలు మద్దతు ఇవ్వలేదని చెప్పారు. శాసనసభ ఎన్నికల్లో తెరాసకు మద్దతుగా నిలిచిన మైనారిటీలు, దళితులు, బీసీలు లోక్‌సభ ఎన్నికల్లో అండగా నిలవరని.. కేసీఆర్‌కు ఓటు వేస్తే మోదీకి వేసినట్లేనని వారికి తెలుసని వివరించారు. తెరాస-వైకాపా కుమ్మక్కుతో వారికి ఇప్పుడున్న ఎంపీ సీట్లు కూడా రావని.. రానున్న ఎన్నికల్లో తెదేపాకు 25సీట్లు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాబోయే ప్రధానమంత్రిని తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు నాయుడే నిర్ణయిస్తారని ప్రకటించారు.

కక్ష తీర్చుకోవాలన్న కుట్రతోనే కేసీఆర్ ఇలా చేస్తున్నారు: జేసీ దివాకర్‌రెడ్డి

వైకాపా, తెరాస గత ఏడాది కాలంగా కలిసే పనిచేస్తున్నాయని, వైకాపా అధ్యక్షుడు జగన్‌ను తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కలవడం కొత్త విషయమేమీ కాదని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఫెడరల్ ఫ్రంట్ లేదు.. పాడూ లేదు... ఆంధ్రప్రదేశ్ మీద కక్ష తీర్చుకోవాలన్న కుట్రతోనే తెలంగాణ సీఎం కేసీఆర్ ఇలా చేస్తున్నారు. ఇష్టారీతిన మాట్లాడుతూ అక్కసు తీర్చుకుంటున్నారు. తెలంగాణ నుంచి ఇక్కడకు వచ్చి రాష్ట్రంపై బురదజల్లాలని చూస్తున్నారు...' అని మండిపడ్డారు. ఉండవల్లికి వచ్చిన ఆయన తన సోదరుడు జేసీ ప్రభాకర్‌రెడ్డితో కలిసి బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తమ ఇద్దరు కుమారులు రాజకీయాల్లో ఉంటారని, వారికి వచ్చే ఎన్నికల్లో సీట్లు కేటాయించే అంశాన్ని ముఖ్యమంత్రి ముందు ప్రస్తావించలేదని పేర్కొన్నారు. షర్మిలపై జరుగుతున్న దుష్ప్రచారానికి తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'షర్మిల నాకు కూతురులాంటిది. ఆమె గురించి ఎన్నడూ తప్పుగా మాట్లాడలేదు. భవిష్యత్తులో మాట్లాడబోను కూడా. కులాంతర వివాహం చేసుకొని ఆమె ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. ఆమెనెలా విమర్శిస్తాను...' అని జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

పోలవరంను అడ్డుకుంటున్న కవిత

- వివరాలు వెల్లడించిన మంత్రి దేవినేని

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ఆపాలంటూ, పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతులు ఇవ్వకుండా స్టే ఇవ్వాలంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె.కవిత 2011లో సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారని ఏపీ జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బుధవారం వెల్లడించారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని, కేంద్ర జలసంఘాన్ని, కేంద్ర సాంఘిక న్యాయం, గిరిజన మంత్రిత్వశాఖలను కవిత ప్రతివాదులుగా చేర్చారని వివరించారు. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అనేక మంది కోర్టుల్లో కేసులు దాఖలు చేశారని, కవిత సైతం ఈ ప్రాజెక్టును అడ్డుకుంటున్న వైనాన్ని, ఆ వివరాలను అందించారు. రిట్ పిటిషన్ 459/2011గా ఈ కేసు వివరాలను తెలిపారు. 2017 జులై 10న ఆఖరుసారిగా ఇది లిస్టు అయిందని ఆ వివరాలు పేర్కొంటున్నాయి.

మోదీ నాటకంలో కేసీఆర్, జగన్‌లు పాత్రధారులు: బుద్ధా వెంకన్న

ఈనాడు, అమరావతి: ప్రధాని మోదీ ఆడుతున్న నాటకంలో జగన్, కేసీఆర్‌లు పాత్రధారులన్నది సుస్పష్టమైందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న చెప్పారు. బుధవారం విజయవాడలో విలేకర్లతో మాట్లాడుతూ వారు తమ ముసుగులు తొలగించి రానున్న ఎన్నికల్లో ఒక్కటిగా తెదేపాపై పోటీకి నిలబడాలని సవాల్ విసిరారు. ఎంతమంది కలిసి వచ్చినా తెదేపా విజయాన్ని ఆపలేరన్నారు. ఈ భేటీతో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సంకేతాలనిస్తున్నదీ జగన్ ప్రజలకు వివరించాలన్నారు.

నేను రాజకీయం చేసేందుకే ఆంధ్రప్రదేశ్‌కు వచ్చా

- తెలంగాణ మాజీ మంత్రి తలసాని

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఈ ప్రాంతానికి వచ్చి రాజకీయాలు మాట్లాడవద్దని ఆంధ్రప్రదేశ్‌లోని కొందరు తెదేపా శాసనసభ్యులు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సంస్కృతీ సంప్రదాయబద్ధంగా ఉభయగోదావరి జిల్లాల్లో వేడుకలు జరుగుతాయని, ఇక్కడి ఆతిథ్యం ఎంతో గొప్పగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో తెలంగాణ నుంచి ఎందుకు వచ్చానో, ఏం చేస్తున్నానో అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిఘా ఉంచడం చూస్తే నవ్వొస్తోందన్నారు. వారికి భయపడి మాత్రం నేను వెనుకాడనన్నారు. తాను ప్రస్తుతం వచ్చింది రాజకీయాలు చేయడానికేనని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇస్తానన్న బహుమతి సిద్ధం చేశామన్నారు. అది ఎలా ఉంటుందో, ఏ మేర ఉంటుందో అంతా గోప్యమన్నారు. ఏపీలోని ఎస్సీ, బీసీ, ఇతర సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేలా పూర్తి మద్దతు ఇస్తామన్నారు. అనంతరం జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లి కోడిపందేల్లో పాల్గొనడంతో పాటు పలు సామాజిక వర్గాలకు చెందిన వారితో సమీక్షలకు తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు.



కోడిపుంజుతో తలసాని శ్రీనివాస్‌యాదవ్

తలసానిని ఏపీలో అడుగుపెట్టనివ్వం

తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోనబోయిన

ప్రధాని మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌లకు తలసాని శ్రీనివాసయాదవ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్ విమర్శించారు. గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు రిజర్వేషన్ తొలగిస్తే నోరెత్తని తలసాని ఇక్కడకు వచ్చి కారుకూతలు కూస్తున్నారని ధ్వజమెత్తారు. అయిదు కోట్ల మంది ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తెలంగాణ దొరలకు జగన్ తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు.

షర్మిల ఫిర్యాదుపై యూట్యూబ్‌కు పోలీసు తాఖీదులు

ఈనాడు, హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యంగా వ్యాఖ్యలు, చిత్రాలు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ వై.ఎస్.షర్మిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ అధికారులు 'యూట్యూబ్' యాజమాన్యానికి బుధవారం తాఖీదులు ఇచ్చారు. షర్మిల ప్రతిష్ఠను దెబ్బతీస్తూ కొన్ని రోజులుగా యూట్యూబ్‌లో వీడియోలు పెడుతున్నారని, వాటిని తక్షణం తొలగించడంతో పాటు ఎవరు పోస్ట్ చేశారో చెప్పాలంటూ తాఖీదుల్లో పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశామని సైబర్ క్రైమ్ అదనపు డీసీపీ కె.సి.ఎస్.రఘువీర్ తెలిపారు. వీలైనంత వేగంగా నిందితులను అరెస్ట్ చేస్తామని, ఐదేళ్ల క్రితం కూడా షర్మిలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు ఉంచిన ముగ్గురిని అరెస్ట్ చేశామని గుర్తుచేశారు. షర్మిల తన ఫిర్యాదులో పది మందిపై అనుమానం ఉందంటూ పేర్కొన్నారని, వారి వివరాలను పరిశీలించి చట్టపరంగా చర్యలు చేపట్టనున్నామని డీసీపీ వివరించారు.

లండన్ పర్యటనకు జగన్

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి లండన్ పర్యటనకు వెళ్లనున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుతున్న తన కుమార్తెను చూసేందుకు ఆయన అక్కడికి వెళ్లనున్నారు. గురువారం హైదరాబాద్ నుంచి నేరుగా లండన్ వెళ్తారు. ఐదు రోజుల పాటు అక్కడే ఉండి ఈ నెల 22న తిరుగు ప్రయాణమవుతారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రానికి మూడు ర్యాంకులు

మంత్రి నారాయణ

నెల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రానికి 3, 4, 5 ర్యాంకులు వచ్చాయని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు గ్రామీణ మండలం చింతారెడ్డిపాళెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం పలువురు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 4500 మున్సిపాలిటీలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొనగా మొదటి పది స్థానాల్లో 300 మున్సిపాలిటీలు ఎంపికవ్వగా.. 31 మున్సిపాలిటీలు రాష్ట్రానికి చెందినవేనని పేర్కొన్నారు. వీటిని పరిశీలిస్తే 110 మున్సిపాలిటిల్లో పారిశుద్ధ్య చర్యలు ఏవిధంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు.

వచ్చే ఎన్నికల్లో తెదేపాకు 175 స్థానాలు

వచ్చే ఎన్నికల్లో తెదేపాకు 175 స్థానాలు రావడం ఖాయమని మంత్రి నారాయణ తెలిపారు. ప్రతిపక్ష నేత జగన్, తెలంగాణ సీఎం కేసీఆర్‌లు ప్రధాన మంత్రి మోదీకి మద్దతుగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు కల్గిస్తున్న కేంద్రంలోని భాజపాకు ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి మద్దతు ఇవ్వడాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు.

చితిలోనూ తోడైంది

- భర్త మరణం తెలిసి హఠాన్మరణం పాలైన భార్య
- రాజమహేంద్రవరంలో వృద్ధదంపతుల అనుబంధం


మరణించిన వృద్ధ దంపతులు

హుకుంపేట(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: శరీరాలు వేరైనా ఆత్మ ఒక్కటే అన్న రీతిన ఆ దంపతులు జీవనం సాగించారు. కష్టసుఖాల్లో తోడూనీడై సాగారు. సంసారాన్ని అనుబంధాల సాగరంగా మార్చుకున్నారు. ఈ జంట సఖ్యతపై కన్నుకుట్టిన కాలం మలిసంధ్య దశలో భర్తను కాటేసింది. పెనిమిటి మరణం తెలిసి.. ఆత్మానుబంధం తమదంటూ ఆ భార్యా తనువు చాలించింది. భర్తకు చితిలోనూ తోడై నిలిచింది. పలువురిని కంటతడిపెట్టించిన ఈ ఘటన రాజమహేంద్రవరంలో చోటు చేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని హుకుంపేట గ్రామానికి చెందిన మట్టా గణిరాజు(77) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. భర్త చనిపోయాడన్న సమాచారం తెలిసిన వెంటనే భార్య మట్టా సత్యవతి(70) హఠాన్మరణం చెందారు. వీరికి ఏడుగురు సంతానం. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి చనిపోవడంతో వీరంతా దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఈ సంఘటన స్థానికులందరినీ కంటతడి పెట్టించింది.

ఆ ఊళ్లో మానవత్వాన్ని వెలి వేశారు!

- తల్లి శవాన్ని సైకిల్‌పై శ్మశానానికి తరలించిన బాలుడు


సైకిల్‌పై తల్లి మృతదేహాన్ని తీసుకెళ్తున్న బాలుడు

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: కులాంతర వివాహం చేసుకోవటమే ఆమె పరంగా జరిగిన నేరం. . అదే ఏకైక కారణం.. బంధువులు, గ్రామస్థులంతా వెలి వేశారు. ఆమె కన్నుమూసినా వారి పాషాణ హృదయాలు కరగలేదు. తల్లి మృతదేహాన్ని తరలించేందుకు గ్రామస్థులెవరూ ముందుకు రాకపోవడంతో 16 ఏళ్ల కొడుకే సైకిల్‌పై శ్మశానానికి తీసుకెళ్లాడు. మానవత్వానికి మచ్చ తెచ్చే ఈ దారుణం ఒడిశాలోని ఝార్సుగుడ జిల్లాలో చోటుచేసుకుంది. లఖన్‌పూర్ సమితి కర్వాబహ గ్రామానికి చెందిన జానకి అనే వితంతువు బుధవారం ఉదయం చెరువుకు వెళ్లి బిందెతో నీరు తీసుకుని ఇంటికి వచ్చాక అలసటకు గురై అరుగుపైనే కన్నుమూసింది. ఆమెకు 16 ఏళ్ల కొడుకు మాత్రమే ఉన్నాడు. తల్లి చనిపోయిన విషయం ఆ బాలుడు గ్రామంలోని బంధువులకు తెలిపాడు. కులాంతర వివాహం చేసుకున్న ఆమెను గ్రామం వెలివేసిందని, అందుకే తాము రాలేమని వారు ఖరాఖండీగా చెప్పారు. దీంతో దిక్కు తోచని పరిస్థితిలో ఆ బాలుడు సైకిల్‌కు కొయ్యదుంగలు కట్టి, దానిపై తల్లి మృతదేహాన్ని పెట్టుకున్నాడు. గ్రామానికి కిలోమీటరు దూరాన అడవికి సమీపంలోని శ్మశానానికి తరలించాడు. తానే గొయ్యి తవ్వి మృతదేహాన్ని పాతిపెట్టాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మహిళా కానిస్టేబుల్ బలవన్మరణం

- ప్రేమించి పెళ్లాడిన సహచరుడే కారణమా?
- మృతురాలు సరిహద్దు పోలీస్ దళం ఉద్యోగిని


కరణం కుమారి

ఆనందపురం (విశాఖపట్నం), న్యూస్‌టుడే: దేశ రక్షణ రంగంలో కొలువు సాధించిన యువతి ఆత్మహత్యకు పాల్పడడం చర్చనీయాంశమైంది. ప్రేమించి పెళ్లాడిన సహచరుడే ఇందుకు కారణమని అనుమానిస్తున్నారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. విశాఖ నగర పరిధి 56బీఎన్ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ దళంలో ఎం.రాజేంద్ర(27), కరణం కుమారి(22)లు 2017 నుంచి కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. వీరిలో రాజేంద్రది తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా, పూడూర్ మండలం, వెంకాపల్లి. కుమారిది విశాఖ జిల్లా మునగపాక మండలం. ఐదు నెలలుగా ఆనందపురంలోని ఓ అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. ఉద్యోగ శిక్షణ శిబిరంలో ఉండగానే వీరు ప్రేమలో పడ్డారు. గత ఏడాది అక్టోబరు 15న పెద్దలకు చెప్పకుండా సింహాచలం గుడిలో పెళ్లి చేసుకున్నారు. రాజేంద్ర ఇటీవల వేరే మహిళను వివాహం చేసుకున్నాడని తెలియడంతో రెండు నెలలుగా ఇద్దరి మధ్య తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కుమారి బుధవారం ఇంట్లో ఫ్యానుకు ఉరిపోసుకుని మృతి చెందింది.

వైద్య పరీక్షల కోసం అమెరికాకు జైట్లీ

దిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వైద్య పరీక్షల కోసం గత ఆదివారం రాత్రి అమెరికా వెళ్లారు. వారాంతంలో ఆయన తిరిగి స్వదేశానికి చేరుకుంటారని తెలుస్తోంది. దిల్లీలోని ఎయిమ్స్‌లో గత ఏడాది జైట్లీకి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. ఆ తర్వాత అక్కడే పలుమార్లు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇప్పుడు మాత్రం వైద్య పరీక్షల కోసం అనూహ్యంగా అమెరికా వెళ్లారు. జైట్లీ క్యాన్సర్ బారినపడ్డారని, చికిత్స కోసమే అమెరికాలోని న్యూయార్క్ వెళ్లారని వార్తలొస్తుండటం గమనార్హం.

త్వరగా కోలుకోవాలంటూ రాహుల్ ట్వీట్

జైట్లీ అమెరికా వెళ్లడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం ట్విటర్‌లో స్పందించారు. జైట్లీ ఆరోగ్యం బాగాలేదని తెలిసి తాను కలత చెందానన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కష్టకాలంలో జైట్లీకి, ఆయన కుటుంబానికి 100 శాతం అండగా ఉంటామని పేర్కొన్నారు.

వికసిస్తున్న బోసి నవ్వులు



- రాష్ట్రంలో గణనీయంగా తగ్గుతున్న శిశుమరణాలు
- బాలింత మరణాలదీ అదే బాట
- సత్ఫలితాలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ చర్యలు
- మరిన్ని జాగ్రత్తలతో పరిస్థితి ఇంకా మెరుగవుతుందంటున్న 'లైఫ్‌లైన్'

మాతా..శిశు మరణాలు తగ్గించేందుకు వైద్య ఆరోగ్య శాఖ చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగేలా చేయడం, శిశువులకు సకాలంలో టీకాలు వేయించడం, గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందేలా చేయడంలో శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలవల్ల ప్రయోజనాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో మాతా శిశుమరణాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. తాజా గణాంకాలు ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. 2017 ఏప్రిల్ నుంచి డిసెంబరు 15 నాటికి 6,822 మంది శిశువులు మరణించగా ఈ ఏడాది ఆ సంఖ్య 5,541కి తగ్గింది. అలాగే 2017 ఏప్రిల్ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు 513 మంది బాలింతలు మరణించగా ఈ ఏడాది 347 మంది ప్రాణాలు విడిచారు.

తగ్గిన జనన - మరణాలు

2017 ఏప్రిల్ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు రాష్ట్రంలో 5,35,656 మంది శిశువులు జన్మించారు. 2018లో ఇదే సమయానికి 5,27,200 శిశువులు జన్మించారు. కిందటేడాదితో పోలిస్తే 8,458 జననాలు తగ్గాయి. అనంతపురం జిల్లాలో కిందటేడాదితో పోల్చినప్పుడు 8,338 జననాలు పెరిగాయి. కిందటి సంవత్సరంలో 6,822 మరణించారు. ఈ ఏడాది 5,541 మరణాలు సంభవించాయి. ఈ మరణాల్లో 91శాతం మరణాలు ముందస్తు చర్యలతో తగ్గించేందుకు అవకాశం ఉందని విశాఖ కేజీహెచ్‌లోని 'లైఫ్ లైన్'(మరణాల కారణాలు విశ్లేషించే కేంద్రం)విశ్లేషించింది. శిశువుల మరణాలు తగ్గించడంలో ముఖ్యంగా ఆక్సిజన్ సౌకర్యాన్ని ఆస్పత్రుల్లో ఉండాల్సిన అవసరాన్ని లైఫ్‌లైన్ గుర్తించింది.

ఇంటింటిని పలకరిస్తూ

శిశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందేలా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పుట్టిన రోజు నుంచి ఏడాది, ఏడాది నుంచి ఐదు సంవత్సరాలలోపు శిశువులు, పిల్లలకు నిర్దేశిత పట్టికను అనుసరించి టీకాలు వేయించాలి. 2017 ఏప్రిల్ నుంచి డిసెంబరు 15 వరకు 88.48శాతం ఏడాదిలోపు శిశువులకు టీకాలు వేయించారు. 2018లో డిసెంబరు 15వ తేదీ వరకు ఇది 101.22శాతం నమోదైంది. ఇదే క్రమంలో 2017లో ఏడాది నుంచి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు 80.17శాతం టీకాలు వేయించగా...2018 నాటికి ఇది 104.31శాతం నమోదైనట్లు వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. దీనికోసం ప్రత్యేకంగా గతనెలలో 'పలకరింపు' కార్యక్రమం ద్వారా ఇంటింటికి తిరిగి పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించారు.

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనే ఎక్కువ

2017 ఏప్రిల్ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు 513 మంది బాలింతలు మరణించారు. ఈ ఏడాది ఇదే కాలానికి 347 మంది ప్రాణాలు విడిచారు. ఇందులోనూ 69శాతం మరణాలు తగ్గించేందుకు వీలుందని 'లైఫ్ లైన్' విశ్లేషించింది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో మరణాల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ 3 జిల్లాల్లో గిరిజన ప్రాంతాల్లో జరిగిన మరణాల శాతం 35శాతం వరకు నమోదైంది. ఈ మరణాలు తగ్గించేందుకు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని లైఫ్‌లైన్ వెల్లడించింది.

100 శాతానికి చేరువలో ఆస్పత్రుల్లోనే ప్రసవాలు

వైద్య ఆరోగ్య శాఖ ప్రయత్నాలవల్ల 99.50శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. నూటికి నూరుశాతం ప్రసవాలు ఆస్పత్రుల్లో జరిగేందుకు వీలుగా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో పుట్టే శిశువులకు 'బేబి కిట్'ను ప్రభుత్వం ఉచితంగా అందచేస్తోంది. అలాగే..తల్లీబిడ్డను వారి నివాస స్థలానికి వాహనం (తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్) ద్వారా ఉచితంగా చేరవేస్తోంది. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న 'తల్లీ సురక్ష' పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగే అవకాశం వస్తున్నందున మాతా..శిశు మరణాల సంఖ్య ఇంకా బాగా తగ్గుతుందని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య పేర్కొంటున్నారు.

రక్తహీనతను అధిగమిస్తూ

గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుని, తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు వీలుగా క్షేత్రస్థాయి ఎ.ఎన్.ఎం.లు, ఇతర సిబ్బందిని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఇది 86.62శాతంగా నమోదైంది. దీనిని ఇంకా మెరుగుపరిచే చర్యలు క్షేత్రస్థాయిలో కొనసాగుతున్నాయి. దీనివల్ల గర్భిణుల్లో ప్రధాన సమస్యగా ఉండే రక్తహీనత నుంచి బయటపడుతున్నారు. 2017 ఏప్రిల్ నుంచి మార్చి డిసెంబరు వరకు 4.37శాతం రక్తహీనత నమోదైంది. 2018లో 1.27శాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. నెల్లూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా, కడప జిల్లాల్లో తగిన పురోగతి కనిపించింది.

- ఈనాడు, అమరావతి

పండుగ పూట విషాదం

- రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం
- సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో ఘటన


వెంకట నాగమురళీ కృష్ణ ★ కవిత ★ ధనూష


టైరు పేలడంతో ప్రమాదానికి గురైన కారు

కోదాడ రూరల్, న్యూస్‌టుడే: అతివేగం ముగ్గురి ప్రాణాలు బలిగొంది. ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, తల్లి, కుమార్తె దుర్మరణం చెందగా, పదేళ్ల బాలుడు గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ చర్లపల్లి సమీపంలోని ఓ కాలనీలో నివాసముండే రావి వెంకటమురళీకృష్ణ(48) భార్య కవిత(38), కుమార్తె ధనూష(16), కుమారుడు యువనీతకృష్ణతో కలిసి సంక్రాంతి పండుగ కోసం కవిత స్వగ్రామమైన కృష్ణా జిల్లా నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లికి వెళ్లారు. బుధవారం ఉదయం సొంత డస్టర్ కారులో మురళీకృష్ణ డ్రైవింగ్ చేస్తూ హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. సూర్యాపేట జిల్లా కోదాడ శివారులోని కొమరబండ వద్ద జాతీయ రహదారి బైపాస్ దాటుతుండగా మలుపులో ఉన్న డివైడర్‌ను కారు కుడివైపు ఉన్న టైరు ఢీకొట్టింది. టైరు పేలి డివైడర్ మీదుగా 50 మీటర్లు ప్రయాణించి కుడివైపు రహదారిలో హైదరాబాద్ నుంచి అరకు లోయకు వెళ్తున్న ఇన్నోవా వాహనంపై, అదే వేగంతో వెనుక ఉన్న హోండాసిటీ కారుపై పడి ఫైబాగాన్ని చీల్చుకుంటూ రహదారి పక్కన ఉన్న కల్వర్టు గోడను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న కవిత, ధనూష కాలువలోకి ఎగిరిపడ్డారు. వారి శరీరభాగాలు చిందరవందరగా పడ్డాయి. మురళీకృష్ణ సీటు బెల్టు ధరించి ఉండటంతో కారులోనే ప్రాణాలు వదిలారు. ఆయన కుమారుడు యువనీతకృష్ణ చేయి విరిగింది. గాయాలపాలైన బాలుడిని కోదాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఇన్నోవా, హోండా సిటీ కార్లలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో అయిదుగురికి గాయాలయ్యాయి. వీరంతా మెదక్ జిల్లా రామాయంపేట, హైదరాబాద్‌కు చెందిన లోటస్ ల్యాండ్ మార్క్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మురళీకృష్ణ హబ్సిగూడలోని ఓ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, కవిత బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఉన్నత ఉద్యోగం చేస్తున్నట్లు వారి బంధువులు తెలిపారు.

నర్మదాలో పడవ బోల్తా ఐదుగురు మృతి

నందుర్‌బార్ (మహారాష్ట్ర): మకర సంక్రాంతి సందర్భంగా నర్మదా నదికి పూజలు చేసేందుకని గిరిజనులు పడవలో వెళ్తుండగా ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పడవ నట్టేట బోల్తా పడింది! ఈ దుర్ఘటనలో నలుగురు చిన్నారులతో పాటు ఓ మహిళ ప్రాణాలు కోల్పోయారు. 39 మంది మాత్రం ప్రాణాలు దక్కించుకున్నారు. నందుర్‌బార్ జిల్లాలోని భూషా, ధాడ్‌గావ్ గ్రామాల గిరిజనులు ప్రతి మకర సంక్రాంతి నాడు నర్మదా నదికి వెళ్లి పూజలు చేస్తుంటారు. ఇలా మంగళవారం పండగ రోజు పూజలు చేసేందుకని సుమారు 60 మంది పడవలో బయల్దేరారు. అయితే కొద్దిసేపటికే ఉన్నట్టుండి అది బోల్తా పడింది. ఐదేళ్లలోపు వయసున్న నలుగురు చిన్నారులతో పాటు ఓ మహిళ (55) నర్మదా నదిలో మునిగి చనిపోయారు.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ.. ఐదుగురి మృతి
- ఆగ్రహంతో 15 లారీలకు నిప్పు పెట్టిన ప్రజలు


ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో కాలిపోతున్న లారీలు

మహదేవ్‌పూర్, న్యూస్‌టుడే: మహారాష్ట్రలో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొని ఐదుగురు మృతి చెందారు. తెలంగాణకు సరిహద్దున ఉన్న గడ్చిరోలి జిల్లాలోని గురుపల్లి గ్రామ సమీపంలో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. ఏటాపల్లి-ఆళ్లపల్లి రహదారి మార్గంలో ఉదయం 11 గంటల సమయంలో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొంది. ఘటనలో ఐదుగురు బస్సు ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందారు. పది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగ్రాతులను చంద్రపూర్, ఆళ్లపల్లి ఆసుపత్రులకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు స్థానికులతో కలిసి రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఆగ్రహంతో అటుగా వెళ్తున్న 15 లారీలకు నిప్పు పెట్టారు.

పర్యాటక ఉత్సవాల కోసం ప్రత్యేక ప్రణాళిక

మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి


ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఉత్సవాల కోసం ప్రత్యేక క్యాలెండర్ రూపొందించామని.. పర్యాటకుల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోందని మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఈ నెల 18 నుంచి అరకులో నిర్వహించనున్న బెలూన్ ఫెస్టివల్‌పై బుధవారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడారు. బెలూన్లలో ఎగిరేందుకు ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో 4 వేల మంది పేర్లను నమోదు చేసుకున్నట్లు చెప్పారు. గతేడాది వాతావరణం అనుకూలంగా లేక ఫెస్టివ్ సరిగా జరగలేదన్నారు. రాష్ట్రంలో ప్రతినెలా ఒక సాంస్కృతిక కార్యక్రమం ఉండేలా ప్రణాళిక రూపొందించామని, దీనికి అనుగుణంగా పర్యాటకులు టూర్ ప్యాకేజీలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. పర్యాటకశాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. నాలుగేళ్ల కిందట రాష్ట్రాన్ని 9 కోట్ల మంది పర్యాటకులు సందర్శిస్తే ఇప్పుడు 19 కోట్ల మంది సందర్శిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ఆర్డీ రాధాకృష్ణమూర్తి, జిల్లా పర్యాటక అధికారి పూర్ణిమాదేవి, నిర్వాహక మేనేజర్ సమిత్ పాల్గొన్నారు.

సీతంపేటలో ముగిసిన గగన క్రీడలు

సీతంపేట, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస ఉద్యానవనంలో ఏర్పాటు చేసి గగన క్రీడల పండగ (ఏరో స్పోర్ట్స్ ఫెస్ట్)-2019 బుధవారం ఘనంగా ముగిసింది. పలువురు పర్యాటకులు గగన విహారం చేసి మధురానుభూతి పొందారు. నాలుగు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో పారా మోటరింగ్‌లో 310 మంది, పారా సైలింగ్‌లో 220 మంది, హాట్ ఎయిర్ బెలూన్‌లో 70 మంది పర్యాటకులు గగన విహారం చేశారని ఐటీడీఏ పీవో ఎల్.శివ శంకర్ తెలిపారు. బుధవారం రాత్రి బాణసంచా కాల్చి ఈ కార్యక్రమాన్ని ముగించినట్లు వివరించారు.

చిన్న, మధ్య నీటివనరుల వృద్ధికి జైకా!

- రూ.2000 కోట్లతో ప్రాజెక్టు
- జైకా ఆర్థిక రుణ సాయం రూ.1683 కోట్లు



ఈనాడు-అమరావతి: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను ఆధునికీకరించి వ్యవసాయోత్పత్తులు పెంచేందుకు రూ.2000 కోట్లతో జలవనరులశాఖ ఒక ప్రాజెక్టును చేపట్టింది. దీనికి జపాన్ ఆర్థిక సంస్థ సాయం చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత వాటా నిధులు భరిస్తూ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది.

ప్రాజెక్టు స్వరూపం

మొత్తం అంచనా వ్యయం: 2000 కోట్లు

జైకా సాయం: 1683.30 కోట్లు (84.16శాతం)

రాష్ట్రం వాటా: 316.70 కోట్లు (15.84శాతం)

ప్రాజెక్టు కాలపరిమితి: 7 సంవత్సరాలు

ఏం పనులు చేస్తారంటే

ఈ ప్రాజెక్టు కింద నారాయణపురం భారీ నీటిపారుదల ప్రాజెక్టును ఆధునికీకరిస్తారు. మరో 19 మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులతో పాటు 445 చిన్ననీటి చెరువులను ఆధునికీకరిస్తూ జీవనాధార కార్యక్రమాలు అమలు చేస్తారు. భాగస్వామ్య నీటిపారుదల వ్యవస్థను అభివృద్ధి చేస్తారు. వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తారు. మత్స్య, పశుసంవర్ధక విభాగాల్లో రైతుల జీవనాధారానికి అవకాశం కల్పించే కార్యక్రమాలు అమలు చేస్తారు.

సాగునీటి వృద్ధికి...

- నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణ కోసం మొత్తం రూ.138.96 కోట్లు ఖర్చు చేసి 15001 హెక్టార్లకు ప్రయోజనం కలిగించడం.
- రాష్ట్రంలోని 19 మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టుల ఆధునికీకరణకు రూ.569.71 కోట్లు ఖర్చు చేస్తారు. దీంతో 83,865 హెక్టార్లకు ప్రయోజనం చేకూరుతుంది. ఒట్టిగడ్డ రిజర్వాయర్, పెద్ద నక్కలం ఆనకట్ట, పెద్దగడ్డ జలాశయం, వెంగళరాయ సాగరం, ఆంధ్ర జలాశయం, రైవాడ జలాశయం, మద్దిగడ్డ జలాశయం, తొర్రిగడ్డ పంపింగ్ స్కీం, తమ్మిలేరు జలాశయం, మున్నేరు ఆనకట్ట, మోపాడు జలాశయం, వి.ఆర్.కోట ఆనకట్ట, నెల్లూరు జిల్లాలోని డీఆర్‌డీఎం ఛానల్, బుగ్గవంక జలాశయం, శివభాష్యం సాగర్, ఎగువ పెన్నార్ జలాశయం, పెన్నార్ కుముదవతి ఆనకట్ట, అర్నియార్ జలాశయం, కృష్ణాపురం జలాశయం ప్రాజెక్టులను ఆధునికీకరిస్తారు.
- రూ.253.72 కోట్ల అంచనా వ్యయంతో 445 చెరువులను నవీకరిస్తారు. దీంతో 57044 హెక్టార్లకు మేలు కలుగుతుంది.

ఏ అంశాలకు ఎంత వ్యయం

అంశం	ఖర్చు (రూ.కోట్లలో)
భారీ, మధ్యతరహా నీటిపారుదల పథకాల ఆధునికీకరణ	708.67
445 చిన్ననీటి చెరువుల ఆధునికీకరణ	253.72
భాగస్వామ్య నీటిపారుదల కార్యక్రమాలు	89.43
రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం	125.69
జీవనాధార కార్యక్రమాలు	69.06

భాగస్వామ్య నీటిపారుదల వ్యవస్థ

- ఈ ప్రాజెక్టు కింద మొత్తం 585 నీటి వినియోగదారుల సంఘాలను గుర్తించారు. నీటిని సమంగా పంచడం ద్వారా గరిష్ఠ ప్రయోజనం సాధించడానికి నీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలను బలోపేతం చేస్తారు. ఇందుకు ఎన్‌జీవోల సాయం తీసుకుంటారు.
- భారీ నీటిపారుదల, మధ్య తరహా ప్రాజెక్టు ప్రాంతంలో ఒక్కో వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేయనున్నారు.

రైల్లో చిలక పిల్లల అక్రమ రవాణా

- విశాఖలో అడ్డుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు
- అటవీశాఖ అధికారులకు అప్పగింత


ఆర్పీఎఫ్ స్టేషన్‌లో రామచిలకల పిల్లలున్న ట్రేలు

రైల్వేస్టేషన్ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: సరిగా ఈకలు కూడా రాని 800 చిలక పిల్లలను రైలులో అక్రమంగా తరలిస్తుండగా రైల్వే రక్షక దళ పోలీసులు పట్టుకున్నారు. ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 13న భువనేశ్వర్-తిరుపతి(22871) ఎక్స్‌ప్రెస్ సాధారణ బోగీల్లో కూరగాయల రవాణాకు ఉపయోగించే 14 ట్రేలలో చిలక పిల్లలను తరలించటాన్ని కొందరు ప్రయాణికులు గమనించారు. వాటి అరుపులతో విసుగు చెంది ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. ఆ రైలు విశాఖ చేరుకోగానే సి.ఐ. రామన్, ఎస్.ఐ. సి.వి.రమణల బృందం చిలక పిల్లల్ని స్వాధీనం చేసుకుంది. నిందితుల కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో అటవీ శాఖాధికారులకు సమాచారమిచ్చారు. వారు ఆ చిలకలను స్వాధీనం చేసుకొని జంతు ప్రదర్శనశాలకు తరలించి, సంరక్షణ చర్యలు చేపట్టారు. చెట్లపై చిలుకలు పెట్టిన గుడ్లు సేకరించి, వాటిని పొదిగించాక ఇలా కొందరు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

పొరుగు నేలకు పసిడి రాశులు

AMARAVATHI GREENS ANDHRA PRADESH

- ప్రమాణాలతో విదేశాలకు పంపేందుకు సమాయత్తం
- ఎగుమతులపై ఉద్యానశాఖ దృష్టి
- మన బ్రాండ్ అమరావతి గ్రీన్స్
- నాణ్యమైన ఉత్పత్తి కోసం రైతులకు అవగాహన

పురుగుమందు అవశేషాలు లేని పంట ఉత్పత్తులను విదేశాలకు పంపడంపై ఉద్యానశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ దిశగా రైతులను చైతన్యపరచేందుకు కార్యాచరణ అమలుచేస్తోంది. ప్రపంచపటంపై ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తుల ప్రత్యేకత చాటేలా అమరావతి గ్రీన్స్ లోగోను రూపొందించింది. రాష్ట్రంనుంచి విదేశాలకు ఎగుమతయ్యే అన్ని రకాల ఉద్యాన ఉత్పత్తులను ఇదే బ్రాండ్‌తో పంపాలని భావిస్తోంది.

ఎగుమతులు.. ఎన్నో ప్రమాణాలు

వివిధ రకాల ఉత్పత్తుల ఎగుమతుల విషయంలో ఎన్నో ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. ఒక్కో దేశం నిబంధనలు ఒక్కోలా ఉంటాయి. సుమారు 160 నుంచి 180 రకాల పురుగు, తెగుళ్ల మందులకు సంబంధించిన పరీక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. మత్స్య ఉత్పత్తుల్లో నిషేధిత యాంటీబయోటిక్స్ అవశేషాలు బయటపడుతుండటంతో ఐరోపా, అమెరికానుంచి తిరస్కరణకు గురవుతున్నాయి. ఎగుమతుల సమయంలో వివిధ పరీక్షలు నిర్వహిస్తారు. వాటిలో ప్రధానంగా..

- ఎంఆర్ఎల్ (మాగ్జిమమ్ రెసిడ్యూ లెవల్): మన పంటలో పురుగుమందుల అవశేషాలు లేవని ధ్రువీకరించాలి. కొన్నింటిలో అవశేషాలు 0.001 నుంచి 0.004వరకే ఉండాలి. ఎక్కువ ఉంటే తిరస్కరిస్తారు.
- యూరో గ్యాప్ (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్): ఉత్తమ వ్యవసాయ విధానాలు పాటించాలి. కలుషిత వాతావరణం లేని పరిస్థితులు ఉండాలి.
- ఫైటోశానిటరీ సర్టిఫికెట్: ఉత్పత్తిలో పురుగుమందుల అవశేషాలు లేకున్నా.. పురుగులు, గుడ్లు వంటివి ఉండొచ్చు. ఇలాంటివి లేవని ధ్రువీకరించాలి.

పురుగుమందుల నుంచి బయటకు తెచ్చి

సాధారణంగా కూరగాయల సాగులో పురుగుమందుల వినియోగం ఎక్కువ. దశాబ్దాల నుంచి విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తుండటంతో వాటి అవశేషాలు భూమి, నీటిలోనూ మిగిలిపోయాయి. మనం వాడే సంకర విత్తనాలు కూడా పురుగుమందు చల్లితేనే పండుతాయనేలా తయారయ్యాయి. ఈ పరిస్థితులనుంచి రైతులను విముక్తులను చేసేలా ప్రత్యేక క్లస్టర్లను గుర్తించి ఉద్యానశాఖ సాగు చేయించనుంది.

పంటకోత అనంతర చర్యలూ కీలకం

పంట కోత అనంతర విధానాల్లో ప్రభుత్వ సహకారమూ కీలకమే. పురుగుమందుల అవశేషాలు పరీక్షించే కేంద్రాలు అందుబాటులో లేవు. దీనికి ఖర్చు కూడా ఒక్కో నమూనాకు రూ.ఐదు వేల నుంచి రూ.15 వేల వరకు అవుతోంది. ఈ ఖర్చును కనీసం రూ.500 తగ్గిస్తేనే రైతులకు వెసులుబాటు ఉంటుంది. ఎంపెడా అనుమతించిన ప్యాక్‌హౌస్‌లు నాలుగే ఉన్నాయి. వాటిని పెంచాల్సి ఉంది. పంట కోత తర్వాత ఉత్పత్తిని ప్యాక్‌హౌస్‌కు చేర్చే దాకా శీతలీకరణ అవసరం. ఇందుకనుగుణంగా వాహనాలు అందుబాటులోకి తేవాలి. కూరగాయల సాగుతోపాటు విదేశాలకు ఎగుమతికి సంబంధించి రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని ఉద్యానశాఖ డీడీ శరవణన్ తెలిపారు. రాయితీపై ప్యాక్‌హౌస్‌లు, వాహనాలు అందిస్తున్నామని అన్నారు.

రోజుమార్చి రోజు ఎగుమతులే లక్ష్యం

ఎగుమతుల ప్రమాణాల మేరకు పండించేలా రైతులకు శిక్షణ ఇప్పించే ఏర్పాటుచేస్తున్నాం. రోజుమార్చి రోజు ఎగుమతులు చేయాలనేది లక్ష్యం. అమరావతి గ్రీన్స్ లోగో పేరుతో వాటిని పంపిస్తాం. ఇప్పటికే చిత్తూరు, పశ్చిమగోదావరి జిల్లాలనుంచి కాకర, దొండ, అరటి, కంద తదితర ఉత్పత్తులు సింగపూర్, ఇతర దేశాలకు వెళ్తున్నాయి. వారితోనూ మాట్లాడి దీన్ని అనుసరించేలా చూస్తాం. గుంటూరులోని లాంలో పురుగుమందుల అవశేషాలు గుర్తించే కేంద్రం ఏర్పాటు చేయనున్నాం.

చిరంజీవిచౌదరి, కమిషనర్, ఉద్యానశాఖ


ఎగుమతుల కోసం సిద్ధం చేస్తున్న బెండ

రైతులేం చేయాలి?



పురుగుల నివారణకు వివిధ పద్ధతులు పాటించాలని విజయనగరం జిల్లా గరివిడి మండలం కొమురాం గ్రామ రైతు **శివకుమార్‌రాజు** తెలిపారు. 600 కిలోల బెండను ఇటీవల ఫ్రాంక్‌ఫర్ట్‌కు ఎగుమతి చేసిన ఆయన.. సాగు సమయంలో తీసుకున్న జాగ్రత్తలను వివరించారు.

చుట్టూ ఎర పంట..

- బెండకు రెండు వరసలు గోడమాదిరిగా మొక్కజొన్న వేశా. తర్వాత వరసలో బంతి మొక్కలు నాటా. బయటనుంచి వచ్చే పురుగుల్ని ఇవి ఆకర్షిస్తాయి.
- బయోలాజికల్ కంట్రోల్ విధానంలో తెగుళ్లు, బ్యాక్టీరియా నివారణకు ట్రైకోడెర్మా విరిడె, సూడోమోనాస్ వాడుతున్నాం. ఇవి కిలో రూ.100 మాత్రమే. ఎకరాకు రెండు కిలోలు సరిపోతాయి. విత్తనాన్ని వీటిలో నానబెట్టవచ్చు.
- పసుపు, నీలిరంగు అట్టలు వాడాలి. దోమలు ఆకర్షితమై వీటికి అతుక్కుపోతాయి. ఫెరమోన్ ట్రాప్స్ పెట్టాలి. రెక్కల పురుగుల్ని ఇవి ఆకర్షిస్తాయి.
- మూడువారాలకోసారి వేపనూనె పిచికారి చేయాలి. 3000 పీపీఎం ఉంటే లీటరుకు మూడు ఎంఎల్ కలిపి చల్లాలి.
- ఒకే మందును పదేపదే పిచికారి చేస్తే పురుగు నియంత్రణ శక్తి పెంచుకుంటుంది. అలా చేయకూడదు.
- ప్రతి దేశం అనుమతించదగిన మందులు కొన్ని ఉంటాయి. ఎంత కొట్టాలో కూడా వారే చూపిస్తారు. వాటిని తెలుసుకుని పిచికారి చేయొచ్చు.
- పురుగుమందు చల్లాక నిర్ణీత కాలం తర్వాతే కోత కోయాలి.

- ఈనాడు, అమరావతి

ఆపరేషన్ కమల విఫలం

- కర్ణాటక సర్కారుకు స్వతంత్రుల మద్దతు ఉపసంహరణ
- అయినా ముందడుగు వేయలేకపోయిన భాజపా

ఈనాడు డిజిటల్, బెంగళూరు: కర్ణాటకలో 'ఆపరేషన్ కమల' విఫలమైంది. తగిన సంఖ్యలో మద్దతుదారులు చేతికందక కుమారస్వామి సర్కారును కమలనాథులు కూలదోయలేకపోయారు. సంక్రాంతి నాటికి ఎలాగైనా మైత్రి సర్కారును కూల్చాలని భారతీయ జనతా పార్టీ (భాజపా) రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప నేతృత్వంలో ప్రయత్నాలు జోరుగా సాగాయి. వీరి ప్రయత్నానికి కొనసాగింపుగా సంకీర్ణ ప్రభుత్వంలోని ఇద్దరు స్వతంత్ర శాసనసభ్యులు తమ మద్దతును ఉపసంహరించుకున్నారు. ఉపసంహరణ పత్రాలను గవర్నర్‌కు అందజేశారు. భాజపా అంచనావేసిన స్థాయిలో కాంగ్రెస్, జనతాదళ్ అసమ్మతి ఎమ్మెల్యేలు తమ పంచన చేరకపోవడంతో 'ఆపరేషన్ కమల' ఫలితం దిశగా సాగలేకపోయింది. హరియాణాలోని గురుగాంలో తమ ఎమ్మెల్యేలతో సమావేశమైన యడ్యూరప్ప ఆపరేషన్ కమల తీరుతెన్నులను జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు వివరించారు.

'హస్తం' అడ్డుకుందిలా

భాజపా జాతీయ సమావేశం నిమిత్తం ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా యడ్యూరప్ప నేతృత్వంలో దిల్లీకి వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ సమావేశం అనంతరం వీరంతా పార్టీ జాతీయ అధ్యక్షుడితో పాటు మరి కొందరు నేతలతో చర్చించి గురుగాంలోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. భాజపాకు చెందిన ఎమ్మెల్యే అశ్వర్థనారాయణ నేతృత్వంలో ఆపరేషన్ కమల ముందుకు సాగింది. చించోళికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉమేశ్ జాదవ్‌తో ఆయన ముచ్చటిస్తున్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయటంతో కాంగ్రెస్ శిబిరంలో కలవరం మొదలైంది. దీనికి తోడు మంగళవారం రాణిబెన్నూరు, ముళబాగి నియోజకవర్గాల నుంచి గెలిచిన స్వతంత్ర ఎమ్మెల్యేలు ఆర్.శంకర్, హెచ్.నాగేశ్ సైతం సర్కారుకు మద్దతు ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బెంబేలెత్తిన ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి కె.సి.వేణుగోపాల్ బెంగళూరు చేరుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భీమానాయక్, గణేశ్, బసవరాజు, రమేశ్ జార్ఖిహొళి, ఉమేశ్ జాదవ్ తదితరుల సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉండడంతో వీరిని సంప్రదించే బాధ్యతను సీనియర్ మంత్రులు కె.జె.జార్జి, డి.కె.శివకుమార్, ప్రియాంక్ ఖర్గే, జమీర్ అహ్మద్‌కు అప్పగించారు. భాజపా వైపు ఎవ్వరూ వెళ్లాల్సిన అవసరంలేదని, మంత్రి పదవులు కావాలంటే మేం త్యాగం చేసి అప్పగిస్తామని వీరు ప్రకటించారు. అసమ్మతి శిబిరానికి నాయకత్వం వహిస్తున్న బెళగావి నాయకుడు రమేశ్ జార్ఖిహొళికి ఎంపీ టికెట్ హామీ ఇవ్వడంతో 'ఆపరేషన్ కమల'కు ఆయన దూరంగా జరిగారని సమాచారం. బుధవారం సాయంత్రానికల్లా మూడు రోజులుగా ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకున్న వారంతా స్పందించారు. 'మేమంతా కుటుంబసభ్యులతో కలిసి పండగలకు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాం' అని చెప్పడంతో కాంగ్రెస్ కాస్త ఊపిరి పీల్చుకుంది.

భారీ ఎత్తున 'జీఎమ్మార్' వస్త్రదానం

రాజాం, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం, జీఎమ్మార్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు తన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా రాజాంలో భారీగా వస్త్రదానం చేశారు. జీఎమ్మార్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 15న సంక్రాంతి పర్వదినం సందర్భంగా 14వేల మంది పేదలు, సాధువులకు వస్త్రదానం చేశారు. ఇందుకు భారీ ఏర్పాట్లు చేశారు. క్రమపద్ధతిలో కార్యక్రమం నిర్వహించి.., పేదలకు భోజన వసతి కల్పించారు. వస్త్రదాన స్వీకరణకు వచ్చినవారిలో మహిళలు, పురుషులను వేర్వేరు వరుసల్లో కూర్చోబెట్టి టోకెన్లు అందజేశారు. మహిళలకు చీర, దుప్పటి, టవల్, పురుషులకు పంచె, దుప్పటి, టవల్ ఉన్న ప్యాకెట్లును జీఎమ్మార్, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. 1200 మంది వలంటీర్లు, మరో 200 మంది ఉద్యోగులు కార్యక్రమం నిర్వహణలో సేవలు అందించారు. ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినాన స్వయంగా వస్త్రదానం చేయటం జీఎమ్మార్ ఆనవాయితీగా పెట్టుకున్నారు.



శ్రీకాకుళం జిల్లా రాజాంలో వస్త్ర దానానికి హాజరైన ప్రజలు (అంతరచిత్రంలో) వస్త్రదానం చేస్తున్న జీఎమ్మార్

అబ్బురపరిచిన లలిత్ ఆదిత్య అష్టావధానం



రవీంద్రభారతి, న్యూస్‌టుడే: తెలుగు భాష కూడొక్కటే కాదూ.. అంతర్జాతీయ ఖ్యాతినీ ఆర్జించిపెడుతుందని నిరూపిస్తున్నారు.. అమెరికావాసి యువ అవధాని గన్నవరం లలిత్ ఆదిత్య. దర్శనమ్ పత్రిక నిర్వహణలో బుధవారం రాత్రి రవీంద్రభారతిలో గన్నవరం లలిత్ ఆదిత్య 'సంస్కృతాంధ్ర ద్విగుణిత అష్టావధానం' రసవత్తరంగా నిర్వహించారు. ఎనిమిది మంది తెలుగు, ఎనిమిది మంది సంస్కృత పృచ్ఛకులను లలిత్ ఆదిత్య సమాధానపరుస్తూ ఆశ్చర్యచకితుల్ని చేశారు. 'అమెరికాలో పుట్టిన పెరిగిన లలిత్ ఆదిత్య తెలుగులోనే కాదూ.. సంస్కృతంలోనూ పాండిత్యాన్ని సాధించడం, అవధానాలూ చేయడం గొప్ప విషయమని, తెలుగు యువతకు ఆయన స్ఫూర్తి అని అతిథులు అభినందించారు.

భారతీయ నిపుణులకు స్వాగతం

- 2021 నుంచి వీసాలపై పరిమితి ఉండబోదని బ్రిటన్ వెల్లడి

దిల్లీ: భారత్ నుంచి తమ దేశానికి వచ్చే అత్యుత్తమ నిపుణుల సంఖ్యపై పరిమితి ఏదీ ఉండబోదని బ్రిటన్ స్పష్టం చేసింది. 2021 నుంచి అమల్లోకి రానున్న నూతన వలస విధానం అందుకు వీలు కల్పిస్తుందని వెల్లడించింది. దిల్లీలో బుధవారం భారతీయ అధికారులతో చర్చల అనంతరం బ్రిటన్ ఇమ్మిగ్రేషన్ మంత్రి కరోలిన్ నోక్స్ విలేకర్లతో మాట్లాడారు. తాము ఇతర అన్ని దేశాల నిపుణులకు ఇస్తున్న వీసాల సంఖ్యతో పోలిస్తే భారతీయ నిపుణులకు ఇస్తున్న వీసాలే ఎక్కువని నోక్స్ గుర్తుచేశారు. ఇరుదేశాల్లోని అకడమిక్ డిగ్రీలను పరస్పరం సమానమైనవిగా భావించి ఉన్నత విద్య, ఉద్యోగాలకు అనుమతించేలా భారత్-ఫ్రాన్స్ మధ్య ప్రస్తుతం ఒప్పందం ఉంది. అలాంటి ఒప్పందాన్ని మనదేశంతో కుదుర్చుకోవాలని బ్రిటన్ కోరుకుంటున్నట్లు సమాచారం.

సీబీఐ డైరెక్టర్ ఎంపికపై 24న భేటీ

దిల్లీ: సీబీఐ డైరెక్టర్ నియామకానికి సంబంధించి ఈ నెల 24న అత్యున్నతస్థాయి ఎంపిక సంఘం భేటీ కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన గల ఈ సంఘంలో ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయి, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే సభ్యులుగా ఉన్నారు. తొలుత ఈ నెల21న సమావేశం జరపాలని ప్రతిపాదించినప్పటికీ 24నగానీ, 25నగానీ నిర్వహించాలని ఖర్గే సూచించడంతో ఆ మేరకు తేదీని ఖరారు చేశారు. ప్రస్తుతం సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావు కొనసాగుతుండగా, పూర్తిస్థాయి డైరెక్టర్ ఎంపిక కోసం ఈ సమావేశం జరగనుంది.

మరోవైపు సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావు నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యంపై వచ్చే వారం విచారణ జరగనుంది.

ఎల్డీఎఫ్ సర్కారు తీరు సిగ్గుచేటు

- శబరిమల వివాదంపై యూడీఎఫ్‌ది రోజుకో మాట: ప్రధాని మోదీ

కొల్లాం(కేరళ): శబరిమల ఆలయ వివాదంలో కేరళలోని సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వ వ్యవహార శైలిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశంలో ఏ పార్టీగానీ, ఏ ప్రభుత్వంగానీ వ్యవహరించని రీతిలో అత్యంత సిగ్గుచేటుగా ప్రవర్తించడం చరిత్రలో నిలిచిపోతుందని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ పలురకాల వైఖరిని ప్రదర్శించిందంటూ దుయ్యబట్టారు. మతతత్వం, అవినీతి, కులతత్వం విషయంలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్ ఒకే నాణేనికి రెండు ముఖాలని ఆరోపించారు. మంగళవారం ప్రధాని మోదీ కేరళలో 13 కి.మీ.పొడవైన కొల్లాం బైపాస్‌ను ప్రారంభించిన సందర్భంగా భాజపా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కమ్యూనిస్టులు భారత చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికతను గౌరవించరనేది మనకు తెలిసిందేనని, ఈ స్థాయిలో ద్వేషిస్తారని ఎవరూ ఊహించలేదని వ్యాఖ్యానించారు. శబరిమలపై కాంగ్రెస్, యూడీఎఫ్ తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. వారు పార్లమెంటులో ఒక మాట, పథనంథిట్టలో మరో మాట చెబుతున్నారని, ఒకరోజు ఒకలా, మరుసటి రోజు మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ముమ్మారు తలాక్‌ను నిర్మూలించే దిశగా ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుంటే, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఓటుబ్యాంకు రాజకీయాలతో వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు.


కేరళ గవర్నర్ జస్టిస్ పి.సతాశివంతో కలిసి తిరువనంతపురంలోని పద్మనాభస్వామి ఆలయాన్ని మంగళవారం సందర్శిస్తున్న ప్రధాని మోదీ

ప్రధాని మోదీ మంగళవారం తిరువనంతపురంలోని ప్రఖ్యాత పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించారు. 20 నిమిషాలపాటు గుడిలో గడిపారు. అంతకుముందు ఆలయం వద్ద స్వదేశ్ దర్శన్ తదితర పర్యాటక సంబంధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని ప్రారంభించారు.

రూ.90 వేల కోట్ల లూటీని అడ్డుకున్నాం: ప్రధాని

బాలంగీర్(ఒడిశా): దొంగ పత్రాల ద్వారా రూ.90 వేల కోట్లను దోపిడీ చేసే యత్నాల్ని తమ ప్రభుత్వం అడ్డుకోవడంతో తనను పదవి నుంచి దించే కుట్ర చేశారని ప్రధాని మోదీ ఆరోపించారు. గత ప్రభుత్వాలు మధ్యవర్తుల ద్వారా ప్రజాధనాన్ని లూటీ చేసే ప్రక్రియకు తాము అంతం పలికామన్నారు. 6 కోట్లకుపైగా నకిలీ రేషన్ కార్డులు, ఎల్పీజీ కనెక్షన్లు, దొంగ పింఛన్లను బయటపెట్టామన్నారు. మంగళవారమిక్కడ రూ.1,550 కోట్ల విలువైన కేంద్ర ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం భాజపా సభలో మోదీ మాట్లాడారు.

'అక్షయపాత్ర, సులభ్'లకు గాంధీ శాంతి బహుమతి

ఈనాడు, దిల్లీ: కోట్లాది మందికి అన్నం పెడుతున్న అక్షయపాత్ర ఫౌండేషన్... మలమూత్ర ఎత్తివేతల పని నుంచి ఎంతోమందికి విముక్తి కల్పించిన సులభ్ ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా గాంధీ శాంతి బహుమతిని గెలుచుకున్నాయి. 2016కి గాను ఈ అవార్డును దక్కించుకున్నాయి. వీటితోపాటు కన్యాకుమారిలోని వివేకానంద కేంద్ర (2015); ఏకల్ అభియాన్ ట్రస్ట్ (2017); యోహి ససకావా (2018)లను ఈ పురస్కారాలు వరించాయి. నాలుగేళ్లకు సంబంధించిన గాంధీ శాంతి బహుమతుల విజేతలను కేంద్ర సాంస్కృతికశాఖ బుధవారమిక్కడ వెల్లడించింది. ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగొయి, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, లోక్‌సభలో ప్రతిపక్షనేత ఖర్గే, మాజీ ఉపప్రధాని ఆడ్వాణీలతో కూడిన ఎంపిక సంఘం బుధవారం విజేతలను ఎంపిక చేసింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారం కింద రూ.కోటి నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక, హస్తకళ/చేనేత వస్తువులను ప్రభుత్వం అందిస్తుంది.


సత్తెనపల్లి చెరువు మధ్యలో నిర్మించిన 76 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం

తారక రామునికి ఘనమైన నివాళి

- 18న సత్తెనపల్లిలో తారకరామసాగర్.. ఎన్టీఆర్ గార్డెన్స్ ప్రారంభం
- సభాపతి కోడెల శివప్రసాదరావు వెల్లడి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడైన నందమూరి తారకరామారావు వర్ధంతిని ఈ నెల 18న ఘనంగా సత్తెనపల్లి పట్టణంలో నిర్వహించబోతున్నట్లు శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు. సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పురపాలక సంఘానికి చెందిన 60 ఎకరాల చెరువును ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేశామన్నారు. చెరువు మధ్యలో 76 అడుగుల ఎత్తుతో నిర్మించిన రాష్ట్రంలోనే భారీ తారకరాముని విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పర్యాటక అభివృద్ధి పనులతోపాటు పల్నాడు ప్రాంతానికి ఆధునిక విద్యనందించేందుకు ఉద్దేశించిన రూ.35 కోట్ల నిధులతో కేంద్రీయ విద్యాలయ శాశ్వత భవనాల నిర్మాణ పనులు, రూ.92 కోట్లతో అచ్చంపేట రోడ్డులోని రైల్వేగేటు వద్ద నిర్మించ తలపెట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణాలకు సీఎం భూమిపూజ చేస్తారని వెల్లడించారు.

తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ స్థానం పదిలం

ఈనాడు, అమరావతి: తెలుగు ప్రజల గుండెల్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ స్థానం ఎప్పటికీ పదిలమేనని ఆ పార్టీ నాయకురాలు, హరికృష్ణ కుమార్తె సుహాసిని పేర్కొన్నారు. గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యాప్రమాణాలు తీసికట్టు

- పిల్లల్లో తగ్గిపోతున్న పఠనశక్తి
- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల్లో ఇదే స్థితి
- ఆంధ్రప్రదేశ్‌లో మెరుగుపడిన మౌలిక వసతులు

ఈనాడు, దిల్లీ: దేశంలో విద్యాప్రమాణాలు నానాటికీ తగ్గిపోతున్నాయి. గ్రామీణప్రాంతాల్లో చదువుతున్న పిల్లల విద్యాప్రమాణాల స్థాయిని లెక్కించడానికి ప్రతి రెండేళ్లకోసారి కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ సర్వే నిర్వహిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా తాజాగా విడుదల చేసిన 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (రూరల్)-2018 చేదు నిజాలను బయటపెట్టింది. రెండోతరగతి పుస్తకాలు చదవగలిగే అయిదో తరగతి విద్యార్థుల సంఖ్య 2008లో 53.1% మేర ఉండగా 2018నాటికి ఆ సంఖ్య 44.2%కి పడిపోయింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లోనూ ఉమ్మడిగా పఠనశక్తి తగ్గిపోతోంది. 2వ తరగతి పుస్తకాలు చదివే అయిదోతరగతి ప్రభుత్వపాఠశాలల విద్యార్థుల సంఖ్య 2008లో 53.1% ఉండగా 2018లో 44.2%కి తగ్గిపోయింది. ఇదే సమయంలో ప్రైవేటు విద్యార్థుల సంఖ్య 67.9% నుంచి 65.1%కి పడిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి పరిస్థితే కనిపించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అన్న తేడా లేకుండా పిల్లలందరిలో ఒకటే ధోరణి కనిపిస్తోంది. తాజా సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్ పాఠశాలల్లో మౌలిక వసతుల పరిస్థితి కొంత మెరుగుపడింది. మరుగుదొడ్లు, తాగునీరు, కంప్యూటర్, విద్యుత్తు సౌకర్యం లాంటి వాటి కల్పనలో గతం కంటే పరిస్థితి మెరుగ్గా ఉంది. పాఠశాలల్లో క్రీడా సౌకర్యాలు కూడా బాగానే ఉన్నట్లు తేలింది.

- ఆంధ్రప్రదేశ్‌లో 6-14 మధ్య వయసు పిల్లల్లో 35.2% మంది ప్రైవేటు స్కూళ్లలో ఉన్నారు.
- 11-14 మధ్య వయస్సు బాలికల్లో 2.9% మంది పాఠశాలలకు వెళ్లడం లేదు. 15-16 ఏళ్ల మధ్య బాలికల్లో 9.7% మంది పరిస్థితీ అదే విధంగా ఉంది.
- మూడో తరగతి చదువుతున్న పిల్లల్లో 22.4% మంది మాత్రమే రెండోతరగతి పుస్తకాలు చదవగలుగుతున్నారు. ఇది జాతీయ సగటు 27.2% కంటే తక్కువ. మూడో తరగతి పిల్లల్లో 38.4% మంది తీసివేతలు చేయగలుగుతున్నారు. ఇది జాతీయ సగటు 28.1% కంటే ఎక్కువ.
- అయిదోతరగతి చదువుతున్న పిల్లల్లో 59.7% మంది రెండోతరగతి పుస్తకాలు చదవగలరు. 39.3 మంది భాగహారాలు చేయగలరు. 8వ తరగతి పిల్లల్లో 78.2% మందికి రెండో తరగతి పుస్తకాలు చదివేశక్తి ఉంది. 47.6% మంది భాగహారాలు చేయగలుగుతున్నారు. ఈ విషయాల్లో ఆంధ్రప్రదేశ్ పిల్లలు జాతీయ సగటు కంటే కొంత పై స్థాయిలోనే ఉన్నారు.
- విద్యార్థులు-అధ్యాపకుల నిష్పత్తి రాష్ట్రంలో 2010లో 60% ఉండగా 2018 నాటికి 61.5%కి పెరిగింది. తరగతి-టీచర్ నిష్పత్తి ఇదే సమయంలో 53.9 నుంచి 70%కి చేరింది. ఆఫీసు/స్టోర్‌లాంటి సౌకర్యాలున్న పాఠశాలల నిష్పత్తి 57% నుంచి 58.6%కి చేరింది. క్రీడా మైదానాలున్న పాఠశాలల నిష్పత్తి 61.2% నుంచి 61.9%కి పెరిగింది.
- ప్రహరీలున్న పాఠశాలల సంఖ్య 47.2 నుంచి 55.1%కి చేరింది.
- మధ్యాహ్నభోజనం వండటానికి వంటశాలలున్న పాఠశాలల సంఖ్య 64.2% నుంచి 72.9%కి పెరిగింది.
- మరుగుదొడ్లున్న బడుల సంఖ్య 38.6% నుంచి 86.4%కి చేరింది. ఇందులో బాలికల మరుగుదొడ్లున్న పాఠశాలల సంఖ్య 25.4% నుంచి 81.1%కి పెరిగింది.
- 60, ఆలోపు పిల్లలున్న పాఠశాలల సంఖ్య 2010-2018 మధ్యకాలంలో 31.5% నుంచి 38.6%కి చేరింది.
- గ్రంథాలయం, పుస్తకాలు అందుబాటులో ఉన్న స్కూళ్ల సంఖ్య 92% నుంచి 91%కి తగ్గింది. గ్రంథాలయం పుస్తకాలు ఉపయోగించుకుంటున్న పిల్లల సంఖ్య 2010లో 77.6% ఉండగా 2018 నాటికి 54.8%కి తగ్గింది.
- కంప్యూటర్లు అందుబాటులో ఉన్న పిల్లల సంఖ్య 2010లో 9.3% ఉండగా, 2018 నాటికి 22.6%కి చేరింది. సర్వేకి వెళ్లినరోజు కంప్యూటర్లు ఉపయోగిస్తూ కనిపించిన పిల్లల సంఖ్య 2014లో 5.6% ఉండగా 2018లో 6.6%మేర ఉంది. సర్వే నాడు మధ్యాహ్నభోజనం సరఫరా చేస్తూ కనిపించిన పాఠశాలల సంఖ్య 2010లో 99.7% ఉండగా, 2018లో 96%కి పరిమితమైంది.
- 6-14 మధ్య వయస్సున్న పిల్లల హాజరుశాతం ఆంధ్రప్రదేశ్‌లో 80-84% మధ్య ఉంది. ఈ అంశంలో ఆంధ్రప్రదేశ్ రెండోదశ రాష్ట్రాల జాబితాలో నిలబడింది.
- 11-14 మధ్య వయస్సులో బడికి వెళ్లని బాలికల సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లో 2006లో 10.5% మంది ఉండగా, 2018 నాటికి అది 2.9%కి తగ్గింది. 15-16 ఏళ్ల మధ్య గల బాలికల్లో బడికి వెళ్లని వారి సంఖ్య 2006లో 21.3% ఉండగా 2018 నాటికి అది 9.7% తగ్గింది. ఈ రెండు అంశాల్లో జాతీయ సగటు కంటే ఏపీలో పరిస్థితి బాగుంది.
- కనీస తీసివేతలు చేయగలిగే 3వ తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఏపీలో 5%మేర తగ్గింది. 2016లో ఈ సంఖ్య 39.1% మేర ఉండగా, 2018 నాటికి 34.1%కి చేరింది.
- రెండోతరగతి స్థాయి పుస్తకాలు చదవగలిగే 3వ తరగతి విద్యార్థుల సంఖ్య 2008-2018 మధ్యకాలంలో ఏపీలో 71-80% ఉంది. ఇందులో ఏపీ దేశంలో మూడోస్థాయి రాష్ట్రాల సరసన నిలిచింది.

ఆంధ్రప్రదేశ్‌లో మూడోవంతు పాఠశాలల్లో క్రీడా పరికరాలు అందుబాటులో ఉన్నాయి. హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు తర్వాత క్రీడాపరికరాలు బాగా ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశే. ఏపీలో 78% స్కూళ్లలో ఫిజికల్ ఎడ్యుకేషన్ పీరియడ్‌తో కూడిన టైంటేబుల్ అమల్లో ఉంది. ఈ విషయంలో మహారాష్ట్ర (93%), కేరళ (83%), తమిళనాడు (82%)లు ఏపీకంటే ముందున్నాయి.

ఛాంపియన్స్

12 ఏళ్లకే గ్రాండ్ మాస్టర్



కార్ల్‌సన్, ఆనంద్‌లను అధిగమిస్తా

"గ్రాండ్‌మాస్టర్ అవడం ఆనందంగా ఉంది. దిల్లీ టోర్నీలో పోటీ తీవ్రంగా ఉంది. ఈ టోర్నీలో బాగా ఆడాను. చివరి రౌండ్ మంచి ప్రదర్శన కనబరిచా. భవిష్యత్తులో కార్ల్‌సన్, విశ్వనాథన్ ఆనంద్‌ల కంటే మెరుగైన స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నా."
– గుకేశ్

ప్రపంచంలో రెండో పిన్న వయస్కుడిగా గుకేశ్ ఘనత

చెన్నై

ప్రజ్ఞానంద గుర్తున్నాడా..! 12 ఏళ్ల 10 నెలల 13 రోజుల వయసులో చెస్ గ్రాండ్‌మాస్టర్ హోదా సంపాదించి.. ఆ ఘనత సాధించిన భారత యువ ఆటగాడిగా రికార్డు అందుకున్నాడు. అతడి రికార్డు ఏడు నెలలైనా నిలవలేదు. తమిళనాడుకే చెందిన యువ సంచలనం గుకేశ్ అతడి రికార్డును తిరగరాశాడు. మంగళవారం దిల్లీ అంతర్జాతీయ చెస్ టోర్నీలో మూడో జీఎం నార్మ్ సంపాదించి గ్రాండ్‌మాస్టర్ హోదా గెలుచుకున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయసులో గ్రాండ్‌మాస్టర్ దక్కించుకున్న అతడు.. ప్రపంచంలో ఈ ఘనత పొందిన రెండో పిన్న వయస్కుడిగా నిలిచాడు. మొత్తంమీద భారత్ తరపున 59వ జీఎంగా అవతరించాడు. నిజానికి గత డిసెంబరులో అతడికి గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కాల్సింది. బార్సిలోనాలో జరిగిన అంతర్జాతీయ టోర్నీలో మూడో రౌండ్లో జీఎం డానియెల్ వొచాతురొ (ఇటలీ) చేతిలో గుకేశ్ ఓడాడు. ఆ గేమ్‌లో నెగ్గి ఉంటే గుకేశ్‌కు అప్పుడే మూడో నార్మ్ వచ్చేది. ప్రపంచంలోనే అత్యంత చిన్న వయసులో గ్రాండ్‌మాస్టర్ అయ్యుండేవాడు. 2002లో సెర్గీ కర్జాకిన్ (ఉక్రెయిన్) 12 ఏళ్ల 7 నెలలకే జీఎం అయ్యాడు. అతడి తర్వాత గుకేశ్ అత్యంత చిన్న వయస్కుడు. "గ్రాండ్‌మాస్టర్ అయినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఎప్పటికైనా విశ్వనాథన్ ఆనంద్ సర్‌తో ఆడాలని కోరుకుంటున్నా. బార్సిలోనాలో రికార్డు అందుకోలేకపోయినందుకు నిరాశ చెందా. మళ్లీ ఆటపై దృష్టిసారించి ఈ ఘనత అందుకున్నా" అని గుకేశ్ తెలిపాడు.

అలాగైతే కుర్రాళ్లు టెస్టులాడడం కష్టం

కుర్రాళ్లు కేవలం పరిమిత ఓవర్ల క్రికెట్‌పైనే దృష్టిపెడితే వారికి టెస్టు క్రికెట్లో సమస్యలు తప్పవని టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లి హెచ్చరించాడు. టెస్టుల్లో తమ జట్టు తిరుగులేని శక్తిగా ఎదగాలని కోరుకుంటున్నానని చెప్పాడు.

76 ఆస్ట్రేలియాతో రెండో వన్డేలో సిరాజ్ ఇచ్చిన పరుగులు. అరంగ్రేటంలో అత్యధిక పరుగులు సమర్పించుకున్న భారత రెండో బౌలర్ సిరాజ్. గావ్రి (83) ముందున్నాడు.

అడిలైడ్: పరిమిత ఓవర్ల క్రికెట్‌పై ఎక్కువగా దృష్టిపెట్టడం.. టెస్టు క్రికెట్ పరిస్థితులకు తట్టుకోలేకపోవడానికి సాకు కాకూడదని కోహ్లి అన్నాడు. "పరిమిత ఓవర్ల క్రికెట్ ముఖ్యమైందే. కానీ కేవలం ఆ ఫార్మాట్ల మీదే దృష్టి పెట్టి.. టెస్టు క్రికెట్లో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవలేకపోవడానికి దాన్నే సాకుగా చూపుతున్నామంటే క్రికెటర్లలో మానసికంగా ఏదో సమస్య మొదలైనట్లే" అని కోహ్లి చెప్పాడు. ఏ ఆటగాడైనా బాగా శ్రమిస్తేనే నాణ్యమైన టెస్టు క్రికెటర్ అవుతాడని అన్నాడు. "బాగా సాధన చేయాలి. ఒక్క పరుగు రాకపోయినా రెండు గంటలు బ్యాటింగ్ చేసేందుకు సుముఖంగా ఉండాలి. కుర్రాళ్లు చేయాల్సిందిదే" అని కోహ్లి చెప్పాడు. ప్రస్తుత భారత క్రికెటర్లు యువ ఆటగాళ్లకు ఉదాహరణగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నారని అతడు అన్నాడు. టెస్టు క్రికెట్లో తమ జట్టు తిరుగులేని శక్తిగా అవతరించాలన్న తన కోరికను మరోసారి వెల్లడించాడు. "అది మా లక్ష్యం అని చెప్పను. కానీ రానున్న సంవత్సరాల్లో భారత్ టెస్టు క్రికెట్లో గొప్ప శక్తిగా నిలవాలని బలంగా కోరుకుంటున్నాం. అందుకోసం ప్రయత్నిస్తున్నాం" అని కోహ్లి అన్నాడు. "భారత క్రికెట్, భారత ఆటగాళ్లు టెస్టు క్రికెట్‌ను గౌరవిస్తే.. టెస్టు క్రికెట్ అత్యున్నత స్థితిలో ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా మనకున్న అభిమానులే అందుకు కారణం" అని చెప్పాడు.

ఆయన నిజాయితీగా చెబుతాడు: కెప్టెన్‌గా తన పనిని కోచ్ రవిశాస్త్రి మరింత తేలిక చేస్తున్నాడని కోహ్లి చెప్పాడు. "రవిశాస్త్రి నాతో తన అభిప్రాయాన్ని నిజాయితీగా చెబుతాడు. ఓ ఘటన నాకింగా గుర్తుంది. నిరుడు ఇంగ్లాండ్‌లో ఓ టెస్టులో సెంచరీ, అర్ధసెంచరీ సాధించా. అప్పుడు రవిశాస్త్రి నాతో మాట్లాడాడు. 'బ్యాటింగ్‌కు సంబంధించి నీతో ఏమీ మాట్లాడను. ఎందుకంటే నాతో పాటు ప్రతి ఒక్కరూ గర్వపడేలా నువ్వు ఆడావు. కానీ కెప్టెన్‌గా 'ఈ జట్టు నుంచి అత్యుత్తమ ప్రదర్శనను ఎలా రాబట్టాలో, మంచి వ్యూహ రచన ఎలా చేయాలో ఆలోచించడం మొదలు పెట్టు' అని అన్నాడు. ఆయన మాటలు నన్ను గట్టిగా తాకాయి. 'కెప్టెన్సీ అంటే నువ్వు అనుకుంటున్నదాని కంటే ఎక్కువ' అని ఆయన అన్నట్లనిపించింది" కోహ్లి చెప్పాడు.



కోహ్లి 104

కోహ్లి కొట్టేశాడు 39

- ముగించి మురిపించిన ధోని
- రెండో వన్డేలో ఆసీస్‌పై భారత్ విజయం

అడిలైడ్

అడిలైడ్‌లో అదరహో. కెప్టెన్ విరాట్ కోహ్లి సూపర్ బ్యాటింగ్‌తో కెరీర్‌లో 39వ వన్డే శతకం సాధించగా.. ధోని చక్కని ముగింపుతో ఒకప్పటి ధోనీని గుర్తుకుతెచ్చాడు. దీంతో తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో నెగ్గిన టీమ్‌ఇండియా.. సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మంగళవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి (104; 112 బంతుల్లో 5×4, 2×6), ధోని (55 నాటౌట్; 54 బంతుల్లో 2×6), రోహిత్ (43; 52 బంతుల్లో 2×4, 2×6), దినేశ్ కార్తీక్ (25 నాటౌట్; 14 బంతుల్లో 2×4) మెరవడంతో 299 పరుగుల లక్ష్యాన్ని భారత్ 49.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మొదట ఆస్ట్రేలియా 9 వికెట్లకు 298 పరుగులు సాధించింది. షాన్ మార్ష్ (131; 123 బంతుల్లో 11×4, 3×6) ఆసీస్ ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచాడు. మాక్స్‌వెల్ (48) కూడా రాణించడంతో ఆసీస్ మంచి స్కోరును సాధించింది. భువనేశ్వర్ (4/45), షమి (3/58), జడేజా (1/49) బంతితో రాణించారు. మూడో వన్డే శుక్రవారం జరుగుతుంది.

శతక్కొట్టిన కోహ్లి.. ముగించిన ధోని: టీమ్‌ఇండియా ఛేదన ఆసక్తికరంగా సాగింది. విరాట్ కోహ్లి చక్కని శతకంతో జట్టును లక్ష్యం దిశగా నడిపించగా.. విమర్శకులకు జవాబిస్తూ, ఇన్నింగ్స్‌ను ముగించే సామర్థ్యం తనలో ఇంకా మిగిలే ఉందని చాటుకుంటూ జట్టును ధోని విజయతీరాలకు చేర్చాడు. ధనాధన్ ఇన్నింగ్స్ ఆడిన ధావన్ (32; 28 బంతుల్లో 5×4) తొలి వికెట్‌కు రోహిత్‌తో కలిసి 47 పరుగులు జోడించి ఎనిమిదో ఓవర్లో ఔటయ్యాడు. ఆ తర్వాత ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను కోహ్లి తీసుకున్నాడు. 18వ ఓవర్లో స్కోరు 100 దాటింది. ఐతే అంతా సాఫీగా సాగుతున్న దశలో స్టాయినిస్ బౌలింగ్‌లో రోహిత్ ఔట్ కావడంతో 54 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత రాయుడు (24; 36 బంతుల్లో 2×4) కోహ్లితో మూడో వికెట్‌కు 59 పరుగులు జోడించినా.. టైమింగ్‌తో ఇబ్బందిపడ్డాడు. కోహ్లి మాత్రం అలవోకగా బ్యాటింగ్ చేశాడు. రాయుడు ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన ధోని.. కోహ్లికి మంచి సహకారాన్నిచ్చాడు. 37వ ఓవర్లో స్కోరు 200 దాటింది. ఐతే 108 బంతుల్లో కెరీర్లో 39వ శతకం పూర్తి చేసిన కోహ్లి.. 44వ ఓవర్లో ఔట్ కావడంతో ఛేదన ఆసక్తికరంగా మారింది. చివరి 36 బంతుల్లో 55 పరుగులు చేయాల్సిన పరిస్థితి. ఐతే ఉత్కంఠను అధిగమిస్తూ ధోని.. ధాటిగా ఆడిన కార్తీక్‌తో కలిసి జట్టును గెలిపించాడు. చివరి ఓవర్లో 7 పరుగులు చేయాల్సివుండగా ఉత్కంఠ పెరిగింది. కానీ స్టాయినిస్ తొలి బంతిని లాంగాన్‌లో సిక్స్‌గా మలిచి ఆసీస్ ఆశలపై ధోని నీళ్లు చల్లాడు.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: 298/9 (కరే 18, ఫించ్ 6, ఖవాజా 21, షాన్ మార్ష్ 131, హాండ్స్‌కాంబ్ 20, స్టాయినిస్ 29, మాక్స్‌వెల్ 48; భువనేశ్వర్ 4/45, షమి 3/58, జడేజా 1/49)

భారత్ ఇన్నింగ్స్: 299/4 (రోహిత్ 43, ధావన్ 32, కోహ్లి 104, రాయుడు 24, ధోని 55 నాటౌట్, కార్తీక్ 25 నాటౌట్; బెహ్రెండార్ఫ్ 1/52, రిచర్డ్సన్ 1/59, స్టాయినిస్ 1/46, మాక్స్‌వెల్ 1/16)




ధోని (55 నాటౌట్)

ధోని విలువను లెక్కగట్టలేం

"ధోనిని అలా వదిలేయాలని ప్రతి ఒక్కరిని ప్రార్థిస్తున్నా. అప్పుడే అతడు బాగా ఆడతాడు. ఒకప్పటి నిలకడ ఇప్పుడు ఉండదు. దాన్ని అంగీకరించాల్సిందే. కొంత నిలకడలేమి ఉన్నా భరించాలి. ఇప్పటికీ జట్టుకు అతడు తిరుగులేని ఆస్తి. అతడి విలువను లెక్కగట్టలేం. బ్యాట్స్‌మెన్ షాట్‌లను ఊహించి బౌలర్లకు పదే పదే సూచనలిస్తాడు. ఫీల్డింగ్ కూర్పుల్లోనూ అతడి ప్రత్యేకత ఉంటుంది"
– గావస్కర్

భార్య.. కోచ్



మలేసియా మాస్టర్స్ టోర్నీలో అరుదైన సన్నివేశం చోటు చేసుకుంది. ఇటీవలి వరకు పీబీఎల్‌తో బిజీగా ఉన్న సైనా, కశ్యప్.. పెళ్లి తర్వాత ఆడుతున్న తొలి అంతర్జాతీయ టోర్నీ.. మలేసియా మాస్టర్స్. బుధవారం తొలి రౌండ్ మ్యాచ్‌లు జరిగాయి. మధ్యాహ్నం 12 గంటలకు సైనా మ్యాచ్ ముగిసింది. అప్పుడు కోచ్ స్థానంలో కశ్యప్ కూర్చున్నాడు. పెళ్లికి ముందు కూడా సైనాకు కోచ్‌గా కశ్యప్ చిట్కాలు అందించాడు. మధ్యాహ్నం 2.25 గంటలకు కశ్యప్ మ్యాచ్ ప్రారంభమైంది. ఆ మ్యాచ్‌కు కోచ్‌గా సైనా కూర్చోవడం విశేషం. మ్యాచ్ సాగుతున్నంతసేపు కశ్యప్‌ను సైనా ప్రోత్సహించింది. ప్రతి గేమ్ విరామంలో కశ్యప్‌కు సైనా చిట్కాలు చెప్పడం ఆకట్టుకుంది.

చెమటోడ్చిన సైనా

శ్రీకాంత్, కశ్యప్ ముందంజ

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారులు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్, పారుపల్లి కశ్యప్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఏడో సీడ్ సైనా 14-21, 21-18, 21-18తో జాయ్ జువాన్ (హాంకాంగ్)పై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరుకుంది. ప్రపంచ 37వ ర్యాంకర్‌ను ఓడించడానికి తొమ్మిదో ర్యాంకర్ సైనా చెమటోడ్చింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఏడో సీడ్ శ్రీకాంత్ 21-17, 21-11తో లాంగ్ ఆగ్నస్ (హాంకాంగ్)పై, కశ్యప్ 19-21, 21-19, 21-10తో రస్మస్ గెమ్కీ (డెన్మార్క్)పై గెలుపొందారు.

ఐసీసీ సీఈవోగా మను

దుబాయ్: ఐసీసీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈవో)గా మీడియా ప్రొఫెషనల్ మను సాహ్ని నియమితుడయ్యాడు. వచ్చే వన్డే ప్రపంచకప్‌తో డేవిడ్ రిచర్డ్సన్ పదవీ కాలం ముగియనుంది. ఆ తర్వాత మను బాధ్యతలు చేపడతాడు. ఈఎస్‌పీఎన్ స్టార్ స్పోర్ట్స్‌లో 17 ఏళ్లపాటు వివిధ పదవుల్లో పనిచేసిన మను కొంతకాలం ఎండీగా కూడా ఉన్నాడు.

హరియాణా విజయం

పంచకులా: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో నిరుటి రన్నరప్ హరియాణా శుభారంభం చేసింది. బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో హరియాణా 5-2తో యూపీ దంగల్ జట్టును ఓడించింది. 57 కిలోల విభాగంలో రవికుమార్ 7-2తో నవీన్‌ను ఓడించి హరియాణాకు తొలి విజయాన్ని అందించాడు. మ్యాచ్ చివరి బౌట్‌లో హరియాణా క్రీడాకారిణి అనస్తాసియా నిచిత (57 కిలోలు) 9-0తో సరితను ఓడించి జట్టుకు తిరుగులేని విజయాన్ని అందించింది.

ఈషకు పసిడి



హైదరాబాద్: తెలంగాణ యువ సంచలనం ఈష సింగ్ ఖేలో ఇండియా షూటింగ్‌లో సత్తా చాటింది. అండర్-17 10 మీటర్ల పిస్టల్ విభాగంలో విజేతగా నిలిచింది. క్వాలిఫయింగ్‌లో 565 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన ఈష ఫైనల్లో 241.3 పాయింట్లతో టైటిల్ సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ విభాగంలో ఈష, అగా మహ్మద్ జోడీ రజతం నెగ్గింది.

పుజారా విఫలం

- సౌరాష్ట్ర 170/7
- యూపీతో రంజీ క్వార్టర్స్



లఖ్‌నవూ: ఆస్ట్రేలియాలో పరుగుల వరద పారించిన చెతేశ్వర్ పుజారా రంజీ ట్రోఫీలో విఫలమయ్యాడు. సౌరాష్ట్రకు ఆడుతున్న అతడు ఉత్తర్‌ప్రదేశ్‌తో క్వార్టర్‌ఫైనల్లో 11 పరుగులకే పెవిలియన్ చేరాడు. పేస్ బౌలర్ శివమ్ మావి బౌలింగ్‌లో అతడు క్యాచ్ ఔటయ్యాడు. మావి (3/39), అంకిత్ రాజ్‌పుత్ (2/59), యశ్ దయాల్ (2/35) ధాటికి రెండో రోజు, బుధవారం ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 385 పరుగులు చేసింది.



కెర్బర్

అరుణాచల్ 14 ఆలౌట్

దిల్లీ: బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళల టీ20 మ్యాచ్‌లో యూఏఈ చేతిలో చైనా 14 పరుగులకే ఆలౌటైన రెండో రోజే బీసీసీఐ అండర్-23 మహిళల నాకౌట్ టీ20 క్రికెట్ టోర్నీలోనూ అలాంటి రికార్డే నమోదైంది. మంగళవారం హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అరుణాచల్‌ప్రదేశ్ కూడా 14 పరుగులకే కుప్పకూలింది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన అరుణాచల్ 11 ఓవర్లలో 14 పరుగులకు ఆలౌటైంది. ఏడుగురు క్రీడాకారిణులు డకౌటయ్యారు. హిమాచల్ బౌలర్ ప్రాచి చౌహాన్ (4/1) నాలుగు వికెట్లు పడగొట్టింది. అనంతరం హిమాచల్ 1.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేసి పది వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది.

నాదల్, షరపోవా, కెర్బర్ ముందంజ

మూడో రౌండ్లో ఫెదరర్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్ కష్టంగా మూడో రౌండ్లో అడుగుపెట్టాడు. నాదల్ అలవోకగా ముందజ వేయగా.. ఐదో సీడ్ కెవిన్ అండర్సన్ కథ ముగిసింది. మహిళల సింగిల్స్‌లో షరపోవా, స్టీఫెన్స్, కెర్బర్ రెండో రౌండ్‌ను అధిగమించారు.

మెల్‌బోర్న్

మూడో సీడ్ రోజర్ ఫెదరర్, రెండో సీడ్ రఫెల్ నాదల్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఐతే ఇద్దరూ విరుద్ధ ప్రదర్శనతో రెండో రౌండ్‌ను అధిగమించారు. ఫెదరర్ 7-6 (7-5), 7-5 (7-3), 6-3తో అన్‌సీడెడ్ ఎవాన్స్ (బ్రిటన్)పై కష్టపడి నెగ్గగా... నాదల్ మాత్రం 6-3, 6-2, 6-2తో ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)ను చిత్తు చేశాడు. కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా) ఇంటిముఖం పట్టాడు. అమెరికా ఆటగాడు తైఫో రెండో రౌండ్లో 4-6, 6-4, 6-4, 7-5తో అండర్సన్‌కు షాకిచ్చాడు. మరోవైపు ఆరో సీడ్ సిలిచ్ (క్రొయేషియా), పదో సీడ్ కచనోవ్ (రష్యా), దిమిత్రోవ్ (బల్గేరియా) మూడో రౌండ్లో ప్రవేశించారు. సిలిచ్ 7-5, 6-7 (9-11), 6-4, 6-4తో మెక్‌డొనాల్డ్ (అమెరికా)పై, కచనోవ్ 6-3, 6-3, 6-3తో నిషియోకా (జపాన్)పై, దిమిత్రోవ్ 6-3, 6-7 (5-7), 6-3, 7-5తో క్యువాస్ (ఉరుగ్వే)పై విజయం సాధించారు. బటిస్టా అగట్ (స్పెయిన్), సెప్పి (ఇటలీ), బెర్డిచ్ (చెక్), వెర్దాస్కో (స్పెయిన్) కూడా మూడో రౌండ్లో అడుగుపెట్టారు. టాప్ సీడ్ జకోవిచ్ (సెర్బియా), నాలుగో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), ఏడో సీడ్ థీమ్ (ఆస్ట్రియా), ఎనిమిదో సీడ్ నిషికోరి (జపాన్), వావ్రింకా (స్విట్జర్లాండ్) రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

షరపోవా దూకుడు: మహిళల సింగిల్స్‌లో రష్యా అమ్మాయి మరియా షరపోవా అలవోకగా మూడో రౌండ్లో అడుగుపెట్టింది. రెండో రౌండ్లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆమె 6-2, 6-3తో ఆష్లే బార్తీ (ఆస్ట్రేలియా)ని చిత్తు చేసింది. రెండో సీడ్ కెర్బర్ (జర్మనీ), ఐదో సీడ్ స్టీఫెన్స్ (అమెరికా) సులభంగా రెండో రౌండ్ దాటారు. కెర్బర్ 6-3, 6-2తో హదాద్ మయా (బ్రెజిల్)ను చిత్తు చేయగా. స్టీఫెన్స్ 6-3, 6-1తో బాబోస్ (హంగేరి)ను ఓడించింది. ఇతర మ్యాచ్‌ల్లో మూడో సీడ్ వోజ్నియాకి (డెన్మార్క్) 6-1, 6-3తో లార్సన్ (స్వీడన్)పై, క్విటోవా (చెక్) 6-1, 6-3తో బెగు (రొమేనియా)పై, సబలెంక (బెలారస్) 6-3, 6-4తో బౌల్టర్ (బ్రిటన్)పై, బెన్సిచ్ (స్విట్జర్లాండ్) 7-5, 4-6, 6-2తో పుతిన్‌త్సెవా (కజకిస్థాన్)పై గెలిచారు. సెరెనా విలియమ్స్ (అమెరికా), టాప్ సీడ్ హాలెప్ (రొమేనియా), నాలుగో సీడ్ ఒసాకా (జపాన్), వీనస్ విలియమ్స్ (అమెరికా), బౌచర్డ్ (కెనడా), ముగురుజ (స్పెయిన్), కొంటా (బ్రిటన్) రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

డబుల్స్ నుంచి భారత్ ఔట్: పురుషుల డబుల్స్‌లో భారత్ కథ ముగిసింది. బరిలో ఉన్న భారత ఆటగాళ్లు తొలి రౌండ్ కూడా దాటలేకపోయారు. మొదటి రౌండ్లో రోహన్ బోపన్న-దివిజ్ శరణ్ జోడీ 1-6, 6-4, 5-7తో పాబ్లో కారెనో బుస్టా, గిలెర్మో గ్రేసియా లోపెజ్ ద్వయం చేతిలో ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో లియాండర్ పేస్, ఏంజెల్ రెయెస్-వరెల జోడీ 5-7, 6-7 (4)తో ఆస్టిన్ కాయిసెక్ (అమెరికా), సితాక్ (న్యూజిలాండ్) జంట చేతిలో కంగుతింది.



20 ఏళ్ల తర్వాతే ఇళ్ల స్థలాల విక్రయం

• 'బదలాయింపుల నిషేధ చట్టం-1977'కు మరోసారి సవరణ ప్రతిపాదనలు

ఈనాడు, అమరావతి: పట్టణాలు, గ్రామాల్లో ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందిన పేదలు ఇరవై ఏళ్ల తర్వాత వాటిని అమ్ముకునే విధంగా వెసులుబాటు విషయమై సమాలోచనలు జరుగుతున్నాయి. తొలుత ఐదేళ్ల తరువాత అమ్ముకునేలా బదలాయింపుల నిషేధ చట్టం-1977ను ఆర్డినెన్స్ ద్వారా సవరించేందుకు ఆమోదం కోసం గవర్నర్ నరసింహన్‌కు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించింది. దీనిపై గవర్నర్ నరసింహన్ వ్యక్తంచేసిన అభిప్రాయాలపై నేరుగా ఆయనతో చర్చించిన అధికారులు 20 ఏళ్ల తర్వాత అమ్ముకునేలా ప్రతిపాదించినట్లు తెలిసింది.

ఇళ్లు, సాగు భూమిలేని పేదలకు ప్రభుత్వం ఉచితంగా స్థలాలు, భూములు కేటాయిస్తోంది. లబ్ధిదారులు వీటిల్లో ఇళ్లు కట్టుకునేందుకు, సాగు చేసుకునేందుకు మాత్రమే అవకాశం ఉంది. చట్ట ప్రకారం అమ్మకాలు నిషిద్ధం. అయినా కొందరు అనధికారికంగా విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలుచేసిన వారు ఏళ్ల తరబడి అందులో ఉంటున్నా ఎలాంటి హక్కులు సంక్రమించడంలేదు. ఇలాంటి వారంతా తమ స్థలాలు క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, మంత్రులు సైతం ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. విశాఖపట్నం, ఇతర ప్రాంతాల్లో 100 గజాలలోపు ప్రభుత్వ భూములు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుని ఉంటే.. క్రమబద్ధీకరించిన అనంతరం రెండేళ్ల తర్వాత అమ్ముకోవడానికి వీలు కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు.

రెండేళ్ల నుంచి ఐదేళ్లకు!: ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను లబ్ధిదారులు రెండేళ్ల తర్వాత అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే.. ప్రస్తుతం ఆ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి క్రమబద్ధీకరణ అవకాశాన్నీ కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. వీరి విజ్ఞప్తుల మేరకు మంత్రివర్గ ఉపసంఘం కూడా ప్రభుత్వానికి సిఫార్సుచేసింది. అయితే రెండేళ్ల తర్వాత అసైన్డ్ స్థలాలు అమ్ముకునే అవకాశం కల్పించాలని వచ్చిన సిఫార్సుపై ఉన్నతస్థాయిలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. చివరికి అయిదేళ్ల తర్వాత అమ్ముకునే అవకాశం కల్పించేలా 'బదలాయింపు నిషేధ చట్టాన్ని' ఆర్డినెన్స్ ద్వారా సవరించేందుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వం గవర్నర్ నరసింహన్‌కు పంపింది.

గవర్నర్ సూచనలతో..: ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన గవర్నర్ నరసింహన్ అయిదేళ్ల తర్వాత అమ్ముకోవచ్చనే నిబంధనను 20 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వానికి సూచించారు. ఆ సూచనలతో రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాల విక్రయం, క్రమబద్ధీకరణను రెండు రకాలుగా వర్గీకరించారు. పేదలకు ఇచ్చిన స్థలాలను ఎవరైనా కొనుగోలు చేసి.. ప్రస్తుతం అందులో నివాసం ఉంటుంటే వారికే వాటిని క్రమబద్ధీకరిస్తారు. ఇళ్ల స్థలాలు పొందిన వారైతే మాత్రం 20 ఏళ్ల తర్వాత అమ్ముకునేలా ప్రతిపాదనలు పంపించారు.



బంధం నిలిచింది.. కన్నీళ్లను తుడిచింది

మానవ సంబంధాలు మృగ్యమైపోతున్న ప్రస్తుత తరుణంలో బంధం కోసం తాపత్రయపడుతూ అష్టకష్టాలు పడే వారిని అరుదుగా చూస్తుంటాం. అలాంటి నిరుపేద మేనమామ కథే ఇది. తాను దివ్యాంగుడైనా, చేసేది యాచక వృత్తే అయినా తన మేనల్లుళ్లను కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆయన పడుతున్న నరకం వర్ణనాతీతం. విజయవాడ క్రాస్ రోడ్స్‌కు చెందిన సీతారాం పుట్టుకతోనే దివ్యాంగుడు. చక్రాల కుర్చీలో దివ్యాంగుడైన చిన్న మేనల్లుడు లక్ష్మీనారాయణను తోస్తూ, నడుముకు గుడ్డకట్టుకుని దాని సాయంతో దివ్యాంగుడైన పెద్ద మేనల్లుడు ప్రసాద్‌ని లాగుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ముగ్గురూ ఊరూరా తిరుగుతూ యాచక వృత్తిలో వచ్చిన డబ్బుతో కడుపు నింపుకొంటున్నారు. దివ్యాంగులకు పింఛను పథకం ఉన్నా ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియకపోవడంతో దానికి దూరమయ్యారు. – ఈనాడు అమరావతి

నరేగా నిధులు వచ్చేస్తున్నాయ్

నెలాఖరులోగా రాష్ట్రానికి కేటాయింపు

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా) కింద వివిధ రాష్ట్రాలకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ.6,084 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు ఉత్తర్వులు వెలువడినట్లు అధికారులకు సమాచారం అందింది. ఇందులో రాష్ట్రానికి రావలసిన బకాయిలు నెలాఖరులోగా విడుదలయ్యే అవకాశం ఉందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ అంచనా వేస్తోంది. నరేగాలో రాష్ట్రంలో చేసిన పనులకు నవంబరు 15 తరువాత చెల్లింపులు నిలిచిపోయాయి. వేతనదారులకు ఇప్పటివరకు రూ.462.72 కోట్లు, 'మెటీరియల్ కాంపోనెంట్'లో పనులకు రూ.1,086.42 కోట్లు చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం తాజాగా కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖకు నిధులు విడుదల చేయడంతో త్వరలోనే రాష్ట్రంలో 2 నెలల బకాయిలు చెల్లించే వీలుంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి ఒకరు తెలిపారు.

తుపాకీతో బెదిరించి దోపిడీ

మావోయిస్టుల చర్యగా అనుమానం

కొడకండ్ల, న్యూస్‌టుడే: మద్యం దుకాణ సిబ్బందిని తుపాకీతో బెదిరించిన దుండగులు రూ.6.70లక్షలు దోచుకొని పరారయ్యారు. తెలంగాణలోని జనగామ జిల్లా మొండ్రాయి సమీపంలో మంగళవారం రాత్రి సంఘటన ఇది. అందిన వివరాల ప్రకారం... క్రాస్‌రోడ్డు వద్ద గల తిరుమల వైన్స్ ఉద్యోగులు ముగ్గురు రాత్రి 10 గంటలకు దుకాణాన్ని మూసివేసి, మద్యం విక్రయాల సొమ్ముతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. రామన్నగూడెం సమీపంలో నలుగురు అడ్డుకొని, ఆ సిబ్బందిని రోడ్డుపక్కన చెట్లలోకి తీసుకెళ్లారు. తుపాకీతో బెదిరించి, నగదు అపహరించి పారిపోయారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. జాగిలంతో పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఇది మావోయిస్టుల పనేనని అనుమానిస్తున్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు
విజయవాడ,
గురువారం
జనవరి 17, 2019

మకరందం

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
makarandam@eenadu.in

ఈనెల 22 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



మనసు తడిస్తే ఓ రాగం...
హృదయం ఉప్పొంగితే మరో రాగం...
భక్తి వెల్లువైతే ఇంకో రాగం...
సంగీతం ఓ అద్భుతమైన హృదయ స్పందనకు ప్రతిరూపం...
భావమైనా, రాగమైనా, గానమైనా
మనసు పొరల్లోంచి వస్తే
అది మాధుర్యమవుతుంది.
గుండె గుండెనూ తాకుతుంది.
వాగ్గేయకారుడు త్యాగయ్య కూడా అంతే...
ఆయన రామభక్తి
ఓ అద్భుత భావమైతే,
ఆయన అనుభూతులు
మహాద్భుత రాగాలయ్యాయి...
వందల ఏళ్ల నుంచీ హృదయరంజితం చేస్తున్నాయి...
ఆయన రచించిన ప్రతి కృతీ,
ప్రతి ఆలాపనా...
జీవితానుభవాల్లోంచి వచ్చినవే...
గుండె పొరల్లోని ఆర్ద్రతతో
తడిచినవే...
అందుకే అవి అంత గొప్పవయ్యాయి...

నవనాడుల్లోనూ నాదోపాసనే ప్రాణవాయువుగా నింపుకున్న వాగ్గేయకారుడు సద్గురు త్యాగరాజస్వామి. అచంచలమైన రామభక్తితో దైవప్రసాదంగా వచ్చిన అద్భుతమైన గాత్రం, కర్ణాటక సంగీత వైదుష్యం సహా తనువు, మనసూ... ఒకటేమిటి 'తన' అనుకున్న సమస్త ప్రపంచాన్నీ శ్రీరాముని చరణాలకు అర్పణ చేసిన భక్తశిఖామణి త్యాగయ్య. సంగీతాన్ని ప్రతిభా ప్రదర్శనకు, ధనసంపాదనకు మార్గంగా కాకుండా, మోక్షసోపానంగా భావించి, త్రికరణశుద్ధిగా ఆచరించిన భక్తవాగ్గేయకారుడాయన.

- అసలు పేరు కాకర్ల త్యాగబ్రహ్మం.
- కాలం : మే 4, 1767 – జనవరి 6, 1847
- రామబ్రహ్మం, సీతమ్మ దంపతులకు మూడో సంతానం.
- ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా, కంభం మండలంలోని కాకర్ల వీరి స్వగ్రామం.
- ఆయన పూర్వీకులు తమిళదేశానికి వలస వెళ్లటంతో త్యాగయ్య జీవితం పూర్తిగా తమిళప్రాంతంలోనే గడిచింది.
- తాత గిరిరాజ కవి గొప్ప పండితులు.
- త్యాగయ్య తండ్రి రామబ్రహ్మం తంజావూరు ప్రభువు శరభోజీ మహారాజు ఆస్థానంలో పనిచేసేవాడు.
- తన 18వ ఏట త్యాగయ్యకు పార్వతితో వివాహం జరిగింది. ఐదేళ్లకే ఆమె చనిపోవడంతో, పార్వతి సోదరి కమలాంబను వివాహం చేసుకున్నారు. వీరికి ఒకే ఒక సంతానం సీతామహాలక్ష్మి. ఈమె ద్వారా కలిగిన మనుమడు కూడా చిన్నతనంలోనే మరణించటంతో ఆయనకు కుటుంబవారసులు లేరు. శిష్యపరంపరే నేటికీ త్యాగయ్య సంగీతానికి వారసులుగా నిలుస్తున్నారు. ఆయన ఇచ్చిన అపారమైన సంగీత సంపదను కాపాడుతున్నారు.

కర్ణాటక సంగీత ప్రపంచంలో ఎందరో వాగ్గేయకారులు ఉన్నారు. కానీ, త్యాగయ్యకు మాత్రమే ఎందుకింత పూజనీయస్థానం ఏర్పడింది? ఆయన్ను మనం ఎందుకు గుర్తుంచుకోవాలంటే...

– భవత్ప్రసాదంగా వచ్చిన విద్యను, విజ్ఞానాన్ని తిరిగి భగవంతుడిని చేరుకోవటానికే వినియోగించిన కైవల్యపథగామిగా త్యాగరాజస్వామి దర్శనమిస్తారు.

– అపారమైన తన సంగీత, సాహిత్య రచనా సర్వస్వాన్నీ మాతృభాష అయిన తెలుగులోనే రచించి, ఆంధ్రసారస్వత రంగం వెలుగు నేటికీ తగ్గకుండా ఉండటానికి కృషి చేసిన తొలి తెలుగు భాషోద్యమ కార్యకర్త త్యాగయ్యలో కనిపిస్తాడు.

– తన కృతులన్నిటిలో సమాజ హితాన్ని ఆకాంక్షించి, తన సాహిత్యాన్ని సమాజసేవకే వినియోగించిన నిజమైన సమాజసేవకుడుగా త్యాగయ్య కనిపిస్తారు.

దొరకునా ఇటువంటి సేవ!



అన్నీ పూజా కుసుమాలే

- తన సంగీతమూ, రామభక్తి తప్ప త్యాగయ్యకు మరోధ్యాస ఉండేది కాదు. అనుక్షణ రామభక్తి, రామనామ జపం, ధ్యానం తప్ప మరే ఉద్యోగమూ చేసే వాడు కాదు. అయినా శిష్యులు అతడిని అంటిపెట్టుకుని ఉండేవారు. ఇదంతా గిట్టని అతని అన్నయ్య పంచనదయ్య ఎలాగైనా త్యాగయ్యకు మనస్తాపం కలిగించాలని భావించి, అతడు ప్రాణంగా చూసుకునే సీతారాముల విగ్రహాలను అపహరించి, కావేరీ నదిలో పడేశాడు. ఎంతవెదికినా తన రామయ్య కనిపించకపోవటంతో త్యాగయ్య జీవితం మీద విరక్తి పెంచుకున్నాడు. అంతటి వేదనలోనూ **'ఎందుదాగినాడో ఈడకు రానెన్నడు దయ వచ్చేనో ఓ మనసా'** అంటూ రామయ్యనే తలచుకుంటూ కృతి రచించాడు. భగవంతుడి కోసం భక్తుడి గుండెల్లో గూడుకట్టుకున్న ఆవేదన త్యాగయ్య కీర్తనలోని ప్రతి అక్షరంలో కనిపిస్తుంది.

- త్యాగయ్య అసాధారణ ప్రతిభ రాజ్యమంతా విస్తరించింది. ఏ నోట విన్నా త్యాగయ్య కృతులే. మొత్తం సంగీతప్రపంచమే త్యాగయ్య ముందు దాసోహమంటోంది. శరభోజీ మహారాజు కూడా త్యాగయ్య గానం వినాలని, అతడిని తన ఆస్థాన విద్వాంసుడిగా నియమించుకోవాలని ఆశపడ్డాడు. అమూల్యమైన మణులు, బంగారం, వజ్రవైడూర్యాలు, రత్నకానుకలను సేవకులకు ఇచ్చి పంపించాడు. అవేమీ తనకొద్దని తిరస్కరించాడు త్యాగయ్య. ఇంటికొచ్చిన లక్ష్మిని చేజేతులారా త్యాగయ్య వెనక్కి పంపించటంతో అన్న పంచనదయ్య తట్టుకోలేకపోయాడు. తమ్ముడిని ఇంటి నుంచి గెంటేశాడు. రాత్రంతా వీధి అరుగుమీదే గడిపాడు. ఈ సందర్భంలో మధ్యమావతిరాగంలో త్యాగయ్య అపురూపమైన కృతి - **'నాదుపై పలికేరు నరులు / వేద సన్నుత, భవము వేరుజేసితిననుచు'** - ఆశువుగా గానం చేశారు. లౌకిక ధనసంపాదన, ఆస్తులు, హోదాలంటే త్యాగయ్యకు ఎంతటి విరక్తిభావం ఉండేదో ఈ కృతి ద్వారా స్పష్టంగా తెలుస్తుంది.

- త్యాగయ్య కుమార్తె సీతాలక్ష్మికి వివాహం కుదిరింది. బాల్యమిత్రుడు, శిష్యుడైన తంజావూరు రామారావు అన్నీ తానై ఏర్పాట్లుచేస్తున్నాడు. మరొక ప్రియశిష్యుడు వేంకటరమణ అదేసమయంలో తప్పనిసరి పరిస్థితుల్లో తమ సొంతూరు వెళ్లాల్సి వచ్చింది. పెళ్లి మరో నాలుగు రోజులు ఉందనగా బయల్దేరి వస్తూ, మార్గమధ్యంలో తన మిత్రుడు, ప్రముఖ చిత్రకారుడైన ఎల్లప్పయ్యర్ గీసిన రామపట్టాభిషేకం చిత్రాన్ని అతని దగ్గర తీసుకుని, పెళ్లిలో తన గురువుగారికి బహుమతిగా ఇచ్చాడు. రామచంద్రుడి వైభవం మూర్తీభవించినట్లుగా ఉన్న ఆ చిత్రాన్ని చూసి త్యాగయ్య ఎంతో సంబరపడ్డాడు. సాక్షాత్తు రామయ్యే తన ఇంటికి నడిచి వచ్చాడని భావించాడు. ఆ ఆనందంలో ఆశువుగా **'నను పాలింపగ నడచి వచ్చితివో' అనే కృతి గానం చేశాడు. ఈ కృతి చివరి చరణంలో 'సురపతి నీలమణి నిభ తనువుతో ? ఉరమున ముత్యపు సరుల చయముతో? కరమున శరకోదండ కాంతితో ? ధరణి తనయతో త్యాగరాజార్చిత'** అంటూ రామయ్య నిలువెత్తు ఆకృతిని అక్షరాకృతిగా మలిచాడు త్యాగయ్య. పోతపోసిన త్యాగయ్య ముగ్ధభక్తికి ఇదొక నిదర్శనం.

- శొంఠి వేంకట రమణయ్య ఆహ్వానం మేరకు తంజావూరు దర్బారు హాలులో కచేరీ చేసేందుకు వెళ్లారు త్యాగయ్య. ఎప్పటిలాగే మనసునిండిన ఆర్ద్రతతో, రామభక్తిలో లీనమై కాంభోజీ రాగంలో **'మరిమరి నిన్నే మొరలిడ నీ మనసున నిన్నే'** అంటూ గానం చేస్తున్నారాయన. ఎవరికీ సమయం గుర్తుకురావటం లేదు. కచేరీ ఎనిమిది గంటలు సాగింది. కచేరీ పూర్తయ్యాక శరభోజీ మహారాజు ఆస్థానంలో అదే రోజు కచేరి ఉందనే విషయం జ్ఞప్తికి వచ్చి అదరూ వణికిపోయారు. తెల్లవారింది. ఒక్కొక్కరే సభకు చేరుకుంటున్నారు. శరభోజీ మహారాజు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాడు. రాజుకు సమాధానం చెప్పే ధైర్యం ఏ ఒక్కరూ చెయ్యలేకపోతున్నారు. నెమ్మదిగా శొంఠి వేంకట రమణయ్యే కల్పించుకుని జరిగిందంతా చెప్పాడు. రాజు శాంతించాడు. త్యాగయ్య గానం తానూ వినాలని కోరుకున్నాడు.

- ఆ రోజుల్లో తమిళనాట ఉగాది పండుగను అట్టహాసంగా జరుపుకునే ఆచారం ఉండేది. తంజావూరు దర్బారు హాలులో గొప్ప ఉత్సవం జరిగేది. ప్రసిద్ధి చెందిన విద్వాంసులంతా కచేరీలు చేసేవారు. అప్పటికే త్యాగయ్య కృతులు ఆనోటా ఈనోటా ప్రచారమవుతూ చివరకు ఆయన గురువైన శొంఠి వేంకట రమణయ్యకు చేరాయి. ఆ ఏడాది ఉగాది వేడుకల్లో కచేరీ చేయాల్సిందిగా త్యాగయ్యను ఆహ్వానించారు. **'దొరకునా ఇటువంటి సేవ ... దొరకునా అల్ప తపమొనరించిన భూసురవరులకునైన సురలకైన...'** అంటూ బిలహరి రాగంలో త్యాగయ్య అప్పటికప్పుడు కృతిని రచించి, స్వరపరిచి గానం చేశారు. రాగాలాపన, నెరవులు వంటి మనోధర్మ ప్రక్రియలను ప్రకటిస్తూ త్యాగయ్య చేసిన అసమానమైన కళాప్రదర్శనకు ఆ సభలో ఉన్న పండితులంతా ఆశ్చర్యపోయారు. చరిత్రకారుల అంచనా ప్రకారం ఈ ఘటన 1792లో జరిగింది. మూడుశతాబ్దాల నాడు త్యాగయ్య రాసిన ఓ సంగీత కృతి పల్లవి 'దొరకునా ఇటువంటి సేవ' ఓ పదప్రయోగంగా మారి ఇప్పటికీ తెలుగువారి నోళ్లలో సామెతగా వ్యాప్తిలో ఉంది.

- త్యాగరాజుకు కోపం కొంచెం ఎక్కువగానే ఉండేది. కానీ, అది క్షణకోపం మాత్రమే. అయితే, ఆ కాసేపటిలోనే ఎంతో విసురు ప్రదర్శించేవారు. ఓ రోజున త్యాగయ్య శిష్యులకు పాఠం చెబుతున్నారు. అదే సందర్భంలో ఆయన భార్య కమలాంబ ఇంటి ముందు నువ్వులు ఆరబెట్టింది. కాసేపటికి ఓ చిన్నకుర్రవాడు తెలియని తనంలో ఆ నువ్వుల మీదుగా పరిగెత్తాడు. అది చూసిన త్యాగరాజుకు కోపం చిర్రెత్తుకు వచ్చింది. పరుగెత్తికెళ్లి పిల్లాడిని పట్టుకుని దండించాడు. భార్య మాటలతో తన తప్పు తెలుసుకున్న త్యాగరాజు ఆశువుగా **'శాంతము లేక సౌఖ్యము లేదు / సారస దళ నయన / దాంతునికైన వేదాంతునికైన' అంటూ కృతి పాడారు. ఇదే కృతిలో 'యాగాది కర్మలన్నియు జేసిన / భాగవతులనుచు బాగుగ బేరైన'** అంటారు త్యాగయ్య. శాంతచిత్తం లేకుండా చేసే యజ్ఞయాగాది క్రతువులు, చదివిన ఆగమశాస్త్రాలు ఫలితాన్ని ఇవ్వవని విస్పష్టంగా ప్రకటించారు. త్యాగయ్యది మూఢభక్తి కాదని, జీవితసారాన్నే కృతులుగా మలిచారని చెప్పటానికి ఇదొక ఉదాహరణ.

–డా. కప్పగంతు రామకృష్ణ



అనంత కృపను తక్కువ చేసుకోకు



భగవానుడి అనుగ్రహానికి కారణాలు ఉండవు. ఆయనది నిర్హేతుకమైన కృప. దానిని అర్థం చేసుకోవడంలో తపశ్శక్తి సంపన్నులు కూడా విఫలమవుతుంటారు. పరమాత్మ పరమ దయాళువు. తన భక్తుడు ఏం కోరుతాడా అని ఎదురు చూస్తూ ఉంటాడట. ఏది కోరితే అది ఇవ్వడానికి ఆయన సదా సిద్ధంగా ఉంటాడట. కానీ, ఆ విషయం తెలియక అల్పమైన కోరికలు అడిగి దేవుడిని నిరుత్సాహ పరుస్తుంటారు భక్తులు. కొండంత దైవం అండగా ఉండాలనుకోవాలి కానీ, గోరంత కోరికలు కోరడం అమాయకత్వమే అవుతుంది. సదా భగవానుడి సన్నిధిలో ఉండడానికి అనుమతివ్వమని అడిగినా ఆయన కాదనడని ఎన్నో పురాణ గాథలు స్పష్టం చేస్తున్నాయి. దేవుడెన్నటికీ భక్తుల మాట జవదాటడు. అలాంటి కల్పతరువును కృప పరిపూర్ణంగా వర్షించేలా చేసుకునే బాధ్యత భక్తులదే! అంతేగానీ, పరమాత్మ అనుగ్రహాన్ని సంకుచితం చేసుకోకూడదు. ఉత్తమ పురుషార్థాన్ని అర్థించి శాశ్వతంగా ఆయన పద సన్నిధిలో నిలిచిపోయే వరం పొందడమే కావాల్సింది.

అల్పమైన ప్రాపంచిక విషయాల గురించి దైవానుగ్రహాన్ని వృథా చేసుకోకూడదు. అనంతమైన ఆనందమే పరమావధిగా ఆయన సాక్షాత్కారాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉత్కృష్టమైన మానవ జన్మను అందుకు సాధనంగా ఉపయోగించుకోవాలి. దైవ సాన్నిధ్యం, సదా ఆయన నామాన్ని స్మరిస్తూ ఉండటమే ఉత్తమ పురుషార్థంగా చెబుతారు. చతుర్విధ పురుషార్థాల కంటే ఇది విలువైనది. భగవానుడి సన్నిధికి చేరుకోగలిగితే.. ఆ దేవదేవుడి సుగుణాలు, ఆయన చూపించే ప్రేమ, కురిపించే కరుణ, వ్యక్తపరిచే స్నేహం అన్నీ పొందవచ్చు. తిరుప్పావై పాశురాల ద్వారా గోదాదేవి భక్తకోటికి తెలియజేసిందీ ఇదే! ధనుర్మాస వ్రతంతో భగవానుడి పరిపూర్ణ అనుగ్రహాన్ని పొందింది ఆ తల్లి. ఆ వ్రతాన్ని ఎలా ఆచరించాలో లోకానికి తెలియజేసి.. అంతటి అదృష్టాన్ని అందరూ పొందాలని ఆశించింది. అందుకే ఆ గోదాదేవి ప్రాతఃస్మరణీయురాలైంది. ఆ తల్లి కీర్తించిన పాశురాలు సుప్రభాత గీతాలయ్యాయి.

ఆయనకే తెలియలేదు

ద్వాపరయుగంలో కృష్ణ భగవానుడు సాందీపని మహర్షి దగ్గర విద్యాభ్యాసం చేశాడు. 64 రోజుల పాటు గురుకులంలో ఉండి 64 కళలను ఔపోసన పట్టాడు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత గురుదక్షిణ ఏమివ్వాలని కోరాడట కృష్ణుడు. ఏమడగాలో తెలియక సాందీపని మహర్షి భార్యను సంప్రదించి.. కాలం చేసిన తన తనయుడిని తెచ్చివ్వమని అడిగాడట. ఆ సమయంలో ఉత్తమ పురుషార్థం అడిగినా కాదనేవాడు కాదు కృష్ణుడు. కానీ, సంతానం కోరుకున్నాడు గురువు. అదే నెరవేర్చాడు. అంతటి మహనీయుడికే భగవానుడితో ఏం కోరుకోవాలో తెలియనప్పుడు.. సామాన్య భక్తుల మాటేమిటి?

జూపల్లి రామేశ్వరరావు గృహంలో జరిగిన ధనుర్మాస ఉత్సవంలో శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి అనుగ్రహభాషణంలో భాగం

సందర్భం



రుషుల సమావేశం

మనమూ వెళ్దామా?

సంక్రాంతి పండగ తెలుగు నేలంతా వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాలో జరిగే ఓ వేడుక మాత్రం ఆసక్తిగొలుపుతుంది.

చిత్తూరు జిల్లా నగరిలో జరిగే కొండచుట్టు వేడుక అనేక రకాలుగా ఆసక్తికమైంది. పూర్వం దేవతలందరూ కలిసి రుషుల సమక్షంలో సమావేశమై తమతమ ప్రాంతాల బాగోగుల గురించి చర్చించారని, పాడిపంటల గురించి మాట్లాడుకున్నారని, ఇప్పటికీ వారు సమావేశం అవుతుంటారని ప్రజలు నమ్ముతారు. దానికి ముందు కైలాసగిరికి ప్రదక్షిణ చేస్తారని భావిస్తారు. గిరిని చుట్టిన తర్వాత జరిగే వేడుక కాబట్టి దీనికి గిరి ప్రదక్షిణ ఉత్సవం లేదా కొండచుట్టు ఉత్సవం అనే పేరుతో వేడుకలు నిర్వహిస్తారు. ఇప్పటికీ కైలాసగిరిలో రుషులు తపస్సు చేస్తున్నారని, మకర సంక్రాంతి తరువాత రెండో రోజు వారు తపోదీక్షను ముగించుకుని గిరి ప్రదక్షిణ చేస్తారని విశ్వాసం. దీనికి నిదర్శనంగా వారందరూ సమావేశం అవ్వడానికి వీలుగా నగరి పట్టణంలోని కరకంఠేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తారు. ఆలయంలోని ఆగస్త్యేశ్వరస్వామి, కరకంఠేశ్వరస్వామి సమక్షంలో పంచాగ శ్రవణానికి కూర్చున్నట్లుగా ఏర్పాట్లుంటాయి. దీనికి వేలాది మంది ప్రజలు హాజరవుతారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచీ ఈ వేడుకలు నిర్వహస్తున్నారు. ఈసారి ఈ సమావేశాన్ని ఈనెల 17 సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహిస్తున్నారు. తిరుపతికి 48 కిలోమీటర్ల దూరంలో నగరి పట్టణం ఉంది.

– ఈ. శివరామప్రసాద్, తిరుపతి

ఇస్లాం సందేశం

అలాంటి మాటలు చెప్పిన వారు....

ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చెప్పే మాటలతో మనుషుల మధ్య సంబంధాలు దెబ్బతింటాయి. స్నేహాలు చెడతాయి. ఒకరి గురించి మరొకరికి చాడీలు చెప్పే దురలవాటు చాలామందికి ఉంటుంది. ఇలాంటి వారు ఎప్పటికీ స్వర్గంలో ప్రవేశించలేరని హెచ్చరించారు ప్రవక్త (స).

ఈనాడు సినిమా





జో, రిచా గంగోపాధ్యాయ్

పెళ్లి కుదిరింది

బిజినెస్ స్కూల్‌లో పరిచయం

కథానాయిక రిచా గంగోపాధ్యాయ్‌కి జో అనే వ్యక్తితో నిశ్చితార్థం జరిగింది. ఆ విషయాన్ని ఆమె సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. 'లీడర్'తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె 'మిరపకాయ్', 'మిర్చి' తదితర చిత్రాలతో విజయాల్ని అందుకొన్నారు. తమిళం, బెంగాలీ చిత్రాల్లోనూ మెరిశారు. కథానాయికగా అవకాశాలు అందుతున్న క్రమంలోనే ఆమె చిత్ర పరిశ్రమకి గుడ్ బై చెప్పి, చదువుల కోసం అమెరికా వెళ్లిపోయారు. బెంగాలీ మూలాలున్న ఆమె కుటుంబం అమెరికాలోనే స్థిరపడ్డారు. "బిజినెస్ స్కూల్‌లో జో పరిచయమయ్యాడు. తనతో రెండేళ్ల ప్రయాణం అద్భుతంగా సాగింది. జోతో నిశ్చితార్థం జరిగింది. నా జీవితంలో తదుపరి దశ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. పెళ్లి రోజు ఇంకా ఖరారు కాలేదు" అని ట్వీట్ చేశారు రిచా.

కథానాయకుడు విశాల్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు. హైదరాబాద్‌కి చెందిన అనీషా ఆళ్లతో ఆయనకి వివాహం నిశ్చయమైంది. వ్యాపారవేత్త కుమార్తె అయిన అనీషా ఆళ్ల కూడా నటిగా గుర్తింపు తెచ్చుకొన్నారు. 'పెళ్ళిచూపులు', 'అర్జున్‌రెడ్డి' చిత్రాల్లో ఆమె తళుక్కున మెరిశారు. పెద్దలు కుదిర్చిన

పెద్దల ఇష్టంతో

ఈ వివాహ విషయాన్ని విశాల్‌కి కాబోయే భార్య అనీషా మంగళవారం సామాజిక మాధ్యమాల ద్వారా బయటపెట్టారు. బుధవారం కథానాయకుడు విశాల్ ట్విటర్ ద్వారా స్పందిస్తూ... "అవును... చాలా సంతోషంగా ఉంది. ఆమె పేరు అనీషా ఆళ్ల. ఆమె తన అంగీకారం తెలిపింది. పెళ్లి ఖరారైంది. నా జీవితంలో ఒక పెద్ద పరిణామం ఇది. త్వరలోనే పెళ్లి తేదీని ప్రకటిస్తా" అన్నారు. విశాల్ తెలుగు, తమిళ భాషల్లో మాస్ కథానాయకుడిగా గుర్తింపు తెచ్చుకొన్నారు. నిర్మాతగానూ రాణిస్తున్నారు.



విశాల్, అనీషా

అదంతా అవసరమా?

నాలో నాకు నచ్చేది నా నవ్వే అని చెప్పే కథానాయికల్ని చూస్తూనే ఉంటాం. అందమైన ముద్దుగుమ్మలు అరనవ్వు నవ్వి తెరపై సందడి చేసినా... కథానాయకులు వాళ్ల మైకంలో పడిపోతుంటారు మరి! రష్మిక మందన్న తన నవ్వు గురించే కాదు... ఎదుటివాళ్లలోనూ నేను మొదట చూసేది నవ్వునే అంటోంది. "ఊరికే నవ్వడం ఎందుకు అంటుంటారు చాలామంది. ఆ మాట నాకు అస్సలు నచ్చదు. ఎదుటి వ్యక్తిని నవ్వుతో పలకరిస్తే ఎంతో అందంగా ఉంటుంది. అందుకే నా పెదాలపై నవ్వు చెరిగిపోనివ్వను. నాతో మాట్లాడే వాళ్లు అలాగే ఉండాలనుకొంటా" అని చెప్పుకొచ్చింది రష్మిక. ప్రస్తుతం ఆమె విజయ్ దేవరకొండతో కలసి 'డియర్ కామ్రేడ్' చిత్రంలో నటిస్తోంది. తదుపరి నితిన్‌తో కలసి 'భీష్మ' కోసం రంగంలోకి దిగబోతోంది. ఏ విషయంలోనైనా ప్రాక్టికల్‌గా ఆలోచించడమే నా బలం అంటోందామె. "ముందుగానే అతిగా ఆశపడటం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తి చేసి బయటికొచ్చాకే దాని ఫలితం గురించి ఆలోచించడం మొదలుపెడతా. ఆశపడాలి, అది నెరవేరకపోతే నిరాశపడాలి. అదంతా అవసరమా అనిపిస్తుంటుంది" అని చెప్పింది రష్మిక.



రష్మిక



కమల్‌హాసన్



సిద్ధార్థ్

'భారతీయుడు 2'లో సిద్ధార్థ్?

కమల్‌హాసన్‌కి మనవడిగా సిద్ధార్థ్ నటించబోతున్నారా? అవుననే అంటున్నాయి తమిళ సినీ వర్గాలు. కమల్‌హాసన్ - శంకర్ కలిసి 'భారతీయుడు'కి కొనసాగింపుగా 'భారతీయుడు 2' చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా లుక్‌ని సంక్రాంతి సందర్భంగా విడుదల చేశారు. ఈ నెల 18 నుంచి చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. ఇందులో కమల్‌హాసన్‌కి మనవడి పాత్ర కీలకమట. ఆ పాత్ర కోసం పలువురు తమిళ కథానాయకుల్ని పరిశీలించిన దర్శకుడు శంకర్... సిద్ధార్థ్‌ని ఖరారు చేశారని ప్రచారం సాగుతోంది. ఇందులో ఓ హిందీ కథానాయకుడు కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నట్టు సమాచారం. చిత్రం సెట్స్‌పైకి వెళ్లేలోపు ఆ విషయాలన్నీ వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఇందులో కమల్‌హాసన్ సరసన కాజల్ నటించబోతోంది.

బ్రహ్మానందంకి శస్త్రచికిత్స



ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం (62)కి ముంబయిలోని ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో గుండెకి సంబంధించిన శస్త్ర చికిత్స జరిగింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన తీవ్ర అస్వస్థతకి గురయ్యారు. దాంతో ఆయన్ని హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు ఆయన్ని ముంబయికి తరలించారు. వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. సోమవారం డా.రమాకాంత్ పాండా నేతృత్వంలో బ్రహ్మానందంకి శస్త్రచికిత్స చేశారు. కొన్ని రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. బ్రహ్మానందం తనయులు రాజా గౌతమ్, సిద్ధార్థ్ ఆస్పత్రిలో తండ్రితో పాటే ఉంటూ చూసుకొంటున్నారు.

విడుదల షురూ

ప్రేమ మజిలీ



నాగచైతన్య

నాగచైతన్య, సమంత పెళ్లి తర్వాత కలిసి నటిస్తున్న చిత్రం 'మజిలీ'. 'దేర్ ఈజ్ లవ్... దేర్ ఈజ్ పెయిన్...' అనేది ఉపశీర్షిక. దివ్యాంశ కౌశిక్ మరో కథానాయిక. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మాతలు. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రంలోని రెండో లుక్‌ని విడుదల చేశారు. ఇందులో నాగచైతన్య క్రికెటర్‌గా కనిపిస్తున్నారు. 'నిన్ను కోరి' తర్వాత శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే 80 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకొంది. విశాఖపట్నం నేపథ్యంలో ఒక రొమాంటిక్ కథతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు సినిమా వర్గాలు వెల్లడించాయి. రావు రమేష్, పోసాని కృష్ణమురళి, సుబ్బరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: విష్ణు వర్మ.

అమెరికా టు ఇండియా



అల్లు శిరీష్

అల్లు శిరీష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఏబీసీడీ'. రుక్సార్ ధిల్లాన్ కథానాయిక. సంజీవ్‌రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. యశ్ రంగినేని, మధుర శ్రీధర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డి.సురేష్‌బాబు సమర్పిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటున్న ఈ సినిమాని మార్చి 1న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. "మలయాళంలో విజయవంతమైన 'ఏబీసీడీ'కి రీమేక్‌గా రూపొందుతున్న చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటుందీ కథ. అమెరికాలో విలాసవంతమైన జీవితాన్ని గడిపిన ఓ యువకుడు, ఏ పరిస్థితుల్లో ఇండియాకి వస్తాడు? వచ్చాక అతని జీవితం ఎలా సాగుతుంది? అనే విషయాలు ఆసక్తి రేకెత్తిస్తాయి. వినోదానికి పెద్ద పీట వేస్తూ రూపొందించిన ఈ చిత్రంలో అల్లు శిరీష్ స్నేహితుడిగా, తెలుగు ప్రేక్షకులకు బాలనటుడిగా పరిచయమైన భరత్ నటించారు. కథానాయకుడికి తండ్రి పాత్రలో నాగబాబు నటించారు" అన్నారు నిర్మాతలు.

వినోదాల చిత్రలహరి



సాయిధరమ్ తేజ్

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'చిత్రలహరి'. కల్యాణి ప్రియదర్శిన్, నివేదా పేతురాజ్ కథానాయికలు. కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, మోహన్ చెరుకూరి నిర్మాతలు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమాని ఏప్రిల్ 12న విడుదల చేయాలని నిర్ణయించారు. దర్శకుడు మాట్లాడుతూ "అనుభూతిని పంచే ఓ చిత్రమిది. భావోద్వేగాలతో పాటు, వినోదం ఆకట్టుకుంటుంది. పేరులో ఐదక్షరాలు ఉన్నట్టుగానే, సినిమాలో ఐదు పాత్రలకి ప్రాధాన్యం ఉంటుంది. ఎక్కువగా కథ ఆ పాత్రల చుట్టూనే తిరుగుతుంది. సాయిధరమ్ తేజ్ కెరీర్‌లో ఓ ఉత్తమమైన చిత్రం అవుతుంది" అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "సాయిధరమ్ తేజ్‌ని కొత్త తరహాలో చూపెట్టబోతున్నారు దర్శకుడు. ఆయన శైలి హాస్యంతో పాటు భావోద్వేగాలుంటాయి. దేవిశ్రీప్రసాద్ సంగీతం చిత్రానికి ఆకర్షణగా నిలుస్తుంది" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కార్తీక్ ఘట్టమనేని, కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, కళ: ఎ.ఎస్.ప్రకాష్.

ఊరంతా అనుకుంటున్నారు



కృష్ణ, విజయనిర్మల

నవీన్ విజయకృష్ణ, శ్రీనివాస్ అవసరాల, మేఘా చౌదరి, సోఫియా సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. బాలాజి సానల దర్శకుడు. శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్.రెడ్డి, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. నవీన్ విజయకృష్ణ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లో ప్రముఖ నటులు కృష్ణ, విజయనిర్మల ఈ సినిమా టైటిల్ లోగో, టీజర్‌లను ఆవిష్కరించారు. సినిమా ఫస్ట్‌లుక్‌ని విజయనిర్మల, నరేష్ విడుదల చేశారు. కృష్ణ మాట్లాడుతూ "పేరు బాగుందంటే సగం సినిమా విజయవంతమైనట్టే. ఆంగ్ల పదాలతో సినిమాకి పేర్లు పెడుతున్న ఈ రోజుల్లో నేటివిటీతో కూడిన 'ఊరంతా అనుకుంటున్నారు' పేరుని నిర్ణయించిన చిత్రబృందాన్ని అభినందిస్తున్నాన"న్నారు. "ఈ సినిమా టీజర్ బాగుంది. నవీన్‌కి మంచి భవిష్యత్ ఉంటుంద"న్నారు విజయనిర్మల. నరేష్ మాట్లాడుతూ "క్లాస్, మాస్, కుటుంబాలు మెచ్చే వినోదభరితమైన సినిమా ఇద"న్నారు. నవీన్ మాట్లాడుతూ " పల్లెలోని కుటుంబ వాతావరణం నేపథ్యంలో నడిచే ప్రేమకథా చిత్రమిద"న్నారు.


'సైరా...' రాజా పాండి



విజయ్ సేతుపతి

చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. అమితాబ్ బచ్చన్, నయనతార, తమన్నా, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకుడు. రామ్‌చరణ్ నిర్మాత. బ్రిటిష్ పాలనపై తిరుగుబాటు చేసిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంతో తమిళ నటుడు విజయ్ సేతుపతి కూడా ముఖ్యభూమిక పోషిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా బుధవారం చిత్రబృందం విజయ్ పోషిస్తున్న రాజా పాండి పాత్ర లుక్‌ని విడుదల చేసింది. అందులో వీరుడిగా, శివభక్తుడిగా విజయ్ సేతుపతి కనిపిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే అవకాశాలున్నాయి.

సినిమానే శ్వాస సినిమానే జీవితం



భారతీయ తొలి టాకీ చిత్రం 'ఆలం ఆరా' మొదలుకొని తెలుగు, తమిళం, కన్నడ భాషల తొలి టాకీల్లోనూ మెరిసిన అరుదైన నటుడు...

తెరవేల్పులుగా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయిన ఎన్టీఆర్, ఎస్వీఆర్‌లని పరిచయం చేసిన దర్శకుడు...

ఒక థియేటర్ దగ్గర డోర్ కీపర్‌గా పనిచేసి ఆ తర్వాత పదుల సంఖ్యలో చిత్రాల్ని రూపొందించి సంచలన విజయాలు అందుకొన్న నిర్మాత.

- ఇలా నటుడు, దర్శకుడు, నిర్మాతగానే కాదు... సినిమా పెట్టెలు మోయడం దగ్గర్నుంచి ఛాయాగ్రాహకుడిగా, రచయితగా, ప్రొడక్షన్ మేనేజర్‌గా, సహాయ దర్శకుడిగా... ఇలా ప్రతి విభాగంతోనూ అనుబంధమున్న తొలి తరం సినీ దిగ్గజం ఎల్వీ ప్రసాద్. స్టూడియోల చుట్టూ తిరిగిన ఆయన పలు స్టూడియోలకి అధిపతి అయ్యారు. సినీ చిత్ర పరిశ్రమకే మార్గదర్శిగా నిలిచారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తాను అనుకొన్నది సాధించేవరకు వెనకడుగు వేయని ఆయన ప్రయాణం నవతరానికి స్ఫూర్తిదాయకం. ఆయన జీవితం సినీ ఔత్సాహికులకు ఓ గొప్ప పాఠం. తన జీవితం మొత్తాన్ని సినిమాకే అంకితం చేసిన ఎల్వీ ప్రసాద్ 111వ జయంతి ఈ రోజు.



ఎల్వీ ప్రసాద్

రూ.100తో ముంబైకి

కాడిగట్టి పొలం దున్నడమే ఆయనకి తెలుసు. తెలుగు తప్ప మరే భాష తెలియదు. కానీ సినిమా అంటే ఎంతో ప్రేమ. అదే ఆయన్ను ఎవ్వరికీ చెప్పా పెట్టకుండా బొంబాయి రైలెక్కేలా చేసింది. అక్కడికి వెళ్లాక జేబులో ఉన్న డబ్బు దొంగలపాలైంది. ఆ తర్వాత జీవితం రోడ్డుపాలైంది. అయినా ఆయన వెనకడుగు వేయలేదు. ఒక చిన్న దర్జీ కొట్టులో పనిచేస్తూ తాను కన్న కలల్ని సాకారం చేసుకొనేందుకు ముందడుగు వేశారు. తొలుత వీనస్ పిక్చర్స్‌లో అడుగు పెట్టిన ఆయన అది మూతపడగానే, ఆ తర్వాత ఇండియా పిక్చర్స్‌లో చేరారు. చిన్న వేషంతో ఆయన నటుడిగా సినీ ప్రయాణం ఆరంభించారు. ఆ తర్వాత భారతీయ మొట్ట మొదటి టాకీ చిత్రం 'ఆలం ఆరా'లో నాలుగైదు చిన్న వేషాలు వేశారు. ఆ తర్వాత ఇంపీరియల్ కంపెనీలో చేరారు. అక్కడ హెచ్.ఎం.రెడ్డి పరిచయం కావడంతో తమిళం, తెలుగు తొలి టాకీ చిత్రాలైన 'కాళిదాసు', 'భక్తప్రహ్లాద' చిత్రాల్లో నటించే అవకాశం ఎల్వీ ప్రసాద్‌కి లభించింది. ఒక పక్క నటుడిగా తెరపై కనిపిస్తూనే మరో పక్క పలు విభాగాల్లో పనిచేస్తూ అపార అనుభవం సంపాదించారాయన. 'గృహప్రవేశం'తో పాటు పలు చిత్రాల్లో కథానాయకుడిగా నటిస్తూనే దర్శకత్వం వహించి విజయాల్ని అందుకొన్నారు. 'మనదేశం', 'షావుకారు', 'పెళ్ళిచేసి చూడు', 'మిస్సమ్మ', 'సంసారం', 'పరదేశి', 'ఇలవేల్పు'... ఇలా ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలొచ్చాయి. హిందీలో ప్రసాద్ ప్రొడక్షన్స్ పేరుతోనూ ఆయన స్వీయ నిర్మాణంలో తెరకెక్కించిన ఎన్నో చిత్రాలు విజయవంతమయ్యాయి. దక్షిణాది చిత్ర పరిశ్రమకి ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టిన ఆయన 1982లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కారం స్వీకరించారు. 1980లో 'రఘుపతి వెంకయ్య' పురస్కారాన్ని అందుకొన్నారు. ప్రసాద్ ప్రొడక్షన్స్‌తో పాటు ఆయన పేరుతో పలు నగరాల్లో ఫిల్మ్ లాబొరేటరీలు, విజువల్ ఎఫెక్ట్స్ స్టూడియోలు, సినిమా ఇన్‌స్టిట్యూట్‌లు, మల్టీపెక్స్ థియేటర్లు నడుస్తున్నాయి.

బయోపిక్ కోసం సంప్రదిస్తున్నారు

"నాన్న జీవితంలో ఎన్నో మలుపులు, మరెన్నో సాహసాలున్నాయి. అవన్నీ నవతరానికి స్ఫూర్తిదాయకం. అందుకే తరచుగా నాన్న జీవితం ఆధారంగా బయోపిక్ చేయొచ్చంటూ పలువురు దర్శకులు వస్తుంటారు. ప్రస్తుతానికి నాకు ఆ ఆలోచనైతే లేదు. నాన్నకి సినిమానే సమస్తం. ఆయన దారిలోనే మేం అడుగులు వేస్తున్నాం. నాన్న పేరుతో నిర్వహిస్తున్న మా ల్యాబ్‌లకి ఫిల్మ్ ప్రాసెసింగ్‌లో 18 సార్లు జాతీయ పురస్కారాలు వచ్చాయి. చిత్ర నిర్మాణం కూడా ఉధృతంగా చేపట్టాలనే ఆలోచన ఉంది కానీ... ప్రేక్షకుల అభిరుచుల్లో చాలా మార్పులొచ్చాయి. మేం ఆ మధ్య రెండు మంచి చిత్రాలు తీశాం కానీ.. అవి విజయవంతం కాలేదు. సమాజానికి మనం తిరిగి ఇవ్వాలని చెప్పేవారు నాన్న. అందుకే 'ప్రేక్షకులు నా సినిమాలు చూశారు కాబట్టే నేను ఇంతవాణ్నయ్యాను. ఎవరైతే చూడలేరో వాళ్ల కోసం ఏదైనా చేయాలి' అనుకొని గుళ్లపల్లి నాగేశ్వరరావుగారితో కలసి ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ని ఏర్పాటు చేశారు. మా స్టూడియోలోని ఐదెకరాలు ఆ సంస్థకే ఇచ్చాం. ప్రపంచంలోనే అత్యుత్తమ సేవలు అందిస్తోంది".

– ఎ.రమేష్ ప్రసాద్

కాళ్లపగుళ్లకు పెట్రోలియంజెల్లీ

చలికాలంలో ప్రతి ఒక్కరి దగ్గరా ఉండాల్సిన వాటిల్లో పెట్రోలియం జెల్లీ ఒకటి. మరి దీన్ని ఎలా ఉపయోగించొచ్చంటే...



- ఈ కాలంలో కాళ్లు పగిలి ఇబ్బందిపెడతాయి. ఈ సమస్యతో బాధపడేవారు పాదాలు శుభ్రంగా కడిగి కాస్త పెట్రోలియం జెల్లీని తడి ఆరకుండానే రాసుకోవాలి. కాసేపాగి సాక్సు వేసుకోవాలి. ఇలా చేస్తే పగుళ్లు తగ్గుతాయి.
- చర్మమే కాదు గోళ్లూ ఈ కాలంలో పొడిబారతాయి. చిట్లిపోతుంటాయి. ఇలాంటప్పుడు పెట్రోలియం జెల్లీని గోళ్లు, వాటి చుట్టూ ఉండే చర్మానికి రాసి మృదువుగా మర్దన చేయాలి. ఇలా కనీసం రోజూ రెండు సార్లు చేస్తుంటే ఆరోగ్యంగా ఉంటాయి.
- మోచేతులు, మోకాళ్లు పొడిబారి, బరకగా కనిపిస్తున్నాయా... ప్రతీరోజూ పెట్రోలియం జెల్లీని రాసుకుని మర్దన చేయాలి. మరీ ఎక్కువగా చర్మం పొడిబారుతుంటే పెట్రోలియం జెల్లీతోపాటు కాస్త మాయిశ్చరైజర్ రాస్తే... చర్మం తాజాగా ఉంటుంది.

వసుంధర

పేదరికం వెక్కిరించినా... పరిస్థితులు ఎదురునిలిచినా... బాగా చదువుకుని, తనకాళ్లపై తాను నిలబడాలనుకుంది. అంతలోనే ఆమె జీవితంలో కుదుపు. ప్రేమించను అన్న పాపానికి ఓ మృగాడి యాసిడ్ దాడికి బతికున్న శవంలా మారింది. అలాగని నాలుగ్గోడలకే పరిమితం కాలేదు. ఛీత్కారాలు, ఛీదరింపుల్ని భరిస్తూ బ్యాంకు ఉద్యోగం సంపాదించుకుంది. తన స్థితికి కారణమైన కర్కశుడిని కటకటాల వెనక్కి నెట్టించింది. తనలాంటి మరెంతోమంది అభాగ్యుల కోసం కొత్త చట్టం వచ్చేలా చేసింది. ఆమే చండీగఢ్‌కు చెందిన ఇంద్రజిత్ కౌర్ రూబీ.

కాలిపోయింది శరీరమే!



మాది చండీగఢ్, మరౌలీకలన్ గ్రామం. అమ్మ, అన్నయ్య, నేను. చిన్న కుటుంబం. నాన్న నా చిన్నప్పుడే చనిపోయారు. చిన్నప్పటి నుంచి చదువంటే చాలా ఇష్టం. దాంతో అమ్మకు భారం కాకుండా, చదువుకుంటూనే చుట్టుపక్కల పిల్లలందరికీ ట్యూషన్లు చెప్పేదాన్ని. ఆ డబ్బులో కొంత నాకోసం ఖర్చు పెట్టుకుని మిగిలింది అమ్మకు ఇచ్చేదాన్ని. అది 2011. ఇంటర్ పూర్తవడంతో చండీగఢ్ విశ్వవిద్యాలయంలో డిగ్రీలో చేరా. అదయ్యాక పీహెచ్‌డీ చేసి పెద్ద సంస్థలో ఉద్యోగం చేయాలని నా ఆశ. కానీ అన్నీ మనం అనుకున్నట్లుగా జరగవు కదా... అప్పుడు బీఏ రెండో ఏడాదిలో ఉన్నా. డిసెంబరు 8. నా ఆశలన్నీ కూలిపోయిన రోజది. ఉదయం తలుపు కొట్టిన చప్పుడైతే, వెళ్లి తీశా. ఎదురుగా జిరక్‌పూర్‌కు చెందిన మన్‌జిత్‌సింగ్. అతడి కళ్లు ఎర్రగా చింతనిప్పులా ఉన్నాయి. గతంలో నన్ను పెళ్లి చేసుకోమని వేధిస్తే, తిరస్కరించా. ఇప్పుడు కూడా అదే ప్రతిపాదనతో వచ్చి ఉంటాడనుకున్నా. వాడి చేతిలో పెద్ద జగ్గు ఉంది. ఏంటని అడిగేలోపే, అందులోని ద్రవాన్ని నాపై ఒంపేసాడు. నిప్పుకణికలు మీద పోసినట్లు ముఖమంతా మంట. భరించలేని నొప్పి. అమ్మా... అంటూ నేను అరచిన అరుపు నాకు ఇప్పటికీ గుర్తు. ఏం జరిగిందో తెలిసేలోపే దాదాపు నా ముఖమంతా కాలిపోయింది. నా చేతులు, మెడ, ఛాతీపై తీవ్ర గాయాలయ్యాయి. నన్ను చూసి అమ్మ వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లింది. ఆ సమయంలో నేను అనుభవించిన బాధ, ఆవేదన పగవాడికి కూడా రాకూడదనుకున్నా.

ఇంటికి రావొద్దన్నారు...

ముఖంలో అవయవాలన్నీ కాలిపోయి, చూపులేక నేను బాధపడుతోంటే చుట్టుపక్కల వారంతా నన్ను విమర్శించేవారు. నా గాయాల నొప్పికన్నా వారి మాటలే ఎక్కువగా బాధించేవి. అంతేనా, ఇంట్లో అమ్మ తప్ప అన్నయ్య సహా బంధువులంతా ఇంటికి రావొద్దని కచ్చితంగా చెప్పేశారు. ఆసుపత్రిలో పరిస్థితి మరీ ఘోరం. నర్సులు, వైద్యులు, అందరి ప్రవర్తన నా పట్ల కఠినంగా ఉండేది. నొప్పి భరించలేక, మత్తు ఇచ్చి చికిత్స చేయమని వేడుకొన్నా వాళ్లు కనికరించేవారు కాదు. మత్తు ఇవ్వకుండానే చికిత్స చేసేవారు. అవన్నీ ఎలా భరించానో నాకు మాత్రమే తెలుసు. ఒకసారి డాక్టర్‌ను నాకు నొప్పి తెలియకుండా చికిత్స చేయగలరా అని అడిగా. దానికి ఆయనిచ్చిన సమాధానం ఇప్పటికీ మరిచిపోలేను. 'ఈ బాధలన్నీ ప్రారంభం మాత్రమే. భవిష్యత్తులో చాలా బాధ నీకోసం ఎదురు చూస్తోంది...' అని చెప్పారు. మృగాలకు కూడా అలా చికిత్స చేయరేమో అని అనిపించేది. సానుభూతి, కనికరం కూడా చూపేవారు కాదు. నాపై యాసిడ్ పోసి నన్ను ఈ గతికి చేర్చిన వాడిని ఎవరూ ఒక్కమాట అనలేదు. బాధితురాలినైన నాపై అందరికీ ఎందుకింత ఏవగింపో తెలిసేది కాదు. అలా ఆ ఆసుపత్రిలో ఉన్నన్ని రోజులు నరకం అనుభవించా.





కోర్టుమెట్లెక్కా...

ఏడాది తరువాత, కాస్త కోలుకున్నాక యాసిడ్ బాధితులకు న్యాయం జరగాలని పంజాబ్, హరియాణా కోర్టులో వ్యాజ్యం వేశా. అలాగే నాపై యాసిడ్ పోసిన దుర్మార్గుడిని కఠినంగా శిక్షించాలని కోరా. అప్పుడే నా గురించి తెలిసిన ఫోర్టిస్ ఛారిటబుల్ ఫౌండేషన్ నాకు ఉచితంగా చికిత్స చేయిస్తామని ప్రకటించింది. అలా అక్కడ నాకు సరైన చికిత్స అందింది. నా ముఖానికి సర్జరీ చేశారు. వాళ్లు చూపే దయా, జాలీ, ప్రేమ నన్ను మామూలు మనిషిని చేశాయి. అలా దాదాపు మూడు సర్జరీలు, పన్నెండు లేజర్ చికిత్సలు జరిగాయి. ఇవన్నీ జరిగిన తరువాత నాకో రూపం వచ్చింది. ఇది జరిగిన మూడేళ్లకి నాపై యాసిడ్ పోసినవాడికి జిల్లా కోరు పదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే అప్పటికే మూడేళ్లైంది. ఇంక ఏడేళ్లపాటు శిక్ష అనేది చాలా తక్కువ. నేను అనుభవిస్తున్న నరకవేదనతో పోలిస్తే, వాడు అనుభవించేది ఏపాటిదనిపించింది. అందుకే మా న్యాయవాదితో చెప్పి, జీవితఖైదు పడేలా వాదించాలని కోరా. అలాగే నాలాంటి వారికి చికిత్స ఖర్చులు, పునరావాసం కల్పించాలని కోరుతూ చండీగఢ్ కోర్టులో పిటిషన్ వేశా. ఇందులో నా కేసును కోర్టు ప్రత్యేకంగా స్వీకరించింది. అంతేకాదు, నాలాంటివారందరికీ చికిత్స ఖర్చులు సహా పునరావాసం కల్పించాలని, విద్యకు చేయూతనివ్వాలని స్థానిక ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. గత రెండేళ్ల నుంచి ఇవన్నీ మా రాష్ట్రంలో అమల్లోకి వచ్చాయి. ఇది కొత్త చట్టం కూడా. నాకోసమే కాకుండా నాలాంటివారందరికీ మంచి జరిగింది కదా. అంతకన్నా కావల్సిందేముంటుంది.

మళ్లీ చదివా...

నా జీవితంలో కాస్త మార్పు వచ్చిందని అనుకునేలోపు ఇంట్లో వాళ్ల తీరుతో మళ్లీ కుంగిపోయా. వారికి నాపై ప్రేమ స్థానంలో ఏవగింపు, ఛీత్కారం కనిపించాయి. అమ్మ తప్ప మిగతావారందరూ ఇంట్లోంచి బయటకు వెళ్లిపొమ్మన్నట్లుగా ప్రవర్తించేవారు. ఖాళీగా కూర్చుని ఎవరికీ భారంగా కాకూడదనుకున్నా. దిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ విజ్యువల్లీ హ్యాండీక్యాప్డ్‌కు వెళ్లిపోయా. అక్కడికెళ్లిన తరువాతే నా చదువును ఎలా కొనసాగించొచ్చో తెలుసుకున్నా. అలా నాలుగేళ్లకు బీఏ పూర్తి చేశా. ఆ తరువాత ఎంఏ చదివా. బ్యాంకు పరీక్షలకు హాజరవడానికి శిక్షణ తీసుకున్నా. అయితే కంటిచూపు లేకుండా ఎలా చదివాను అనుకుంటున్నారు కదూ, పాఠ్యాంశాలన్నింటినీ ఆడియో రికార్డింగ్ ద్వారా వినేదాన్ని. ప్రతీదీ గుర్తు పెట్టుకునేదాన్ని. హాస్టల్ గదిలో నాతో కలిపి నలుగురం ఉండేవాళ్లం. అందులో నాతోపాటు మరొకరికి పూర్తిగా చూపులేదు. మిగతా ఇద్దరికీ పాక్షికంగా కనిపిస్తుంది. వారు మా పాఠాలను చదివి చెప్పేవారు. బ్రెయిలీ నేర్చుకున్నా. ఆ తరువాత డెహ్రాడూన్‌లో బ్రెయిలీలో కంప్యూటర్ కోర్సు పూర్తి చేశా. రెండేళ్ల క్రితం దిల్లీలో నా ముక్కుకు సర్జరీ చేశారు. అప్పటివరకు ఉద్యోగం వస్తుందనే నమ్మకం లేని నాకు, కాస్తంత ఆశ కలిగింది. దాంతో బ్యాంకు పరీక్షలకు ప్రయత్నించాలనిపించింది. అలా మూడు సార్లు హాజరయ్యా. గత ఏడాది జూన్‌లో పాసయ్యా. గత డిసెంబరు 10 నుంచి ప్రస్తుతం దిల్లీలో కెనరా బ్యాంకు లో క్లర్క్‌గా ఉద్యోగంలో చేరా. అంధుల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ పొందుపరిచిన కంప్యూటర్ ద్వారా నా విధులు నిర్వహిస్తున్నా. భవిష్యత్తులో మరిన్ని పరీక్షలు రాస్తా. ఈ ఉద్యోగంలో పైస్థాయికి చేరుకోవడానికి ప్రయత్నిస్తా.

– సిహెచ్. వసుంధరాదేవి

అలసటకు ఉసిరి

ఉన్నట్టుండి అలసటగా అనిపించడం, కళ్లు తిరుగుతున్నట్లు ఉండటం, ఏ పనీ చేయాలనిపించక పోవడం.... అప్పుడప్పుడూ ఎదురయ్యే సమస్యలే. అలాంటప్పుడు ఏం చేయొచ్చో చూద్దాం.



డాక్టర్ గాయత్రీదేవి, ఆరోగ్యపీఠం

ఇంటి వైద్యం

శరీరం బలహీనంగా ఉన్నా, రక్తహీనత, విటమిన్ల లోపం, నెలసరికి ముందు, ఎండలో విపరీతంగా తిరిగినా... ఇలా కావచ్చు. ఈ సమస్యలు ఎదురుకాకూడదంటే... సమయానికి ఆహారం తీసుకోవడం తప్పనిసరి. రోజులో కనీసం పది గ్లాసుల నీళ్లు తాగాలి. శరీరంలో నీటిశాతం తగ్గినా కళ్లు తిరుగుతాయి. అందుకే మానసిక ప్రశాంతత చాలా అవసరం. ఒత్తిడి ప్రభావం శరీరంపై పడినా, నిద్రలేమి ఉన్నా ఇలా కావచ్చు.

- గ్లాసు గోరువెచ్చటి నీటిలో ఒక పెద్ద చెంచా చొప్పున నిమ్మరసం, అల్లం రసం, రెండు చెంచాల తేనె కలిపి తాగితే... కళ్లు తిరిగే సమస్య తగ్గుతుంది.
- అలసటగా అనిపించినా, తిరిగినట్లు ఉన్నా వెంటనే గ్లాసు నీళ్లు తాగాలి. అలాగే శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి.
- గ్లాసు పలుచటి మజ్జిగలో చెంచా పుదీనా రసం, చెంచా నిమ్మరసం, పావు చెంచా వాము కలిపి తాగితే ఉపశమనం పొందొచ్చు.
- గ్లాసు మజ్జిగలో చెంచా చొప్పున గులాబీ రేకల గుజ్జు, చక్కెర కలిపి తాగితే శరీరానికి శక్తి వచ్చి నీరసం తగ్గుతుంది.
- గ్లాసు నల్లద్రాక్ష పళ్ల రసం తాగినా తక్షణ శక్తి వస్తుంది.
- సుగంధాలు కూడా శరీరానికి శక్తినిచ్చి కళ్లు తిరిగే సమస్యని తగ్గించడంలో తోడ్పడతాయి.
- మంచి కర్పూరం వాసన చూడాలి. ఆ వాసనకు మెదడు ఉత్తేజితం చెంది సమస్య తగ్గుతుంది.
- మంచి గంధం, కర్పూరం, కొద్దిగా కొబ్బరినూనె కలిపి, నుదుటి మీద లేపనంలా వేసుకున్నా నీరసం, నిస్తేజం తగ్గుతాయి.





- కప్పు చొప్పున ఉసిరి రసం, అల్లం రసం, చక్కెర కలిపి మరిగించి పానీయంలా తయారు చేసుకోవాలి. దీన్ని ప్రతిరోజూ రెండు పూటలా 30 మి.లీ. పరిమాణంలో తీసుకోవాలి. ఇలా చేస్తే నీరసం, కళ్లు తిరగడం లాంటి సమస్యలు ఉండవు. కళ్లు తిరుగుతున్నట్లు అనిపించినప్పుడు అర కప్పు పానీయాన్ని, అర కప్పు నీటితో కలిపి తీసుకుంటే తక్షణం శక్తి వస్తుంది.



మీ ప్రశ్నలు ఇకపై vasuayur@eenadu.net కు పంపించగలరు.

నజరానా



మొక్కల్ని నీటిలో పెంచేటప్పుడు ఆ కుండీలో చిన్న బొగ్గుముక్క వేస్తే... నాచు పట్టదు. నీళ్లు పరిశుభ్రంగా ఉంటాయి.

మీ అభిప్రాయాలు పంపాల్సిన మా చిరునామా:
వసుంధర,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ, అనాజ్‌పూర్,
హయత్‌నగర్ మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512
email: vasundhara@eenadu.net

ముత్యాల ముగ్గుల పోటీ

ఈటీవీ ఆంధ్రప్రదేశ్

జనవరి 14, 2019 విజేతలు

1. ఎం.అరుణ, దర్శి–ప్రకాశం 2. డి.అపర్ణ, నెల్లూరు 3. ఎం.ఇందిర, ఆదోని–కర్నూలు 4. ఎం.ప్రణయ, కొత్తగూడెం 5. ఎస్.పార్వతి, త్రిపురాంతకం–ప్రకాశం 6. వి.సరళ, నిజాంపట్నం – గుంటూరు 7. వై.జయలక్ష్మి, కర్నూలు 8. జి.క్రిష్ణవేణి, మంచికల్లు–గుంటూరు 9. డి.లక్ష్మి అన్నపూర్ణ, తెనాలి 10. సిహెచ్.రుక్మిణి, మోకిలా–రంగారెడ్డి


జనవరి 15, 2019 విజేతలు

1. కె.భార్గవి, కావలి–నెల్లూరు 2. జి.రాధిక, నక్కబొక్కలపాడు–ప్రకాశం 3. ఏ.బిందు, కొత్తపేట–హైదరాబాద్ 4. సిహెచ్.మాధవి, మేదరమెట్ల–ప్రకాశం 5.ఎం.మేఘ శేష, ముసునూరు–కృష్ణా 6. సి.సంధ్య, గుత్తి–అనంతపురం 7. కె.సుజాత, వనపర్తి 8. మను, బాపట్ల–గుంటూరు 9. ఎస్.శ్రీదేవి, కోడుమూరు–కర్నూలు 10. వి.శ్రీలత, అనంతపురం

బంగారం వెండి

16న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,102	3,088
వెండి (గ్రా)	42.90	42.60



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	33,500	33,380	32,500	32,800	32,750	32,750	33,470	33,420	32,980	32,980
ఆర్నమెంట్	31,260	31,180	30,200	30,400	30,280	30,280	31,020	30,880	30,680	30,680
వెండి(కిలో)	40,550	40,249	40,200	40,400	40,300	40,300	40,600	40,400	40,500	40,500

కడిగేసేయండిలా!



ఆఫీసు, కాలేజీ, స్కూలు... ఇలా ఎక్కడికి వెళ్లినా వెంట ఓ నీళ్ల సీసా ఉండాల్సిందే. ఆఖరికి ఇంట్లో తాగాలన్నా వాటినే ఎక్కువగా ఎంచుకుంటున్నాం. సౌకర్యం మాట ఎలా ఉన్నా... ఆ సీసాను ఎప్పటికప్పుడు శుభ్రపరచకపోతే అనారోగ్యాలు తప్పవు.

- వీలైనంత వరకు ప్లాస్టిక్ సీసాలకు దూరంగా ఉండాలి. వీటిలో వేడి నీళ్లు పోయడం సరికాదు. గాజు, రాగి, స్టీలు సీసాలను నీళ్లు తాగడానికి ఉపయోగించడం మంచిది. శుభ్రం చేసుకోవడం కూడా సులువే.
- సీసాలో గోరువెచ్చటి నీళ్లు, కాస్త లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. కాసేపాగి బ్రష్‌తో శుభ్రంచేసి, కడిగితే చాలు.
- స్టీలు సీసాల్లో వేడినీళ్లు, కాస్తంత ఉప్పు వేసి రాత్రంతా వదిలేయాలి. మర్నాడు కడిగేస్తే వాటినుంచి వచ్చే దుర్వాసన పోతుంది వెనిగర్‌తోనూ శుభ్రం చేయొచ్చు.
- రెండు చెంచాల వంట సోడా, గోరువెచ్చని నీళ్లను సీసాలో పోసి కొన్ని గంటలు అలా వదిలేయాలి. ఆ తరువాత బాగా కదిపి మరోసారి గోరువెచ్చటి నీటితో శుభ్రం చేస్తే హానికారక బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిములు పోతాయి. దుర్వాసన కూడా ఉండదు.

ఐస్‌ట్రేలో... గోళ్లరంగు



ఇంట్లో అంతగా వాడని ఐస్‌ట్రేలు ఉన్నాయా... వాటిని అటక మీద పారేయాల్సిన అవసరంలేదు. రకరకాలుగా వాడుకోవచ్చు. రంగుల దారపు బంతులు, సూదుల్ని వీటిలో వేసుకోవచ్చు. క్లిప్పులు, ఇయర్‌రింగ్స్‌ని డ్రెస్సింగ్ టేబుల్‌మీద ఉంచేయడం కన్నా ఇందులో వేసుకుంటే చివరి నిమిషంలో కంగారు ఉండదు. అవనే కాదు, గోళ్లరంగు సీసాలు, చిన్న చిన్న స్క్రూలు, బొత్తాలు, మేకులు... ఇలా ఏవయినా వేసుకోవచ్చు. ఇంకెందుకాలస్యం. నిరుపయోగంగా ఉన్నాయని అనుకుంటున్న ఐస్ ట్రేలను బయటకు తీసి వాడేయండి.



అబ్బాయిలకు ఫొటోలు పంపుతోంది!

డియర్ వసుంధర



డాక్టర్ పద్మజ, సైకాలజిస్టు

- మా అమ్మాయి ఎంబీఏ చదువుతోంది. తనకి అలంకరణ మీద చాలా ఆసక్తి. మేం మొదట చాలా తేలిగ్గా తీసుకున్నాం. అయితే ఈ మధ్య రోజూ కాలేజీకి రెడీ అయ్యాక ఓ అరగంట ఫొటోలు తీసుకుంటుంది. వాటిని క్లాస్‌లో తనతో మాట్లాడే ఓ ఐదారుగురు అబ్బాయిలకు పంపుతోంది. నేను బాగున్నానా... డ్రెస్ నప్పిందా లేదా' అని అడుగుతోంది. వాళ్లతో పొగిడించుకోవడానికి తాపత్రయపడుతోంది. అలా అబ్బాయిలకు ఫొటోలు పంపడం మంచిది కాదని చెబుతోంటే వినట్లేదు. మా వారికి ఇలాంటి విషయాలు తెలిస్తే దాన్ని కాలేజీ మాన్పించేస్తారు. ఏం చేయాలో తెలియక నేను ఒత్తిడికి గురవుతున్నా. పాపని మార్చేదెలా?

– ఓ సోదరి

జ ఈ వయసులో పిల్లలు గుర్తింపు... ప్రాధాన్యం కోరుకోవడం సహజమే. అలాగే స్నేహితులతో మాట్లాడటం, అన్ని విషయాలు పంచుకోవడం కూడా అందరూ చేసేదే. సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పంచుకోవడం, కామెంట్లు ఆశించడం కూడా ఈ రోజుల్లో సర్వసాధారణం. అయితే ఇవన్నీ మితిమీరితే ప్రమాదమే కాబట్టి... ఆ సంకేతాలు కనిపిస్తోంటే తప్పనిసరిగా నియంత్రించాలి. అమ్మాయి ఇలా చేయడం వల్ల ఎదురయ్యే పర్యవసానాలు ఎలా ఉంటాయో తనంతట తాను అర్థం చేసుకునేలా చేయండి. కొన్ని ఉదాహరణలతో వివరించండి. ఇక, మీ అమ్మాయి ఎందుకు అలా ప్రవర్తిస్తుందో ఆలోచించండి. అంతేకాదు ప్రత్యేకంగా నలుగురైదుగురు స్నేహితుల కోసమే తయారవుతోందా... అలానే తన ఫొటోలను చూసి ఆ అబ్బాయిలు ఎలా స్పందిస్తున్నారో కూడా గమనించండి. మీ అమ్మాయి తనంతట తాను అలా ఫొటోలను పంపుతుందా... లేదా వారే తనని అందుకు ప్రేరేపిస్తున్నారా అనేదీ తెలుసుకోవాలి. కాలేజీలో అమ్మాయి స్నేహితుల గురించి ఆరాతీయండి. అమ్మాయిల్లో స్నేహితులున్నారా.. ఒకప్పటి పరిస్థితి...ఇప్పుడు ఎవరితో స్నేహం చేస్తోందనేది తెలుసుకోండి. తనలో కొత్తగా వచ్చిన మార్పులు, అర్థం చేసుకోండి. వీళ్లలో తన అందం, ఆసక్తులను పక్కదోవ పట్టించే వారెవరైనా ఉన్నారేమో! ఛాటింగ్ కూడా మీ మధ్య ఉన్నప్పుడే చేస్తోందా లేదా ఒంటరిగానే అనేది చెప్పలేదు. ఒంటరిగా ఉన్నప్పుడు చేస్తోంటే మాత్రం వీలైనంత త్వరగా ఆపించడం మంచిది.

కొన్నిసార్లు చేదు అనుభవాల వల్ల కూడా ఇలా ప్రవర్తిస్తుంటారు. తనని ఎవరైనా అందం గురించి విమర్శించారేమో కనుక్కోండి. అలా జరిగినప్పుడు ఆత్మన్యూనత బాధిస్తుంది. దాంతో ఎలాగైనా 'నువ్వు అందంగా ఉన్నావు...' అని చుట్టుపక్కల వాళ్ల నుంచి ప్రశంస అందుకోవడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి ఆ కోణంలో కూడా ఆలోచించండి.

ఇది చాలా సున్నితమైన విషయం. అరిచి, గోల చేసినంత మాత్రాన ఆమె మారదు. ఓపిగ్గా వ్యవహరించండి. ఆమెతో స్నేహంగా ఉంటూ, ఎక్కువ సమయం గడుపుతూ మార్చేలా చూడాలి. నిదానంగానే తనెందుకు అలా చేస్తుందో కారణాలు అడగాలి. కుదిరినప్పుడల్లా తనలోని సానుకూల అంశాలను మీ అమ్మాయికి గుర్తుచేయండి. చిన్న చిన్న లక్ష్యాలను పెట్టి.. వాటిని అధిగమించేందుకు ప్రణాళికలు వేయండి. అబ్బాయిల విషయంలో ఏదైనా సందేహం తలెత్తితే ఆ విచారణలో మీ అమ్మాయినీ భాగస్వామిని చేయండి. తనే నిజానిజాలు తెలుసుకుంటుంది. ఈ రోజుల్లో సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పెట్టడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉంటుందీ... దాన్ని ఇతరులు ఎలా దుర్వినియోగం చేస్తున్నారనేది మీ అమ్మాయికి అర్థమయ్యేలా చెప్పండి. వార్తల్లో వచ్చిన అలాంటివి కొన్ని చూపించి సోదాహరణంగా వివరించండి. ఓర్పుతో మార్పు తెచ్చేలా చూడండి.

మీ ప్రశ్నలు ఇకపై vasupsych@eenadu.net కు పంపించగలరు.

21 నోటిఫికేషన్లు ఒకటే ప్రణాళిక

గ్రూప్‌-1, 2 సహా పలు రకాల నోటిఫికేషన్లను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. వాటిలో 21 ప్రకటనలకు సంబంధించి జనరల్‌ సైన్స్‌, టెక్నాలజీ విభాగానికి ఒకే రకమైన సిలబస్‌ ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది అభ్యర్థులు ఈ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పోటీని తట్టుకొని విలువైన ప్రతి మార్కును పొందాలంటే, విస్తృతంగా ఉన్న సబ్జెక్టును విభజించుకొని చదవాలి. అనవసరమైన లోతులకు పోకుండా అవసరమైన వాటిని గుర్తించి తెలివిగా అధ్యయనం చేయాలి. లేకపోతే తెలియకుండానే సమయం వృథా అయిపోతుంది.



డాక్టర్‌ బి. నరేష్‌

ఏ పరీక్షకైనా సన్నద్ధత ప్రారంభించాలంటే ముందుగా సిలబస్‌ను విశ్లేషించుకోవడం ప్రధానం. ఏపీపీఎస్సీ సిలబస్‌ ప్రకారం.. జనరల్‌సైన్స్‌- నిత్యజీవితంలో దాని అనువర్తనాలు, సైన్స్‌ అండ్‌ టెక్నాలజీలో వర్తమాన అభివృద్ధి, సమాచార సాంకేతికత ఉన్నాయి. సులభంగా ప్రిపరేషన్‌ సాగించడానికి ఈ సిలబస్‌ను 3 భాగాలుగా విభజించుకోవాలి. కరెంట్‌ అఫైర్స్‌తో అనుసంధానం చేసుకొని దాని ప్రకారం సిలబస్‌ అంశాలను చదువుకోవాలి. ప్రతిదాన్ని లోతుగా అధ్యయనం చేయాలని ప్రయత్నించ వద్దు.

గ్రూప్స్‌ ప్రిపరేషన్‌ జనరల్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ



నిత్యజీవితంలో జనరల్‌ సైన్స్‌ అనువర్తనాలు

దీన్ని తిరిగి మూడు ఉపవిభాగాలుగా విభజించుకోవచ్చు. అవి: 1) భౌతికశాస్త్రం 2) రసాయన శాస్త్రం 3) జీవశాస్త్రం. వీటికి సంబంధించిన అంశాలకు 7 నుంచి 10 తరగతుల పుస్తకాలను చదవాలి. వీటిలో పూర్తి సబ్జెక్టు సంబంధిత విషయాలకు తక్కువ, నిత్యజీవితంలో సైన్స్‌ సంబంధిత అంశాలు, దైనందిత జీవితంలో సైన్స్‌ అనువర్తనాలు వంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి.



గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే ప్రశ్నలు ఎక్కువగా ఈ కోణంలోనే వస్తున్నాయని గమనించవచ్చు. ఈ విభాగంలో సిలబస్‌ కొంచెం ఎక్కువగానే ఉంటుంది. సన్నద్ధతను తేలిక చేసుకోవడానికి అభ్యర్థులు అన్ని పుస్తకాల్లోని ఒక పాఠ్యాంశాన్ని ఒకేసారి చదవాలి.

ఉదాహరణకు జీర్ణక్రియ వంటి వాటిని ఏడు నుంచి పది తరగతుల్లోని అన్ని పుస్తకాల్లో ఒకేసారి చదివి, ముఖ్యమైన అంశాలను నోట్‌ చేసుకోవాలి. సిలబస్‌కు సంబంధం లేని వాటిని వదిలివేయడం మంచిది లేదంటే అన్ని విషయాలను గుర్తుపెట్టుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. గత కొద్ది సంవత్సరాల నుంచి ప్రిపరేషన్‌ సాగిస్తున్నవారు ఇప్పటికే వీటిని చదివి ఉంటారు. కాబట్టి వీరు మిగతా 2 విభాగాలపై దృష్టిసారించాలి. ఈ విభాగంలోని అంశాలు పాత సిలబస్‌లోవి ఒకేరకంగా ఉండటం వారికి కలిసొచ్చే అంశం.

సైన్స్‌ అండ్‌ టెక్నాలజీలో...

ఈ విభాగంలో ఇటీవలి ప్రముఖ, వార్తల్లో ఉన్న అంశాలు ఉంటాయి. వీటిల్లో వైద్య, అణు, రక్షణ, అంతరిక్షం, రోబోటిక్స్‌, సూపర్‌ కంప్యూటర్స్‌, క్లోనింగ్‌, జన్యుపరివర్తన జీవులు, మూలకణ టెక్నాలజీ, బయోటెక్నాలజీ అంశాలుంటాయి. వీటిలో ఆయా అంశాల మూల సూత్రాలు, ప్రాథమిక విషయాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వీటిపై అవగాహన ఉంటేనే వర్తమాన విషయాలు అర్థమై, తేలికగా గుర్తుంటాయి. ఈ విభాగంలో గత ఏడాది కాలంలో దేశంలో జరిగిన అభివృద్ధికి చాలా ప్రాధాన్యమివ్వాలి. మొత్తంగా కరెంట్‌ అఫైర్స్‌ కోణంలో చదవడం ఉపయోగకరం.

సమాచార సాంకేతికత (ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ)



ఇది నూతనంగా చేర్చిన అంశం. అభ్యర్థులకు కొత్తగా అనిపించవచ్చు. ఈ విభాగంలో ఈ-గవర్నెన్స్‌, వైద్య- విద్య రంగాల్లో సమాచార సాంకేతిక వినియోగం వంటి వాటిపై దృష్టిసారించాలి. మారుమూల ప్రాంతాల వారికి వైద్యసేవలు అందించడానికి ఉపయోగపడే టెలిమెడిసిన్‌ను దీనికి ఉదాహరణగా చెప్పొచ్చు. ఇవే కాకుండా నూతనంగా అభివృద్ధి పరచిన సూపర్‌ కంప్యూటర్స్‌, బ్లాక్‌ చైన్‌ టెక్నాలజీ, క్లౌడ్‌ కంప్యూటింగ్‌, బిగ్‌ డేటా అనాలిసిస్‌, ఈ-కామర్స్‌, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ వినియోగం, వీటికి సంబంధించిన సేవల పేర్లు, డిజిటల్‌ ఇండియా, బ్రాడ్‌ బ్యాండ్‌, 4జీ, 5జీ టెక్నాలజీ వంటి అంశాలను చదవాల్సి ఉంటుంది. అయితే పూర్తి అంశాన్ని కాకుండా దానిలోని మూలసూత్రం, వాటి ఉపయోగాలు మాత్రమే చదవాలి.

గ్రూప్‌-I ప్రిలిమ్స్‌కు ప్రత్యేకంగా

ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న అన్ని పోటీపరీక్షల కంటే గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌ జనరల్‌ స్టడీస్‌లో ఇచ్చిన సిలబస్‌ వేరుగా ఉంది. ఇతర ఏ పోటీపరీక్షల్లో ఇవ్వని విధంగా జనరల్‌ స్టడీస్‌ పేపర్‌-2లో సైన్స్‌ అండ్‌ టెక్నాలజీకి అత్యధికంగా 30 మార్కులను కేటాయించారు. దీనికి ప్రత్యేకంగా సిలబస్‌ను కూడా ఇచ్చారు. సిలబస్‌ విస్తృతంగా ఉంది. కొత్తగా సన్నద్ధమయ్యేవారు దీన్ని చూసి కొంత ఆందోళనకు గురైనా సరైన ప్రణాళికతో ఈ సమస్యను అధిగమించవచ్చు. గ్రూప్‌-1 సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ సిలబస్‌ను 5 విభాగాలుగా చదువుకొని వర్తమానాంశాలతో కలిపి నోట్స్‌ రాసుకోవాలి. అవి స్థూలంగా 1. నిత్య జీవితంలో సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, దీని అభివృద్ధికి దేశం తీసుకొంటున్న చర్యలు, పాలసీలు 2. ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ సంబంధిత అంశాలు 3. అంతరిక్షం, రక్షణ రంగం 4. శక్తిసంబంధిత టెక్నాలజీ అంశాలు 5. పర్యావరణ, బయోటెక్నాలజీకి సంబంధించినవి.



ప్రిలిమ్స్‌, మెయిన్స్‌కూ ఉపయోగపడేలా ప్రతి విషయాన్ని అర్థం చేసుకుంటూ మెయిన్స్‌ కోణంలో చదవాలి. రెండింటిలోనూ దాదాపుగా ఒకే సిలబస్‌ ఉంది కాబట్టి, శ్రమా తగ్గుతుంది. సిలబస్‌లోని అంశాల్లో వర్తమాన విషయాలకు సంబంధం ఉన్నవాటికి ప్రాధాన్యమిస్తే మరింత ప్రయోజనకరం. సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ అంశాలకు ప్రముఖ దినపత్రికలో వచ్చే వ్యాసాలు, వార్తలు, ఇయర్‌ బుక్‌, తెలుగు అకాడమీ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ పుస్తకాలు, పర్యావరణ శాస్త్రపుస్తకాలు, పరిశోధనా సంస్థలు వెబ్‌సైట్‌లు ఉపయోగపడతాయి.

సిలబస్‌ను దాటవద్దు!

- సిలబస్‌ ఎక్కువగా ఉందని భయపడకూడదు. సరైన ప్రణాళికతో సిద్ధమైతే విజయం వరిస్తుంది.
- సిలబస్‌ ప్రాథమిక అవగాహనను కల్పించడానికే గానీ ఆయా అంశాలపై లోతైన అవగాహనకు కాదనే విషయాన్ని గమనించాలి.
- ఏపీపీఎస్సీ పోటీపరీక్షల్లో సైన్స్‌ అండ్‌ టెక్నాలజీపై వస్తున్న ప్రశ్నలు సబ్జెక్టు సంబంధిత అంశాలపై దాదాపుగా ఉండవు. వివిధ విషయాలను స్పృశించాలి. ఒకే అంశాన్ని సబ్జెక్టు కోణంలో విస్తృతంగా చదవాల్సిన పనిలేదు.



- ముఖ్యమైన అంశాలను అండర్‌లైన్‌ చేసుకుంటూ, పాయింట్స్‌ రూపంలో రాసుకుంటే సగం సన్నద్ధత పూర్తయినట్లే.
- మాదిరి ప్రశ్నాపత్రాలను తరచూ సాధన చేయడం ద్వారా సామర్థ్యాన్ని తెలుసుకోవచ్చు.
- సిలబస్‌ను దాటి చదివితే ఎక్కువ శ్రమకు గురవుతారు. గమనించుకోవాలి.

నోటీస్‌ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఇండియన్‌ కోస్ట్‌ గార్డులో యాంత్రిక్‌ పోస్టులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్‌ కోస్ట్‌ గార్డు- యాంత్రిక్‌ 2/2019 బ్యాచ్‌ కోసం దరఖాస్తులు కోరుతోంది. **అర్హత:** మెట్రిక్యులేషన్‌, ఎలక్ట్రికల్‌/ మెకానికల్‌/ ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ టెలికమ్యూనికేషన్‌(రేడియో/ పవర్‌) ఇంజినీరింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు నిర్దేశిత శారీరక, వైద్య ప్రమాణాలు ఉండాలి. **వయసు:** 18-22 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాత, శారీరక దృఢత్వ, వైద్య పరీక్షల ఆధారంగా. **ఆన్‌లైన్‌ దరఖాస్తు తేదీలు:** ఫిబ్రవరి 11 నుంచి 21 వరకు. http://joinindiancoastguard.gov.in

ఆర్మీలో జేఏజీ ఎంట్రీ స్కీం

ఇండియన్‌ ఆర్మీ జేఏజీ ఎంట్రీ స్కీం 23వ కోర్సు(అక్టోబర్‌ 2019) ద్వారా షార్ట్‌ సర్వీస్‌ కమిషన్‌(ఎస్‌టీ) ఆఫీసర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఈ పోస్టులకు అవివాహితులైన పురుషులు, మహిళలు అర్హులు. **ఖాళీలు:** 14 (పురుషులు-7, మహిళలు-7). **శిక్షణ కాలం:** 49 వారాలు. ఈ శిక్షణ చెన్నైలోని ఓటీఏలో ఉంటుంది. **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ డిగ్రీ ఉత్తీర్ణత, బార్‌ కౌన్సిల్‌లో అడ్వకేట్‌గా రిజిస్ట్రేషన్‌తోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి. **వయసు:** 01.07.2019 నాటికి 21-27 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** స్టేజ్‌-1, 2 పరీక్షలు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా. **ఆన్‌లైన్‌ దరఖాస్తు చివరితేది:** 14.02.2019. **వెబ్‌సైట్‌:** https://joinindianarmy.nic.in/

రాయ్‌పుర్‌ ఎయిమ్స్‌లో సీనియర్‌ రెసిడెంట్‌ పోస్టులు

రాయ్‌పుర్‌(ఛత్తీస్‌గఢ్‌)లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు. **పోస్టు-ఖాళీలు:** సీనియర్‌ రెసిడెంట్‌- 141 **విభాగాలు:** అనాటమీ, బయోకెమిస్ట్రీ, కార్డియాలజీ, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎంటీ, జనరల్‌ మెడిసిన్‌, మైక్రోబయాలజీ, నెఫ్రాలజీ, న్యూక్లియర్‌ మెడిసిన్‌ తదితరాలు. **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ మెడికల్‌ డిగ్రీ/ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 37 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రక్రియ తేదీలు:** 18.01.2019 నుంచి 05.02.2019 వరకు. **వాక్‌ ఇన్‌ ఇంటర్వ్యూ:** ఫిబ్రవరి 07, 08 తేదీల్లో. **వెబ్‌సైట్‌:** www.aiimsraipur.edu.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

దరఖాస్తు చేశారా?



- **హైదరాబాద్‌ ఈఎస్‌ఐసీలో పారామెడికల్‌, నర్సింగ్‌ స్టాఫ్‌ పోస్టులు;** అర్హత: ఇంటర్‌, డిప్లొమా, బ్యాచిలర్‌ డిగ్రీ. చివరితేది: 21.01.2019
- **నైరుతి రైల్వేలో స్టెనోగ్రాఫర్‌ పోస్టులు;** అర్హత: ఇంటర్‌, స్టెనోగ్రఫీ, ఎంఎస్‌ ఆఫీసు సర్టిఫికెట్‌ కోర్సు ఉత్తీర్ణత. చివరి తేది: 18.01.2019
- **బార్క్‌లో మెడికల్‌/ సైంటిఫిక్‌ ఆఫీసర్‌, టెక్నీషియన్‌ పోస్టులు;** అర్హత: ఇంటర్‌, ట్రేడ్‌ సర్టిఫికెట్‌, డిప్లొమా, బ్యాచిలర్‌ డిగ్రీ, పీజీ పని అనుభవం. చివరితేది: 25.01.2019.
- **బీఎస్‌ఎన్‌ఎల్‌లో మేనేజ్‌మెంట్‌ ట్రైనీలు;** అర్హత: బీఈ/ బీటెక్‌, ఎంబీఏ లేదా ఎంటెక్‌ ఉత్తీర్ణత. చివరితేది: 26.01.2019

ఏ ప్రశ్నకు ఏ జవాబు సబబు?

సివిల్‌ సర్వీసెస్‌ నియామక ప్రక్రియలో కీలకమైనది- పర్సనాలిటీ టెస్ట్‌ (ఇంటర్వ్యూ). ఇందులో సాధించే ప్రతి మార్కూ సర్వీసు రావటానికైనా, ఆశించిన సర్వీసుకు ఎంపికవ్వటానికైనా ఎంతో ముఖ్యం. అందుకని ముందస్తు సన్నద్ధత ఎంతో అవసరం. సంప్రదాయ పద్ధతిలో సాధారణంగా అడిగే ప్రశ్నల్లో కొన్ని వ్యక్తిత్వ లక్షణాలు బయటపడవు. వాటిని పరీక్షించేలా ఇంటర్వ్యూను నిర్వహించాలని యూపీఎస్సీ- రిసెర్చ్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ వింగ్‌ సూచించింది. ఫలితంగా కొద్ది సంవత్సరాలుగా ప్రశ్నల తీరు మారుతూవస్తోంది. బయోడేటా, వర్తమాన అంశాల సంబంధ ప్రశ్నలతో పాటు వీటికీ సంసిద్ధం కావాలి!

యూపీఎస్సీ సివిల్‌ సర్వీసెస్‌ పర్సనాలిటీ టెస్ట్‌



2018 సివిల్స్‌ మెయిన్స్‌లో నెగ్గిన 1994 మందికి ఈ ఏడాది ఫిబ్రవరి 11 నుంచి న్యూదిల్లీలో ఇంటర్వ్యూలు జరగబోతున్నాయి. వీటి ద్వారా మొత్తం 770 నుంచి 780 మందిని ఐఏఎస్‌, ఐపీఎస్‌, గ్రూప్‌-ఏ, బీ మొదలైన సర్వీసులకు ఎంపిక చేస్తారు. అభ్యర్థుల వ్యక్తిత్వంలోని ఏ లక్షణాలపై సివిల్స్‌ పర్సనాలిటీ టెస్టులో ప్రధానంగా దృష్టిపెడుతున్నారో అభ్యర్థులు ముందు తెలుసుకోవాలి. అవి- ★ స్థానిక ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు, సహకార ఇతర ప్రజా సంస్థలతో నెట్‌వర్క్‌ ఏర్పరుచుకోగలిగే సామర్థ్యం. ★ లక్ష్యాల సాధనకు అవసరమైన నిరంతర ప్రయత్నం, స్థిర సంకల్పం, శక్తిసామర్థ్యాలు ★ నిజాయతీ, పక్షపాత రాహిత్యం, సామాజికంగా, రాజకీయపరంగా తటస్థత ★ కనీస హక్కులూ, సౌకర్యాలూ లేని నిరుపేదల పట్ల సానుభూతి, మద్దతు ★ దేశ పురోగతి పట్ల నిబద్ధత ★ సహచర అధికారుల, ప్రజల అభిమానం పొందగలిగేవారిలో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెంచగలిగే లక్షణం. ★ పరిస్థితులను తార్కికంగా విశ్లేషించే నేర్పు, అనూహ్య కోణంలో ఆలోచించి నిర్ధారణలకు రాగలిగే సృజనాత్మకత. ★ అనిశ్చిత పరిస్థితుల్లోనూ నిర్ణయాలు తీసుకునే సత్తా ★ ప్రాథమ్యాలను నిర్ణయించుకునే ప్రతిభ, సముచిత సమయ నిర్వహణ ★ కొత్త ఆలోచనలూ, మెలకువలూ నేర్చుకునే సంసిద్ధత ★ ఎలాంటి పరిణామాలకైనా వెరవకుండా నిజం వైపే నిలబడగలిగే చిత్తశుద్ధి.



వి. గోపాలకృష్ణ
డైరెక్టర్‌, బ్రెయిన్‌ ట్రీ

ఈ లక్షణాలూ, నైపుణ్యాలను ఎలా పరీక్షిస్తారు? వివిధ పరిశోధక బృందాల సిఫార్సుల మేరకు కొత్త తరహా ప్రశ్నలను అడుగుతూ అభ్యర్థుల అసలైన వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తున్నారు.

ఎలా చెప్పాలి? ఎలా చెప్పకూడదు?

ఇంటర్వ్యూ బోర్డు అడిగే ఆస్కారమున్న కొన్ని ప్రశ్నలూ, వాటికి చెప్పే సమాధానాల్లో ఏది మెరుగైనది, ఏది కాదు అనేది పరిశీలిద్దాం!

1. How are you today?

యూపీఎస్సీ ఇంటర్వ్యూల్లో అనూహ్యమైన ప్రశ్నగా దీన్ని చెప్పవచ్చు. ఇది మొదట్లో అభ్యర్థి కాస్త స్థిమితపడటానికి ఉద్దేశించినదే. 'I am fine' అని చెప్పాలనే బోర్డు ఆశించేది కూడా. కానీ అంతవరకే ముక్తసరిగా చెప్పటమూ సరికాదు. మరి దాన్నెలా చెపితే సముచితమో చూద్దాం.

➕ 'Sir, I am feeling proud that I have been able to succeed upto this level and enter the portals of UPSC and I am, enthusiastic to face the interview'

➖ 'Sir, I have been preparing throughout the night and I am nervous about the interview'

2. Tell us about yourself?

ఈ ప్రశ్న కూడా సివిల్స్‌ ఇంటర్వ్యూల్లో అసాధారణమే. దీన్ని ప్రైవేటు రంగంలో ఎక్కువగా అడుగుతుంటారు. కానీ ఈ ప్రశ్నను గత ఏడాది కొందరు సివిల్స్‌ అభ్యర్థులు ఎదుర్కొన్నారు. అభ్యర్థి తన బలాలూ బలహీనతలపై విశ్లేషణ చేస్తాడా లేదా అనేది బోర్డు తెలుసుకోవాలనుకుంటుంది. ముఖ్యంగా అభ్యర్థి తన గురించి తాను ఎప్పుడైనా ఆలోచించుకున్నాడా, తన గురించి కొన్ని పదాల్లో వివరించుకోగలుగుతాడా అనేదీ చూస్తుంది. తన గురించి ఏ ఆలోచనా లేనివాడూ, స్వీయ లక్షణాలను కొద్ది మాటల్లో చెప్పలేనివాడూ ఏ ఉద్యోగానికీ సరిపడడని చెప్పవచ్చు.

➕ మొదట అభ్యర్థి ఈ ప్రశ్నకు సిద్ధమవ్వాలి. తన బలమైన నైపుణ్యాలూ, పరిజ్ఞానం ఎక్కువున్న అంశం, వ్యక్తిత్వంలోని శక్తిమంతమైన లక్షణం, అత్యుత్తమంగా చేయగలిగే పనులు, కీలకమైన విజయాలపై దృష్టిపెట్టి చెప్పగలగాలి. నిజానికి ఈ లక్షణాలను ప్రభుత్వానికి ఉపయోగపడేలా ఎలా ప్రయోజనకరంగా మల్చుకోగలడన్నది స్పష్టం చేయటం ముఖ్యం.

అభ్యర్థి తనను అభివర్ణించగల పదాలను ఎంచుకోవాలి. ఉదా: I am active, goal oriented, ambitious, dynamic, focused etc. ఈ పదాలను అనుసంధానిస్తూ జవాబు చెప్పటం ఇంటర్వ్యూకి ముందే సాధన చేయాలి. బలహీనతలపై అనుబంధ ప్రశ్నలకు కూడా సిద్ధమవ్వాలి.

➖ అప్పటికప్పుడు సరైన జవాబు చెప్పలేకపోవటం, 'anyway mentioned in my bio-data which is in front of you' లాంటి జవాబు, తన బలహీనతలను చెప్పలేకపోవటం.

3. Civil Services requires working with people .. What makes you feel that you can get along with people ?

ఈ ప్రశ్న ద్వారా అభ్యర్థి ఇతరులను గౌరవిస్తాడా, బృందంలో కలిసి పనిచేయగలడా అనేది ఇంటర్వ్యూ బోర్డు తెలుసుకోవాలనుకుంటుంది.

➕ విభిన్న వ్యక్తుల నుంచి తాను సమాచారం, ఆలోచనలు ఎలా అభ్యర్థించి, స్వీకరించినదీ అభ్యర్థి వివరించగలగాలి. కాలేజీలో బృంద సభ్యుడి నుంచో, ఉద్యోగంలో అయితే సహోద్యోగి నుంచో నేర్చుకున్న విధానం నిజాయతీగా చెపితే సముచితంగా ఉంటుంది.

➖ చెప్పినదాన్ని బలపరిచే వాస్తవిక ఉదాహరణలేమీ చెప్పకుండా, 'ఇతరులతో కలిసి బాగా పనిచేయగలను' అని కేవలం ప్రకటించి ఊరుకోవటం.

4. What have you done in School / College / employment to show initiative?

ఈ ప్రశ్న ఆంతర్యం ఏమిటంటే... అభ్యర్థి కార్యశీలుడా కాదా అనేది గ్రహించటం.

➕ అభ్యర్థి తన కృషిని ఉదాహరణ ద్వారా చెప్పాలి. కార్యక్రమానికి అజెండా తయారుచేసి, బృంద సభ్యులకు ముందుగానే చేయాల్సిందేమిటో తెలపటం, తగిన పేపర్‌ వర్క్‌తో స్పాన్సర్‌షిప్‌ కోసం ప్రసిద్ధులను కలవటం లాంటివి చెప్పాలి.

➖ కాలేజీ/కంపెనీ విధానాలూ, నియమ నిబంధనలను ఉల్లంఘించిన ఉదాహరణలు; ధర్నాలు నిర్వహించటం లాంటివి చెప్పటం సరి కాదు.

(మరింత సమాచారం కోసం www.eenadupratibha.net చూడవచ్చు.)